సంపుటి : 17 సంచిక : 6 హైదరాబాద్
వెల : రూ. 50
ISSN- 2582-7294

# పాలపిట్ట

PALAPITTA

మాసపత్రిక | జూలై 2026

## ఈ సంచికలో..

డా. కె.వి. రమణాచారి
సిహెచ్. లక్ష్మణ చక్రవర్తి
విహారి
డా. తిరునగరి శరత్‌చంద్ర
కల్లూరి భాస్కరం
కోవెల సుప్రసన్నాచార్య
డి. చంద్రశేఖర రెడ్డి
డా. అట్టెం దత్తయ్య
రాచపాళెం చంద్రశేఖర రెడ్డి
టి. ఉడయవర్లు
డా. అమ్మంగి వేణుగోపాల్
ప్రొ. మసన చెన్నప్ప
జాలాది రత్న సుధీర్
డా. రూప్‌కుమార్ డబ్బీకార్
సుండు శ్రీనివాస్
డా. జి. వెంకటలక్ష్మి
గజ్జారాం చట్ల
కె.పి.అశోక్‌కుమార్
చెరుకూరి సత్యనారాయణ
నెల్లుట్ల రమాదేవి
తరానా
అమ్జద్
కరిపె రాజ్‌కుమార్



స్వేచ్ఛా కవిత్వ మకుటధారి
ఆచార్య మాదిరాజు రంగారావు

# పాలపిట్ట కథల పుస్తకాలు

1. వీణా వేదనం -గన్నవరపు నరసింహమూర్తి రూ.80/-
2. ఉదుతాభక్తి -గన్నవరపు నరసింహమూర్తి రూ.60/-
3. అక్షరాభ్యాసం -గన్నవరపు నరసింహమూర్తి రూ.150/-
4. కల చాలనమ్ - బుర్రా లక్ష్మీనారాయణ రూ.100/-
5. నాలుగు పుంజీలు - బుర్రా లక్ష్మీనారాయణ రూ.100/-
6. దేహనది -బుర్రా లక్ష్మీనారాయణ రూ.100/-
7. మట్టి అరుగు -బుర్రా లక్ష్మీనారాయణ రూ.100/-
8. ఫాలచక్షుబు -బుర్రా లక్ష్మీనారాయణ రూ.100/-
9. ద్వాదశి - బుర్రా లక్ష్మీనారాయణ రూ.100/-
10. పూలవాదర్ - అఫ్సర్ రూ.100/-
11. గోరింటాకు - అఫ్సర్ అనువాద కథలు రూ. 80/-
12. దయాహృదయ - అఫ్సర్ అనువాద కథలు రూ.100/-
13. పరాయోళ్ళు -జి. ఉమామహేశ్వర్ రూ.70/-
14. భరోసా -జి. ఉమామహేశ్వర్ రూ.120/-
15. కథాదౌత్యం -ఎల్.ఆర్.స్వామి రూ.100/-
16. కథాకాశం -ఎల్.ఆర్.స్వామి రూ.60/-
17. అలగా... అలగా... - ఎల్.ఆర్.స్వామి......... రూ.100/-
18. మేఘజాలిన వాసన - ఏ. ఎన్. జగన్నాథశర్మ రూ.125/-
19. పనామా బీచ్‌లో -తరానా రూ.100/-
20. పేగు బంధం - డా. పి.విజయలక్ష్మీ పండిట్ రూ.100/-
21. ఒక వర్షం కురిసిన రోజు - డా. కాంచనపల్లి రూ.100/-
22. లచ్చుంబాయి - డా. రూప్‌కుమార్ డబ్బీకార్ రూ. 100/-
23. నిత్యకల్లోలం -ముదిగంటి సుజాతారెడ్డి రూ.150/-
24. కొత్తగూడెం పోరగాడికో లవ్‌లెటర్ -సామాన్య రూ.100/-
25. అమ్మ కోరిక - తడకమళ్ళ మురళీధర్ రూ.100/-
26. కురిసి అలసిన ఆకాశం - పద్మావతి రాంభక్త రూ. 150/-
27. కిరణం - పి.వి.శివకుమార్ రూ. 200/-
28. అతిథి(కి) దేవుడు - పి.వి.శివకుమార్ రూ. 150/-
29. నీదేగానీ నీదే కాదు - పి.వి.శివకుమార్ రూ.150/-
30. లేంబాక వాటిక కథలు -కిషన్ పిన్నంశెట్టి రూ. 200/-
31. ఆకాశంలో ఒక నక్షత్రం-డా.ఎం. సుగుణరావు రూ. 150/-
32. అమ్మాయి కోరేది - తటవర్తి నాగేశ్వరి రూ. 150/-
33. పాలపిట్ట వినూత్న కథ రూ. 150/-
34. మునిసిపల్ కథలు -డా.దీర్ఘాసి విజయభాస్కర్ రూ. 150/-
35. దేవ నాగర లిపి -బి.ఎస్.ఎమ్. కుమార్ రూ. 300/-
36. ఆకుపచ్చని కన్నీళ్ళు - ఆదా సుబ్బారావు రూ.100/-
37. మంచినీటి సముద్రం - వదలి రాధాకృష్ణ రూ.150/-
38. తల్లివేరు - నెల్లుట్ల రమాదేవి రూ.200/-
39. సమాహారం - శరత్‌చంద్ర రూ.200/-
40. పోతరాజు - వైదేయుల సత్యనారాయణ రూ.100/-
41. చీకటివెన్నెల - దూర్వి కొప్పిశెట్టి ..................రూ. 150/-
42. అనార్కలి- సాదత్ హసన్ మంటు కథలు ........రూ. 100/-
43. పిచ్చుకమీద బ్రహ్మాస్త్రం-గన్నవరపు నరసింహమూర్తి రూ.150
44. బొమ్మా? బొరుసా? - అమృతాప్రీతం - అఫ్సర్ రూ. 150
45. విముక్తాయి - ముదిగంటి సుజాతారెడ్డి ........... రూ. 150
46. రాచిప్ప - డాక్టర్ కొండపల్లి నీహారిణి................రూ. 150
47. ఘర్షణ - డాక్టర్ కొండపల్లి నీహారిణి................రూ. 150
48. నిత్యగాయాల నది - బెజ్జారపు రవీందర్ రూ. 100/-
49. అహానికి ఆవల - జి. ఉమామహేశ్వర్ రూ. 200/-
50. అవ్యక్త రాగం - పి.వి.ఆర్. శివకుమార్ రూ. 200/-
51. పందిరి పెట్టి మంచం - జాస్తి రమాదేవి రూ. 200/-
52. మల్లెపూల ముళ్ళతోట - వదలి రాధాకృష్ణ రూ. 200/-
53. ఓనమాలు - కాటికొండాల నరసింహారావు రూ. 100/-
54. గోధుమ రంగు ఊహ - వంశీకృష్ణ రూ. 150/-
55. పసిడి మనసులు - పి.ఎస్. రాంబాబు రూ. 150/-
56. అనుబంధాలకు ఆవల -తడకమళ్ళ మురళీధర్ రూ. 120/-
57. నాన్నకు నీరాజనం - తటవర్తి నాగేశ్వరి రూ. 200/-
58. మట్టి వాసన - గన్నవరపు నరసింహమూర్తి రూ. 150/-
59. దయాహృదయ - అఫ్సర్ రూ. 100/-
60. ఐదు తరాల కథలు - గులాబీల మల్లారెడ్డి రూ. 150/-
61. పాలపిట్ట కథ - 2025 రూ. 200/-
62. పాలపిట్ట దసరా కథ - 2025 రూ. 300/-
63. పాలపిట్ట దీపావళి ప్రత్యేక కథలసంచిక -2023 రూ.100/-
64. పాలపిట్ట ఉగాది కథా కదంబం - 2024 రూ. 100-
65. బతకాలి! - సింహప్రసాద్ రూ. 150/-
66. కారూన్ - చక్రవర్తుల శ్రీమాన్ రూ. 60/-
67. శిలావిలాపం - రవీంద్రనాథ్ టాగూర్ కథల
అనువాదం: చింతపట్ల సుదర్శన్ రూ. 150/-
68. రామచిలుక - మలయాళ మూలం: పి.ఎస్. శ్రీధరన్ పిళ్ళై
అనువాదం: ఎల్.ఆర్. స్వామి రూ. 100/-
69. మనసు పలికిన కథలు - జొలాది రత్న సుధీర్ రూ. 100/-

---

ఈ పుస్తకాల కోసం సంప్రదించండి - పాలపిట్ట బుక్స్
సెల్ నెంబర్లు: *9848787284, 9490099327*

PALAPITTA
# పాలపిట్ట
మాసపత్రిక
ISSN 2582-7294
సంపుటి: 17 సంచిక: 6
**జూలై 2026**
సంపాదకుడు
**గుడిపాటి**
సహ సంపాదకుడు
**డాక్టర్ రూప్ కుమార్ డబ్బీకార్**

కవర్ డిజైన్
**వికర్ణ**

రిపోర్టర్
**నరేష్**

**చందా వివరాలు**
రెండేళ్ళ చందా: రూ.1000/-
నాలుగేళ్ళ చందా: రూ.2000/-
అయిదేళ్ళ చందా: రూ. 2500
జీవిత చందా: రూ.5000/-

లేఔట్, డిజైన్: అక్షయ డిజైన్ స్టూడియో
Mobile : 9553371056
ప్రకటనలు, చందాలకు మరియు
(రచనలు, అభిప్రాయాలు పంపవలసిన చిరునామా)
**PALAPITTA**
# Flat No.3, Block 6,
MIG-2, APHB, Baghlingampally,
Opp. Sundaraiah Park Gate,
Hyderabad - 500044, Telangana, India.
Cell: 9848787284, 9490099327
E-mail : palapittabooks@gmail.com

**Published at**
H.No.16-11-20/6/1/1,403,
Vijaya Sai Residency, Saleem Nagar,
Malakpet, Hyderabad - 500 036,
Telangana, India

## సంపాదకీయం

# ఆదర్శప్రాయమైన సాహిత్య స్ఫూర్తి

**భా**ష, సాహిత్యాల మీద ప్రేమ మాటల్లో కాక చేతల్లో వ్యక్తం కావాలి. నిరంతర అధ్యయనం, వ్యాసంగం, సామాజిక పరిణామాలపై అసంకల్పితంగానే స్పందించడం జీవితంలో అంతర్భాగం కావాలి. వాద వివాదాలు, సంచలనాల కన్నా తాను చెప్పాలనుకున్నది తనదైన రీతిన అభివ్యక్తం చేయాలి. ఎవరి మెప్పు కోసమో కాకుండా తన మనసు, హృదయ స్పందన ప్రధానంగా సృజనాత్మక వ్యాసంగంలో నిమగ్నం కావాలి. కవిత్వం రాసినా, వచనం రాసినా ముఖ్యంగా సాహిత్య వ్యాసంగానికి అంకితమైన వారి జీవితం సదా స్ఫూర్తిదాయకంగా ఉండాలి. ఈ కోవకు చెందిన ఋషితుల్యులు, ఆదర్శప్రాయమైన సారస్వత మూర్తి ఆచార్య మాదిరాజు రంగారావు.

చాలా సంవత్సరాలుగా వారు 'స్వేచ్ఛా కవిత్వం' శీర్షికన వెలువరించే పుస్తకాలు ఒక ప్రత్యేక ఆకర్షణ. తెల్లటి అట్ట మీద ఎర్రటి అక్షరాలతో కూడిన వారి పుస్తకాల ముఖచిత్రాలు గుర్తుండిపోతాయి. పుస్తకం చూడగానే మాదిరాజు రంగారావు గారి కొత్త పుస్తకం మరొకటి వచ్చిందని బోధపడేది. తెలుగు కవిత్వ ప్రపంచంలో వారిది ప్రత్యేకమైన బాట. అనేకానేక సిద్ధాంతాలు, వాదాలు, ధోరణులతో కూడిన సాహిత్య ప్రపంచాన్ని సంయమనంతో గమనించేవారు. వారి సాహిత్య విమర్శ వ్యాసాలు చదివితే ఈ విషయం అర్థమవుతుంది. ఆధునిక సాహిత్య దృష్టితో ప్రాచీన సాహిత్యాన్ని ఎలా ఆకళింపు చేసుకోవాలో వారి వ్యాసాలు చెబుతాయి.

గతాన్ని యథాతథంగా తిరస్కరించడం, లేదా ఆమోదించడం అనే విపరీత ధోరణులకు ఆయన దూరంగా ఉన్నారు. మరో మాటలో చెప్పాలంటే ఒక తీవ్రత నుంచి మరో తీవ్రతకు వెళ్ళే వైపరీత్యాలు ఆయనను అంటలేదు. సాహిత్య ఉద్యమాలను, వాదాలను, ధోరణులను తనదైన దృష్టితో అధ్యయనం చేశారు. ఏ పూర్వాపరాల నేపథ్యంలోంచి వాటి పుట్టుక, గమనం ఉన్నదో విశ్లేషించారు. కనుక మాదిరాజు రంగారావు గారి సాహిత్య విమర్శ సంపుటాలను పరిశోధకులు, విమర్శకులు ప్రత్యేకంగా అధ్యయనం చేయాలి.


మాదిరాజు రంగారావు గారు సృజించిన 'స్వేచ్ఛా కవిత్వం' సమాజంలో అంతర్భాగంగా, సామాజిక పరిణామాలకు ప్రతిస్పందనగా వెలువడింది. రంగారావు గారి కవిత్వం గత ఏడు దశాబ్దాల పరిణామాలకు ప్రత్యక్షర సాక్ష్యం. ప్రాంతీయ, జాతీయ, అంతర్జాతీయ పరిణామాల ప్రతిఫలనాలను వారి కవిత్వంలో చూస్తాం. 1953 నుంచి 2025 వరకు రంగారావు గారు రచించిన స్వేచ్ఛా కవిత్వం తొమ్మిది సంపుటాలుగా, సాహిత్య విమర్శ రెండు సంపుటాలుగా వెలువరించారు వారి కుటుంబ సభ్యులు.

'కవిత్రయం సృజన రూపం– నిర్వహణ శిల్పం–అనుశీలనం' అనే అంశంపై వారు రాసిన పరిశోధన గ్రంథం (పిహెచ్‌డి) అవశ్యం పఠనీయం. పరిశోధకులకు ఇది ఒక కరదీపిక. కవిత్వం – విమర్శ – పరిశోధన – అనువాదం... ఇలా ప్రతి రంగం మీద తనదైన ముద్ర వేసిన ఆచార్య మాదిరాజు రంగారావు సాహిత్యాన్ని విశ్లేషించే ప్రత్యేక వ్యాసాలతో ఈ నెల సంచిక రూపుదిద్దుకుంది. సాహిత్య విద్యార్థులకు, అధ్యాపకులకు, పరిశోధకులకు ఉపయుక్తమైన సంచిక ఇది. దీనిపై తమ ప్రతిస్పందన తెలియజేయవలసిందిగా పాఠకలోకాన్ని కోరుతున్నాం.

*palapittamag@gmail.com*

కవిత

# రెండు దోసిళ్ళ ప్రేమ



బ్రతుకు స్వేదమై కురుస్తున్న వేళ
చినుకు చినుకు తడిలోనూ..
సూర్యరశ్మిని సుతారంగా ఆహ్వానిస్తూ..
ఆకాశాన ఇంద్రధనస్సై
విచ్చుకోవాలి కదా..
ఎందుకు మరీ..
రాగ ద్వేషాలు...రాకాసి ఛాయలు..!?
మరెందుకు..ఈ దుఃఖ ముఖాలు..!?
మనమంతా మనుషులం కదా...
మనసున మనసై మమేకం కావాలి కదా...

నదులకు లేని సరిహద్దులు గీస్తాం
గాలికి లేని గోడలు కడతాం
పశుపక్ష్యాదులకు లేని భేషజాలు
మన కెందుకు..!?
మనుషుల మధ్యే ఈ మైళ్లకు మైళ్ళ దూరం..

గౌరవం ఇచ్చి పుచ్చుకుంటేనే కదా
గుండె గూడై హత్తుకునేదీ...
ఒకరి కొకరం ప్రేమల్ని పేనుకుంటేనే కదా
మానవాళి మనుగడ సాఫీగా సాగేది

ఇప్పుడు
రెప రెప రెక్కలల్లార్చే పావురాల గుంపు
వలస పక్షుల్లా ఎగిరి ఎక్కడికో పోతున్నాయి
శాంతి దృశ్యం అదృశ్యమౌతూ ...
భూగోళమంతా యుద్ధ దారిద్ర్యం తాండవిస్తుంది
ఈ విపత్కర పరిస్థితుల్లో
నన్ను వెంటాడుతున్న ప్రశ్నొక్కటే..
మనమంతా మనుషులం కదా...
ఈ నియంత చూపుల డేగ కళ్ళు
ఒంటెద్దు పోకడల సామ్రాజ్య ఆకళ్ళు ఎందుకు!?

స్వార్థపు చీకట్ల దుప్పట్లలో
ధూళి పొగలు క్రూర సెగలు నింపుకొని
కళ్ళల్లో నిప్పులు పోసుకుంటూ...

బ్రతికే బ్రతుకు ఓ బ్రతుకేనా...
అంతా నాదే అనే అవివేకం వీడి
మనది అన్నప్పుడే కదా మహత్తు..గొప్ప జగత్తు

రోజంతా సామాన్యుడి ఘోషా చిత్రమే
ఇంటి ఎనగర్రకు వేళ్ళాడిన స్వప్నమొకటి
పొద్దు గుంకిన సూర్యుడల్లే కుంగిపోతోంది
రాత్రింబవళ్ళు దుఃఖపు మెలుకువ
తొలిపొద్దు కోసం
కళ్ళల్లో ఒత్తులేసుకుంటుంది
గుమ్మానికి మమతల తోరణాలు కట్టుకొని
ఇంటిముందు వాకిళ్ళ నిండా
మానవత్వ దయా దీపాలు పరుచుకుంటే..
ఏ తిమిర జాడలూ ...
ఏ నిషిద్ధ విషాద వాడలూ..
హృదిని ఆవహించవు కదా...

నెలవంక రెండు కొసలను పట్టుకుని
వెలుగుల్ని పోగు చేసుకుంటూ..
తొలి సంధ్యకు వేళ్ళాడాలనే తపన గొప్పదే కదా...

అసమానతలతో.. అహంకారాలతో...
దాగుడు మూతలు ఆడుతున్న కాలం
ఒకానొక సమయాన కారుణ్యంతో
మానవత్వ జలపాతాన్ని రాలుస్తుంది
హృదయ కాశ్మీరం గులాబీల తోటై
సమానత్వ సామరస్యాల సుగంధాన్ని
అద్దుకొని పురివిప్పిన మయూరమవుతోంది

ఆకు పచ్చ చెట్టుగా మనం మారాలి కానీ
పక్షులు రెక్కలు కట్టుకు వాలిపోవా..
సమిష్టి చైతన్యం వెల్లి విరియాలి కానీ..
ప్రతీ ఒక్కరి ఉచ్ఛ్వాస నిశ్వాసాల్లో
మనిషి తనపు వాక్యాలు
పుంఖానుపుంఖాలుగా
వెలువడుతూ...
మహోజ్వల ప్రగతి ప్రవాహ గీతాలవ్వవా...

మీరు..నేను..మనందరం
పెద్దగా ఏ త్యాగాలూ చెయ్యనవసరం లేదు
మనం మనుషులం కదా...
రెండు దోసిళ్ల ప్రేమను
అఖండ దీపంగా ఎత్తుకుందాం చాలు..!

**– కటుకోఝ్వల రమేష్**
***99490 83327***

ISSN 2582-7294

విషయసూచిక



## స్వేచ్ఛా కవిత్వ మకుటధారి ఆచార్య మాదిరాజు రంగారావు

సాహిత్యమే జీవితంగా భాసించిన సారస్వత ఋషి ఆచార్య మాదిరాజు రంగారావు. కవిగా, విమర్శకునిగా, పరిశోధకునిగా, అనువాదకునిగా అపారమైన సాహిత్యాన్ని సృష్టించిన రంగారావుది తెలుగు సాహిత్య ప్రపంచంలో విశిష్టస్థానం. ఏడు దశాబ్దాల పైబడి సృజనాత్మక వ్యాసంగంలో నిమగ్నమై వుండడం సాహిత్యం మీద వారి ప్రేమకు సంకేతం. ఇది ఈతరం కవులకు, రచయితలకు స్ఫూర్తిదాయకం. స్వేచ్ఛా కవిత్వ మకుటధారిగా, స్వేచ్ఛా కవిత్వ ప్రవర్తకుడుగా ప్రసిద్ధి చెందిన మాదిరాజు రంగారావు గారి కృషిని విశ్లేషించే ప్రత్యేక వ్యాసాల సమాహారం... పేజీ 12 నుంచి 49 వరకు...

### ప్రత్యేక వ్యాసాలు


- నా'నుడి' – డా. కె.వి. రమణాచారి .........................13
- స్వేచ్ఛా కవిత్వం మేనిఫెస్టో – వి'లక్షణ' చర్చ – సిహెచ్. లక్ష్మణ చక్రవర్తి......................................14
- బహుముఖ వస్తు శిల్ప ప్రవాహం – డా. మాదిరాజు రంగారావు కవిత్వం – విహారి ...............................................18
- దాశరథి కవితా మంత్రధ్వానం – డా. తిరునగరి శరత్ చంద్ర..................................22
- స్వేచ్ఛా కవిత్వ మకుటధారి మాదిరాజు – కల్లూరి భాస్కరం...24
- మాదిరాజు... మానవీయం – కోవెల సుప్రసన్నాచార్య........26
- స్వేచ్ఛా కవిత్వ ప్రవర్తకుడు – డి. చంద్రశేఖరరెడ్డి.............28
- మాదిరాజు సమాలోచనం – సాహిత్య దర్శనం – డా. అట్టెం దత్తయ్య...........................................30
- సామాజిక పరిణామాలు – మాదిరాజు కవిత్వం – రాచపాళెం చంద్రశేఖర రెడ్డి..................................34
- అధికార భాష చిరునామా చెప్పిన ఆచార్య మాదిరాజు రంగారావు – టి. ఉదయవర్లు...............................................40
- ఆచార్య మాదిరాజు రంగారావు సంక్షిప్త పరిచయం...........43
- స్వేచ్ఛా జగతిన... – డా. అమ్మంగి వేణుగోపాల్............44
- మాదిరాజు రంగారావు గారి సిద్ధాంత గ్రంథం – ఒక పరిశీలన – ఆచార్య మసన చెన్నప్ప.......................................46


### కథలు


- ప్రేమ ప్రదర్శన – జాలాది రత్న సుధీర్.....................6
- మళ్ళీ పెళ్ళి – గజ్జారాం చల్ల..............................60


### సీరియల్స్


- మలిసంధ్యలో మలుపులు తరానా..........................50
- రామాపురంలో...– అమ్జద్.................................56


### వ్యాసాలు


- యుద్ధనపూడి సులోచనా రాణి – సాహిత్య వ్యాస వివేచన – సుందు శ్రీనివాస్ ..................................................8
- తొలి భారతీయ టాకీ చిత్రాల తెరపై చెరగని సంతకం – డా. రూప్ కుమార్ డబ్బీకార్ ................................11
- ప్రజాస్వామ్య స్ఫూర్తిని ప్రబోధించే 'ఏడుకోలల బాయి' – డా. జి. వెంకటలక్ష్మి.........................................52
- కథలు – సంకలనాలు – కె.పి. అశోక్ కుమార్..............55
- చింత చేను – చింతల చేను – కె.పి. అశోక్ కుమార్.........55
- నాస్తిక విప్లవకారుడు గోరా – చెరుకూరి సత్యనారాయణ.......64


### కవితలు


నాగవర్మ ముత్యం, కరిపె రాజ్ కుమార్, నెల్లుట్ల రమాదేవి, అంబటి నారాయణ, పి. శ్రీనివాస గౌడ్, దోసపాటి వేంకట రామచంద్రరావు, సముద్రాల హరికృష్ణ

కథ

# ప్రేమ ప్రదర్శన



– జాలాది రత్నసుధీర్

కాలింగ్‌బెల్ మ్రోగింది. 'ఉదయాన్నే వచ్చే పాలవాడు, పేపర్‌బాయ్, పనిమనిషి, వంటమనిషి.. అందరూ వచ్చేసారు. ఈరోజు డెలివర్ అయ్యే అమెజాన్ ఆర్డర్లు ఏమీలేవు. ఎవరై ఉంటారా?' అని ఆలోచిస్తూ ఉత్సుకతతో డోర్ తెరిచింది లక్ష్మి.

ఎదురుగా నిలబడిన వ్యక్తి డాక్టర్ కిరణ్‌బాబుని ఆమె ఇంతకుమునుపు ఎప్పుడూ చూడలేదు. కానీ, ఆ వ్యక్తి ఎవరై ఉంటారో ఊహించగలిగింది, ఆమెలోని సహజ స్త్రీశక్తి. "రండి, రండి" అంటూ సాదరంగా ఆహ్వానించింది.

"ఆయన స్నానం చేస్తున్నారు, వచ్చేస్తారు, కూర్చోండి" అంటూ గ్లాసుతో నీళ్లు ఇచ్చింది.

రమేష్, లక్ష్మి దంపతులు. ఆయన పిల్లల వైద్యుడు. తిరుపతిలో వారి స్వగృహంలో కింద క్లినిక్, పైన నివాసం. ఈ మధ్యే ఒక ఫ్లాట్ కొత్తగా కొన్నారు. ఇంటీరియర్స్, మొత్తం చేయించి అద్దెకు ఇవ్వాలనుకున్నారు, ఈ దంపతులు.

డాక్టర్ కిరణ్‌బాబు మెడికల్ కాలేజీలో ప్రొఫెసర్. విజయవాడ నుండి తిరుపతి మెడికల్ కాలేజీకి బదిలీపై వచ్చాడు. కాలేజి గెస్ట్‌హౌస్‌లో ఒక్కడే ఉంటూ అద్దె ఇంటికోసం వాకబు చేసాడు. రమేష్ ఫ్రెండ్ ఒకాయన అదే కాలేజీలో ప్రొఫెసర్‌గా ఉన్నాడు. ఆయన ద్వారా డాక్టర్ రమేష్ కొత్త ఫ్లాటు అద్దెకోసం చూసాడు. నచ్చింది. అంతకుముందురోజే రమేష్‌తో ఫోన్‌లో మాట్లాడి చెల్లించవలసిన అద్దె, అడ్వాన్స్ మాట్లాడుకున్నారు. ఇద్దరూ సమ్మతించారు. అడ్వాన్స్ చెల్లించి ఫ్లాట్ తాళాలు తీసుకోవడానికి రమేష్ ఇంటికి వచ్చాడు డాక్టర్ కిరణ్‌బాబు.

వారు కొత్తగా కొనుక్కున్న ఫ్లాటుకి మొదటి టెనెంట్ కిరణ్‌బాబు పట్ల ఒక సాఫ్ట్‌కార్నర్ ఏర్పడింది ఆమెకు. సాదరంగా ఇంట్లోకి ఆహ్వానించి ఫ్రిజ్‌లోంచి కివీఫ్రూట్ తీసి కట్‌చేసి ఆయన ముందు ఉంచింది. కొంచెం సేపటికి చిన్న ట్రేలో దేవుని ప్రసాదం తెచ్చి ఆయనకు అందించింది. కొన్ని క్షణాలు ప్రసాదం వైపు చూసి "వద్దండి" అన్నాడు సున్నితంగా. లక్ష్మి చాలా నొచ్చుకొంది.

ఒక డాక్టర్ అని, తన ఫ్లాట్‌కి తొలి టెనెంట్ అన్న భావనతో గౌరవించి ఎంతో అభిమానంగా దైవప్రసాదం అందించింది. ఆయన దానిని తిరస్కరించారు. ఏదో తెలియని ఉద్వేగం, ఉక్రోషం ఆమె మనసును ఆవహించాయి.

"మా దేవుళ్లు మీకు వట్టి విగ్రహాలు, మా ఆలయాలు మీకు నిషిద్ధ ప్రదేశాలు, మా ప్రసాదం మీరు తినరు, కానీ మా ఇల్లు మాత్రం మీకు కావాలి" ఏదో తెలియని ఆవేశంతో గొణుక్కుంది లక్ష్మి.

కానీ ఆమెకు తెలియకుండానే ఆమాటలు బయటకు అనేసింది.

కిరణ్‌బాబు విన్నాడు.

ఆ స్పృహ ఆమెకు లేదు.

ప్రసాదం తీసుకువెళ్లి ఫ్రిజ్‌లో పెట్టింది.

ఒకసారి అసహనంగా హాలులోకి చూసింది. అంతే ఆశ్చర్యపోయింది.

అప్పటికే కిరణ్ బాబు లేచి బయటకు వెళ్లిపోయాడు. తన మాటలు కిరణ్‌బాబు వినే ఉంటాడని ఆమెకు అర్థం అయింది.

ఇంతలో రమేష్ స్నానంచేసి బయటకు వచ్చాడు. జరిగిందంతా భయంభయంగా ఆయనకు వివరించింది.

హతాశుడయ్యాడు రమేష్. అప్పటికీ భార్యను ఏమీ అనలేదు.

ఎందుకంటే ఆమె స్వభావం ఆయనకు బాగా తెలుసు.

...

కిరణ్‌బాబు గెస్ట్‌హౌస్‌కు తిరిగివచ్చి విజయవాడలోనే ఉన్న భార్యకు జరిగిందంతా ఫోన్‌లో వివరించాడు. భర్త అవమాన భారంతో బాధ పడుతున్నాడని ఆమె అర్థం చేసుకొంది. సముదాయించే ప్రయత్నం చేసింది.

"క్లాస్ టైమ్ అవుతుంది, కాలేజీకి బయలుదేరండి" అంటూ ఆమె సంభాషణ ముగించింది.

అతనికి కాలేజీకి వెళ్ళి క్లాస్ తీసుకునే మూడ్‌లేదు. జీవితంలో మొదటిసారి వివక్షను ఎదుర్కొన్న భావనలో ఉన్నాడు. ఈ తిరస్కారాన్ని అంగీకరించలేకపోతున్నాడు.

కిరణ్‌బాబు జనరల్ ఫిజీషియన్, హస్తవాసి మంచింది. విజయవాడలో అతని క్లినిక్ ఎప్పుడూ పేషెంట్స్‌తో రద్దీగా ఉండేది. వారితో చనువుగా మాట్లాడుతూ ధైర్యం చెప్పేవాడు.

అతని క్లినిక్‌కు అన్ని మతాలకు చెందిన పేషెంట్స్ వచ్చేవారు. అందరినీ ప్రేమగా పలకరించడం అతని స్వభావం. మతభావాలకు అతీతంగా ఎదిగిన వ్యక్తి. ఎప్పుడూ వివక్షను ఎదుర్కోలేదు, వివక్షను ప్రదర్శించలేదు కూడా.

జీవితంలో తొలిసారి రమేష్ ఇంట్లో ఇటువంటి బాధాకర అనుభవాన్ని ఎదుర్కొన్నాడు. అందుకే ఇంతగా మథనపడుతున్నాడు.

ఇంతలో కాలింగ్‌బెల్ మ్రోగింది.

అనాసక్తిగా డోర్‌వైపు చూసాడు కిరణ్.

మనసు బాధామయమైనపుడు చుట్టూ జరిగే సంఘటనల పట్ల ఆసక్తి ఉండదు. ఎవరు వచ్చుంటారో అనే కుతూహలం కూడా కలుగలేదు. యాంత్రికంగా వెళ్ళి డోర్ తెరిచాడు. డోర్‌కు అవతల ఉన్న వ్యక్తిని చూసి ఆశ్చర్యపోయాడు. వచ్చిన అతిథిని లోనికి ఆహ్వానించాలా, వెనక్కి వెళ్ళిపొమ్మని చెప్పాలో తెలియని అయోమయ స్థితి.


లోనికి వచ్చాడు కిరణ్. అతని వెనుకే రమేష్ కూడా వచ్చి, ఆగి "కూర్చోవచ్చా?" అని అడిగాడు.

"కూర్చోండి" అన్నాడు. ఎటువంటి భావాన్ని ప్రదర్శించకుండా, నవ్వులేని ముఖంతో.

కొన్ని క్షణాల నిశ్శబ్దం.

వాస్తవానికి, కిరణ్‌బాబుకు ఏమీ మాట్లాడాలని లేదు. ఏమీ వినాలని కూడా లేదు. గాయపడిన మనసు చాలా సేపటివరకు ఏకాంతాన్నే కోరుకుంటుంది.

తరువాత స్వాంతనకై ఎదురుచూస్తుంది.




**నాన్న చెక్కిన శిల్పం**
**రచన: జాలాది రత్న సుధీర్**
**పేజీలు: 120, వెల: రూ. 100**
**ప్రతులకు: ప్రముఖ పుస్తక కేంద్రాలు**

---

రమేష్, కిరణ్‌బాబును పరిశీలనగా చూసాడు. ఎటువంటి స్పందన లేదు. అలాగని పేలడానికి సిద్ధంగా ఉన్న బాంబులాగా కూడా లేదు కిరణ్. ఇది కొంతవరకు సానుకూల పరిస్థితే అని భావించిన రమేష్ సంభాషణ ప్రారంభించాడు –

"మా గృహంలో జరిగిన సంఘటనకు, నా భార్య మాటలకు చాలా చింతిస్తున్నాను, మన్నించండి".

కిరణ్ ఆలోచిస్తున్నాడు, కానీ మాట్లాడలేక పోతున్నాడు. రమేష్‌కు ఇది క్లినిక్‌లో పేషెంట్స్‌ని చూసే టైమ్. ఎందరో పేషెంట్స్, ముఖ్యంగా చిన్నపిల్లలు, వారి తల్లిదండ్రులు డాక్టర్ కోసం ఎదురు చూస్తుంటారు. వారందరిని వదిలి తనకు సారీ చెప్పడానికి వచ్చాడంటే రమేష్ నిజాయితీ కిరణ్ అర్థం చేసుకున్నాడు. కానీ, అతని అహం దెబ్బతింది. గాయం ఇంకా పచ్చిగానే ఉంది. అందుకే నిష్ఠూరంగా..

"పరవాలేదు డాక్టర్ రమేష్. మీకు వేరే టెనెంట్ దొరకకపోడు, నాకు వేరే ఇల్లూ దొరకకపోదు. మనం దీనిని ఇక్కడితో వదిలేద్దాం" అన్నాడు.

"అలాగే డాక్టర్ కిరణ్, కానీ నేను మీకు కొన్ని విషయాలు చెప్పాలని వచ్చాను."

"చెప్పండి"

"మీరు మా ఇంటికి వచ్చినపుడు నా భార్య మీకు ప్రసాదం అందించింది"

"ఔను"

"అంటే, మీ మత విశ్వాసాలు, మీ మతం ఏది అనే వివరాలు ఆమెకు తెలియనట్లేగా?"

కిరణ్ ఏమీ మాట్లాడలేదు. ఆలోచిస్తున్నాడు. రమేష్ మాటల్లోని లాజిక్‌ను అర్థం చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నాడు.

"మీరు మా ఇంటికి రావడం మొదటిసారి. ఆమె మిమ్మల్ని అంతకుముందు ఎప్పుడూ చూడలేదు. స్త్రీ సహజ నైపుణ్యతను బట్టి, మేము కొనుక్కున్న కొత్త ఫ్లాటుకు మీరు అద్దెకు రాబోతున్నారని గ్రహించింది. మిమ్మల్ని సాదరంగా లోనికి ఆహ్వానించింది. కానీ మీ కులం, మతం వంటి వివరాలు ఆమెకు తెలియవు. ఎందుకంటే ఆ విషయాలు మేము మాట్లాడుకోలేదు. మాకు కులమత భేదాలు లేవని మీరర్థం చేసుకోవాలి. ఇదే నిదర్శనం".

కిరణ్‌బాబు కొంచెం మెత్తబడ్డాడు.

నిశ్శబ్దంగా వింటున్నాడు.

కొన్ని క్షణాలాగి రమేష్ "ఎవరైనా ఆలయం నుండి ప్రసాదం ఎందుకు తెచ్చుకుంటారు? అది స్వీకరించడం ద్వారా దేవుని అనుగ్రహం మనపై ఉంటుందనే కదా? ఆ ప్రసాదాన్ని ఒకరికి అందించడమంటే, అది కేవలం అతిథి సత్కారం మాత్రమే కాదు, ఈ ప్రసాదాన్ని స్వీకరించడం ద్వారా మీరు కూడా దేవుని అనుగ్రహం పొందాలని వాంఛించడం. ఎదుటి వారి శ్రేయస్సును కాంక్షించ డం అనేది ఒక అద్భుత ప్రేమ ప్రదర్శన. అదే భావనతో నా భార్య మీకు ప్రసాదాన్ని అందించింది".

"మీకు తెలుసు నేను రోజంతా క్లినిక్‌లో బిజీ. ఆమె రోజంతా ఇంట్లో ఒంటరిగా ఉంటుంది. మాట్లాడేవారుండరు. ఆమెకు తెలియకుండానే తనలో తాను గొణుక్కోవడం అలవాటైపోయింది. అంతేకానీ మిమ్మల్ని అవమానపరచాలనే ఉద్దేశ్యం ఆమెకు లేదు. వాస్తవానికి ఆమె ప్రోద్బలంతోనే నేనిక్కడకు వచ్చాను."

కిరణ్ పూర్తిగా నెమ్మదించాడు.

అది గ్రహించాడు రమేష్.

"జరిగిన పొరపాటుకు మీరు పెద్దమనసుతో మన్నించాలి. ఈ దుస్సంఘటనను మీరు మరచి పోవాలి. మా ఫ్లాట్‌లోనే మీరు నివాసముండాలి. లేదంటే ఒక వివక్షకు గురైన భావన మీ మనసులో నిలిచిపోతుంది. ఆ ప్రభావంతో మీ దగ్గరకు వచ్చే పేషెంట్స్‌ను కూడా ఇదే వివక్ష భావనతో చూసే అవకాశం ఉంటుంది. అంతేకాదు, మీపట్ల వివక్ష ప్రదర్శించాననే గిల్ట్ నన్ను, నా కుటుంబాన్ని కొన్ని రోజులపాటు వేధించవచ్చు. ఇవి మనకు అవసరమా చెప్పండి! ఆలోచించండి, నిర్ణయం మీదే" అంటూ జేబులోంచి ఫ్లాట్ తాళాలు తీసి టీపాయ్‌మీద పెట్టి నమస్కరించి నిష్క్రమించాడు రమేష్.

*రచయిత సెల్: 98494 18009*



# వర్షమొక వేడుక

ఆకాశంలో కదలాడే నల్లమబ్బుల్లో
నిండు కుండవనున్న మా ఊరి చెరువును
దర్శించే కన్నులు నావి

కురుస్తున్న చినుకు తగలగానే
వేల చిగురుటాకుల స్పర్శను
అనుభూతి చెందే శరీరం నాది

వర్షం కురిసే సమయాన
వీస్తున్న చల్లనిగాలికి కదలాడే కొమ్మల్లో
కడుపునిండా పాలు తాగి కేరింతలు కొట్టే
చిన్నారులను చూస్తాన్నేను

అత్యంత భయంకరంగా వినబడుతున్నా కూడా
ఉరుములను ద్వేషించను
నేను పుట్టేటప్పుడు ఆసుపత్రి గదిలో
అమ్మ నొప్పితో అరిచిన
అరుపుల్లాంటివే ఈ ఉరుములు
అనిపిస్తుంది నాకు

కురుస్తున్న ప్రతీ చినుకు
అన్నం మెతుకు అవుతుందనీ నమ్మే నాకు
చిరుజల్లైనా, జడివానైనా
వానేదైనా ఆ పూట మనసును
ఏడాదిపాటు కడుపును నింపుతుంది.

***– నాగవర్మ ముత్యం***
***94905 78855***

RNI NO: APTEL/2010/32190 ISSN-2582-7294

# యద్దనపూడి సులోచనారాణి-సాహిత్య వ్యాస వివేచన



**సుందు శ్రీనివాస్**
**తెలుగు పరిశోధక విద్యార్థి**
**ఉస్మానియా యూనివర్సిటీ**
**ఫోన్ నెం: 9052321016**

## వ్యాస సంగ్రహం

తెలుగు నవలను ఇంటింటా ప్రతి మహిళా నోటా పలికేట్లు చేసిన సులోచనరాణి 'ఫంక్షనల్ లిటరసీ' పెంచిన వ్యక్తిగా ముందు చెప్పుకోవాలి. 'అప్పుడే వేసవి కాలం వచ్చేసింది. వెచ్చని వడగాల్పు ఈ చెవిలోంచి ఆ చెవిలోకి కొడుతోంది. పది గంటలు దాటితే జనం వీధుల్లోకి రావడానికి జడుస్తున్నారు. కలవారి యిళ్ళకి వట్టివేళ్ళ తడికలు బిగింపబడ్డాయి' ఇలా ప్రారంభమయ్యే కథ ఒక రచయిత్రి మొదటి కథ అంటే ఎవరూ నమ్మరు. కానీ ఈ ప్రారంభం యద్దనపూడి సులోచనారాణి మొదటి కథ. ఇంతటి ప్రతిభ సంపన్నురాలైన రచయిత్రి సులోచనారాణి గురించి ప్రముఖ రచయితలు, రచయిత్రులు, ప్రముఖులు రాసిన వ్యాసాలను సేకరించి ఈ వ్యాసంలో విశ్లేషణ చేయడం జరుగుతుంది. అందు కోసం వివిధ పత్రికలలో వచ్చిన వ్యాసాలను సేకరించి ఈ వ్యాస రచనకు ఉపయోగించడం జరుగుతుంది.

## కీలక పదాలు

మద్రాసు ప్రెసిడెన్సీ, వ్యాపకం, సంస్కృతి, వ్యాసాలను, సెక్రెటరీ, ఆత్మాభిమానం, సంఘర్షణలు, మహోత్సవం, జీవన తరంగాలు, మీనా, జ్ఞాపకాలు, స్త్రీ స్వాతంత్ర్యం.

## ఉపోద్ఘాతం

తెలుగు నవలా సామ్రాజ్యానికి మకుటం లేని మహారాణి యద్దనపూడి సులోచనారాణి. తెలుగు వారు అభిమానించి, ప్రేమించి సొంతం చేసుకున్న పేరు యద్దనపూడి సులోచనారాణి. కాల యవనిక మీద ఆమె చేసిన సంతకం దశాబ్దాలైన చెదిరి పోకుండా ఉండిపోయింది అనడంలో ఏమాత్రం సందేహం లేదు. యద్దనపూడి సులోచనరాణి 'మద్రాస్ ప్రెసిడెన్సీ' క్రిష్ణా జిల్లాలో 1940 ఏప్రిల్ 2వ తేదిన మొవ్వ మండలంలోని కాజ గ్రామంలో జన్మించింది. ఆమె నెమలికంటి చలపతిరావు, మహాలక్ష్మీ దంపతులకు ఎనిమిదవ సంతానంగా జన్మించింది. ఈమెకు నలుగురు అక్కలు, ముగ్గురు సోదరులు. సాహిత్య పఠనంతో పాటు కథలను రాయడం తొలి నాళ్లలో యద్దనపూడి సులోచనకు ప్రధాన వ్యాపకం, అప్పటి వరకు తనకు నచ్చిన కథలను రాసే సులోచనారాణి ప్రఖ్యాత దర్శకుడు, కార్టునిస్టు బాపు, రచయిత రమణతో పాటు 'జ్యోతి పత్రిక' వ్యవస్థాపకులు రాఘవయ్య ప్రోత్సాహంతో నవలా రచన ప్రారంభించి 75 నవలలను రచించారు. ఈ నవలల మీద అనేక మంది ప్రముఖులు అనేక పత్రికలలో వ్యాసాలుగా రచించారు. ఆ వ్యాసాలను పరిశీలించే విశ్లేషణ చేయుడమే ఈ వ్యాసం ప్రధాన ఉద్దేశ్యంగా పెట్టుకున్నాను.

## వ్యాస విశ్లేషణ

"ఏ విషయములనైన తెలుసుకొని, దానియందలి అంశములను విభజించి, వివరించి చెప్పుట వ్యాసమని చెప్పవచ్చు" *(రామరాజు బిరుదురాజు, విజ్ఞాన సర్వస్వము తెలుగు సంస్కృతి, పుట:468).*

"తాను చెప్పదలచిన విషయాలను గురించిన సంపూర్ణ పరిజ్ఞానము కలిగి, చెప్పదగిన పరిమితినెరిగి, చెప్పగలిగిన భాషాధికారముండి, తనవలెనే నేతృత్వముగల సభ్యుల ఆమోదమును పొందగల ప్రసంగమును చేసినవాడే వక్త అనిపించుకోనును. అట్టిగుణ సంపద కలిగిన యువవ్యాసముగా తలపోయుచు వ్రాయ గలిగినప్పుడు సాహిత్య ప్రియులు పఠింపదగిన వ్యాసము నిర్వహించబడును" *(లక్ష్మీకాంతం పింగళి, సాహిత్య శిల్ప సమీక్ష, పుట:182-183).*

"ఏదో ఒక విషయాన్ని ఎన్నుకొని దాని చర్చించడమో దానికి సంబంధించిన ఒక కొత్త కోణాన్ని పరిచయం చేయడమో ఒక కొత్త వాదనని లేవనెత్తడమో చేస్తూ వచనంలో సాగె ప్రక్రియ" *(లక్ష్మణ చక్రవర్తి, సి. హెచ్, తెలుగు సాహిత్య విమర్శదర్శనం, పుట:1054)* వ్యాసమని నిర్వచించబడ్డాయి.

యద్దనపూడి సులోచనారాణిపై వచ్చిన వ్యాసాలు పై నిర్వచనాలకు సరిగ్గా సరితూగే విధంగా ఉన్నాయి. 'నా వ్యక్తిత్వానికి సరిపోయే పాత్ర' ఈ వ్యాసం నటీమణి వాణిశ్రీ రచించారు. యద్దనపూడి సులోచనారాణి రచించిన సెక్రటరీ నవల ఆధారంగా రూపొందిన సినిమాలో తన అనుభవాన్ని చెప్పుకుంటూనే, సులోచనారాణి రచన గొప్పతనాన్ని కూడా ఎంతో సహజంగా వాణిశ్రీ తెలియజేశారు. వాణిశ్రీ జయంతి పాత్రను కేవలం నటిగా చేయలేదు. ఆ పాత్ర మనస్తత్వాన్ని అర్థం చేసుకుని జీవించారు. 'ఆత్మాభిమానం ఉన్న మధ్యతరగతి యువతి' అని ఆమె జయంతిని చూసిన తీరు చాలా లోతైనది. ఆమె చెప్పిన దాంట్లో చీరను ఎంపిక చేయుడం, హెయిర్ స్టైల్ నిర్ణయించడం, హావభావాలు, బాడీ లాంగ్వేజ్ గురించి ఆలోచించడం ఇవి అన్నీ పాత్రను నిజజీవితానికి దగ్గరగా తీసుకురావాలనే ప్రయత్నం కనిపిస్తుంది. ఈ వ్యాసం ద్వారా సులోచనారాణి పాత్రల బలం ఏమిటో తెలుస్తుంది. జయంతి పాత్రలో ఆత్మగౌరవం ఉంది. స్వతంత్ర ఆలోచన ఉంది. హుందాతనం ఉంది. కానీ అహంకారం లేదు. ఇది యద్దనపూడి సులోచనారాణి మహిళా పాత్రల ముఖ్య లక్షణం. ఆమె నవలల్లో మహిళలు బలహీనులు కాదు. భావోద్వేగాలు ఉన్నా ఆత్మాభిమానంతో నిలబడే వ్యక్తిత్వాలు. వాణిశ్రీ 'జయంతి నా వ్యక్తిత్వానికి సరిపోయే పాత్ర' అని చెప్పడం ద్వారా, రచయిత్రి సృష్టించిన పాత్ర ఎంత సహజంగా, జీవముగా ఉందో తెలుస్తుంది.

వాణిశ్రీ చెప్పిన మరో ముఖ్య విషయం ఆ కాలంలో మహిళా సెక్రటరీలు చాలా అరుదు. దీని ద్వారా సెక్రటరీ నవల అప్పటి సమాజంలో కొత్త ఆలోచనను తీసుకువచ్చిందని తెలుస్తోంది. ఒక యువతి ఉద్యోగం చేయడం, మగ బాస్ దగ్గర పనిచేయడం, తన వ్యక్తిత్వాన్ని కాపాడుకోవడం, ఇవి అప్పటి సమాజంలో కొత్త భావనలు. యద్దనపూడి

సులోచనారాణి రచన సమాజ మార్పును ప్రతిబింబించింది. వాణిశ్రీ ఈ వ్యాసంలో దర్శకుడు కె.ఎస్. ప్రకాశరావు, నిర్మాత డి. రామానాయుడు, నటుడు అక్కినేని నాగేశ్వరరావు గురించి ఎంతో గౌరవంగా ప్రస్తావించారు. ఇది ఆమె వినయాన్ని చూపుతుంది. సినిమా విజయం తన వల్ల మాత్రమే కాదు. అందరి సహకారం వల్ల వచ్చిందని చెప్పడం విశేషం. ఈ వ్యాసం చదువుతుంటే, చదువుతున్న భావన కంటే, వాణిశ్రీ మన ఎదుట కూర్చుని మాట్లాడుతున్నట్లుగా అనిపిస్తుంది. ఈ వ్యాసం కేవలం సెక్రటరీ సినిమా జ్ఞాపకం కాదు. ఇది యద్దనపూడి సులోచనారాణి సృష్టించిన మహిళా పాత్రల గొప్పతనం, వాణిశ్రీ నటనా లోతు, ఆ కాలం తెలుగు సినిమా సృజనాత్మకత, ఈ మూడింటి సంగమంగా ఈ వ్యాసం నిలుస్తుంది. వాణిశ్రీ మాటల్లో "యద్దనపూడి సులోచనారాణి నవలల్లోని పాత్రలు కేవలం పుస్తకాలలో ఉండేవి కాదు. నిజ జీవితంలో మన చుట్టూ కనిపించే మనుషుల్లా ఉండేవి"*(యద్దనపూడి సులోచనారాణి, సాహిత్య వివేచన-విశ్లేషణా వ్యాస సంపుటి, వాణిశ్రీ, పుట: 91).* అన్నారు.

'స్వర్ణయుగంగా భాసించిన సాహితీజీవనం' అనే పేరుతో యద్దనపూడి సులోచనారాణి గురించి మండలి బుద్ధప్రసాద్ రాసిన ఈ వ్యాసం కేవలం జ్ఞాపకాల సమాహారం మాత్రమే కాదు, ఆమె సాహిత్య ప్రభావాన్ని, వ్యక్తిత్వాన్ని, తెలుగు పాఠకలోకంపై ఆమె వేసిన ముద్రను చిత్రించిన ఒక సాహిత్య నివాళిగా భావించవచ్చు. సులోచనారాణి నవలల ద్వార ఒక తరం మనసులను గెలుచుకున్న రచయిత్రి. ఆమె నవలలు 1960-70 దశకాల్లో ఎంతటి సంచలనం సృష్టించాయో బుద్ధప్రసాద్ చాలా స్పష్టంగా చెప్పారు. ఆ కాలంలో పత్రికలను ఆమె సీరియల్స్ చదవడం కోసం కొనేవారు. ఇంట్లో ఎవరు ముందు చదవాలనే ఆసక్తి ఉండేది. కొత్త భాగం కోసం వారం రోజుల ఉత్కంఠగా ఎదురు చూసే వారని ఈ వ్యాసంలో బుద్ధప్రసాద్ తెలియజేశారు. మహిళా వ్యక్తిత్వానికి ఆమె రచనలు ఇచ్చిన గౌరవం వ్యాసంలో చాలా ముఖ్యంగా కనిపించే అంశం. ఆమె నవలల్లోని కథానాయికలు అందంగా ఉంటారు. అందంతో పాటు ఆత్మాభిమానం కూడా ఎక్కువగా ఉంటుంది. కుటుంబాన్ని గౌరవిస్తూనే తమ వ్యక్తిత్వాన్ని నిలబెట్టుకుంటారు. అంటే సులోచనారాణి రచనలు ప్రేమకథలే అయినా, వాటి వెనుక స్త్రీ స్వాభిమానం, స్వతంత్ర ఆలోచన, ఆత్మగౌరవం బలంగా కనిపిస్తాయి. "ఆడపిల్లలు తమ ఆత్మాభిమానాన్ని చాటుకోవాలి. అందుకై పోరాడాలి. సంప్రదాయాన్ని, కట్టుబాట్లను వివాహ వ్యవస్థను గౌరవిస్తూనే స్త్రీలు తమ వ్యక్తిత్వాన్ని నిలుపుకోవాలని సులోచనారాణి భావించి తదనుగుణంగా తన నవలా నాయికలను రూపొందించేవారు" *(యద్దనపూడి సులోచనారాణి, సాహిత్య వివేచన-విశ్లేషణా వ్యాస సంపుటి, మండలి బుద్ధప్రసాద్, పుట: 107)* అని మండలి బుద్ధప్రసాద్ అభిప్రాయపడ్డారు.

ఆమె నవలల్లో హుందాతనంతో ఉండే నాయకులు, ఆత్మగౌరవంతో కూడిన నాయికలు, ప్రేమ, కుటుంబ సంబంధాలు, భావోద్వేగ సంఘర్షణలు ఈ మేళవింపే ఆమెను 'కలల రచయిత్రి'గా నిలబెట్టింది. కానీ ఆ కలలు వాస్తవానికి దూరంగా కాకుండా, మధ్యతరగతి జీవితానికే దగ్గరగా ఉండటం ఆమె ప్రత్యేకత అన్నారు బుద్ధప్రసాద్. ఈ వ్యాసం కేవలం ఆమె రచనల గురించే కాదు. ఆమె వ్యక్తిత్వాన్ని కూడా పరిచయం చేస్తుంది. సభలకు పెద్దగా వెళ్లకపోయినా వినయంతో ఉండేవారు. సేవాభావం కలిగిన మనసున్న మహిళ, అనాథల కోసం సేవాసంస్థ కూడా ప్రారంభించారు. అంటే ఆమె కలంలో



మాత్రమే కాదు, మనసులో కూడా మానవత్వం నిండిపోయి ఉందని బుద్ధప్రసాద్ చెబుతున్నారు. ఈ వ్యాసంలో అత్యంత హృద్యమైన విషయం రచయిత వ్యక్తిగత జ్ఞాపకాలు. ఆమెను దివి మహోత్సవాల్లో సన్మానించడం, కాజ గ్రామం గురించి వ్యాసం రాయమని అడగడం, ఉగాది పురస్కారం అందించడం, ఆమె మరణ వార్త తెలుసుకున్న సందర్భం. ఇవి వ్యాసానికి కేవలం సమాచార విలువనే కాదు, భావోద్వేగ గాఢతను కూడా ఇస్తాయి.

మండలి బుద్ధప్రసాద్ రచించిన ఈ వ్యాసంలో మూడు లక్షణాలు బలంగా కనిపిస్తున్నాయి. ఆమె గురించి మాట్లాడేటప్పుడు గౌరవం మాత్రమే కాదు, అభిమానమూ కనిపిస్తుంది. ఒక కాలపు పత్రికా సంస్కృతి, నవలా పఠనం, తెలుగు మధ్యతరగతి జీవనశైలిని కూడా నమోదు చేశారు. ఆమె మరణాన్ని ప్రస్తావించిన భాగంలో వ్యాసం చాలా హృద్యంగా మారుతుంది. సమగ్రంగా చెప్పాలంటే ఈ వ్యాసంలో మండలి బుద్ధప్రసాద్ ఒక ప్రముఖ నవలా రచయిత్రిగా, మహిళల మనసులను చదివిన రచయిత్రిగా, తెలుగు పాఠక ప్రపంచాన్ని మార్చిన శక్తిగా, తన మట్టిని మరచిపోని దివిసీమ కూతురిగా, మానవత్వంతో నిండిన వ్యక్తిగా చిత్రించారు. ఒక సందర్భంలో సులోచనారాణి మాట్లాడుతూ "ఈ మట్టివాసన చూడగానే మనస్సు ఆర్ద్రతతో స్పందించింది. పుట్టింటికి వచ్చినంత అనుభూతి కలిగింది. మళ్లీ జన్మంటూ ఉంటే దివిగడ్డ పైనే జన్మించాలని కోరుకుంటున్నాను అన్నారు" *(యద్దనపూడి సులోచనారాణి, సాహిత్య వివేచన- విశ్లేషణా వ్యాస సంపుటి, మండలి బుద్ధప్రసాద్, పుట: 108)* అని బుద్ధప్రసాద్ ఒక సందర్భాన్ని ఉదహరించారు. అందుకే ఈ వ్యాసానికి పెట్టిన 'స్వర్ణయుగంగా భాసించిన సాహితీజీవనం' అనే శీర్షిక సరైనది. ఎందుకంటే ఆమె రచనా ప్రయాణం నిజంగానే తెలుగు సాహిత్యంలో ఒక స్వర్ణయుగం కాబట్టి.

యద్దనపూడి సులోచనారాణిపై వచ్చిన 'తొలి నంది అవార్డు మా ఇద్దరికే' అనే వ్యాసాన్ని గొల్లపూడి మారుతీరావు రాశారు. ఈ వ్యాసం ఒక జ్ఞాపక రచన మాత్రమే కాదు. యద్దనపూడి సులోచనారాణి వ్యక్తిత్వం, రచనా వైశిష్ట్యం, సినీరంగంతో ఆమె అనుబంధం గురించి విలువైన సమాచారాన్ని అందించే వ్యాసం. ఈ వ్యాసం ప్రారంభంలోనే గొల్లపూడి, సులోచనారాణిని 'అందమైన పాపులర్ రచయిత్రి'గా పేర్కొన్నారు. అది కేవలం రూపాన్ని మాత్రమే కాదు, ఆమెకు ఉన్న ప్రజాదరణను కూడా సూచిస్తుంది. ఆమె పెద్దగా చదువుకోకపోయినా, సాధారణ పాఠకుడికి తేలిక అర్థమయ్యే రీతిలో, సరళమైన భాషలో నవలలు రాయగలదని గొల్లపూడి ప్రత్యేకంగా చెప్పారు.

ఆమె రచనలో సరళమైన భాష, చక్కటి కథనం, పాఠకుడిని అలరించే ప్రవాహం ఉన్నాయని ఆయన గుర్తు చేస్తారు. అందుకే ఆమె నవలలు పాఠకుల్లో అంత ఆదరణ పొందాయని తెలుస్తుంది. ఈ వ్యాసంలోని ముఖ్యాంశం ఆత్మగౌరవం సినిమా. గొల్లపూడి చెబుతున్నట్టు, ఆయన జీవితంలో మొదటి సినిమా కథ, యద్దనపూడి సులోచనారాణితో కలిసి రాయడం జరిగిందని ఈ వ్యాసంలో గుర్తు చేసుకున్నారు. దుక్కిపాటి మధుసూదనరావు ప్రోత్సాహం, కె. విశ్వనాథ్ తొలి దర్శక ప్రయాణం, సులోచనారాణి ఇంట్లో జరిగిన కథా చర్చలు అన్నీ తెలుగు సినీ చరిత్రలో ఒక ప్రత్యేకమైన జ్ఞాపకంగా కనిపిస్తాయి అన్నారు గొల్లపూడి. నంది అవార్డులు ప్రారంభమైన మొదటి సంవత్సరంలోనే 'ఆత్మగౌరవం' చిత్రానికి ఉత్తమ కథగా నంది అవార్డు రావడం గొప్ప విశేషం. అందులో గొల్లపూడి

మారుతీరావు, యద్దనపూడి సులోచనారాణి ఇద్దరూ కలిసి ఆ అవార్డు అందుకోవడం ఈ వ్యాసానికి భావోద్వేగ గాఢతను ఇస్తుంది. ఇది వ్యక్తిగత జ్ఞాపకం మాత్రమే కాదు. తెలుగు సాహిత్యం, తెలుగు సినిమా కలిసిన చారిత్రక క్షణం. వ్యాసం చివర్లో గొల్లపూడి, ఆమె నవలల ప్రభావాన్ని గుర్తు చేశారు. ప్రత్యేకంగా "సెక్రటరీ, జీవనతరంగాలు, మీనా లాంటివి ఆమెను ప్రజాదరణలో శిఖరానికి చేర్చాయని చెబుతారు. 'హాట్‌కేకుల్లా అమ్ముడయ్యేవి' అన్న వ్యాఖ్య ఆమె రచనలకు ఉన్న విపరీతమైన ఆదరణను తెలియ జేస్తుంది" *(యద్దనపూడి సులోచనారాణి, సాహిత్య వివేచన-విశ్లేషణా వ్యాస సంపుటి, గొల్లపూడి మారుతీరావు, పుట: 124).* ప్రత్యేకంగా ఇంట్లో ఉన్న మహిళల్లో పఠనాసక్తిని పెంచడంలో ఆమె పాత్ర ఎంతో గొప్పదని గొల్లపూడి మారుతీరావు అభిప్రాయ పడటం ఈ వ్యాసంలో గమనించదగిన విషయం.

ఈ వ్యాసంలో జ్ఞాపకాల మాధుర్యం, స్నేహ పూర్వకత, గౌరవం, కృతజ్ఞత అన్నీ కలిసిపోతాయి. గొల్లపూడి విమర్శకుడిలా కాకుండా, సహచరుడిగా, ఆ కాలాన్ని చూసిన వ్యక్తిగా మాట్లాడటం వల్ల వ్యాసం మరింత హృద్యంగా మారింది. ఈ వ్యాసం ద్వారా యద్దనపూడి సులోచనారాణి గురించి మనకు మూడు ముఖ్య విషయాలు తెలుస్తాయి. ఆమె అసాధారణ ప్రజాదరణ పొందిన నవలా రచయిత్రిగా, ఆమె తెలుగు సినిమాకూ విలువైన కథా సహకారం అందించిన రచయిత్రిగా, తెలుగు మహిళల్లో చదవాలనే ఆసక్తిని పెంచిన అరుదైన రచయిత్రిగా. గొల్లపూడి మారుతీరావు రచించిన ఈ వ్యాసం యద్దనపూడి సులోచనారాణి సాహిత్య జీవితానికి ఒక అందమైన నివాళిగా నిలుస్తుంది.

## ముగింపు

యద్దనపూడి సులోచనారాణి తెలుగు సాహిత్యం లో ఒక ప్రత్యేక యుగానికి ప్రతీకగా నిలిచిన రచయిత్రి. ఆమె నవలలు కేవలం వినోదాన్ని అందించడమే కాకుండా, మధ్యతరగతి జీవితాల ఆశయాలు, ఆవేదనలు, ఆత్మగౌరవం, స్త్రీ స్వాతంత్ర్య భావాలను సున్నితంగా ప్రతిబింబించాయి. ఆమె సృష్టించిన పాత్రలు పాఠకుల మనసుల్లో శాశ్వత స్థానం సంపాదించుకోవడానికి కారణం వాటి సహజత్వం, జీవన సాన్నిహిత్యం. ఈ వ్యాససంపుటిలోని రచయితల జ్ఞాపకాలు, విశ్లేషణలు, అభిప్రాయాలు సులోచనారాణి సాహిత్య వ్యక్తిత్వాన్ని మరింత సమగ్రంగా అర్థం చేసుకునే అవకాశాన్ని కల్పిస్తున్నాయి. తెలుగు పాఠకలోకంపై ఆమె చూపిన ప్రభావం, సాహిత్యానికి అందించిన సేవ, స్త్రీ వ్యక్తిత్వానికి ఇచ్చిన గౌరవం ఆమెను చిరస్మరణీయ రచయిత్రిగా నిలబెట్టాయి. అందువల్ల యద్దనపూడి సులోచనారాణి పేరు తెలుగు సాహిత్య చరిత్రలో ఎప్పటికీ వెలుగొందుతూనే ఉంటుంది.

## ఉపయుక్త గ్రంథాలు


1. 'ఆంధ్రుల అభిమాన రచయిత్రి యద్దనపూడి సులోచనారాణి-సాహిత్య వివేచన' విశ్లేషణా వ్యాస సంపుటి, సంపాదకుడు-డా. నాగసూరి వేణుగోపాల్, బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి ఫౌండేషన్, చంద్రమౌళి నగర్, గుంటూర్-322007.
2. రామరాజు. బిరుదురాజు, పుచ్చావాసుదేవ పరబ్రహ్మశాస్త్రి, విజ్ఞాన సర్వస్వము తెలుగు సంస్కృతి. (రెండవ సంపుటము) హైదరాబాద్: తెలుగు యూనివర్సిటి, 1988.
3. లక్ష్మీకాంతం. పింగళి, గౌతమ వ్యాసములు, హైదరాబాద్: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, 1989.
4. లక్ష్మణ చక్రవర్తి. సి.హెచ్, సంపత్కుమారా చార్య, కోవెల (సంప), తెలుగు సాహిత్య విమర్శదర్శనం (విజ్ఞాన సర్వస్వం సంపుటం) హైదరాబాద్: కొమర్రాజు వేంకట లక్ష్మణరావు విజ్ఞాన సర్వస్వకేంద్రం పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, 2016.


# వలస వెళ్ళిన వసంతమా!




**- కరిపె రాజ్ కుమార్**


అస్తవ్యస్త ఆలోచనలనిండా
ఆకాశ నక్షత్రాల్ని ఒంపుకుంటే
కాసేపటికే కాస్మోపాలిటన్లమవుతాం

అడవుల్లో రాలిన ఆకుల్ని
అగణితంగా లెక్కిస్తూపోతే
శిథిల చైత్రాల శిబిరాల్లో
ఒకరిగా శీఘ్రంగానే చేరిపోతాం

మోడువారిన మోదుగుల్ని
ఆప్యాయంగా హత్తుకోకపోతే
అలిగిన ఆమనిని నిర్దయగా
ఆవలకు వెళ్ళగొట్టినవారమౌతాం

మూగవోయిన గొంతుల్లో
మూర్ధన్యాలను పలకరించలేకపోతే
ఉత్సవ మూర్తులుగానే మిగిలిపోతాం

ఎల్లడివడి ఎండిపోయిన హవనాల్లో
పచ్చందాల్ని పల్లవించలేకపోతే
హరిత హంతకులమై హరించుకుపోతాం

తుట్టెవీడిన తేనెటీగలు జట్టుకట్టడానికి
సహనంతో సహకరించకపోతే
చిటారుకొమ్మన మిఠాయి పొట్లాన్ని
ఆవలితరాలకు అందించలేని అసమర్థులమౌతాం

అప్పుడప్పుడే విచ్చుకుంటున్న
రంగురంగుల సీతాకోక చిలుకల
లేలేత రెక్కల్ని పట్టుబట్టి
పటీల్మని విరిచినవారమౌతాం

శిశిరానికీ గ్రీష్మానికీ నడుమ
రాయబారం నెరపే విధిని వదలి
వలస వెళ్ళిన ఓ వసంతమా!
ఆవాహయామి! ఆవాహయామి!!



*కవి సెల్: 81251 44729*

# తొలి భారతీయ టాకీ చిత్రాల తెరపై చెరగని సంతకం

సినిమా రంగానికి తొలినాళ్లలో పాదులు వేసిన మహనీయులలో ఒకరు హెచ్. ఎం.రెడ్డి. అలాంటి వారి జీవిత చరిత్ర, వారు చేసిన కృషి పుస్తక రూపంలో రావడం చాలా తక్కువ అనే చెప్పాలి. సినిమా రంగానికి సంబంధించిన విషయాలు గాని, విమర్శ గాని రాసే అతి కొద్ది మంది సినీ విమర్శకులలో హెచ్.రమేష్ బాబు ఒకరు. ఇతని రచనలు చాలా పరిశోధనాత్మకంగా వుండి కొత్త విషయాలను వెలికి తీస్తాయి. సినీ రంగానికి సంబంధించి ఇటీవలి కాలంలో వచ్చిన సమగ్రమైన రచన "హెచ్. ఎం.రెడ్డి – తెలుగు సినిమా పితామహుడు". ఇదే రచయిత కలం నుండి ఇంతకు ముందు "లోటస్ ఫిలిం కంపెనీ–హైదరాబాద్" శీర్షికతో కొత్త సంగతుల చేర్పుతో ఒక పుస్తకం వచ్చింది.

ప్రస్తుత పుస్తకం వివరాల్లోకి వెళితే – భారతీయులకు చలన చిత్ర కళను పరిచయం చేసినవారు లూమియే సోదరులు అని తెలుస్తుంది. 19వ శతాబ్దపు అద్భుతంగా కొనియాడబడిన చలన చిత్రకళ మొదటిసారిగా 1895 డిసెంబర్, 28న ప్యారిస్ లో ప్రదర్శించబడి ఆరు నెలల్లోనే 1896 జులై 7న బొంబాయి లోని వాట్సన్ హోటల్లో తొలిసారిగా ప్రదర్శించబడింది. అదే సంవత్సరం జులై 14 నుండి నాటకాలు మాత్రమే ప్రదర్శించబడే బొంబాయిలోని నావెల్టీ థియేటర్ లో సినిమాల ప్రదర్శన రెగ్యులర్ గా మొదలైంది. లూమియే సోదరుల ప్రేరణతో ఫొటోగ్రాఫర్‌గా పనిచేసే సావేదాదా 1899లో డాక్యుమెంటరీ తీసిన తొలి భారతీయుడిగా చరిత్రకెక్కాడు. 1896 డిసెంబర్ లో మద్రాస్‌లో మూకీల ప్రదర్శన నిర్వహించిన తర్వాత హైదరాబాద్‌లో 1897, ఆగష్టులో మూకీ చిత్రాల ప్రదర్శనకు ఆద్యుడుగా నిలిచిన వాడు స్టీవెన్ సన్. భారతీయ సినిమాకు, దక్షిణాది చిత్రాలకు విశేషమైన కృషి చేసిన వారైన దాదా సాహెబ్ ఫాల్కే, సామికణ్ణు విన్సెంట్, రఘుపతి వెంకయ్య నాయుడు, ధీరేన్ గంగూలీల పై రచయిత చేసిన ప్రస్తావన మూకీ, టాకీల ప్రారంభదశ లోని స్థితిగతులపై అవగాహనను కల్పిస్తాయి. సునాలినీ దేవి, మృణాళిని దేవి, పైడి జయరాజ్, ఎం. డి బేగ్, ఎం.ఏ రహమాన్ లతో పాటు ఇతర నటులు, నటీమణులు, నిర్మాతల ప్రస్తావన వారి కాంట్రిబ్యూషన్ వివరాలు చదవడం ఆసక్తికరంగా ఉంటుంది.

'కాళిదాస్' సినిమా పై చర్చిస్తూ రెంటాల జయదేవ పరిశీలనలు, రచయిత అభిప్రాయాలను వివరంగా ఇస్తూ ఆ సినిమా పై వున్న వివాదాలను పక్కన పెడుతూ 'కాళిదాస్' సినిమా దక్షిణ భారత తొలి టాకీ సినిమాగా నిర్ధారించడం ఈ పుస్తకంలోని అనేక ప్రత్యేకతలలో ఇదొక ప్రత్యేకతగా చెప్పుకోవచ్చు. 'కాళిదాస్'లో తమిళ, తెలుగు భాషల ప్రమేయం వున్నాఈ సినిమాను తొలి తమిళ టాకీగా గుర్తిస్తారు. మాణికలాల్. బి. పటేల్ సహకారంతో హెచ్. ఎం. రెడ్డి దర్శకత్వం వహించిన తెలుగు తొలి టాకీ 'భక్త ప్రహ్లాద' (1932)లో టైటిల్ పాత్రను ఖమ్మం జిల్లా వాసియైన కృష్ణాజీ రావు షిండే వేశారు. తొలి తెలుగు సినిమా పాట, తెలుగు సినిమా కవి (చందాల కేశవదాసు), తెలుగు టాకీ తొలి కథానాయిక (సురభి కమలాబాయి), తొలి విలన్ (మునిపల్లె సుబ్బయ్య) ఇలా అనేక తెలుగు తొలి టాకీ కళాకారుల గురించి కవులు, నిర్మాత దర్శకుల గురించిన వివరాలు గ్రంథస్తం చేయబడ్డాయి. కాళిదాస్, భక్త ప్రహ్లాద టాకీల నిర్మాణ కాలం, వాటి విడుదల తేదీల మీద వున్న సందేహాల నివారణ దిశగా రెంటాల జయదేవ చేసిన పరిశోధన, విషయ సేకరణ అభినందించదగిన విషయం. వీటి వివరాలను పుస్తకంలో రమేష్ బాబు సంవత్సరాలు, తేదీలతో సహా ఇచ్చారు. ఈ పుస్తకం ద్వారా హెచ్.ఎం.రెడ్డి విలక్షణమైన వ్యక్తిత్వం ప్రకటితం కావడమేగాక, దర్శక నిర్మాతగా ఆయన తెలుగు సినీ రంగానికి, దక్షిణ భారత చిత్ర సీమకు, మొత్తంగా చూస్తే భారతీయ సినిమా రంగానికి చేసిన అసామాన్యమైన సేవను దర్శింపజేస్తుంది. సతీ సావిత్రి, సీతా స్వయంవర్, ద్రౌపదీ వస్త్రాపహరణం లాంటి సినిమాల నిర్మాణాలు పర్యవేక్షణను గమనిస్తే భారతీయ చిత్రకళా పరిశ్రమ ఎదిగిన తీరు తెన్నులు, వికాస పరిణామాలు పాఠకుడి కళ్ళ ముందు ప్రత్యక్ష మవుతాయి.



హెచ్. ఎం.రెడ్డి కొత్తవారిలో ప్రతిభ ఉన్నదంటే ప్రోత్సహించి సినిమాల్లో అవకాశమిచ్చేవారు. అలా ఆయన ద్వారా సినీ రంగానికి పరిచయమైనవారు ఉన్నత స్థానానికి ఎదిగి పేరు ప్రతిష్టలు సంపాదించుకున్నారు. పృథ్వీ రాజ్ కపూర్, ఎల్ వి ప్రసాద్, బి.ఎన్. రెడ్డి, బి నాగిరెడ్డి, కాంతారావు, అంజలి, అల్లు రామలింగయ్య వీరేగాక సాంకేతిక శాఖల్లో కూడా ఆరితేరిన వారున్నారు. రెడ్డి గారి ముప్పై ఏళ్ల సినీ జీవితంలో పది సినిమాలకు నిర్మాతగా, ఎనిమిది సినిమాలకు దర్శకునిగా, ఐదు సినిమాలకు దర్శక నిర్మాతగా వుండి మొదటి తెలుగు టాకీ సినిమాకి దర్శకత్వం వహించి పితామహుడిగా నిలిచారు. రెడ్డి తీసిన 23 చిత్రాలలో 'జాజ్ ఆఫ్ లైఫ్' (సైలెంట్ మూవీ), గృహలక్ష్మి, ప్రతిజ్ఞ, తెనాలి రామకృష్ణ, నిర్దోషి, వద్దంటే డబ్బు, బీదల ఆస్తి ప్రత్యేకంగా చెప్పుకోదగ్గవి. బుర్ర మీసాలు, గంభీరమైన స్వభావం, మాటలో నిక్కచ్చితనం, పనిలో నిబద్ధత రెడ్డి వ్యక్తిత్వాన్ని పట్టిస్తుంది.

1892, జూన్ 12వ తేదీన జన్మించిన రెడ్డి గారి జన్మ తేదీ, జన్మ స్థలం పైన అనేక సందేహాలు వున్నాయి. చివరకు ఎలహంక ఆయన పుట్టిన ఊరుగా రచయత నిర్ణయానికి వస్తాడు. 1960, జనవరి, 16న ఆయన కన్ను మూయడం తెలుగు, తమిళ చిత్ర సీమకే కాదు భారతీయ చిత్రకళా రంగానికి ఆ రోజు చీకటి రోజని చెప్పవచ్చు. హెచ్. ఎం.రెడ్డి గా ప్రసిద్ధి పొందిన హనుమప్ప మునియప్ప రెడ్డి తెలుగు టాకీ సినిమా రంగానికి ఆయన చేసిన కృషి మరువరానిది.

తమ్మారెడ్డి భరద్వాజ గారు తన ముందుమాటలో, సోషల్ మీడియాలో చేసే ఊహాజనిత వ్యాఖ్యలు, అబద్దాలు సినిమా చరిత్ర తెలియని వారికి వాస్తవమని భ్రమపడే అవకాశముందని, ఫలితంగా చరిత్ర వక్రీకరించబడే ప్రమాదముందని ఆలా జరగకుండా ఉండాలంటే రమేష్ బాబు లాంటి వారు పరిశోధనాత్మకంగా విషయ సేకరణ చేసి గ్రంథస్తం చేయడం ఎంతైనా అవసరమని చెప్పడం గమనించదగినది. అలాగే బి.కె.ఈశ్వర్ గారు చరిత్రలో నిజాలకంటే అవకతవకలు ఎక్కువగా కనిపిస్తాయి అంటారు.

తొలి భారతీయ టాకీ 'ఆలం ఆరా' రూపకల్పనలో హెచ్.ఎం.రెడ్డి ది చెప్పుకోదగిన పాత్ర. 'కాళిదాస్', 'భక్త ప్రహ్లాద' లకు దర్శకునిగా ఆయన స్థానం భారతీయ సినీ చరిత్రలో ఉన్నతమైనది. ప్రత్యేకించి తెలుగు సినిమాకు మూలస్తంభంగా నిలిచే హెచ్.ఎం. రెడ్డి సినీ జీవితాన్ని, వ్యక్తిత్వాన్ని, ఆయన ప్రతిభాపాటవాలను పరిశోధనాత్మకంగా వెలికి తీసి బయటి ప్రపంచానికి అందజేయడానికి రమేష్‌బాబు చేసిన కృషి ప్రశంసనీయమైనది. చిత్రకళా పరిశ్రమపై, సినిమా విషయాలపై అభిరుచి, ఆసక్తి వున్న వారు చదవాల్సిన పుస్తకం .

**హెచ్.ఎం.రెడ్డి – తెలుగు సినిమా పితామహుడు : హెచ్. రమేష్ బాబు, వెల :175/- రూపాయలు, పేజీలు : 214, ప్రతులకు: 77807 36386**


***– డా. రూప్ కుమార్ డబ్బీకార్***
***91778 57389***



# సారస్వత ఋషి

తొలి యవ్వనప్రాయం నుంచి మొదలుకొని కడదాకా సాహిత్యాన్ని సృజిస్తూ, సాహిత్యమే జీవితంగా భాసించిన సారస్వత ఋషి ఆచార్య మాదిరాజు రంగారావు. కవిగా, విమర్శకునిగా, పరిశోధకునిగా, అనువాదకునిగా అపారమైన సాహిత్యాన్ని సృష్టించిన రంగారావుది తెలుగు సాహిత్య ప్రపంచంలో విశిష్టస్థానం. ఏడు దశాబ్దాల పైబడి సృజనాత్మక వ్యాసంగంలో నిమగ్నమై వుండడం సాహిత్యం మీద వారి ప్రేమకు సంకేతం. ఇది ఈతరం కవులకు, రచయితలకు స్ఫూర్తిదాయకం. తొమ్మిది దశాబ్దాల వారి నిండు జీవితం పరిపూర్ణమైనది. వేల పుటల రచనలతో తెలుగు సారస్వతాన్ని సుసంపన్నం చేశారు. విభిన్న వాదాలు, ధోరణులతో కూడిన సాహిత్యరంగం మీద 'స్వేచ్ఛా కవిత్వం' పేరిట తనదైన ముద్ర వేశారు. తను తలచినది రాశారు. ఎవరి ఆమోద అనామోదాలతో నిమిత్తం లేకుండా చెప్పాలనుకున్నది చెప్పారు. కవిగా, విమర్శకునిగా వారి మార్గం నిరుపమానం.

తెలుగు సాహిత్య విద్యార్థులు, పరిశోధకులు, మరీ ముఖ్యంగా భాష, సాహిత్యాలను బోధించేవారు మాదిరాజు రంగారావు గారి సాహిత్యాన్ని శ్రద్ధతో అధ్యయనం చేయాలి. వారిని చదవడం మన సృజనానుభవాన్ని సంపద్వంతం చేస్తుంది. తెలుగు సాహిత్య సంపన్నతకు వారి తోడ్పాటు మీద మరిన్ని విశ్లేషణలు, పరిశోధనలు జరగాలి. ఇటీవలనే వారి స్వేచ్ఛా కవిత్వం తొమ్మిది సంపుటాలు, సాహిత్య విమర్శ రెండు సంపుటాలు వెలువడినాయి. ఈ బృహత్ సంకలనాలను ముద్రించి, లోకం ముందు వుంచిన రంగారావు గారి కుటుంబ సభ్యులను అభినందించాలి. ఈ నేపథ్యంలో శ్రీకృష్ణదేవరాయ తెలుగు భాషా నిలయం జూలై **4** తేదీన 'ఆచార్య మాదిరాజు రంగారావు సాహిత్యం-పరామర్శ' శీర్షికన ఒక సదస్సు నిర్వహిస్తుంది. ఈ సందర్భంగా మాదిరాజు రంగారావు గారి కృషిని రేఖామాత్రంగా తెలియజెప్పే కొన్ని వ్యాసాలతో 'పాలపిట్ట' ప్రత్యేక సంచికను వెలువరిస్తున్నది. ఈ సంచిక కోసం తమ సహాయ సహకారాలు అందించిన పెద్దలకు, మాన్యులకు, రచయితలకు ప్రత్యేక ధన్యవాదాలు.



# నా'నుడి'

సమకాలీన సాహిత్యాన్ని ఎంతగానో ప్రభావితం చేసిన ఆచార్య మాదిరాజు రంగారావు ఆధునిక తెలుగు పండితకవి. ఉత్తమ పరిశోధకుడు, విమర్శకుడు కూడా. సంస్కృతాంధ్రాంగ్ల సాహిత్యాల అంచుల్ని ముట్టిన విద్వన్మూర్తి. ఆధునిక సాహిత్యంలో సమస్త భావజాలాలకు సంబంధించిన, సకల ప్రక్రియలకు సంబంధించిన గ్రంథాలను క్షుణ్ణంగా అధ్యయనం చేసిన సాహితీమూర్తి. వందలాది విద్యార్థులకు సంస్కృతాంధ్ర సాహితీ విశేషాలను విడమర్చి చెప్పిన మహాదేశికుడు. కవిత్వాన్ని ఎంతగా ఆస్వాదిస్తారో, సాహితీ విమర్శను కూడా అంతగా అభిమానిస్తారు. ఆధునిక తెలుగుసాహిత్యంలో స్వేచ్ఛా కవిత్వం సమాలోచన, సాత్త్విక చింతన, మానవతా దృక్పథం, ప్రజాస్వామ్య చైతన్యాలను సమన్వయ పరచిన ప్రముఖ కవి పండితుడు. స్వేచ్ఛాకవిత్వ నిర్మాతగా, మార్మిక కవిగా ప్రతీతి పొందిన డాక్టర్ మాదిరాజు రంగారావు "స్వేచ్ఛాకవిత సంప్రదాయ ఛందస్సు నుండి ముక్తమైన ఒక ఆధునికప్రక్రియ; ఒక నిర్ణీతమైన నియమబద్ధ, యతిప్రాసలు లేని, లయబద్ధంకాని సంప్రదాయ చంధోరీతికి చెందని రచన"గా స్వేచ్ఛాకవిత్వాన్ని నిర్వచించారు. స్వేచ్ఛా కవిత్వానికి పునాది ప్రజాస్వామ్య భావన, సామాజిక స్పృహ, స్వేచ్ఛతో పాటు స్వచ్ఛత ఆచార్య రంగారావు కవిత్వంలో మెరుపులీనుతుంది. విరామమెరుగని ఆయన కలానికి బలమిచ్చినవి మానవ శ్రేయస్సు, మానవ సంక్షేమం, మానవాభ్యుదయమనే అంశాలే. ఎవరినీ అంటీ ముట్టకుండా, అంతర్ముఖుడై, 'తన కవిత్వం తనది; తన రచనలు తనవి' అన్నట్లుగా నిలిచిపోయిన ఋషితుల్యుడు మాదిరాజు; సహృదయుడు. మాదిరాజు రంగారావు మనసులో 'రసధుని' ఆత్మబంధమైంది. ఆత్మనాదమైంది. ఆత్మగంధమైంది. నూటడెబ్బై పుస్తకాలకన్నా ఎక్కువే రాసినప్పటికీ. ఆయనగారి 'స్వేచ్ఛా కవిత్వం' విశ్వవ్యాప్తం కాలేదు. జీవితమంతా 'రచన' చేశాడే కానీ తనకు తాను వ్యాప్తి చేసుకోలేదు. తన కోసం, తన కవిత్వం కోసం, విశ్వవిద్యాలయ ఆచార్యునిగా వున్నా. తన పదవినీ, అధికారాన్నీ ఏమాత్రం వాడలేదు. కవిత్వాన్ని లాభాపేక్షకు వాడని సుకవి. అవార్డుల కోసం అర్రులు చాచలేదు. ఆయన ఎవరితొడుగు తొడుక్కుని బ్రతకలేదు. స్వేచ్ఛా కవిత్వం కోసం జీవితమంతా ధారపోసిన మన మాదిరాజు కవి రాజే !!

ఆ కవిరాజు స్మరణ "వారి కుటుంబసభ్యుల సహకారం"తో– 125 సంవత్సరాల ఉత్సవాల్లో భాగంగా శ్రీకృష్ణదేవరాయ తెలుగు భాషా నిలయం తలపెట్టిన యజ్ఞతుల్యమైన 'ఆచార్య మాదిరాజురంగారావు సాహిత్యం పరామర్శ' పేరిట నిర్వహింపబడే సాహితీ కార్యక్రమం సుసంపన్నం కావాలనీ, 'ఆత్మబంధమైన రసధుని'లా నిల్చిపోవాలని ఆశిస్తూ; శుభాకాంక్షలతో–

**– కె.వి. రమణ**

# స్వేచ్ఛాకవిత్వం మేనిఫెస్టో - వి'లక్షణ' చర్చ

- సిహెచ్.లక్ష్మణ చక్రవర్తి

తెలుగు సాహిత్యంలో వాదాలు, ధోరణులు, ఉద్యమాలు కేంద్రంగా వెలువడిన సాహిత్యం తమ తమ పద్ధతులలో నియమ నిబంధనలను ఏర్పర్చుకున్నది. ఇది ఒక్కొక్కసారి సృజన రూపంగానూ, మరికొన్నిసార్లు వివేచన రూపంగానూ కనిపిస్తుంది. 'మేనిఫెస్టో' అనే మాట ప్రపంచ వ్యాప్తంగా 1948లో ఫ్రెడరిక్ ఏంగెల్స్, కార్ల్ మార్క్స్ రాసి ప్రచురించిన 'కమ్యూనిస్ట్ మేనిఫెస్టో' అనే రాజకీయ కర పత్రంతో ప్రాచుర్యంలోకి వచ్చింది. సామాజిక, ఆర్థిక, చారిత్రక అంశాలలో వాస్తవాలను క్రోడీకరించి ప్రపంచానికి కొత్త స్ఫూర్తిని అందించింది. మేనిఫెస్టో పదంతో తెలుగు సాహిత్యంలో కనిపించే విమర్శ రచన శేషేంద్ర రచించిన కవిసేన మేనిఫెస్టో. అంతకుముందు కమ్యూనిస్టు మేనిఫెస్టో తోనూ తెలుగు సాహిత్య విమర్శకులకు పరిచయం ఉంది. జనాంతికంగా చేసిన రాజకీయపరమైన, మతపరమైన, తత్త్వపరమైన లేక సాహిత్యపరమైన ప్రకటనను మేనిఫెస్టో అనవచ్చు. ఈ ప్రకటన లేక ప్రణాళికలో ఆయా సంస్థల సిద్ధాంతాలు, నమ్మకాల గురించిన వివరణలు, ఇంకా వారి భవిష్యత్ ప్రణాళిక ఉంటాయి.

"రాజకీయ, మత, తాత్విక, సాహిత్యపరమైన నమ్మకాలనూ, సిద్ధాంతాలనూ ప్రజల నుద్దేశించి ప్రకటించడం. సాహిత్య ఉద్యమాలలో ఉన్న కవులూ, రచయితలు ఈ రకమైన మేనిఫెస్టోలను ప్రకటించడం సర్వసాధారణం. తమ సాహిత్య ఉద్యమానికి ప్రేరణేమిటో, కారణమేమిటో, లక్ష్యాలు ఏమిటో దాన్ని సాధించడానికి తాము చేయదలచుకున్న కార్యక్రమాలు ఏమిటో వీరు చెప్పుకుంటారు". (సాహిత్య విమర్శ పదాల డిక్షనరీ, 2021, పుట.118) మేనిఫెస్టో అంటే స్థూలంగా ఒక సమూహం, సంఘం ఏర్పాటు చేసుకునే ప్రణాళిక అని అర్థం చేసుకోవచ్చు. అయితే ఇటీవలి కాలంలో రాజకీయ పార్టీలు ఎన్నికలకు ముందు తాము చేయదలచిన పనులను గురించి, చేస్తామను కుంటున్న పనులను గురించి చెప్పే ప్రణాళికగా ఈ మాట ఎక్కువగా చర్చల్లో కనిపిస్తుంది. నిజానికి రాజకీయ నేపథ్యం సాహిత్య సృజనలో కనిపించినప్పుడు కవులు కళాకారులు తమ ఉద్దేశాన్ని మేనిఫెస్టో రూపంలో రూపొందించటం కనిపిస్తుంది. అన్ని రకాల సాహిత్యసంఘాలకు ఒక ప్రణాళిక ఉంటుంది.

స్వేచ్ఛా కవిత్వ నిర్మాతగా, మార్మిక కవిగా ప్రసిద్ధి పొందిన మాదిరాజు రంగారావు సాహిత్య విమర్శకుడిగా సుమారు 15 రచనలు చేశారు. ఫ్రీవర్స్ అన్నమాటకు సమానార్థకంగా 'స్వేచ్ఛాకవిత్వం' అన్నది మాదిరాజు రంగారావు ఉపయోగిస్తూ వచ్చారు. వచన కవిత అన్న మాటకంటే 'స్వేచ్ఛాకవిత' అనడం సరైనదని భావిస్తూ "స్వేచ్ఛాకవిత సంప్రదాయ ఛందస్సు నుండి ముక్తమైన ఆధునిక ప్రక్రియ. ఒక నిర్ణీతమైన నియమబద్ధం, యతి ప్రాసలు లేని లయబద్ధం కాని సంప్రదాయ ఛందోరీతికి చెందని రచన" అంటూ కొందరు తెలుగుకవులు దీన్ని నిర్వహించిన రీతిని దాని తత్వాన్ని 'స్వేచ్ఛాకవిత్వం' మేనిఫెస్టోలో వివరించారు. స్వేచ్ఛాకవిత్వం అన్న భావనను, దాని ఆధునికతను పరిణామాన్ని వివరించడం ఈ పుస్తకం చేస్తున్న ప్రధానమైన పని. 'వచన కవిత్వం కాని కవిత్వంగా సామాజిక స్పృహ రాజకీయ దృష్టి మనస్తత్వ విశ్లేషణం ఆధునిక ప్రకాశనంతో నిరంతరం కొత్తదనానికి అన్వేషణతో కొత్త ప్రక్రియగా విలసిల్లింది' అన్నది స్వేచ్ఛా కవిత్వం పట్ల మాదిరాజు గారికి ఉన్న స్పష్టమైన అభిప్రాయం. దాన్ని నిరూపించి, మార్గం వేసే క్రమంలో చేసిన ఆలోచనలే స్వేచ్ఛా కవిత్వం మేనిఫెస్టో.



**మాదిరాజు రంగారావు - 8 జూన్ 1935 - 21 జూన్ 2025**

కవిత్వ తత్వాన్ని వివరించే వ్యాసపరంపరలు రూపనగుడి నారాయణరావు (కావ్యనిదానము) దువ్వూరి రామిరెడ్డి (కవిత్వతత్త్వనిరూపణ వ్యాసాలు తొమ్మిది) యు.ఎ. నరసింహ మూర్తి (కవిత్వతత్త్వ వివేచన) వంటి వారు చేశారు. వారందరూ కవిత్వ పదార్థం కేంద్రంగా ఆలోచనలు సాగించిన వారు. అందుకు భిన్నంగా మాదిరాజు రంగారావు వస్తువు రూపం అభివ్యక్తి, నిర్మాణం కారణంగా చేసుకొని స్వేచ్ఛా కవిత్వం అన్న మేనిఫెస్టోను సిద్ధం చేశారు.

వైయక్తిక సామాజిక స్థరాలు వస్త్వాశ్రయ ఆత్మాశ్రయ రీతులు స్వేచ్ఛా కవిత్వానికి పునాదులుగా మాదిరాజు రంగారావు భావించారు. స్వేచ్ఛా కవిత్వ భావనను నిర్మించే విశ్లేషించే క్రమంలో ప్రజాస్వామ్య భావనను చెప్పారు. స్వేచ్ఛా కవిత్వానికి ప్రజాస్వామ్య భావనకు ఉన్న సంబంధాన్ని చర్చించడం ద్వారా ఒక మౌలిక విషయాన్ని ప్రతిపాదించారు. ఆధునిక సాహిత్యంలో అభ్యుదయ కవిత్వం దాని అనంతర ధోరణులు అన్నీ ప్రజాస్వామ్య భావనను కలిగి ఉన్నా అవి ఏ రకంగా సంకుచిత స్థితిలో ఉన్నాయో ప్రస్తావించారు. ఆయా వాదాలు ధోరణులు ఒక్కొక్క 'ప్రజ'కు ప్రాధాన్యం కలిగించినవి కానీ అందులో ప్రజాస్వామ్యం లేదు. ఈ వాదాలు చెప్పే ప్రజాస్వామ్యానికి భిన్నంగా తన వాదాన్ని చెప్పే ప్రయత్నం చేశారు మాదిరాజు రంగారావు. స్వేచ్ఛా-స్వాతంత్ర్యం, సంస్కరణ-పరివర్తనం, ప్రగతి-మానవతారాధన, శాంతి- సౌభాగ్యం, సౌందర్యం- సమానత్వం, సంప్రదాయ మూలాలు - విశ్వ భావన వంటి వాటితో ఇది ఉంటుందని

*కవిత్వ తత్త్వాన్ని వివరించే వ్యాసపరంపరలు రూపనగుడి నారాయణరావు (కావ్యనిదానము) దువ్వూరి రామిరెడ్డి (కవిత్వతత్త్వ నిరూపణ వ్యాసాలు తొమ్మిది) యు.ఎ. నరసింహ మూర్తి (కవిత్వతత్త్వ వివేచన) వంటి వారు చేశారు. వారందరూ కవిత్వ పదార్థం కేంద్రంగా ఆలోచనలు సాగించిన వారు. అందుకు భిన్నంగా మాదిరాజు రంగారావు వస్తువు రూపం అభివ్యక్తి, నిర్మాణం కారణంగా చేసుకొని స్వేచ్ఛా కవిత్వం అన్న మేనిఫెస్టోను సిద్ధం చేశారు.*

స్వేచ్ఛాకవిత్వానికి పునాదిగా ప్రజాస్వామ్య భావనను చర్చించారు. వచనకవిత్వం లేదా సమకాలీన కవిత్వానికి సామాజిక స్పృహ ప్రధానాంశం. భావ కవితలోని స్వేచ్ఛను వస్తురూప సంవిధానాలకు, అభ్యుదయం మొదలు తర్వాతి కాలం వరకు వచ్చిన కవిత్వంలోని సామాజిక స్పృహను ప్రజాస్వామ్యంగా చూపడం ద్వారా స్వేచ్ఛా కవిత్వం భిన్నమయిన దనేందుకు భూమికను ఏర్పరచుకున్నారు.

వస్త్వాశ్రయ ఆత్మాశ్రయ ధోరణులు అన్నిటిలోనూ ఏదో ఒక పార్శ్వం లేదా స్థితి ఉంటుంది. అనుభూతికో, అనుభవానికో తనను మలచుకునే, తన కవిత్వానికి అవధిగా భావించుకునే స్థితికి భిన్నమైందిగా స్వేచ్ఛా కవిత్వాన్ని నిరూపించటానికి మాదిరాజు రంగారావు చర్చకు పెట్టిన కొన్ని విషయాలు న్నాయి. స్వేచ్ఛా కవిత్వానికి లక్షణం లేదు ఉండదంటూ దాన్ని గుర్తించటానికి కొన్ని విషయాలను చెప్పారు.

*శబ్దం లహరి వలె మరో శబ్దాన్ని అందుకొని వర్తిస్తుంది*
*శబ్దం తరంగం వలె ఎగసి మరో శబ్దాన్ని పట్టుకొని కదులుతుంది*
*వాక్యం మరో వాక్యాన్ని అందుకొని, మరో వాక్యంతో కలిసి చరిస్తుంది*
*లయ చలనంతో ప్రసార గమనంతో ఆకర్షిస్తుంది*
*ధారా గతితో ప్రవహిస్తుంది.*

ఇట్లా ఎక్కడికక్కడ ఆవేశ స్థితిని అనుసరించి ఒకే స్థాయిలో లేదా వివిధ స్థాయిల్లో పై అంశాల సమాకలనం జరగవచ్చు ఆవేశ స్థాయిని బట్టి భావ స్వరూపాన్ని బట్టి నిర్మాణ రీతిని బట్టి ఉద్గమన రూపం సిద్ధిస్తుంది.

ఒక్కొక్కప్పుడు శబ్దం, శబ్ద సమూహం వాక్యం దాని కదలికల్ని బట్టి అక్కడక్కడ గణ రూపాలు, మాత్ర రూపాలు చోటు చేసుకోవచ్చు.

రచనల్లో సంభాషణ పద్ధతులు వచన రీతులు వచోవిన్యాసాలు చోటు చేసుకుంటాయి.

ఇదంతా ఆ సందర్భాన్ని సమయాన్ని అనుసరించి కవి బహిరంతర వ్యక్తిత్వంపై ఆధారపడి ఉంటుంది. స్వయం ప్రేరణ, కవి వ్యక్తిత్వం, సంప్రదాయ సంస్కృతీ తేజం, ఆధునిక సంస్కారం, మానవీయ స్పందన, సామాజిక తత్పరత, హేతు దృష్టి, వస్తునవ్యత అన్నవి కవిలో కవిత్వంలో ప్రస్ఫుటమవుతాయి. కథా పద్ధతి కంటే భావ విన్యాసానికి కథనరీతి కంటే భావ యోజనకు ప్రాధాన్యం స్వేచ్ఛా కవిత్వంలో ఉంటుందని వారు భావించారు.

కుందుర్తి వచన కవిత్వానికి లక్షణ నిర్దేశం చేస్తూ సాంప్రదాయికుల ఆమోదం వచన కవితకు లభించటానికి కథానిర్వహణ, కథన రీతులను చెప్పారు. ముక్త ఛందమే అయినా ఒకానొక గేయపు నడకను వచనగేయపు స్వభావాన్ని అంగీకరించారు. వచన కవిత్వం కంటే భిన్నమైంది స్వేచ్ఛా కవిత్వం అని చెప్పటానికి ఈ అంశాలనే ఇక్కడ మాదిరాజు రంగారావు ప్రస్తావించి దాని ప్రణాళికను పద్ధతిని చెప్పే ప్రయత్నం చేశారు.

స్వేచ్ఛను నిర్వచించే ప్రయత్నంలో భావకవిత్వంలోని స్వేచ్ఛా వ్యక్తిని ఆశ్రయించిందనీ, స్వేచ్ఛా కవిత్వం లోని స్వేచ్ఛా వ్యక్తి, సమాజం, ప్రక్రియ అన్నిటిలోనూ ఉంటుందంటారు మాదిరాజు వారు. తాను ప్రతిపాదిస్తున్న ఈ పద్ధతి కవిత్వం భావ కవితకు అభ్యుదయకవితకు చాలా భిన్నమైనదని వారు భావించారు. అందుకు వారు ఎన్నుకున్న జంట స్వేచ్ఛా కవిత్వం – ప్రజాస్వామ్య భావన. ఒకటి భావ కవిత్వంతో మరొకటి అభ్యుదయ కవిత్వంతో సంవదించే అంశాలు. ఈ రెండిటికి భిన్నంగా ఒక విస్తృతమయిన దిశ, పరిధి ప్రయోజనాన్ని కల్పించి ఈ మేనిఫెస్టోని రూపొందించారు. భావ అభ్యుదయ వచన కవిత్వాలలో ఉన్న దిశ పరిధి ప్రయోజనం చాలా పరిమితమైనవని చెబుతూ స్వేచ్ఛా కవిత్వపు దిశ పరిధి ప్రయోజనాలు బహుముఖీనమైనవని అన్నారు.

"ప్రజాస్వామ్య కవిత్వం భౌతిక రూపాన్ని విడనాడకుండా ఉదాత్తమైన విలువలకు ప్రాధాన్యం ఇస్తుంది. మార్క్సీయ భావనతో సమాజంలో వర్గ పోరాటాన్ని తీవ్రతరం చేసి ఉగ్రశక్తిగా విప్లవ కవిత్వం ఆయుధయుత పాత్రను వహించింది. వీటికి సమాంతరంగా అప్పుడప్పుడు తలెత్తే అనుభూతి కవిత్వం కాల్పనికతను సంతరించుకుంది వీటికి భిన్నంగా విశిష్టంగా సామాజిక ప్రగతి లక్ష్యంతో వ్యక్తి వికాసంపై దృష్టి భౌతిక మానసిక తలాలకు సమానమైన ప్రాధాన్యంతో చిర సంప్రదాయ సంపద పట్ల గౌరవంతో వెలువడింది ప్రజాస్వామ్య (స్వేచ్ఛా) కవిత్వం" అని సమకాలీన వదాలకు ఇది ఎలా భిన్నమో చెప్పారు.

కవిత్వంలో సృజన శక్తి అన్నది కవి దాటిన వివిధ పరిణామ దశలలో వివిధ రూపాలుగా ఉంటుంది. ఒక కవిలో బాహిర, అంతర స్వరూపాలు, స్థల కాలాల అవధులను బట్టి లక్ష్యంలో మార్పును చేసుకుంటూ కవిత్వం వెళుతుంది. ఈ దశలో కావ్య గానం కవి సమ్మేళనాలలో కవితా పఠనం వంటివి తొలినాళ్లలో పద్యానికి వచన కవితకు గేయపునడకను ఇచ్చాయి. తొలినాళ్లలో వచన కవిత్వం అంటే బ్లాంక్ వెర్స్ పద్ధతిలో నడిచేది. స్వేచ్ఛా కవిత్వం వచ్చాక కవిత్వంలో గాన పద్ధతి తగ్గింది. ఇది కవి పాఠకుడు ఇద్దరూ అంతర్ముఖీనులు కావటానికి తోడ్పడిన మార్గంగా వివేచించారు మాదిరాజు రంగారావు. స్వేచ్ఛా కవిత్వం అనుభవంలోకి వచ్చే కొద్దీ మనసు మలిన రహితం అయ్యేకొద్దీ తేజోవంతంగా ప్రకాశించే కొద్దీ అహం స్థానంలో దార్శనికత సిద్ధిస్తుంది. ఇక్కడ అహం పోవటం అంటే సహృదయత మేల్కోవటం. వచన కవితకు అస్పష్టత ఒక లక్షణం. దానికి వారు చెప్పే కారణాలు వేరు. స్వేచ్ఛాకవిత్వంలోనూ ఇది ఉంటుంది. ఇక్కడి క్లిష్టత భావరూపాలకు, ప్రతీకలకు సంబంధించిందంటారు మాదిరాజువారు.

స్వేచ్ఛా కవిత్వంలోని వస్తువు, ప్రకృతి, సమాజం జీవితం అన్న వాటితో ముడిపడి ఉంటుంది. ఇవి దేనికదిగా ఉండటం వివిధ కవితా వాదాలలో గమనించవచ్చు. స్వేచ్ఛా కవితలోని ప్రకృతి కేవలం వర్ణనాత్మకం కాదు. సమాజం కేవలం వర్గం కాదు. మానవ సంబంధాల చలనం. వ్యక్తిపై, అతని శక్తిపై హేతువాద దృక్పథం కలవారు సంపూర్ణ విశ్వాసం చూపారు. అందుకు భిన్నంగా వ్యక్తిని అతని జీవిత దృక్పథం ఆధారంగా స్వేచ్ఛా కవిత్వం గుర్తిస్తుంది. బాహ్య అంతర స్వరూపాలుగా ఉండే ఈ కవిత్వంలో మొదటిది దృష్టికి, రెండవది ఊహకు ఒదుగుతుంది. దృష్టికి ఒదిగింది ఆనందాన్ని, ఊహకు ఒదిగింది ఆలోచనను ఇస్తుంది. అందువల్ల స్వేచ్ఛా కవిత్వంలో వస్తువులో అభ్యుదయ కవుల భౌతికం, భావకవుల కాల్పనికం, సంప్రదాయవాదుల భౌతిక అతీత ప్రభావ తీవ్రత ఉండవు. స్వేచ్ఛా కవిత్వంలో నేటి సామాజిక జీవనానుభవంతో నిగ్గు తేల్చిన వాస్తవం దృశ్యమానం అవుతుంది. అలాగే వివిధ సిద్ధాంతాలు, అభిప్రాయాలు, జీవితంలో సమన్వయం పొందుతున్న సమయం అన్నవి ఉంటాయంటారు మాదిరాజు రంగారావు.

స్వేచ్ఛా కవిత్వంలోని ఆధునికత నిరంతర పరిణామశీలమైంది అంటూనే మానవత ఆత్మిక ధర్మంగా మారవలసిన అవసరాన్ని చర్చించారు. సంఘ సంస్కరణ అభ్యుదయ విప్లవ వాదాలలో కనిపించే మానవత భౌతిక ధర్మంగా ఉంది. పరోపకారం మానవతకు చిహ్నమే అయినా అది ప్రకృతిలో కనిపించే

పరోపకారమంత సహజంగా ఆత్మీయ ధర్మంగా ఉండాలంటారు మాదిరాజు రంగారావు. అటువంటి మానవీయసంబంధాలను స్వేచ్ఛాకవిత్వం బోధిస్తుందని అభిప్రాయ పడ్డారు.

స్వేచ్ఛాకవిత్వాన్ని ఈ కోణాలలో ప్రతిపాదించిన మాదిరాజు రంగారావు దీనిని సమాలోచన చేయవలసిన పద్ధతులను చెప్పడం ప్రత్యేకంగా చెప్పుకోదగింది. మేనిఫెస్టో కేవలం నియమ నిబంధనలను ప్రణాళికలను తయారు చేస్తే, చెబితే సరిపోదు. దానిని అన్వయించే, సమన్వయం చేసే పద్ధతులను నేర్పించాలి. అందుకు వారు చేసిన ప్రతిపాదనలు ఇవి:

– 1980 తర్వాత స్వేచ్ఛా కవిత్వంలో మార్క్సిజం వెనుకబడింది. దళిత, స్త్రీ, మైనార్టీ అనుభూతివాద ధోరణులు, ప్రజాస్వామ్య భావనలు వచ్చాయి

– విశ్వభావన, విశ్వ మానవుడితో పాటు స్థానీయమైన అవసరాలను బట్టి దేశీయతకు ప్రాధాన్యం వచ్చింది.

– కులం, మతం, ప్రాంతం, జండర్, వృత్తి, ఉద్యోగం వంటి అసమానతలతో ఏర్పడ్డ వైరుధ్యాలని ప్రజాస్వామ్య భావన పరిష్కార సాధనగా ఉపయోగపడింది.

– అంతర్జాతీయ జాతీయ దేశీయ స్థానీయ సమస్యలు వాటి పరిష్కారాలలో నిర్మాణాత్మక దృక్పథం ఏర్పడింది.

– హేతు దృష్టికి అనుభూతికి సమప్రాధాన్యం. సాహిత్య సామాజిక రాజకీయ మనస్తత్వ పరమైన అంశాలకు చోటు కల్పించింది.

– వస్తునిర్వహణ ఆవిష్కరణలో భావ చిత్రాలు, ప్రతీకలు, ఆర్కిటైప్స్, మనస్తత్వరీతులు కళారూపంలో భాగం అయ్యాయి.

– రూపపరమైన పద్యం గేయం గీతం వచనం ముద్రలు వీడిన మనోరూపంతో స్వేచ్ఛా కవిత్వాన్ని దర్శించడం అవసరం. అప్పుడే సమాలోచనకు సరైన స్థితి ఏర్పడుతుంది

స్వేచ్ఛా కవిత్వంలో ఛందస్సులో నియతమైన నిర్మాణ గతికి లయకు ప్రత్యామ్నాయంగా కొన్ని అంశాలను ప్రతిపాదించారు.

– పద చలనంలో వాక్య విన్యాసంతో స్వతంత్ర నిర్మాణం కనిపిస్తుంది

– కళాత్మకతకు లోపం రానీయని విధంగా ఆవేగంతో ఆలోచనతో అభివృద్ధి విధం రూపొందుతుంది.

– మధ్యలో సంభాషణ పద్ధతి సహజతను చేకూర్చేదిగాను యోజితమవుతుంది.

– భావ ప్రమాణాన్ని బట్టి పదవాక్యోపవాక్య ప్రసారం జరుగుతుంది. స్పందన రీతుల్ని దీనికి అనుగుణంగా ఆవేశ స్థాయిని అనుసరించి వైవిధ్యాన్ని పొందుతుంది.

– నిర్మాణ రూపంలో ఒక చలనాన్ని మరోచలనం ఒక గమనాన్ని మరో గమనం ఒక ప్రసారాన్ని మరో ప్రసారం అందుకొని నైరంతర్యాన్ని కలిగి ఉంటుంది.

– మొదటినుంచి చివరిదాకా ఏర్పడే క్రమంలో శైలిని ఏర్పరచుకొని మూర్తిమత్వాన్ని పొందుతుంది.

ఈ విధంగా రచనకు ఒక నిర్దిష్టమైన ఆకృతి సిద్ధిస్తుంది. ఇది కవి ఆంతరమైన నిర్మాణ శక్తికి సంబంధించినది మాత్రమే అయినా, స్వతంత్ర ప్రతిపత్తి కలిగింది స్వేచ్ఛా ప్రేరితమైందిగా చెప్పారు.

వస్తు రూప నిర్మాణాల సమాలోచన ద్వారా స్వేచ్ఛాకవిత్వాన్ని సమాలోచన చేసే తీరును ప్రతిపాదించారు. స్వేచ్ఛా కవిత్వాన్ని సమాలోచన చేస్తూ వచన కవిత్వంలోని పరిమితుల వల్ల ఇది ఇందులో అంతర్భాగమవుతుందని, ఇది వైయక్తిక సామాజిక స్థాయిల్లో విస్తృతికి పూర్ణతకు ప్రాతినిధ్యం వహిస్తుంది అంటారు మాదిరాజు రంగారావు.

ఈ సందర్భంలో వారు కామనీయకం అన్న భావన (Concept) ను ప్రతిపాదించారు. రామణీయకం అన్న మాట జగన్నాథుని కాలం నుంచి, రసరామణీయకతను ప్రతిపాదించిన దువ్వూరి రామిరెడ్డి దాకా చర్చలో ఉన్నటువంటి పదం. దీన్ని శోభకు పర్యాయపదంగా, క్షణక్షణ నవీనత్వాన్ని భావింపజేసేదిగా విమర్శకులు అందరూ చెప్పారు. కామనీయకంలో రామణీయకం అన్నది అంతర్భాగమవుతుందని, దానికన్నా ఇది విస్తృతమైందని అంటూ "అర్థ బోధక రూపమైన శబ్దం మొదలుకొని ధ్వన్యర్థమైన ప్రతీయమానం దాకా బహు విధాలుగా వ్యాప్తం అయింది. ఇది కోరదగింది అందమైనది ఇష్టపడి చేసేది" అంటారు మాదిరాజు రంగారావు. అయితే ఇది ధ్వన్యాలోకంలో ఆనందవర్ధనుడు ప్రస్తావించగా అభినవగుప్తుడు వ్యాఖ్యానించాడు అన్నారు. సంవేదన, భావసాంద్రత, అభివ్యక్తినైపుణి, ప్రయోజన పరతతో కూడింది ఈ కామనీయకం. ఈ భావన ద్వారా ఏకకాలంలో కవి పనితనం, పాఠకుడు లేదా శ్రోత అనుభవం రెండిటి సమ్మేళనం చేశారు మాదిరాజు రంగారావు. ఈ ఇద్దరు కలిసినప్పుడే కావ్యం అవుతుందన్నది ఈ సందర్భంలో వారు గుర్తు చేశారు.

స్వేచ్ఛా కవిత్వాన్ని సమాలోచించడంలో కవిస్థాయి, సహృదయ స్థాయి, అభిమాన స్థాయి, సమాలోచన స్థాయి, పరిశోధన స్థాయి అన్న ఐదు స్థాయులను ప్రతిపాదించారు. కవిస్థాయి అతడు వెలువరించే భావాలకు అంతర్వ్యక్తిత్వానికి సంబంధించింది. సహృదయ స్థాయి అతడి అనుభూతి శీలానికి, అభిమాన స్థాయి సమీక్ష పీఠికల రూపంలోని విషయానికి, సమాలోచన స్థాయి సమాలోచన చేసే వ్యక్తి దృష్టి కోణంతో ఉండే స్థితికి, పరిశోధన స్థాయి పూర్వపక్షం, విశదీకరణ ప్రతిపాదనలతో ఉంటుంది. ఈ ఐదు దశలను సమాలోచనలో ప్రధాన భాగాలుగా చెప్పారు. ఈ రీతిలో సమాలోచన చేయవలసిన అవసరం ఉందని భావించారు. ప్రతీయమానార్థాన్ని కావ్య శాస్త్రానుసారం, నిబద్ధతను ప్రజాస్వామ్య భావనతో సమన్వయిస్తూ అంతర్, బహిర్, అంతస్తత్వ స్థాయుల్లో సమాలోచన చేస్తూ రాజకీయ సామాజిక తాత్త్విక సాంస్కృతిక చింతనలతో విశ్లేషించవలసిన అవసరాన్ని విడమరచి చెప్పారు. స్వేచ్ఛా కవిత్వంలో మానవీయ యుగం ఒకటి ప్రత్యేకంగా కనిపిస్తుందని దాన్ని కాపాడవలసిన అవసరం ఉందని భావించారు

స్వేచ్ఛా కవిత్వం, సహృదయ స్పందన అన్న భాగం ఒకరకంగా స్వేచ్ఛా కవిత్వం రెండు భాగాలలో చెప్పిన అంశాలకు ఉపసంహారం వంటిది. అదే సందర్భంలో స్వీయ కవిత్వానికి అన్వయించే సూత్రాలను వివరించడం లాంటిదిగా కూడా ఇది కనిపిస్తుంది. స్వేచ్ఛా కవిత్వానికి ఉన్న లక్షణాలను, కొంత అన్వయాన్ని తొలి రెండు భాగాలలో చెబితే ఈ భాగంలో స్వేచ్ఛా కవిత్వం మిగతా వాటికి ఎందుకు భిన్నమో చెప్పటానికి ఎక్కువగా ప్రయత్నం చేసినట్లు కనిపిస్తుంది.

వచన కవిత్వం, వచన పద్యం, వచన గేయం అన్న మాటలలో వచన, పద్య, గేయ స్వభావాలు లయాత్మకతను కలిగి ఉన్నాయి. వాటికి ఒక చట్రం ఉంది. వచనకవిత్వం స్వేచ్ఛా కవిత్వం ఒకటి కాదంటూ "వచన కవిత్వానికి అవసరమైన జీవధాతువును క్రియాత్మకం చేసే శక్తి లేదు. కవిత్వభాషకు అనుకూల స్థితి ఇచ్చే లక్షణం లేదు. కవిత్వంలో అభివ్యక్తి క్షేత్రాన్ని సంకుచితం చేసే సీమల్ని తలపిస్తుంది" వంటి కారణాలను చెప్పారు. కవిత్వం కంటే వచనత్వానికి జారిపోవడంపై మాదిరాజు రంగారావు నిరసన తెలియజేస్తున్నట్లు ఈ మాటలలో గమనించవచ్చు. త్రిపురనేని శ్రీనివాస్ వంటి కవులు 90 ల ప్రాంతాలలో కవిత్వం కేవలం వచనం అయిపోవడాన్ని గట్టిగానే వ్యతిరేకించారు. అటువంటి స్థితి పై మాటలలోను చూడవచ్చు.

స్వేచ్ఛగా ఏ ఆటంకాలు లేకుండా, పరిమితులు, నియమాలు లేకుండా తనలో కలిగిన భావానుభవాన్ని ఆవిష్కరించడం వలన అది స్వేచ్ఛా కవిత్వంగా రూపొందిందన్నారు మాదిరాజు రంగారావు. శబ్ద విస్తృతి తగ్గి, అభివ్యక్తి శిల్పం లోపించి, భావప్రసార నిర్మాణంలో కళాత్మకత ఉన్న సామాజిక విషయ వైవిధ్యం


పెరిగింది ఇదంతా వచనత్వాన్ని వదిలిపెట్టడం వలన వచ్చిన అభివృద్ధి విశేషంగా నిరూపించే ప్రయత్నం ఈ సహృదయ స్పందన అన్న భాగంలో కనిపిస్తుంది.

స్వేచ్ఛా కవిత్వాన్ని సమాలోచించడానికి భావస్థానం అభివ్యక్తి విశేషం, సామాజిక రాజకీయ సాంస్కృతిక దార్శనికత, జీవిత వాస్తవం మానవీయ భావన అన్నవి ప్రధాన భూమికలుగా పనికి వస్తాయన్నారు. కవి ఆలోచనలను పట్టుకోవడానికి భావస్థానం పనికి వస్తుందన్నారు. ఈ ఆలోచనల వెనుక రససిద్ధాంత ప్రభావం కనిపిస్తుంది. అభివ్యక్తి విశేషాన్ని పట్టుకోవడంలో అమూర్తం నుండి మూర్తం వరకు ప్రయాణిస్తున్న తీరును గమనించాలి. సామాజిక రాజకీయ సాంస్కృతిక దార్శనికతలు జాతీయ అంతర్జాతీయ ప్రాంతీయ స్థానిక భూమికలు అన్న వాటితో కలుపుకొని ప్రధాన భూమికను వహిస్తాయన్నారు. జీవిత వాస్తవం మానవ చరిత్ర పరిణామక్రమాన్నిబట్టి తెలుసుకోవాలి అని స్వేచ్ఛా కవిత్వ సమాలోచనకు అవసరమైన విషయాన్ని చెప్పారు.

స్వేచ్ఛా కవిత్వంలో కనిపించే రూప భేదాల (దీర్ఘ కవిత, మినీ కవిత, నానీలు, రెక్కలు)కు విషయ సూక్ష్మత అభివ్యక్తి సంక్షిప్తత, ఝటిత స్ఫూర్తి, మెరుపులా ఆలోచన కారణాలుగా చూపి ఇవన్నీటికీ మూలం ముక్తకవే అంటారు మాదిరాజు రంగారావు. వర్తమాన కాలంలో స్వేచ్ఛా కవిత్వం ప్రయోగ శీలతతో, స్వేచ్ఛా వర్తనంతో తాను నమ్మే సిద్ధాంతాలకు కట్టుబడి గత ప్రభావాన్ని అవసరమైనంత తీసుకొని గతానికి పరంపరకు మధ్య సమన్వయం అందించడం స్వేచ్ఛా కవిత్వానికి సాధ్యం అయ్యిందని చెబుతూ రూపపరంగా వస్తు పరంగా దాని విస్తృతిని అంచనా వేశారు.

స్వేచ్ఛా కవితలో సృజనక్రియ జరిగే తీరును చెప్పడం కళాతత్వ పరిధికి సంబంధించినది. సృజన క్రియకు స్పందనం, స్థూల ఆకృతి రేఖ, స్పందనకు ఆకృతికి మధ్య ఖాళీలను పూరించడం, రచనా యానం అన్న నాలుగు దశలు ఉంటాయని, దానిని విమర్శకుడు పట్టుకోవాలన్నారు. అప్పుడే పారదర్శకతతో కూడిన సాహిత్య విమర్శ వెలువడుతుందని అభిప్రాయ పడ్డారు. కవి దృష్టిని పసిగట్టి, స్వీయ సిద్ధాంతాలను దర్శించి, అన్వ యించి, వస్తుతత్వాన్ని విశ్లేషించి, కవితా కళను చర్చించడం అన్న పనుల ద్వారా పారదర్శకతను విమర్శకులు సాధించవచ్చని చెప్పి, స్వేచ్ఛాకవిత్వ సమాలోచన రీతిని ప్రస్తావించారు. కవి విమర్శకుడు ఇద్దరు కవిత్వం లోని సజీవ మార్గమైన పూర్ణత కోసం భిన్న మార్గాలలో ప్రయత్నం చేస్తారు. అలా ప్రయత్నం చేయవలసిన అవసరం ఇద్దరికీ ఉంది అని భావించారు.

స్వేచ్ఛా కవిత్వంలో వ్యక్తి కేంద్రకం, సమూహ



*స్వేచ్ఛాకవిత్వంలో ప్రజాస్వామ్యం, మార్క్సీయ, సమన్వయ, సమకాలిక సంప్రదాయం, మావోపథం, అనుభూతి, అస్తిత్వవాద, దిగంబర, చేతనావర్త పైగంబర పరిణామాలున్నాయని వ్యక్తి స్వేచ్ఛా, సమాజాశ్రయం, ప్రక్రియాగతమైనదని మాదిరాజు రంగారావు భావించారు.*

కేంద్రకం, సర్వ మానవీయ భావన అన్న మూడు రీతులను చెప్పారు. అందుకు లక్ష్యంగా తన స్వీయ కవిత్వాన్ని ఉదహరించారు. వ్యక్తి కేంద్రంలో అద్దంలో ప్రజాస్వామ్యం, సమూహ కేంద్రకంలో ఆల్బమ్‌లో ప్రజాస్వామ్యం, సర్వ మానవీయ విశ్వభావనను ప్రవాహంలో ప్రజాస్వామ్యంగా చిత్రించిన తీరును ఇక్కడ అన్వయించి చూపారు.

స్వేచ్ఛా కవిత్వం ఒక సహజ పరిణామం ఫ్రీవర్స్ అన్న మాటకు సరిగ్గా అన్వర్థమయ్యేది ఇది. వైవిధ్యం, విస్తృతి నవ్యతాకాంక్ష వంటి కారణాలతో స్వేచ్ఛాకవిత్వం అన్నమాట సమంజసం, సహేతుకం అని ప్రజాస్వామ్య భావన ప్రేరణతో స్వేచ్ఛా సృజన శక్తికి ప్రాధాన్యమిస్తుందని ఈ ప్రక్రియ సిద్ధాంతాన్ని ప్రతిపాదించారు మాదిరాజు రంగారావు.

స్వేచ్ఛాకవిత్వం మేనిఫెస్టో అన్న రచనలో ప్రజాస్వామ్య/మానవీయ భావనలు, సహృదయుడు అన్వయించి విశ్లేషించవలసిన తీరు గూర్చి చర్చ ఉంది. తొలి భాగంలో స్వేచ్ఛా కవిత్వాన్ని, రెండో భాగంలో మానవీయ భావనలను చర్చించారు. స్వేచ్ఛాకవిత్వంలో ప్రజాస్వామ్యం, మార్క్సీయ, సమన్వయ, సమకాలిక సంప్రదాయం, మావోపథం, అనుభూతి, అస్తిత్వవాద, దిగంబర, చేతనావర్త పైగంబర పరిణామాలున్నాయని వ్యక్తి స్వేచ్ఛా, సమాజాశ్రయం, ప్రక్రియాగతమైనదని భావించారు. కవిత్వం సృజన, ఆధునికత, స్వేచ్ఛా కవిత్వంలో కొన్ని సమస్యలు వంటి వ్యాసాలు మొదటి భాగంలోఉన్నాయి. స్వేచ్ఛా కవిత్వంలో ప్రతీయమానం, నిబద్ధత, కామనీయకత, సమాన ధర్మాలు, మానవీయ భావనలు అన్న విషయాలతోపాటు స్వేచ్ఛా కవిత్వం, అంతర, బాహిర, అంతస్తత్వ స్థాయుల్లో సామాజిక, రాజకీయ, తాత్త్విక, సాంస్కృతిక చింతనతో కూడిందన్నారు. వచన కవిత్వం అన్న మాట పరిమిత ప్రయోజనాన్నిస్తే స్వేచ్ఛా కవిత్వం బహువిధాలైన భావజాల రూపాల్ని సంలీనం చేసుకున్నదని ఈ పుస్తకం ద్వారా రంగారావు చెప్పారు. స్వేచ్ఛా కవిత్వం సహృదయ స్పందన లో కళాతత్త్వ దృష్టి, స్వేచ్ఛాకవిత్వ విశ్లేషణకు, అవగాహనకు అవసరమయిన అంశాల ప్రస్తావన ఉంది.

స్వేచ్ఛాకవిత్వం వచనకవితకు భిన్నమయినదనడం ద్వారా వారు రూపాన్ని కేంద్రంగా చేసుకొని దీన్ని చెప్పారని స్థూలంగా అనిపించినా, వచన కవితకు మార్గంగా ఉన్న వస్తువు, అభివ్యక్తి, నిర్మాణం వంటి అన్ని అంశాలకు ఇది భిన్నం అని వారు చెప్పినా, ఈ పద్ధతి కవిత్వపు వస్తువును చర్చించడంలో ఆయన విప్లవ, మార్క్సీయ కళాత్మక, సమన్వయ, ప్రజాస్వామ్య, దళిత, స్త్రీవాద కవుల కవితారీతి పైనే ఆధారపడ్డారు. అయితే ఇవి వచనకవితలుగా, దాని పరిణామంగా చర్చలో నిలిచినవి. వాటినే స్వేచ్ఛాకవిత్వ సమాలోచనలో వివేచించడం వలన కొంత స్పష్టతను కోల్పోయింది. వారు చెప్పిన నియమాలన్నీ వచనకవితకు వర్తిస్తాయని ఈ ఎన్నుకున్న అంశాల ద్వారా తెలుస్తుంది.

స్వేచ్ఛా కవిత్వ సమాలోచన వ్యాసాలలో జాతీయ భావన సంప్రేరితం, నవాలోకనం అన్న రెండు రీతులుగా జాతీయతను, అంతర్జాతీయభావన ను వివిధ సంఘటనల, అంతర్జాతీయ సిద్ధాంతాల వాదాల ప్రభావంగా, మానవీయ కోణంలో స్థితులు సంఘటనల ఆధారంగా, మానవ చరిత్రను వికాసదృష్టితో చెప్పే కావ్యాలుగా విభజించవచ్చని ఆ దృష్టితో స్వేచ్ఛాకవిత్వాన్ని అంచనా వేశారు. అయితే కథనం, కథనరీతులు, అంత్యప్రాసలు, లయ. గేయపునడక వదిలించుకున్న స్థితి ఇప్పుడు వచనకవితలోఎక్కువగానే ఉంది. అయినా అక్కడక్కడ ఆ జాడలు ఇంకా ఉన్నాయి. అందుకు భిన్నంగా ఉన్నదాన్నే స్వేచ్ఛా కవిత్వంగా మాదిరాజు రంగారావుగారంటున్నారని గ్రహించాలి. వస్తువు రీత్యా గాక రూపం నిర్మాణం, అభివ్యక్తి ఆధారంగా దీనిని అంచనావేయాలి. అందుకు వారే రాసిన కవిత్వం ప్రాథమిక లక్ష్యాలు కాగా ఇతర కవులలో దీనిని మరింత జాగ్రత్తగా పరిశీలించి చర్చించవలసే ఉన్నది.

***రచయిత సెల్: 98497 14261***

# బహుముఖ వస్తుశిల్ప ప్రవాహం

# డా॥ మాదిరాజు రంగారావు 'స్వేచ్ఛా కవిత్వం'

- విహారి

"కవిత్వం కాలాతీత కాంతిరేఖ" అన్నారు సోమసుందర్. ఈ నిర్వచనం- కవిత్వం ఉనికికీ, తద్వారా కవి శాశ్వతత్వానికీ నప్పుతుంది. కవిత్వం వర్తమానాన్ని అనుభవిస్తూ, గతాన్ని అనుసరిస్తూ, భవిష్యత్తుని ఆహ్వానిస్తూ వుంటుంది. ఇదే దాని చలనం, గమనం, పయనం. వర్తమానంలో మనిషి ఇరుసున బెట్టిన కందెన. సమాజమేమో - పళ్ళచక్రం. మనిషి - సమాజం ఘర్షణ కవిత్వానికి, అందునా ప్రయోజనాత్మక కవిత్వానికి భూమిక. సమాజంతో మాత్రమే కాక, కాలంతోనూ మనిషి సంఘర్షించటం అనివార్యం- ఒక్కొక్కప్పుడు. ఈ చక్రాన్నంతా పారదర్శకం చేస్తుంది కవిత్వం.

ఈ ప్రక్రియలో ఒక అంతరార్థ సూత్రమే కవిత్వాన్ని ప్రజాస్వామీకరించటం. ప్రజాస్వామ్యం అంతస్సత్వం, తత్త్వం - స్వేచ్ఛ! ఇదిగో ఈ తత్త్వాన్ని ప్రతిపాదించి, స్థిరపరచి విస్తృతమైన రీతిలో కవిత్వాన్ని అందించిన మహాకవి - మాదిరాజు రంగరావుగారు వారి 'స్వేచ్ఛాకవిత్వం'గా వెలువడిన 9 సంపుటాల్లో ఏడో సంపుటం (2020- 22)లోని కవిత్వం వికాస, ప్రకాశాల్ని స్థూలంగా పరామర్శిస్తాను.

***

రంగారావుగారు స్వేచ్ఛా కవిత్వాన్ని 'ఇదొక మార్గం. లక్ష్యం చెదిరే అవకాశం లేని దార్శనికతతో సుసంపన్నమైంది' అంటూ, 'స్వేచ్ఛా కవిత్వమన్న పదబంధం ప్రజాస్వామ్య హృదయానికి చెందిన అమూల్యమైన వరం. ఇది ప్రగతిశీలమైంది. జీవనచక్రంలో ఎదురయ్యే సమస్యల్నీ ఎదుర్కొనే అన్ని దిశల్నీ స్పృశిస్తుంది. చింతన కవకాశమిస్తుంది. తగిన చర్యలకు ప్రేరేపిస్తుంది. ఒకవిధంగా ఈనాటి పరిస్థితుల్లో ఇదొక ఆదర్శంగా వికాసజగత్తును, ఆపైన స్వేచ్ఛాయుతమైన భౌతిక మానస దశలను చేపడుతుంది' అని వివరణ ఇచ్చారు.

ఈ భావాన్నే మరింతగా వివరిస్తూ ఇలా అన్నారు కవి:

*'జ్ఞాపకాలు పరంపరా గతమైనవి/ నీలిమబ్బుల వలె ప్రియభావనతో/ ఒక ఘటన ఎపుడో! జరిగింది ఇపుడు/ పాత్రలవే; ప్రతీకలతో వేరువేరు మనుషులు/ రాత్రి కలలో దహనకాండ దృశ్యం/ ఎప్పుడేది ఎదురు పడేది తెలియదు/ కవితలో ఉదయం మెలకువలో/ సృజనసర్గ పొందవచ్చు. అభినవం/ మొదలైంది చివర అంటూ ఎరగదు/ కాలచక్ర భ్రమణంలో ఇది అక్షర దృశ్యమయం'.*

*'కాలం ముందునకే, వెనక్కి అడుగు వేయదు/ ఆటంకాల నధిగమిస్తూ ఆవలితీరంపై ఆశతో'* అని కాలం ద్రవస్థితిని తన కంఠస్వరం చేశారు.

'స్వేచ్ఛా కవిత్వం' 'Living representative of the undivided humanity of the world' అని అంటూ, 'ఆధునిక తెలుగు కవిత్వంలో వైవిధ్యాన్ని ప్రదర్శిస్తుంది' అన్నారు. ఆ వస్తువైవిధ్య అంశాన్ని ముందుగా దర్శిద్దాం.

***

## 1. వస్తుస్పృహ :

రంగారావుగారి కవిత్వం వస్తుశక్తి కలిగిన దిక్చక్రం.. వస్తుస్పృహలో మూడు ముఖ్యమైన అంశాలు విచారణీయంగా ముందుకొస్తాయి. ఒకటి: వస్తుదర్శనం. భౌతికమైన చూపుకి అనేకానేక సంక్షుబ్ధ శబ్ద వాక్ చిత్రాలు, సంకీర్ణ దృశ్యాలు కనిపిస్తూ ఉంటాయి. రెండు : వస్తు గ్రహణం. చూసినదాన్ని అర్థం చేసుకోవటం, దాన్ని మననం చేసుకొని హృదయగతం చేసుకోవటం. ఈ స్థాయిలో శతసహస్రంగా జశీత్వతం కవి హృదయాన్ని ముప్పిరిగొంటాయి. వీటినుండి తన మనోధర్మం నిర్దేశించిన వాటిని ఎంపిక చేసుకోవటం, ఆ ఎన్నిక గొన్నవాటినుండి నిర్దిష్టమైన వస్తు స్వీకరణం. మూడు: అభివ్యక్తీకరణం: అంటే తన హృద్దర్శనాన్ని లోకానికి అందించటం. ఈ అందించటంలోనే ఉత్తమకవి భావమయప్రపంచం, దాని సత్వం, తత్త్వం, దృక్పథం బయటికి వస్తాయి. ఉత్తమకవిగా రంగారావుగారు వెలార్చిన వస్తు వైవిధ్యం ఈ గ్రంథంలోని 11 అధ్యాయాల్లో ప్రస్ఫుటంగా పర్యాప్తి చెందింది.

***

**రేపటి రిజర్వులో :** 'ఈ సృజన చేతన ప్రధానంగా వర్తమానాన్ని ఆశ్రయించింది' అంటూ 'దీనికిదిగా ఆధునిక వాతావరణంలో ప్రత్యేకతను సంతరించుకుంది' అన్నారు కవి.

*'ఏ రోజు కారోజు జీవితంలో కొత్తమలుపు*
*మనిషిలో ఆరోజు సార్థకతను పరీక్ష చేసేను*
*పక్షి పశు జంతు మృగరూపాలు మానసికంగా*
*ఎవరు దేన్ని ధరించి పాత్రవహించేదీ తెలియదు*
*తెలియని రహస్యాలతో చిక్కుపడిన ప్రజాస్వామ్యం'*

- ఇదీ వర్తమానం. ఇదీ సామాజిక వాస్తవికత. యథార్థస్థితి. దాన్ని కవిత్వభాషలో దర్శనీయం చేశారు కవి. అరుపులూ, ఆక్రోశాలూ లేకుండా సాగిన అక్షరీకరణాన్ని ఆలోచనాప్రేరకంగా పఠితమేధలోకి వొంపుతున్నారు. మరికొంత వివరణ తర్వాత ఒక చరుపు :

*'ఎన్నికలు యథావిధిగ రావడం పోవడం జరుగుతూనే వుంది. నీరులేని బావిలాగ పేదల బతుకులు!'* సామాజికస్పృహ అనుద్వేగకరంగా వ్యక్తీకరణం పొందింది. ఇదీ స్థితీ, గతీ వివరణ. ఇదే కవి లక్షించిన 'ఆధునిక' వాతావరణ ప్రతిఫలనం. ఈ వాతావరణం గాలీ హోరూ మరింత విశదంగా :

*'ఉదయకిరణ స్పృహతో గడప దాటగనే/ ఊహలో పూలదండకు బదులుగా/ ఇరువైపుల పదునుతో తళతళ లాడుతూ / ఖడ్గమెదురు కావడం! అనుకోని అనుభవ చిత్రం! రాత్రులు చీకటిలో గుప్తంగా జరిగేవి/ నేరం హింస ఇపుడు పట్టపగలు భయ దృశ్యం!/ కత్తి మొన నుండి విషమక్షణం/ అగ్నిశిఖయై పైకి దూకవచ్చు/ మొగ్గలు పూలై అలరించే అభిలాష/ మాయమై విశీర్ణ దృశ్యం కనిపించవచ్చు/ ప్రకృతి నుండి వ్యక్తి పరిధి దాటి సమాజ వలయంలోకి / ప్రవేశం! సృజన విలయ గతులతో సమాజ రూపం'* అని అనుభవాలకు ఆనవాలుగా ఆవిష్కరించారు.

వస్తువు పట్ల ఆత్మీయత వున్న కవి రంగారావు గారు. 'చెట్టు కొమ్మకు తీసిన ఉరి, ఎప్పటిదో విషాదఘటన ; ఇపుడు ప్రతి కొమ్మను ఉరికి గురిచేయడం అమాయకం!' అంటున్నారు. నిజానికి 'అమాయకం' పదాన్ని వస్తుమర్యాదని పాటించి అన్నా, కవి మనసు పలుకుతున్నది 'అమానుషం' అనే!

*'మనిషికీ మనిషికీ మధ్య ఏదో ఒక అడ్డు*
*ఇనుపతెరో! గాజు తెరో! మరొకటో మరొకటో'*

ఈ నిట్టూర్పు - పైన నేనన్న ఆత్మీయత నుండి వెలువడిందే!

*'వస్తువుతో రహస్య సంభాషణ కవికే చెల్లుతుంది'* అనేది ఎంతో అర్థవంతమైన కవి వాక్కు. దీనికి మద్దతుగా ఇలా వచ్చిన వాస్తవం పఠితను

అంతర్ముఖీనుని చేస్తుంది.

*'తెలియనంతవరకూ అంతా సామాన్యం*
*కాస్త పరిచయంతో వెలుగు దృష్టి పడుతుంది*
*ఉన్న చీకటి మాపేందుకెన్ని ఉపాయాలో!'*

అయితే, ఈ అవిచ్ఛిన్న ద్వైదీభావ వాస్తవికతకు కారణం? 'వెలుగు కొంగు పట్టుకుని నీడ కదులుతుంది.

ఈ ద్వంద్వ ప్రకృతికీ, ప్రవృత్తికీ ఇంకా స్ఫాటిక స్వచ్ఛతను అలదుతూ అంటారు కవి:

*'శిశుదశలోని అమాయకముఖం / ఎదిగే కొద్దీ చతురమతిగ మారుతుంది / ముఖాలు అద్దెకు దొరకవు! మాస్కులు పనిచేయవు. / రహస్య జీవనతంత్రం బ్రతుకులో భాగమవుతుంది'*

వర్తమాన సమాజంలో మనిషి చిత్తవృత్తికీ, ప్రవర్తన పోకడకీ అనేకానేక వాస్తవదృశ్యాల్ని పరిచయం చేసుకుంటూ వెళ్ళారు కవి:

*'ఏ వ్యక్తి ఒంటరికాదు, పరివారంలో / బయటికి మాత్రం అలా అనిపించవచ్చు / లోన సమాజం! ఎన్ని శ్రేణులలోనో / లోన జనత! ఎన్ని మనోవిధాలతోనో!'* అని *'ఏ వ్యక్తీ ఒంటరి స్తంభం కాదు! సమూహ చేతనలో భాగం'* అంటూ పద్యాన్ని ఆలోచనీయం చేస్తారు. సామాజిక చిత్రణలో సానుకూలమైనవీ, అననుకూలమైనవీ కూడా కవిత్వంలో ననలెత్తుతాయి.

'నూయిలోకి చూస్తే దాహం తీరే జలం లేక పోలేదు. / ఆర్తముఖాల మధ్య ఆర్ద్రత!' ఇది ఒక పార్శ్వం. మరొక పార్శ్వం– *'ఊహలో కదలేవన్నీ కావాలనుకోవడం భ్రమ/ మాదిరి బొమ్మలు కారు వ్యక్తులు/ యంత్రమయం కాదు సమాజం'* కనుక, జరుగుతున్న అవాంఛనీయత ఎలా జృంభిస్తున్నది?

*'ఉచితంగా ఏదేని సులభంగా వస్తే పొందే*
*తొందరలో మనిషి ఎంత కయిన తెగించేను*
*భూమిపై నడక నింగిలో ఆలోచన*
*రెండూ మనిషిలోని సహజమైన గుణాలు*
*రెండింటికీ మధ్య మనిషి మనో జగం*
*ఊహలతో దిశలను స్పృశిస్తుంది,*
*నేరమెవరిది? ముందు నిర్ధారణ మవసరం*
*ఉదార చరిత్రలో ప్రతిపుట మానవీయ సంపదతోనే*
*నేరానికి ముందు తీర్పుతో శిక్షను ప్రకటించడం*
*న్యాయం కాదు*
*ఊహలపై అందరినీ ఒకే తాట కట్టివేసేరా?*
*మానవేతర మైనదేదీ సంఘానికి సమ్మతం కాదు*
*రాజ్యంలో చట్టం మానవీయ ముఖంతోనే సార్థకం'*

ఇది సత్యవాక్కుగా స్థిరమైంది. ఎందువలన అని ప్రశ్న. ఈ ప్రశ్నకూ కవి సమాధానం చెప్పేరిలా :

*'చెట్టునీడ తాను నడవాలని ఆరాటపడుతుంది*
*శిల్పముఖం పలకాలని ఉత్సాహపడుతుంది*
*నడుస్తూ పలుకుతూ సాగే మనిషిలో కోర్కెలు ఒకటొకటీ*
*ఏరోజుకారోజు ఆశకు బలమిచ్చే రిజర్వులో కొన్ని'!*

ఇదీ మొదటి అధ్యాయంలో కవి జీవస్పర్శతో నిలువెత్తున ఎదిగిన అక్షరవృక్షం!!

**అక్షతం :** మూడుభాగాలుగా వచ్చింది. (1) లాక్‌డౌన్ (2) 'స్వాగత మిస్తుంది' (3) సెలవులేదు... వస్తు విశేషం తెలుస్తూనే ఉంది. కరోనా – విషాదం. వివిధ పార్శ్వాల గాథామయచిత్రణ. వర్తమాన జీవనగమనంలో విశేష స్థితిగతుల ఆవిష్కారం.

*'ఆవగింజలా మొదలైన వైరస్ భయం / గుమ్మడికాయలా మారుతుంది అనుకోకుండా / మనసుకు మోయలేని బండరాయి అవుతుంది / దేహం గేహానికి పరిమితమై హృదయం విశ్వమయమవుతుంది'*

అంటూ, కవి సుదీర్ఘంగా, విస్తృత దృశ్యీకరణం చేస్తారు. 'స్వీయకర్ఫ్యూ' విధివిధానాలు, 'స్వచ్ఛంద నియంత్రణ రూపం' ఒకవిధంగా 'మానవాళి సంక్షేమం' కావటం వివరిస్తారు. 'ప్రకృతితో సమభావం ఎప్పటికీ /బ్రతుకులో సమభావం తప్పనిదీ కలిసేదీ' అని సందేశిస్తారు.

**లాక్‌డౌన్ –2లో** 'స్వేచ్ఛ' మరింత విశదీకరణ పొందింది. కవి అంటారు:

*'స్వేచ్ఛ అంటే ఏది బడితే అది చేసేందుకు కాదు/ బృందాల అశ్లీలాలు సమూహాల అరాజకాలు, వ్యక్తిలో మురికితనం మోదుతనం పోవలసి ఉంది.'*

*'స్వేచ్ఛలో శ్రమ జీవన మొక వికాస రూపం / ఎవరి జీవనం వారిది పయనం గమ్యంలో/ స్వచ్ఛమైంది శుభ్రమైంది భౌతిక మానస స్థాయిలో / తగిన వాతావరణంకై కవిత సమ సమాజంలో'*

కవి భావధార వస్తువుని ఉజ్జ్వలం చేస్తూ సాగుతుంది. *'రెప్పలు వాలినంత మాత్రాన నిదురపోయినట్లు కాదు/ నిద్రమునించినంత మాత్రాన ప్రపంచం లేనట్లు కాదు/ఎవరి అంతర్యానం వారి స్వంతం, రహస్యమయం'* అని మానవ స్వభావానుభూతి దీప్వమో, దీపకల్పమో కావటాన్ని చిత్రీకరిస్తారు.

కవికి సమాజానుశీలనా, మనుషుల మనస్తత్వ వైరుధ్యాల పరిశీలనా కలిసి సమకాలీన లోకరీతిని నిర్దిష్టంగా మనోయవనిక మీద ముద్రిస్తాయి. ఆ చిత్రాల దర్శనం – ఆత్మిక వేదనావలయంలో అనుభూతిని ప్రజ్వలితం చేస్తుంది. అప్పుడు వెలువడుతుంది కవితాధార. 'సమాజశ్రేయం'గా! చూడండి ఆ ఆనవాలు:

స్వేచ్ఛా కవిత్వం



మాదిరాజు రంగారావు

*'ఉదయం వస్తుంది మనసులు తేజోవంతమయ్యే నని*
*ఆశపడే బతుకుల్ని అనలమయం చేస్తూంది పగలు*
*శుభ్రమైన గాలి స్వచ్ఛమైన నీరు స్ఫటిక సమం హృదయం*
*కోరే మనుషులిపుడు ఉన్నదానితో సర్దుక పోవలసిందే*
*హృదయం జ్వాలామయం అయ్యే కన్నా*
*పూలగుత్తి అయితేనే సమాజానికి శ్రేయం*
*పయనంలో అడవులు కొండలు నదులు అవరోధాలు*
*ఎన్ని సారులు దాట వలసివచ్చేనో? పరీక్షలన్ని మారులు'*

'కాలం వాహనమై' తీసుకుపోతుంది. అనేక స్థితుల్నీ, గతుల్నీ చూపుతుంది.

*'ఎండలో వానలో మంచులో చెట్టు / ఉన్నచోటు వదలి ఎక్కడికీ వెళ్ళదు/ మొలక నుండి మాను వరకు పచ్చదనంతో/ అన్నిటినీ భరిస్తుంది, ధూళి ధూమ, కలుషాల్నీ ప్రాణానికి ముప్పులోనా! పొట్ట కొసమొ/ క్షణాలలో వదలి మనిషి కదలిపోయేను/ ప్రాణభయం లేనిచోట / కాస్త సుఖం ఉన్నచోట/ ఏ దశలో ఎచటికయినా/ అనుమానం లేకుండా పయనం సాగుతుంది/ స్థానీయం ప్రాంతీయం దేశీయం ప్రాపంచికం/ ఒకదానితో ఒకటి కలిసి అస్మితలో మానవీయం/ ఈనాటి కవితలో ఇది విషయానికి కేంద్రం/ అక్షరరూపంలో బ్రతుకులు ప్రతిఫలించేను'*

ఇదీ ముక్తాయింపు. ఈనాటి కవితని గాఢంగా సాంద్రంగా అలా వెలువరించిన గొప్ప కవి రంగారావుగారు.

***

**అజేయం :** ఆధునిక వచనకవితలో – మరీ ఇటీవలి కాలంలో – సమాజ రుగ్మతల్ని గాఢంగా, తీవ్రంగా అభివర్ణించి వదిలేయటం జరుగుతోంది. నిక్కమైన నిర్దిష్టమైన ఆలోచన గల కవి ఉన్న రొచ్చుని చూపి, సంవేదనని పఱచి ఆగడు. ఆ స్థితిగతుల మార్పుకి దిశానిర్దేశంగా అంతో ఇంతో తన భావనలోని పరిష్కారాన్ని కనీసం ధ్వనిమయంగానైనా పాఠకుని ముందు పెడతాడు. ఈ 'అజేయం' లోని 'ఆంతర్యం' చెబుతూ రంగారావుగారు అన్న మాటల్ని చూడండి :

'ఇందులో వర్తమాన స్థితిగతుల విషయంలో కవిత భావరూపాల్లో

*'చెట్టునీడ తాను నడవాలని ఆరాటపడుతుంది*
*శిల్పముఖం పలకాలని ఉత్సాహపడుతుంది*
*నడుస్తూ పలుకుతూ సాగే మనిషిలో కోర్కెలు ఒకటొకటీ*
*ఏరోజుకారోజు ఆశకు బలమిచ్చే రిజర్వులో కొన్ని'!*
*ఇదీ మొదటి అధ్యాయంలో కవి జీవస్పర్శతో నిలువెత్తున*
*ఎదిగిన అక్షరవృక్షం!!*

అభివ్యక్తమైంది. సామాజిక రాజకీయ నైతిక మనస్తత్వ కోణాల్లో హేతుసహితమైన ఆలోచనతో అనుభవసాంద్రత విశ్లేషణ కందుతూంది. ప్రజాస్వామ్య సామ్యవాద దార్శనికంతో మనిషిలో కష్టాల్ని బాధల్ని, వేదనల్ని అననుకూలాల్నీ అతిక్రమించి అధిగమించి సాధించే అజేయమైన రూపం సామాజిక వాస్తవంగా అవతరించింది. స్థానికం నుండి విశ్వమయం దాకా ఆలోచనా ప్రసారం కవితాత్మకతను పొందింది. కవి ఎవరినీ నిరాకరించడు. తిరస్కరించడు. కవిత అన్నిటినీ స్వీకరిస్తుంది, స్వాగతిస్తుంది. స్వేచ్ఛా కవిత్వంలో 'అజేయమయిన' స్థానాన్ని నిలుపుకుంటుందనే కవి ఆంతర్యం.'

కవి స్రష్టమాత్రమే కాకుండా దార్శనికుడు కూడా అని స్పష్టీకరిస్తుంది ఈ చరణం.

సమాజంలోని సంక్షోభం, మనిషి ఆరాటం, వేదన, ఓటమిలనుండి ఈ లక్ష్యం వైపు పయనించేందుకు వలసిన రెక్కమానుని కవి చాలాచోట్ల నాటి, నిలబెట్టారు.

*'శ్రమ జీవన స్పర్శలేని బ్రతుకులు లేవు*
*శ్రమ కేతన మెరగని ఏ దేశం లేదు*
*పలు స్థాయిలలో సమాజ నవ నిర్మాణంలో*
*శ్రమ సాధన సంకేతాలు! ఈ చేతులు*
*విప్పారిన ఫాలతలంపై శ్రమ రేఖలతో*
*అభయంతో పాటుగ దీవెన లొసగేను'*

సమాజంలో భిక్షువుల స్థితిని 'పరిష్కారం' ఖండిక ప్రస్తావిస్తూ, కవి సంవేదనని పంచుతున్నారు, "ఇంతవరకు సమాజ వికాసంలో భాగం కాలేదు. నేతలు, పాలకుల పెద్దలు విస్మరించిన వాస్తవం" అంటూ, ఈ సమస్య పరిష్కారానికి 'విశాల ప్రయోజనాల ప్రణాళిక' 'నిరంతరం చిత్తశుద్ధితో వ్యవహరించటం' ఆవశ్యకమని హెచ్చరిస్తూ, ఈ ప్రక్రియలో కవి, కవిత తమ పాత్ర నిర్వహిస్తాయని ధ్రువీకరిస్తారు. ముక్తాయింపుగా 'మానవీయ భావనతోనే పరిష్కారం' అని సందేశించారు.

'బ్రతుకులో లక్ష్యం' అంటూ ఒక పద్యం ఉంది. భావంలోనూ, భావాభివ్యక్తిలోనూ తేజోమయమైన కవితగా జాలువారింది.

*'ఒక కొసలో సౌముఖ్యం ఒక కొసలో వైముఖ్యం/ స్వేచ్ఛా స్వతంత్ర జీవనగమనంలో తప్పనివీ / చంద్రుడు అందరికీ చెందిన హ్లాద బింబం / దీన్ని ముక్కలు చేసి అందరికీ పంచేరా?/ విశ్వమయం మానవ రూప మంటూనే/ స్వంతమైన చిన్ని చిన్న గదులలో నిలిపేరా?/ సూర్యుడు అందరికీ చెందిన విశ్వబింబం / కిరణాలను వేరు చేసి అందరికీ పంచేరా?/ ఆలోచనలో ఎవరి విహారం వారిది/ ప్రీతికరం/ వర్తనలో నిరంకుశం ఒకరికి నచ్చవచ్చు/ చుట్టూ కత్తులు తోడుగ హింసరచనలో/ బ్రతుకులు అభిమానించే వారు ఉండవచ్చు/ నీటిలో పడవ గమ్యం తీరాన్ని చేరడం / బ్రతుకులో మనిషి లక్ష్యం! ప్రాణాల్ని నిలపడం'*

జీవన వికాససూత్రాల్ని అక్షరీకరిస్తూ, కవిత్వాన్ని ఆలోచనా ప్రేరకమూ, ఆచరణ ప్రచోదకమూ చేయటం రంగారావు గారి కవిత్వపు జీవశక్తి. కవితలన్నీ ఈ 'బ్రతుకులో లక్ష్యం' వాక్యానికి ఉదాహరణలే!

***

"గుడ్ బై"లో 'వర్తమాన స్థితిగతుల ఆలోకనం ఆధునిక భావోన్మీలనం పొందింది' అంటూ 'విషయ ప్రతిపాదనలో 'అంతరంగం' ప్రధానమైన పాత్ర వహించింది' అన్నారు కవి. 34 కవితలు గల ఈ అధ్యాయంలో సారవంతమైన అభివ్యక్తితో సామాజిక వాస్తవికత విస్తృతావిష్కరణ పొందింది.

'ఇదీ సంగతి' ఖండిక ప్రారంభమే ఒక విద్యుల్లతలా విరిసింది. *'కవిత విపణిశాలలో దొరికే వస్తువు కాదు/ లోన హృదయప్రియం, బయట విశ్వమయం'* ఈ వాక్య సంచయం రంగారావుగారి ఆత్మీయతాముద్రని కూడా సంతరించుకున్న సత్యవాక్కు అనటం అతిశయోక్తి కాదు.

*'జీవితం అడవికాదు! ఎప్పటికీ కాలేదు/ విషమ ఘటనలో మృగం బయటికి రావచ్చు/ బాధలలో సందర్భంలో సమాజ సుందరత చెడీ మరచిన అడవి భయం ఆవహించవచ్చు'* అంటూ *'అవసరానికి బతుకులో సందర్భం ఎదురైే/ మరో పాత్రలోకి దిగవలసి వస్తుంది'* అని మనిషి మనస్తత్వ వైరుధ్యం ఎంత సహజాతమో వివరిస్తారు. ఇదే మనం రోజూ వివేకదృష్టితో అనుకొనే సూక్తి – *'ఏ మనిషీ నూరుశాతం, చెడూకాదు, నూరు శాతం మంచీ కాదు'* అని! అందుకనే, *'కష్టంలో నష్టంలో భవిత గురించిన చింతన/ మానసిక క్షేత్రాలలో ఆశావాహన'* మవుతుందని నిర్ధరిస్తారు.

ఈ భావమయ ప్రపంచంలో కవి మరో అడుగు ముందుకు వేసి 'అక్షర హృదయం'ని ఆవిష్కరించారు. 'ప్రతి బ్రతుకూ విలువైనది' ఒక వెంటాడే వాక్యంగా దర్శనమిస్తుంది.

*'సౌభాగ్యం సంక్షోభం సహనం అలజడి పయనం ఆటంకం*
*అన్నిటినీ దాటుతూ జీవితం! ఆగనిదీ తప్పనిదీ*
*కాలంతో పాటు సమాజం నిరంతర చలనంతో గతమై*
*మానవ చరిత్రలో సంపదల ఖజానాగా మారేను*
*ఎవరికి వలసిన క్రియను వారు ఆపేక్షించేరు*
*ఎవరికి నచ్చని చర్యను వారు ఉపేక్షించేరు*
*సమాజంలో అందరికీ అవకాశం తప్పనిసరి*
*అందునా జనస్వామ్యంలో ప్రతి బ్రతుకూ విలువైనది'*

ఇదీ అనుభవసారం! ఈ అధ్యాయంలో బతుకు అర్థాన్నీ, పరమార్థాన్నీ పారదర్శకం చేసే మరి కొన్ని అపూర్వమైన పంక్తులు వచ్చాయి:

*'పంట తరువాత పంటకు భూమి సంతసిస్తుంది*
*చెట్టు తరువాత మొక్కకు నేల ఎదురు చూస్తుంది*
*నివాసానుగుణం కాదని అడవిని తగలబెట్టేరా?*
*వాన రాక ఆలస్యమైందని భూమిని వదలి వేసేరా?*
*బయట గాలి పుష్కలంగా వీచే సమయంలో*
*కిటికీలు తలుపులు మూసిపెట్టినట్లు ఉంటూంది*
*దీనికన్న సమాధి నయ మనిపిస్తుంది*
*ఈ నిశ్శబ్ద సమయంలో ప్రతి అడుగు మృత్యుఖండం*
*అడవిలో నెత్తురు చుక్కల జాడల దారిన*
*పులి అడుగులు నది వైపు చూపేను*
*శుభ్రమై గట్టుకు క్షేమంగా చేరేను పులి*
*ఇది మనిషికి బ్రతుకులో ప్రేరణ రూపమవుతూంది'*

ఈ వాక్యాల్లో మానవేతిహాసం సమస్తమూ నిశ్చలనమైంది. అంతేగాక, మానవజీవన మూల్యాల్ని కవితామయం చేసిన తేజోరేఖలు విప్పారినవి. నిశ్చయంగా – విశ్వజనీనమైన కవిత్వ ఖండంగా ఇది శ్లాఘనీయం మాత్రమే కాదు. మానవీయం, స్మరణీయం, పునఃపునః ప్రకటనీయం!!

'వార్తలో కవిత' అధ్యాయంలో 'ఒక ప్రయోగ భావనతో సామాజిక వాస్తవికత ప్రతిఫలిస్తుంది' అన్నారు రంగారావుగారు. దీనికి ఉదాహరణప్రాయమైన ఒక

వాక్య సమదాయాన్ని చూద్దాం.


*'ఉదార చరితుని చూస్తే మహా తరువు మదిలో మెదలుతుంది*

*దయా గుణ హృదిని చూస్తే మహానది ఎదలో కదలుతుంది*

*లోనుండి చైతన్య ప్రసారం ఊహాలో కదలి తరలుతుంది*

*బయట కొన్ని పరిమితులలో తన రూపు దిద్దుకుంటుంది'*

అయితే, విషాదం ఏమంటే – 'కష్టం దుఃఖం ఆసరాగా ధిక్కారం పోరాటం' సాగినా 'రాజనీతి రాజకీయం' మాత్రం 'అన్నీ తన వశం కావాలని' తగిన చర్యల్ని తీసుకుంటుంది. కనుకనే, 'మలుపు తిరిగితేనే ఏదో ఒక మార్పుకు అవకాశం' అని క్రియాశీలత్వాన్ని అంతర్లయగా వినిపిస్తారు.



'నిప్పులపై మేఘం' అధ్యాయంలో 'వర్తమాన కాలంలో చూచేవీ చూడక తప్పనివీ, తెలిసినవీ వార్తలలో చోటు చేసుకున్నవీ ఇందులో దార్శనికతను పొందాయి' అనేది కవి హృద్దర్శనం.

'బ్రతుకులు ఆగవు' శీర్షికలో జీవన వాస్తవికతను సున్నితమైన నిరసన స్వనంతో వెలువరచారు. *'ఒకరి నుండి ఒకరు దూరమై ప్రవాసాలు / కాలం ఆగదు మనిషికి బ్రతుకు తెరువులతో / ఆహారం భద్రత క్షేమం కోసం పయనం తప్పదు/ కొనప్రాణంతో రోజులు గడవడమొక దౌర్భాగ్యం'* అనటంలోనూ *'స్వార్థం ఎంతవరకూ తీసుక వెళ్ళేదీ తెలియదు/ అంతవరకూ ప్రపంచాన్ని ఇరుకుగదిగ మార్చేరు'* అనటంలోనూ కవికి గల వ్యష్టి, సమష్టి దృక్పథం, సంవేదన, మంచి మార్పుని వాంఛించే ఆంతర్య చిత్తశుద్ధీ స్పష్టమవుతున్నాయి.

ఈ అధ్యాయం నిండా కవి హృదయాన్ని గాయం చేస్తున్న బాధామయ స్థితిగతుల చిత్రణ ఎంతో సాంద్రంగా అక్షరీకరణం పొందింది. *'ఈ కాలంలో రాజకీయం అంటే ప్రభ్రష్టజగం/ జ్వాలాచలనంతో దేనికయినా తెగించేరు/ తలపడేరు/ అంటించిన బొగ్గుకుప్పల వలె నిప్పుల చర్యలు / దిబ్బల వలె పైకెగరే బూదివలె జీవన రేఖలు'* వంటివి అనేక ఉదాహరణలు ఉన్నాయి.

'తెలియని వాస్తవం' అధ్యాయంలో 'బ్రతుకుమూట నేలపైకి విసిరివేసినట్లు చెదరిన' ఆశారూపాల దృశ్యీకరణ విస్తృతంగా వచ్చింది. ఊహ– అనుభవం– సమస్యల విషమజాలం– అన్వేషణ– పరిష్కారం ఆశావహ ముగింపుతో లక్ష్యసిద్ధిని చేరుకోగల తీరుని గోచరింపజేశాయి. 'చేతనతోనే హృదయం కుసుమితమవుతుంది' అనే మానవగీతం కవి ఆశాశ్వాసగా పఠితకు జీవితార్థాన్నీ, అవగాహననూ ప్రోది చేస్తుంది.

– ఇలా ఈ ఏడో సంపుటంలో రంగారావుగారి 'స్వేచ్ఛా కవిత్వం' వస్తు విస్తృతినీ, వైవిధ్యాన్నీ నేలమీద నడిచే మనిషి వాస్తవాల మాలికగా అందించింది. వారి కవిత్వ యాత్రలోని అనుభవసారాన్ని పఠిత హృదయానుభూతికి వాహికగా రూపుదిద్దుకుంది.

***

## 2. కవితాశిల్పం :

'శిల్పం కథకుని మంత్రదండం' అన్నారు కథా సందర్భంలో. ఇది కవిత్వానికీ అన్వయిస్తుంది. ఆ మంత్రదండ ప్రయోగం – వస్తువుని కవిత్వం చేయడంలో సహకారి. వాక్యాన్ని వ్యంగ్య విలసితం చేస్తే కానీ భావం కవితామయంకాదు. కావ్యభాషలో వ్యక్తీకరణదే కీలకాంశం. కుందుర్తి అన్నట్టు 'అలంకారాల భారం' లేకపోయినా వాక్యం సాదాసీదా పేపర్ స్టేట్‌మెంట్ కాకూడదు. అలా లేకుండా అనుభూతిసాంద్రంగా మార్చటమే 'ఆల్కెమీ' – రసవిద్య! ఈ విద్యని నిగూఢగుప్తమగు విత్తంగా సంపాదించుకున్నవారు రంగారావుగారు. వారికి ఈ కవిత్వరచన మెళకువలన్నీ అరచేతి ఉసిరికలు. అందుకనే స్పష్టాతిస్పష్టంగా అన్నారు వారు, "కవి తన సృజన సమయంలో పొందిన అనుభవ విశేషాన్ని పాఠకుల్లో బింబింప జేసే ప్రయత్నమే అభివ్యక్తి రూపం' అని.

రంగారావుగారి కవిత్వ శిల్ప గుణ విశేషాల్లో మొట్టమొదటిది ఎత్తుగడే. *'ఎవరు కాదనుకున్నా ఎవరు ఇష్టపడకున్నా / ఎవరు కనులు మూసుకున్నా / సాయం వేళన చీకటి చిత్రం! విషాద వర్ణంలో కనిపిస్తుంది/ అనుమానంలో ముంచుతుంది/ స్థానంలో మార్పుతో కోణంలో దృశ్యం! వేరవుతూంది'* అని కవిత మొదలయ్యేసరికీ– రానున్న చిత్రాలమీద, దృశ్యాలమీద ఉత్కంఠ ప్రేరేపించినట్లవుతుంది. ఇది ఒక్క ఉదాహరణ. ఇలా అనేక కవితల ఆరంభం ఆసక్తికరంగా వచ్చింది.

ఇది చదవగానే పఠితమేధలో ఆలోచనల అలలు సంచలిస్తాయి. ఒక దృశ్యాదృశ్యహేల మనోయవనిక మీద సంచరిస్తుంది. పరిచిత అపరిచిత అనుభవాలు చైతన్యస్రవంతిని జాలువార జేస్తాయి.

అలాగే, కొన్ని ఖండికల చరణాలు చదువుతుంటే జీవితం, సమాజం స్ఫూర్తిజనకంగా కళ్ళకు కడతూ నిలుస్తాయి. ఉదాహరణకు : *'ఆహారం కావలసిన సందర్భంలో మనుషులు/ ఆనందం పేరుతో ఇంద్రధనుసును భుజించేరా?' 'ఉన్న ఖాళీలను నింపే ఉద్దేశం కన్నా/ వేటితో దేన్ని నింపాలన్నది అవశ్యసమస్య'* అన్న రసస్ఫోరక వాక్యఫణితి పఠిత అంతర్ముఖీనతకు ఆలవాలమవుతుంది.

శిల్పంలో కవితాఖండిక నిర్మాణందే మరోముఖ్య పాత్ర. దీనికి ఏకాంశవ్యగ్రత అతిముఖ్యం. 'స్వేచ్ఛా కవిత్వం'లో కవికి ఈ అంశం మీద శ్రద్ధాభక్తీ పుష్కలంగా వున్నాయి కనుక, కవితలన్నీ శీర్షికాసందేశాన్నీ, లక్ష్యాన్నీ పక్కదారి పట్టించకుండా నడిచాయి.

శిల్ప సంబంధమైన మరో గుణ విశేషం ముగింపు. 'ఎన్ని ఉన్నా ఎంతగా పైచేయి అయినా/ మనిషి తన కథలో కీలుబొమ్మ మాదిరిగా' అని ముగుస్తుంది– 'చుక్కలవలె జ్ఞాపకాలు' అనే కవిత!

కవితా శిల్పానికి జీవలక్షణం –అభివ్యక్తి. రంగారావుగారి కవిత్వాభివ్యక్తిలోని ఒక మెరుపు – వారు రూపకాల్నీ, ఉపమల్నీ – గోళీల్లా రువ్వరు. ఆ అలంకారాల ప్రమేయాన్ని విడమరిచి వాక్యంగా అందిస్తారు. దీనివలన కవిత్వభాషకు విజ్ఞత అలదినట్లవుతుంది. 'అనుభవ వాస్తవదృశ్యం! ఎప్పటికీ సాగుతుంది ప్రవాహంలా' అని రెండు పాదాలు. అలంకార ప్రియత్వం ఉన్న కవి 'ప్రవాహదృశ్యం' అనో 'దృశ్య ప్రవాహం' అనో అనేస్తాడు. ఇలా కోకొల్లలుగా ఈ కవిత్వంలో ఉక్తి విశేషాలు ఉన్నాయి.

భాషా, శైలీ– శిల్పానికి ఉడుపులు. సాహిత్య సంప్రదాయాల విజ్ఞులు కనుక రంగారావుగారి కవిత్వభాష, శైలీ – సంస్కారవంతంగా పర్యాప్తమైనాయి. *'శ్రమజీవికి ఊరయినా, నగరమైనా ఒకటే/ ఆహారం ఆవాసం వసనం ఆసరా లోకటే'* అన్నారు. చదివేందుకూ, ఆ సత్యాన్ని నెమరువేసుకొనేందుకూ– ప్రోత్సహించే సరళసుందరమూ, ఆలోచనీయమూ అయిన శైలి!

***

'స్వేచ్ఛా కవిత్వం' – గ్రంథంలో అనేకచోట్ల– కవి గురించి, కవిత్వం గురించి అభిప్రాయాలు, వాంఛితాలు, నిర్వచనాలు అసంఖ్యాకంగా వస్తాయి. 'కవికవికీ' అని ఒక ఖండిక కూడా వున్నది. (157పేజి)

*'కవి మనో జగత్తు అక్షర రూపంలో వెడలుతుంది*

*హిమగిరి శిఖరంలా అంతరంగం మౌనంగా*

*కిరణ స్పర్శచే కరగుతుంది! సరిస్తుంది కిందికి*

*ఒకరికి పూల గుచ్ఛంలా కనిపించవచ్చు*



*ఒకరికి నిప్పుల కుంపటిలా అనిపించవచ్చు*
*కవి కవికీ స్పందనలో వివిధ ప్రయోజనాలతో'*

ముక్తాయింపులోని చివరిపాదంలో – చివరి రెండు పదాల్లో– దాగివున్న వ్యంగ్యంలో సాహితీలోకంలో అనంతమైన ఈనాటి రీతీ – రివాజూ ధ్వనిస్తుంది కదా! అలాగే, కవిత అంటే 'మట్టికణం నుండి నింగిలోకి/ అనుభవంతో ఆదర్శం అల్లుకొన్న మానవలత' అన్నారు.

*'జలధిహోరు భాష గట్టుకు తెలుస్తుంది*
*పూలమౌనభాష గాలికి తెలుస్తుంది*
*కవికి తెలుస్తుంది మనసులోని రహస్యం*
*మాటలోనే కవితరేకులు విప్పారుతాయి'* అంటూ

కవి – కవితల అనుసంధాన ప్రక్రియనూ తెలిపారు.

'కవిత హృదయభాష' అని ధృవీకరిస్తూనూ, 'కవితలో శబ్దం సూర్యకిరణ స్పృహతో / చీకటిని వెలుతురుగా తీరుస్తుంది క్షణంలో' అనీనూ చెప్పి పఠిత అంతశ్చేతనకు పనిబెట్టారు!!

***

'స్వేచ్ఛా కవిత్వం'లో రంగారావుగారు కవి–కవిత, మనిషి – సమాజం– కాలం మధ్యన సంఘర్షణను, సానుకూలతలను పారదర్శకం చేశారు. సామూహికత్వంలో వైయక్తికత్వం – వైసెవర్సా– ని నిరూపించారు. సమకాలీన సామాజిక వాస్తవికత ఆధారంగా – 'అనన్యాన్నీ, అనితరాన్నీ, అపూర్వాన్నీ అందుకొని వివేచనకు పూనుకోవడం' మనిషి, ప్రాథమికావసరంగానే గుర్తించమన్నారు. ఇలా కవిగా వారి వ్యక్తిత్వంలోని చేతన, శాంతి కాముకత్వం, విశ్వజనీన దృక్పథం– వారి కవిత్వంలోని జీవశక్తిని కవితామయంగా బహిర్గతం చేశాయి. చివరివాక్కుగా, వారే అన్నట్టు – 'సృజనరూపం భావరూపాలతో, ప్రతీకలతో, వ్యంగ్య శోభితంగానూ ప్రజాస్వామ్య దార్శనిక లక్ష్యంతోనూ విలసిన్తాంది. అభివ్యక్తిలో ధారారూపం ఆవిష్కృతమైంది'

'కవితలో చివరి వాక్యం, బ్రతుకులో చివరి ఊపిరి, రోజులో చివరి కిరణం, మలుపు తిరిగే చివరి చిహ్నం, నవజగతికి తెరచిన ద్వారం, మనస్సు మార్పుకు సిద్ధమవుతుంది'

ఇదే సత్యవాక్కు, తథాస్తు! స్వస్తి!!

***రచయిత సెల్: 98480 25600***

# దాశరథి కవితామంత్రధ్వానం

– డా. తిరునగరి శరత్ చంద్ర

'కోటి తెలుగుల బంగారుకొండ క్రింద పరుచుకున్న నరసులోపల ఉదయించిన పద్మం' తెలంగాణమని సగర్వంగా చాటిన మహాకవి దాశరథి. కవిగా, గొప్పవక్తగా, బహుముఖ ప్రతిభావంతుడిగా, బహుభాషాపండితుడిగా, విమర్శకుడిగా తెలుగు సాహిత్యంలో తన ముద్రను పదిలంగా ప్రతిష్ఠించిన కవి దాశరథి.

ఆ మహాకవి సాహిత్యంపై ఎన్నో విమర్శనాత్మక గ్రంథాలు వెలువడ్డాయి. వారి సాహిత్యాన్ని, కవిత్వాన్ని అందులోని పటిష్టతను, విశిష్టతను చాటి చెప్పాయి. అలా దాశరథిపై వచ్చిన విమర్శనాత్మక వ్యాసాల సంపుటుల్లో ఆచార్య మాదిరాజు రంగారావు రాసిన 'దాశరథి కవితా సమాలోచనం' ఒకటి.

ఆచార్య మాదిరాజు రంగారావు తెలుగు సాహితీ సముద్రాన్ని మథించిన ప్రతిభామూర్తి. విశ్వవిద్యాలయ ఆచార్యునిగా ఎంతో మంది విద్యార్థుల మెదళ్ళలో అక్షరబీజాలు నాటారు. గొప్ప రచయితగా, సాహితీ విమర్శకునిగా తెలుగు సాహిత్యంలోని అనేకానేక ప్రక్రియల్లో ఎంతో కృషి చేశారు.

ముఖ్యంగా – ఆధునిక సాహిత్యంలోని ప్రముఖ కవులపై, మహాకవి పండితులపై ఆయన రాసిన విమర్శనాత్మక వ్యాసాలు ఆయా కవుల సాహిత్యాన్ని ఎంతో లోతుగా, సవివరణాత్మకంగా మనకు తెలుపుతాయి.

ఆధునిక తెలుగు మహాకవి దాశరథి కృష్ణమాచార్య సాహిత్యాన్ని ఎంతో లోతుగా అధ్యయనం చేసిన మాదిరాజు రంగారావు దాశరథి కవితాచైతన్యాన్ని గూర్చి చెబుతూ వ్యాసాలరూపంలో పొందుపరిచారు.

ఆయా సందర్భాల్లో రాసిన వ్యాసాలివి. విభిన్న కోణాల్లో దాశరథి కవిత్వంలోని శక్తిని తెలియజేసే వ్యాసాలివి. ప్రతీ వ్యాసంలో దాశరథి సాహితీమూర్తిమత్వాన్ని మనకు కళ్ళకు కట్టినట్టు చూపిస్తారు. అలా రాసిన వ్యాసాలన్నింటినీ 'దాశరథి కవితాసమాలోచనం' అనే పేరుతో పుస్తకంగా ప్రచురించారు. ఉద్యమ చైతన్యంతో ప్రకాశించే సాహితీస్రష్ట ఎం.ఎల్ నరసింహారావు గారికి ఈ పుస్తకం అంకితం చేశారు.

ఈ పుస్తకంలో – ఆధునిక సాహిత్యయుగంలో శ్రీశ్రీ తర్వాత ఉద్యమతత్త్వం, ప్రగతిభావన, కవిత్వకళ కలిసి రూపొందిన వ్యక్తిత్వంతో దాశరథిని మనం చూడగలం. శ్రీశ్రీ తర్వాత అంతటి ప్రభావవంతమైన సాహిత్యాన్ని దాశరథి ఎలా సృష్టించారో, దానికి గల కారణాలేమిటో చెబుతూ ఎంతో వివరణాత్మకంగా రంగారావు రాశారు.


తెలంగాణ విమోచనోద్యమ కాలంలో దాశరథి కవిత్వం వజ్రాయుధంగా పనిచేసింది. నిజాం పరిపాలనలో మగ్గే తెలంగాణా ప్రజల ఆశయ మేమిటో ఆయన పద్యాల్లో వేయిగొంతుకలతో వినిపిస్తుందని, వేలరూపాలుగా కనిపిస్తుందని రంగారావు వివరించారు.

'చింతల తోపులో కురియు చిన్కులకున్ తడిముద్దయైన...' అనే మహాంధ్రోదయంలోని పద్యంలో దాశరథి నిరుపేదల పక్షాన నిలబడి గర్జించిన తీరు కనబడుతుంది. సామాజిక ప్రయోజనమూ, కావ్యకళా రెండూ కూడా దాశరథి కవిత్వంలో ఎలా దర్శనమిస్తున్నాయో వివరించారు. వెనుకబడినతనంతో అమాయకత్వం, దారిద్ర్యం, నిస్సహాయత వల్ల ఎంతోమంది పేద ప్రజలు ఎదుర్కొన్న పరిస్థితులు, పడుతున్న కష్టాలు మొ.వన్నీ దాశరథిని కలిచివేసిన తీరు ఈ పద్యంలో కనబడుతుంది.

ఉద్యమకాలంలో దాశరథి నిజామాబాద్, హైదరాబాద్, వరంగల్ జైళ్ళల్లో నిర్బంధించబడ్డప్పుడు ఆయా జైళ్ళలోని పరిస్థితులను కళ్ళకు కట్టినట్లు దాశరథి కవిత్వంలో చూపించారని మాదిరాజు రంగారావు అభిప్రాయపడ్డారు.

*'నాడు మానవతీ నయనాంచలముల*
*నాగసర్పాలు బుసకొట్టి నాట్యమాడె*
*నాడు మానవతయు నవనాగరికతయు*
*తన్ను తిన్నది రాక్షసత్వమ్ము చేత'*

వంటి పద్యాల్లో దాశరథి – తెలంగాణలో జరిగిన అకృత్యాలవల్ల అబలల కన్నీళ్ళు సెగలు



***'దాశరథి కవితాసమాలోచనం' పుస్తకాన్ని సాహితీస్రష్ట ఎం.ఎల్ నరసింహారావు గారికి అంకితమిచ్చారు***

గక్కిన తీరును, వారి కళ్ళల్లోని ప్రతీకార సర్పాల బుసబుసలను, ఆవేశాన్ని, ఆక్రోశాన్ని గురించి తెలిపారు. దాశరథిలోని కరుణరసార్ద్రతను, సామాన్య జనులకోసం ఆయన పడే తపనను గురించి ఈ పద్యాలు తెలియజేస్తాయని మాదిరాజు రంగారావు చెప్పారు.

*'అనాదిగా సాగుతోంది అనంత సంగ్రామం*
*అనాథుడికీ ఆగర్భ శ్రీమంతుడికీ మధ్య'*

అంటూ.. శ్రీమంతుడికీ, అనాథుడికీ మధ్య జరుగుతున్న యుద్ధాన్ని గురించి చెబుతూ.. అందులో శ్రీమంతుడే గెలుపు పొందుతున్నాడని, పేదవాడు అపజయాల పాలవుతున్నాడని చెబుతూ.. ధనమదాంధుల్ని నిరసిస్తూ, ప్రశ్నిస్తూ దాశరథి రాసిన గేయాలు పేదల్లో ఎంతలా చైతన్యాన్ని తీసుకువచ్చాయో వివరించారు.

*'ధనం దాచగలరు గాని తేజస్సును దాచగలరా?*
*తెరలు దించగలరు*
*గాని శిరస్సులను వంచగలరా?'*

అనే పంక్తుల్లో స్వేచ్ఛాప్రయాణచరిత్రతో సాగుతున్న తెలంగాణ ప్రగతిని గురించి చాటి చెబుతారు. పాతచరిత్ర పోయి కొత్తచరిత్ర మొదలై, కొత్తయుగం బాటలో ప్రజలు ఎలా నడవాలో ఈ గేయంలో దాశరథి చెబుతారు. మాదిరాజు రంగారావు దాశరథికున్న వినూత్నకవితాదృష్టిని బాగా పరిశీలించి, దాశరథిలోని సృజనాత్మకతను, సామాజికతను సమపాళ్ళల్లో మేళవించి ఈ వ్యాసాన్ని రాశారు.

ప్రత్యేకాంధ్ర రాష్ట్రాన్ని సాధించే ప్రయత్నంలో తన జీవితాన్ని త్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములును గురించి, తెలుగు ప్రజల సమైక్యతను ఆశించి రాసిన కవితాఖండికలు ఒక్కొక్కటి ఒక్కో ప్రత్యేకతను సంతరించుకున్నది. ఆ ప్రత్యేకతలన్నీ రంగారావు వ్యాసాల్లో విపులంగా కనబడతాయి.

*'వెలుతురు బాకు తాకిడికి విచ్చిన చిక్కని కాలరాత్రి....'* అనే పద్యం,

'నీవెరుగవె! శ్రీరాముడ! నేను మానవుడనె లెమ్ము!
నిద్రాణాంధ్ర ధరాస్థలి నేడు మేలుకొల్పగలను'

అనే గేయం చదివితే దాశరథికున్న శాంతిలక్ష్యం, సువిశాల దృక్పథం, సామాజిక స్పందన ప్రస్ఫుటమవుతాయి. దాశరథిలో ఉన్న సమైక్యతాభావన, మూడుకోటులనొక్కటే ముడిబిగించి పాడినాను మహాంధ్ర సౌభాగ్యగీతి' అనే పంక్తుల్లో స్పష్టమవుతుందని రంగారావు ఈ వ్యాసంలో తెలియజేశారు. 'ఉద్యమ వ్యక్తిత్వం-మహాంధ్రోదయ భావన' అనే ఈ వ్యాసంలో తెలుగు ప్రాంతాలన్నీ ముక్కలుగా కాదు ఒక్కటిగా ఉండాలన్న దాశరథి భావనను గురించి తెలియజేశారు.

'పునర్నవం'లో దాశరథికున్న సామాజికమైన అవగాహననూ, కర్తవ్యనిష్ఠనూ గురించి రంగారావు చక్కగా వివరించారు. తెలంగాణ విమోచనోద్యమం



తరువాత కొంత ఊపిరి పీల్చుకున్న జనావళిలో ఎలాంటి ప్రశాంతత నెలకొన్నదో, తెలంగాణలో అనుకూల వాతావరణం ఎలా ఉన్నదో, ప్రజల్లోని కొంత శాంతిని, సౌభాగ్యాన్ని వీటన్నింటిని చూసిన దాశరథిలో కలిగిన స్పందనను

*'జగత్తులో నేడు సగం దగాపడుట మానుకొంది*
*బీదజనం నేడు మొగం*
*తుడుచుకోని మేలుకొంది'*

అనే 'తెలంగాణం' గేయం ద్వారా తెలియజేశారు. తరతరాల రాచరికపు పీడనతో మగ్గుతున్న బతుకుల్లోని దౌర్భాగ్యస్థితిని గురించి, వారి కష్టాలను, కన్నీళ్ళను, వారిపై జరిగిన దోపిడీని, దుర్మార్గాన్ని తలుచుకొని – ఆ రోజులకు ఈరోజులకు ఉన్న తేడాను గమనించుకుంటూ దాశరథి ఈ గేయం రాశారని రంగారావు చెబుతున్నారు. దాశరథిలోని కర్తవ్యశీలంతోపాటు భవిష్యత్తుపై అతనికున్న ఆశాభావాన్ని కూడా ఈ గేయం చాటి చెబుతోందని రంగారావు అన్నారు.

*'రుద్రవీణ తీగల చప్పుడు*
*వణికించును భీరులనిప్పుడు*
*నిరుపేదా నాతో రారా..*
*తేతేరా పలుగూ పారా'*

అంటూ 'అశ్రుదీపం' అనే గేయంలో దాశరథి నిరుపేదలను కదంతొక్కి ముందుకు నడవమని ఆహ్వానించిన తీరును గురించి రంగారావు ప్రస్తావించారు. ఈ గేయం గురించి రంగారావు గారి విశ్లేషణ అత్యద్భుతంగా ఉందని దాశరథి రంగారావుకు రాసిన లేఖలో ప్రస్తావించారు. దాశరథిని జాతీయవాదిగా, అఖిలమానవ శాంతి ప్రియునిగా, సమతావాదిగా, మానవతామూర్తిగా ఈ 'పునర్నవం'లో చూడొచ్చునని రంగారావు అభిప్రాయం.

సామాజిక స్పృహ, అనుభూతి స్పందనం, రచనాశిల్పం – ఈ మూడు లక్షణాలూ కలగలిసిన కవిత్వం పునర్నవంలో ఉందని మాదిరాజు రంగారావు వివరణాత్మకంగా, ఉదాహరణ యోగ్యంగా తెలియజేశారు.

*'ఉషస్సు కిర్మీర కవాటం తోస్తూ*
*ఒక్క మాటు చూచిందిటు*
*తమస్సు పాషాణకిరీటం తీస్తూ*
*ఒక్క పరుగు తీసిందటు'*

అనేవి 'ఉషస్సంధ్య'లోని ఆరంభ పంక్తులు. ఈ కవితాపంక్తులు కవిభావనాలోకంలో ఉదయించి – సామాజిక ఆదర్శాన్ని ఎలా సాధిస్తుందో రంగారావు తెలియజేశారు. ఉషస్సు రోజును వెలిగిస్తుంది. తమస్సు రోజును అంతం చేస్తుంది. తమస్సు సమాజంలోని కఠోర ప్రవృత్తిని చూపిస్తుందని, ఉషస్సు కోసం తమస్సులో తపస్సు చేయక తప్పదన్న సత్యాన్ని అంతర్నిగూఢంగా దాశరథి చెప్పారని మాదిరాజు రంగారావు ప్రస్తావించారు.

దాశరథి రాసిన 'బాల్యం' అనే వచనకవిత ఎంతో పేరు పొందింది. ఎన్నో కవిసమ్మేళనాల్లో దాశరథి ఆ కవిత చదివి అందరినీ ముగ్ధుల్ని చేసేవారు. ప్రతి వ్యక్తి మనస్సునూ, ఆర్ద్రభావనతో పరిమళింపజేసేది బాల్యస్మృతి అని, ఎంతకాలం గడిచినా దాని రంగు, రుచీ, వాసన తరగదని చెబుతారు.

*'దుర్మార్గాలకీ, దుఃఖాలకీ అవతలిగట్టున*
*తొంగి తొంగి చూచే లోకం బాల్యం*
*ఈ లోకం ఎత్తిన వెన్నెల బావుటాలు*
*బ్రతుకులో చల్లదనాన్ని రెపరెపలాడిస్తాయి'*

జీవితానికి ఇవతలిగట్టున బాల్యలోకం. అవతలిగట్టున మరో లోకం. అవతలిగట్టున ఉన్న లోకం దుర్మార్గాలకు నిలయమై, ఇవతలిగట్టున ఉన్న బాల్యలోకం ప్రశాంతతకు, నిర్మలత్వానికి, సంతోషానికి నిలయమై, ఆలవాలమై కనబడుతుందన్న దాశరథి కవితాకోణాన్ని రంగారావు విశ్లేషణాత్మకంగా వివరించారు.

'పునర్నవం'లోని 'మస్తిష్కంలో లేబొరేటరీ' అనే కవితలో వర్తమాన స్పందనను, సామాజిక చైతన్యాన్ని, 'మేల్కొన్న మనిషిని చూడ్డానికి వెళుతున్నాను' అనే కవితలో అధివాస్తవికతను, దాశరథి కవితల్లోని ప్రతీకాత్మకతను (సింబాలిజమ్), కాల్పనిక పార్శ్వాన్ని, భవిష్యత్ సమాజాన్ని తన కవితాదృష్టితో ముందే గ్రహించిన దాశరథికున్న కాలజ్ఞానాన్ని రంగారావు ఈ పుస్తకంలో వివరించారు.

ఆయా సందర్భాల్లో మాదిరాజు రంగారావుకు దాశరథి రాసిన లేఖల్లో నుంచి ఏడు లేఖలను ఈ పుస్తకం చివరలోని 'అనుబంధం'లో చేర్చారు. దాశరథి కవిత్వాన్ని వివిధ కోణాలనుంచి దర్శించి, వర్ణించి ఎంతో విపులంగా తెలియజేశారు. దాశరథి కవితామంత్రధ్వానాన్ని తెలుగు సాహితీలోకమంతటా వినిపించడానికి మాదిరాజు రంగారావు చేసిన అపూర్వకృషి ఇది.. ఈ వ్యాసాలద్వారా దాశరథి కవిత్వం చాలామంది పరిశోధకులకు, అభిమానులకు చేరువవుతుంది.

***రచయిత సెల్: 6309873682***

# స్వేచ్ఛాకవిత్వ మకుటధారి మాదిరాజు

- కల్లూరి భాస్కరం

పనిలో రెండు చేతుల వలె/ గతిలో రెండు అడుగుల వలె
కవితలో అర్థ భావ ప్రకాశం/ అందరికీ చెందినదీ స్వేచ్ఛాజగం
*

స్వేచ్ఛ వ్యక్తికి అనివార్యమైంది, అవసరమైంది
జీవనమార్గంలో పలు దృశ్యాలను నింపుతుంది
భావమయం, క్రియాగతిలో శక్తిని ప్రకటిస్తుంది
*

నిషేధింపరాని స్వతంత్రరూపం స్వేచ్ఛ/ అందరికీ చెందింది, ఎప్పటికీ ఉండేది
జీవనపద్మానికి విశాలతనిస్తుంది/ ప్రజాస్వామ్యసంస్కృతికి పరిమళత నిస్తుంది
*(స్వేచ్ఛాకవిత్వం, ఆరవసంపుటం నుంచి)*

ప్రాచీనకాలంనుంచీ చూస్తే తెలుగు కవితారంగంలో వస్తు, భావ, రూపపరిణామం ఇతిహాసం, కావ్యం, ప్రబంధం మొదలైన పేర్ల మీదుగా సాగింది. ఆధునికకాలానికి వచ్చేసరికి అది భావ, అభ్యుదయ, విప్లవ, దిగంబర, అనుభూతి, స్త్రీవాద వగైరా పేర్ల మీదుగా జరిగింది. విశేషమేమిటంటే, ఆధునికకాలానికి చెందిన వీటన్నిటినీ దండగుచ్చి ఒకే వర్గీకరణ కిందికి తెచ్చి, దానికి 'స్వేచ్ఛాకవిత్వం' అని పేరు పెట్టారు డా. మాదిరాజు రంగారావు. ఆపైన దీనంతటినీ స్వేచ్ఛాకవిత్వమని ఎందుకు అనాలో బహుముఖాలుగా విశ్లేషిస్తూ ఒక మేనిఫెస్టో రచించారు. ఇంకా ఆపైన, 'స్వేచ్ఛాకవిత్వం' పేరిట స్వయంగా కవిత్వం రచించారు. అది తొమ్మిది సంపుటాలుగా పుస్తకరూపం ధరించింది.

అంటే, మామూలు మాటలా కాకుండా, మంత్రంలా ధ్వనించే 'స్వేచ్ఛ' అనే రెండక్షరాలలోకి ఆధునికకాలపు కవితాచైతన్యం మొత్తాన్ని సంగ్రహించి చూపించే ప్రయత్నం చేశారు రంగారావుగారు. ఆ క్రమంలో కాలాన్నీ, చరిత్రనూ, సమాజాన్నీ; కాల, చరిత్రలను అంటిపెట్టుకుని సమాజం చెందే బహువిధ పరిణామక్రమాన్నీ, ఆధునిక కాలంలో దాని పర్యవసానాలుగా అమరిన ప్రజాస్వామ్యాన్నీ, సామ్యవాదాన్నీ; మంచివైపు, అంతరాలు లేని మన్నికైన మానవజీవనంవైపు అడుగులు వేయించే ఉద్యమస్ఫూర్తినీ, అంతిమంగా విశ్వశాంతివాదాన్ని, పరిపూర్ణమానవీయవికాసాన్నీ ఒక దార్శనికుడి స్థాయిలో దర్శిస్తూ తన స్వేచ్ఛాకవిత్వపు మేనిఫెస్టోలో ప్రతిపాదిస్తారాయన. దానికే 'స్వేచ్ఛాకవిత్వ' రూపంలో అంతే బహుముఖీనమైన, తనదైన కవితారూప మిస్తారు.

*భయం నుండి ముక్తమైన స్వేచ్ఛలో*
*స్టేషన్ నుండి స్టేషన్‌కు ఊరునుండి ఊరుకు*
*మధ్యమధ్య ప్రకృతిలోని ప్రభావదృశ్యాలతో*
*జనజీవన శ్రేణుల సంపుటం సమాజం*
*

*చరిత్రలో ఘటనలతో సమాజంలో మార్పు/కవితకు ప్రేరణయై కొత్తబాట పట్టిస్తుంది*
*వాస్తవానుభవంలో బ్రతుకును సుగమం చేసే/మార్పు ననుసరించేందుకు సాహసమవసరం*
*

*మనిషికి మనిషి తోడు విలువకు విలువ చేరుతుంది*
*మనుషుల విలువలతో సమాజమొక వివిధ వస్తు నిలయం*
*

*ప్రవాహానికి ఇరు తీరాలవలె కవి-సమాజం/ రెండింటినీ కలుపుతుంది మానవతాజలం వంతెన అవుతుంది కవిత సమాజానికి ప్రియంగా*
*

*సమాజ సందర్భంలో కవిత పాత్ర*
*ప్రజాస్వామ్యపథంలో ఒక అవసర వాస్తవం*
*బోనులో బంధించిన హరిణానికి మోచనం*
*వెలుగును బాధించే అనలాన్ని ఆర్పడం*
(స్వేచ్ఛాకవిత్వం, ఆరవసంపుటం నుంచి)

అసలు సంగతేమిటంటే, స్థలకాలాలతోనూ, వాటి మీదుగా జరిగే పరిణామక్రమాలతోనూ మనిషి జీవితం ముడిపడి ఉన్నట్టే; అతని ఆలోచనలూ, అతని ప్రణాళికలూ, కవిత్వం సహా అతని సృజనవ్యాపారాలూ ముడిపడి ఉంటాయి. మనుషుల్లో చాలామంది తమ ఆలోచనలూ, సృజనశక్తుల అభివ్యక్తిలో మునిగిపోతారు తప్ప స్థలకాలాలతో వాటికున్న ముడిని నిశితంగా గుర్తిస్తారని చెప్పలేము. ఏ కొందరో ఆ ముడిని గుర్తించి తమ ఆలోచనల్లోనూ, సృజనశీలంలోనూ దానిని భాగం చేసుకుని దానిని విశ్లేషించడానికీ, కవిత్వం వంటి ప్రక్రియల రూపంలో దానిని వ్యక్తీకరించడానికీ పూనుకుంటారు. మాదిరాజు రంగారావు వారిలో కేవలం ఒకరు కాదు, అగ్రగణ్యులలో ఒకరు.

స్థలకాలాల స్పృహతో సమకాలీనకవిత్వాన్ని స్వేచ్ఛాకవిత్వం పేరిట వర్గీకరించాలంటే; వస్తు, రూపపరంగా, భావపరంగా ప్రాచీన, మధ్యయుగాల మీదుగా కవిత్వంలో వచ్చిన మార్పుల గురించిన అవగాహన ఉండాలి; వాటితో సమకాలీన కవిత్వాన్ని పోల్చి చూసి వస్తు,రూప,భావపరంగా కొత్తగా వచ్చిన మార్పులను ఎత్తిచూపగలిగి ఉండాలి; సమాజమూ, రాజకీయాలూ, ఉద్య మాలతో సహా వాటికి దోహదపడిన ఆయా చోదకశక్తులను తరచిచూడగలిగి ఉండాలి. ఆవిధంగా ఈ పరిశీలనకు పెద్ద కేన్వాస్ అవసరమవుతుంది. మాదిరాజు రంగారావు గారు ఈ పనిని ఎంతో విద్వత్ పూర్వకంగా, ఆసక్తితో, మార్పుల పట్ల సంపూర్ణమైన సానుకూలవైఖరితో, ఉత్సాహోద్వేగభరితంగా చేస్తారు. ఆవిధంగా ఆయన సమకాలీనకవిత్వంతోనూ, దాని వెనుకనున్న రకరకాల చోదకశక్తులతోనూ అక్షరాలా మమేకమై జీవించారని చెప్పవచ్చు. 'స్వేచ్ఛాకవిత్వం-ప్రజాస్వామ్య భావన', 'స్వేచ్ఛాకవిత్వం-మానవీయభావన' అనే శీర్షికలతో రెండు భాగాలుగా వారు వెలువరించిన మేనిఫెస్టో మొత్తం దీనికి ప్రత్యక్షరసాక్ష్యం.

ఇంతకీ ఆధునికకవులకు, కవితాపరిశీలకులకు, ఆ మాటకొస్తే అన్నిరకాల సాహితీప్రక్రియలకు చెందిన రచయితలకు, వ్యాఖ్యాతలకు అంత పెద్ద కేన్వాస్ ఎందుకు అవసరమైందంటే- ఆధునికయుగస్వరూపం, స్వభావం అటువంటిది కనుక! అంతవరకూ వచ్చిన సాహిత్యం సంప్రదాయసాహిత్యం పేరిట నిర్దిష్ట స్థల,కాల నేపథ్యాలతోనూ నిర్దిష్ట వస్తు, రూపాల మధ్యా, సాహిత్యాదర్శాల మధ్యా సంచరిస్తూవచ్చింది. కాలం వెంబడి సంభవించే పరిణామం మందగతిని అనుసరించే ప్రాచీన, మధ్యయుగాలలో దేశీయంగా వర్ణాశ్రమధర్మపాలన, వ్యక్తిగతనైతిక, ఆధ్యాత్మిక, ధార్మికనిష్ఠ మొదలైనవాటిని అంతిమ ఆదర్శాలుగా నిబంధించుకుని నిపుణంగా అమరిన రసమూ, ధ్వనీ, అలంకారం, శైలీ, శిల్పం మొదలైన కావ్యసామగ్రిని ఆస్వాదించడం సాంప్రదాయిక సాహిత్య పరమాదర్శం అయింది. రూపపరంగా చెబితే ఈ కాలమంతటా శ్లోకం, లేదా పద్యమే సాహిత్యాన్ని ఏలింది.

అదే ఆధునికకాలానికి వచ్చేసరికి, దేశం మంచీ, చెడూ రెండూ కలగలసిన

బయటి గాలులకు తెరచిన కిటికీ అయింది. శాస్త్ర, సాంకేతిక ప్రభావాలతోపాటు స్వేచ్ఛ, స్వాతంత్ర్యం, ప్రజాస్వామ్యం, సమసమాజభావన మొదలైన, రాజకీయ, సామాజిక, సాంస్కృతికసంబంధమైన నినాదాలు, ఉద్యమాల తాలూకు సత్ప్రభావాలూ వాటిలో ఉన్నాయి. ఒకవైపు స్వాతంత్ర్యోద్యమం దేశమంతటినీ ఉద్యమస్ఫూర్తితో ఊపి వేస్తే; దానికి అదనంగా తెలంగాణ వంటి చోట ప్రాంతీయంగా నిజాం వ్యతిరేక పోరాటం, సామ్యవాదచింతన, ఇటీవలి కాలానికి వస్తే ప్రత్యేక రాష్ట్రోద్యమం వగైరాలు కవిత్వంతో సహా సాహిత్యసృజనతో చెట్టపట్టాలు వేసుకుని సాగాయి. ఈ అనుభవం అంతా కలసి 'స్వేచ్ఛ' అనే రెండక్షరాల మంత్రరూపం ధరించి ఉన్నతోన్నత గమ్యంగా పరిణమించింది. ఆ క్రమంలో కవిత్వంతో సహా సాహిత్యం మొత్తానికి స్వేచ్ఛ అనేది కలగా, కలవరింతగా, పలవరింతగా మారిపోయింది. అదే మాదిరాజు రంగారావు గారి కలంనుంచి స్వేచ్ఛాకవిత్వ మేనిఫెస్టోగా, స్వేచ్ఛాకవిత్వ సంపుటాలుగా జాలువారింది.

*వర్తమానం ముందుకే నడుస్తుంది, నడిపిస్తుంది*
*వ్యక్తిలో బింబమైన కవిత జనచేతనలో*
*సమాజచలనానికి ఉత్తేజకరం అవుతుంది*
*సంకల్పానికి సాధన అక్షరం, వైరుధ్యాలను చుదుతుంది*

*

*కళకూ నీతికీ మధ్య వంతెన వంటిది కవిత*
*కళ్ళలో కారం చల్లి ఝటితిగ బయటపడేది కాదు*
*ముఖాన దుమ్ము చిమ్మి తోసుకపోయేది కాదు*
*సొంత లాభాలకు పనికి వచ్చే విపణివీథి కాదు*

*

*వివిధ మనోవిధాలతో కొత్తయుగం ప్రస్తుతం*
*మనిషిని ఆటంకం దాటించే వేరు వేరు సాధనాలు*
*జీవితానికి చెరొకవైపునుండి వేరువేరుగా*
*"నిజం" "కవిత" రెండూ హృదయం వీడని పార్శ్వాలు*


(స్వేచ్ఛాకవిత్వం, ఆరవసంపుటం నుంచి)

పాతలోని మంచినీ, మన్నికనూ తోసిపుచ్చని సమన్వయవాది రంగారావు గారు. "వర్తమానానికీ, గతానికీ అనుబంధం వివిధ విషయాల్లో తప్పనిసరిగా కొనసాగుతూ ఉంటుంది. సాహిత్యానికి వస్తే, గతంలోని భారతీయ, పాశ్చాత్యసిద్ధాంతాలకు సంబంధించిన మౌలికమైన ఆలోచనల్ని విస్మరించడానికి వీల్లేదు. వాటి ఉపయోగం ఎంతో ఉంది. ఈ అంశాల్ని ప్రదర్శనశాలల్లో శిల్పాల్లా కాకుండా, సహేతుకంగా ప్రయోజనపరంగా అన్వయించుకుని ఉపయోగించుకోవలసి ఉంది. వీటిని ఆధునికకవిత్వంలో కళాత్మకమైన విలువలపై దృష్టితో సమన్వయం చేసుకోవడం సముచితం. దీనికి విమర్శకుల్లో గ్రహణ గుణం, వ్యాఖ్యానకౌశలం, సమయపరివర్తనల గురించి విజ్ఞత, దర్శనశక్తీ అవసరం" అంటారాయన.

పద్యం గురించి రాస్తూ, దానిపట్ల ఎవరికీ ద్వేషమూ, నిరసనా లేకపోవడం విస్మరించరాని విషయమనీ, పద్యం అందుకున్న శిల్పశిఖరాలు అలాంటివంటారు. "చరిత్రలో పద్యానికున్న గౌరవస్థితికి ఏ క్షతీ లేదు. కానీ అది ప్రస్తుత సామాజికస్థితిలో అవసరాల దృష్ట్యా ఎంతవరకు తన పాత్రను నిర్వహించగలదనేది వేరే ప్రశ్న. పద్యరచన కళాక్షేత్రం వలె నిలిచే ఉంటుం" దంటారు. ఒక్కోసారి కవిత్వతత్త్వ వివేచనలో సంప్రదాయం, ఆధునికత అన్న విభజనకు పోకుండా కవిత్వమే నికషోపలంగా చర్చ చేయడంలో ఆయన వెనకటి లాక్షణికులను తలపిస్తారు. "ఆధునికకవిత్వ సమాలోచనంలోనూ పాశ్చాత్య

# స్వేచ్ఛా కవిత్వం

ఆరో సంపుటం (2018-2020)



మాదిరాజు రంగారావు

కావ్యశాస్త్రంతోపాటు ప్రాచీన భారతీయకావ్యశాస్త్రానికి సంబంధించిన అంశాల్ని వర్తింపచేయవచ్చు" నంటారు. ధ్వన్యాలోకంలో ఆనందవర్ధనుడు ప్రతిపాదించిన 'ప్రతీయమాన' లక్షణాన్నీ, అభినవగుప్తుడు ప్రతీయమానాన్నే ఆత్మగా చెప్పడాన్ని ఆయన ప్రస్తావించి; కవిత్వంలో ప్రతీయమానం సార్వకాలికమూ, సార్వ జనీనమూ కనుక ప్రాచీనమూ ఆధునికమూ అనే ప్రసక్తి లేదంటారు.

ఛందస్సు గురించి ప్రస్తావిస్తూ, అది కవిత్వానికి ఏ విధంగానూ భంజకం కాదనీ, ఛందస్సు వల్ల సంక్షిప్తత చేకూరుతుందనీ, అస్పష్టత తొలిగే అవకాశం ఉంటుందనీ, విశిష్టమైన గతీ, ఒక ఆకర్షణా సిద్ధిస్తాయనీ అంటారు. కొత్తను అన్వేషించే లక్షణం– మార్పును కోరే తత్త్వంతోపాటు పాతలో ఒకవిధంగా ఏర్పడిన స్తబ్ధత కొత్త ప్రయోగాలకు దారి తీస్తుందనీ, సమాజంలోని స్వేచ్ఛా వాతావరణం రచనలో స్వేచ్ఛను అవలంబించే ధోరణికి నడిపిస్తుందనీ అంటారు. విశ్లేషించి చూస్తే స్వేచ్ఛాకవిత్వంలోనూ తెలిసో తెలియకో ఛందస్సుకు సంబంధించిన అంశాలు అక్కడక్కడ చోటుచేసుకోవడం గమనించవచ్చుననీ; భావరూపమైన స్పష్టతనూ, రూపావిష్కరణలో ఆకర్షణీయమైన గతినీ సాధించేమేరకు కవిత్వంలో ఏ కాలంలోనైనా ఛందస్సు యొక్క ప్రమేయంవల్ల నష్టం లేదనీ అంటారు.

అదే సమయంలో, లయ, ఛందస్సు ఒకటి కావని అంటూ, లయాత్మక రచన భౌతికరూపాన్ని ఎక్కువగా ఆశ్రయించుకుని ఉంటుంది కనుక, కవితాప్రపంచంలో మొదటి శ్రేణికి చెందినది కాదంటారు. శబ్దాల బరువూ, తూగుతో క్రమమైన పొందిక లయ అనీ, స్వేచ్ఛాకవిత్వం అటువంటి బరువూ, తూగూ కలిగి భిన్నభిన్న రీతుల్లో 'అంతర్లయ'తోనూ, ఎక్కువగా 'అంతర్నాదం'తోనూ ఉంటుందనీ ఒక సూత్రీకరణ చేస్తారు. పోతపోసినట్లు వ్రాస్తూపోతే విసుగు కలుగుతుంది కనుక దానిని పరిహరించడానికీ, సృజనశక్తి ప్రసారానికి అంతరాయం కలగకుండా చూడడానికీ 'అంతర్లయ'పై; ఇంకా శ్రద్ధ ఉంటే 'అంతర్నాదం'పై దృష్టి పెట్టాలంటారు. అంతిమంగా సంప్రదాయరీతులను సహనంతో మననం చేసుకుని మనసును వికసింపచేసుకోవడం నేడెంతో అవసరమంటారు.

అర్థాన్ని, గమ్యాన్ని ఏర్పరచలేని మాటలు
చీకటి కమ్మిన గుహలను తలపిస్తాయి
నూనెలేని అనుభవాల దివ్వెల్ని సూచిస్తాయి
చెదరిన కలల ముక్కల్ని చేర్చినట్లు ఉంటుంది

*

*ఏ లిప్త అయినా కవితకు పనికివస్తుంది*
*శశికిరణం హ్లాదకరంగా/ రవికిరణం చండమయంగా*
*మోదం, ఖేదం జీవనపార్శ్వాలతో*
*ప్రవాహగమనం పొందుతుంది*
*హృదయానికి ఆర్ద్రంగా మేధకు వెలుతురుగా*

*

*కవితకు సందర్భం ఇది అది అని లేదు/ ఏ దృశ్యం ఏ శబ్దం ఏ ధ్వనితోనో*
*ఏ ఎద కదలికతోనో, ఏ భావస్పర్శతోనో/ సృజన కళ పొందుతుంది,*
*కవిత వెడలుతుంది*

*

*తన ముఖం చూడలేని మనిషికి/ అద్దం సహాయపడుతుంది బాగా*
*తన హృదయం ఎరగలేని మనిషికి/ కవిత ఉపకరిస్తుంది అనూహ్యంగా*

*

*దొరకని చోట దారి చూపిస్తుంది/ దారి లేని చోట కొత్తది వేస్తుంది*

*

సమాజ సందర్భంలో కవిత పాత్ర/ ప్రజాస్వామ్యపథంలో ఒక అవసర వాస్తవం
బోనులో బంధించిన హరిణానికి మోచనం/ వెలుగును బాధించే అనలాన్ని ఆర్పడం

(స్వేచ్ఛాకవిత్వం, ఆరవ సంపుటం నుంచి)

స్వేచ్ఛాకవిత్వాన్ని బహుకోణాలలో నిర్వచించే క్రమంలో సంప్రదాయ/పద్య సాహిత్యానికీ; ఆధునిక స్వేచ్ఛాకవిత్వానికి ఉన్న మరిన్ని తేడాలను మాదిరాజు రంగారావు ఎత్తిచూపుతారు. కవి తనకు తానుగా సద్యః స్ఫూర్తితో ఏర్పరచుకునే నిర్మాణరూపమే తప్ప స్వేచ్ఛాకవిత్వానికి నియతమైన లక్షణం లేదంటారు. స్వచ్ఛందనిర్మాణశిల్పమే స్వేచ్ఛాకవిత్వం అంటారు. ఆయన ప్రకారం, మనిషిపై ఆశతో, మానవతా మనోజ్ఞంగా ప్రకాశించే స్వరూపం స్వేచ్ఛాకవిత్వంలో దర్శనమిస్తుంది. ఎప్పటికప్పుడు కొత్తను కోరే మార్పుకు ప్రేరేపిస్తుంది, మార్పుకు సహకరిస్తుంది, మార్పును లక్షిస్తుంది. సమాజగనమలో సముచితమైన పాత్రను నిర్వర్తిస్తూ ఉండడం వల్ల చారిత్రక ప్రాధాన్యాన్ని సంతరించుకుని కవిత్వమంటే ఈనాడు స్వేచ్ఛాకవిత్వంగా అర్థస్ఫూర్తిని పొందింది.

దీనినే మరింత విపులీకరిస్తూ, స్వయంప్రేరణాయుతమైనదీ, కవి వ్యక్తిత్వంలో సంప్రదాయసంస్కృతీ తేజంతోపాటు ఆధునిక సంస్కారం, మానవీయస్పందన, సామాజికతత్పరత, హేతుదృష్టి, అభ్యుదయకాంక్ష, విప్లవస్ఫూర్తి, సమన్వయలక్షణం, వస్తునవ్యత వంటి అనేకాంశాల సమాహారమే స్వేచ్ఛాకవిత్వం అంటారు. ఇంతటి వైవిధ్యం వెనకటి ఏ దశలోనూ కనిపించదంటారు. వస్తు, రూపపరంగా మరింత వింగడిస్తూ, స్వేచ్ఛాకవిత్వంలో కథాపద్ధతికి కన్నా, భావవిన్యాసానికీ; కథనరీతులకు కన్నా భావయోజనకే ప్రాధాన్యముంటుందంటారు.

స్థూలంగా కథాసూత్రం, కథాంశం ఉన్నా; నిర్వహణ మాత్రం భావస్థానాలపై, భావగతులపై దృష్టితోనే సాగుతుందంటారు. కథ అసలే లేకపోయినా ఒక స్థితి ఉంటుందనీ, కొన్ని స్థితుల సంయోజనం ఉంటుందనీ అది వస్తుగతం, మనస్తత్వగతం, కేవల భావవిన్యాసం కావచ్చునంటారు. ఈ సృజనలో మనఃప్రపంచం, అందులోని రహస్యాలు, స్మృతులు, వర్తమానచిత్రణం ఎక్కువ కనిపిస్తాయంటారు. స్వేచ్ఛాకవిత్వానుభవం పద్యానుభవం కన్నా భిన్నంగా ఉంటుందనీ, పద్యరచనలో సాధారణంగా ఏ పద్యానికదే పూర్ణమైతే, స్వేచ్ఛాకవిత్వంలో ఒక స్థితి, లేదా ఒక భావాన్ని బట్టి వాక్యం, లేదా వాక్య సముదాయం పూర్ణభాగంగా విభజితమవుతుందనీ అంటారు.

ఈవిధంగా రంగారావు గారు ప్రాచీన అలంకారశాస్త్రాల నమూనాలో ఆధునిక/అత్యాధునిక కవిత్వానికి లాక్షణికమైన రూపురేఖలను సంతరించడానికి తన స్వేచ్ఛాకవిత్వపు మేనిఫెస్టోలో విశేషప్రయత్నం చేశారు. అయితే, ఆయన స్వేచ్ఛాకవిత్వ లక్షణాలను క్రోడీకరించడంపై పెట్టినంత దృష్టిని వాటికి తగిన లక్ష్యాలను జోడించడంపై పెట్టకపోవడం కనిపిస్తుంది. ఆ ప్రయత్నాన్ని భావిపరిశోధకులకు, పరిశీలకులకు విడిచిపెట్టారని భావించడం సముచితం. కాకపోతే, స్వేచ్ఛాకవిత్వం పేరిట ఆయన స్వయంగా వెలువరించిన కవితా ఖండికలను కొంతమేరకు లక్ష్యాలుగా స్వీకరించవచ్చు.

తను స్వేచ్ఛాకవిత్వంగా వర్గీకరించిన ఆధునిక/అత్యాధునిక కవిత్వంలో క్లిష్టత, అస్పష్టతతో సహా రంగారావుగారు అన్ని కోణాలనూ ఆయా శీర్షికల కింద తన మేనిఫెస్టోలో చర్చించారు. సాహిత్యంలో స్తబ్ధత, లేదా విరామం ఎందుకు సంభవిస్తూ ఉంటుందో, దానిని ఎలా అర్థం చేసుకోవాలో కూడా ఆయన లోతైన కాలికస్పృహనుంచి చెబుతారు. రెండు భాగాలుగా ఉన్న ఆయన మేనిఫెస్టోలోని అన్ని అంశాలనూ ఈ వ్యాసంలో స్పృశించి వ్యాఖ్యానించడం సాధ్యం కాదు కనుక ఆసక్తిగల పాఠకులు, పరిశోధకుల స్వయంపరిశీలనకు విడిచిపెట్టడం అనివార్యమవుతోంది.

సంపూర్ణమైన, స్ఫూర్తిమంతమైన ప్రజాస్వామిక చింతననుంచి, కేవలం సాహిత్యానికే పరిమితం కాకుండా, మనిషికీ, సమాజానికీ చెందిన సమస్తాంగాలనూ దానికి కలుపుకుంటూ రంగారావుగారు సునిశితంగానూ, సువిశాలంగానూ ఆధునిక/అత్యాధునిక కవిత్వాన్ని గమనిస్తూ, అర్థం చేసుకుంటూ స్వేచ్ఛా కవిత్వమకుటంతో జరిపిన విశేషాధ్యయనఫలితాలు ఆయన మేనిఫెస్టో, ఆయన స్వేచ్ఛా హృదయస్పందన ఆయన కవితాఖండికలు. "ప్రజాస్వామ్యం మానవజాతి శ్రేయస్సుకు ఉపకరించే అన్ని సిద్ధాంతాలలోని గుణాలనూ మన్నిస్తుంది. వేల వ్యక్తిత్వాలను వేయి విధాలుగా వికసింపజేసి సమాజానికి సంపూర్ణతను సిద్ధింపజేస్తుంది" అంటారాయన. ఈ అవగాహనామథనం నుంచి పుట్టినదే స్వేచ్ఛాకవిత్వభావన. ఆ అవగాహనను అందిపుచ్చుకుని దానిని మరింత సుసంపన్నం చేస్తూ ముందుకు సాగడమే ప్రజాస్వామికస్వేచ్ఛావాదులూ, కవితాప్రియుల కర్తవ్యం.

చరిత్ర నిశ్శబ్దంగా ఉండదు, ఉండలేదు
పూర్వపు అట్టహాసం స్మృతిలో సందడి చేస్తుంది
కవితలో గాథకు మూలశక్తి నందిస్తుంది
ఒరలో కరవాలం తీసి పదును పెడుతుంది

*

ప్రతి పతాక భిన్నమైన ఆదర్శానికి చిహ్నం
ప్రతి వాదం కొత్తదైన దృక్కోణానికి సూచన
సంఘంలో జనసంస్కృతి వికసించే కొద్దీ
నిరంకుశం శిథిల దృశ్యమవుతుంది

*

ఏ లిప్తా కాలుతూన్న కొరకంచులు కావు
ఏ బతుకులోను వేదన నిరాశ దుఃఖం చిరం కావు
అనుభవముద్రలు సృజనకు కళాకృతి నిచ్చేను
ఇది మానవవికాసంలో జనతకు ప్రేరణ అయ్యేను

(స్వేచ్ఛాకవిత్వం, ఆరవసంపుటం నుంచి)

1. మాదిరాజు రంగారావు శతాధికంగా స్వేచ్ఛా కవిత్వ ఖండకావ్యాలు రచించారు. వాటిలో స్వేచ్ఛాకవిత్వం అనే 6వ సంపుటిపై ఈ వ్యాసం.

2. స్వేచ్ఛాకవిత్వం గురించి ఆయన మేనిఫెస్టో కూడా విడుదల చేశారు. దానిని పీవీ నరసింహారావుకు అంకితం చేశారు.

3. ప్రజాస్వామ్యం కారణంగానే స్వేచ్ఛాకవిత్వం వికసించిందని ఆయన అంటారు. ఇది సృజనాస్వేచ్ఛకు కొత్త కవాటాలు తెరిచిందంటారు. దాని పర్యవసానాన్ని ఆయన బహుముఖాలుగా చర్చించారు. పద్యం కూడా స్వేచ్ఛాకవిత్వం కిందికి పూర్తిగా రావాలని ఆకాంక్షించారు. ఆవిధంగా పద్యం పట్ల ఆయన సానుకూలతనే వ్యక్తం చేశారు.

4. స్వేచ్ఛా కవిత్వాన్ని ఆయన ఇలా వివరిస్తారు: "ప్రస్తుతసమాజంలో పై వర్గాల నుంచి కింది వర్గాల దాకా అందరినీ కలుపుకుని వారి జీవితసమస్యలకూ, సమాధానాలకూ ప్రాధాన్యమిస్తుంది ఈ ప్రక్రియ. ఇది చాలా తక్కువ కాలంలో బహుముఖీనంగా విస్తరించడానికి కారణం ఇదే. ఆధునికసాహిత్యచరిత్రలో స్వేచ్ఛా కవిత్వం, ప్రజాస్వామ్యయుగంలో కొత్త దిశకూ స్వతంత్రమైన అభివ్యక్తికీ సాధనంగా నిలిచింది. సామాజిక తత్పరతతో, వ్యక్తిస్ఫూర్తితో ఆధునిక సాహిత్యసంస్కృతిలో చారిత్రకమైన పాత్రను నిర్వహిస్తోంది. ప్రజాస్వామ్య సంవిధానం భూమికపై సాహిత్యచరిత్రలో ప్రజాస్వామ్య యుగంగానూ, కవితాప్రస్థానంలో స్వేచ్ఛాయుగం గానూ పరిగణించడానికి వీలైన అస్తిత్వాన్ని పొందింది".

○

# మాదిరాజు.. మానవీయం

– కోవెల సుప్రసన్నాచార్య



మాదిరాజు రంగారావు తన రచనలను 1954 ప్రాంతాలలో ప్రారంభించినా తెలంగాణం నుంచి వచ్చిన కవులలో ఒంటరిగా రూపనిష్ఠను కచ్చితంగా పాటించినాడు. కుందుర్తి ఉద్యమ రూపకల్పన కంటే ముందే, తన నిరంతర కవితా వ్యాసంగాన్ని వచన పద్యంలోనే సాగించాలని నిశ్చయించుకున్నాడు. పద్యంలో చేరి మనం కొత్తగా సాధించగలిగింది ఏముంటుంది అన్నది ఆయన ఊహకావచ్చు. ఏది ఏమైనా వచనమే ఆయనకు కావ్య మాధ్యమం అయింది. అయితే రంగారావు ఎప్పుడూ ప్రగతి వాద కవుల, ప్రయోగవాద కవుల పరిమితులలో ఇమిడిపోలేదు. కాదు అని సంప్రదాయ మార్గంలో సాగిపోనూలేదు. ఆయన జాతీయ ప్రజాస్వామ్య దృక్పథానికి అంకితమై సాగిపోయాడు. 1957లో 'కిర్మీరం' అనే పేర ఆయన కవితాసంపుటం తొలిసారిగా బయటకు వచ్చింది. దీన్ని శ్రీశ్రీకి అంకితం చేశాడు. ఆయన సాహిత్య సృజన ఎప్పుడూ నిరుద్ధం కాలేదు. ప్రవహిస్తూనే వచ్చింది నిరంతరంగా. కిర్మీరం అంటే బహువర్ణ శబలచిత్రం. ఇదీ ప్రపంచం ఆయనకు. శిలా సదృశమైన ఏ స్థితిలోనూ నిలిచి ఉండలేదు. 'వీచే గాలిలా మ్రోగే నదీ తరంగంలా దూకే జలధారాధునిలా మెరసే నవ విద్యుల్లేఖా పుష్పంగా హసిస్తూ నిత్యం చరించడం జీవ సృష్టి వైలక్షణ్యం'. (పే. 15) ప్రపంచాన్ని ఇలా ఆయన భావించింది 'భిన్నత్వం అనిశ్చలత్వం క్షణ క్షణం వినూతనత్వం రూపరేఖలు మారే గుణం భౌతిక ప్రాపంచిక లక్షణం' (పే. 14) ఇదీ ప్రపంచాన్ని గురించిన రంగారావు దృష్టి. సుమారు ఏడు దశాబ్దాల పాటు సాగిన రంగారావు సాహిత్య ప్రస్థానం మానవుడి అంతర్బహిర్జగత్తుల సమన్వయం కోసం సాగించిన కృషి.

1971లో రంగారావు ప్రకటించిన 'మానవీయం' తెలుగు సాహిత్యంలో విశిష్టునిగా ఆయనకు స్థానాన్ని కలిపించింది. అంకితంలో జగత్తును వివర్తంగా పేర్కొనటం ఆయనకు గల అద్వైత నిష్ఠను ప్రకటించింది. మానవ జీవనంలో ఆదినుంచి నేటివరకూ సాగిన వివిధ పరిణామాలు, విరోధాలు వివిధములైన అనుభవాలు సమగ్రంగా చిత్రించిన ఆధునిక కావ్యాలలో బహుశా ఇదే మొదటిది. 'నేటి సంఘర్షణలోని క్లిష్టస్థితుల నుండి ఆగామి యుగంలో పునర్జన్మవలె కనిపించే మానవుని మహోదారరూపం, ఉదాత్తమైన మరో లోకాన్ని సృష్టించుకొని, విశ్వసంస్కృతి భూమికలో అవతరిస్తుందన్న ఆశతో కావ్యం ముగుస్తుంది'. ఆగామియుగం మానవుని ప్రస్తుత పరిమితులను ఛేదించే పునర్జన్మ. అది మహోదారం ఉదాత్తమైన మరోలోకం.

భారతీయ తత్త్వ చింతనలో జగత్తును మిథ్యగా దుఃఖమయంగా భావించే దశ ఒకటైతే జగత్తును దివ్య చైతన్య మయంగా పరిణమింపజేసుకునే దిశమరొకటి. భక్తి ఉద్యమకాలం నుంచీ ప్రయత్న శీలంగా భారతీయ తాత్త్వికులు ఈ సమన్వయాన్ని లక్షిస్తున్నారు. వర్తమాన భారత సంస్కృతి వికాసంగా జగన్నిర్మాణాన్ని లక్షించారు. మాదిరాజు రంగారావు మానవీయం నిర్మించిందీ దృష్టితోనే. విరసం జన్మించిందీ ఇంచుమించుగా ఒకే కాలం కావటం గమనించదగ్గ అంశం.


విమర్శకులు ఎంతగా కుంచించుకుని రంగారావు కవిత్వాన్ని పేర్కొనకుండా ఉపేక్షించినా, ఆయన క్రమంగా స్వతంత్రంగా ఎదిగాడు. తనలోని పూర్వసంస్కారాల సంపుటినించి తనను తాను విడగొట్టుకున్నాడు. తన శైలిని నిర్మించుకున్నాడు. తన వ్యక్తిత్వంలో భావుకత, తాత్త్వికతలను స్వీయ చైతన్యంతో నిర్మించుకున్నాడు. జాతీయ వాద పరిమితులను దాటి విశ్వచైతన్యంలో తనను అనుసంధించుకొన్నాడు.

రంగారావు కవిత్వంలో ఆదినుంచి కానవచ్చే లక్షణం వాచ్యం కాకుండా భావాన్ని వెల్లడించే జాగ్రత్త గైకొనడం. ఇందుకోసం ఆయన ప్రకృతినించి ప్రతీకలను వాడుకుంటాడు. శ్రీశ్రీ మొదలైన ప్రగతివాద కవులు, కుందుర్తి మొదలైన వాళ్లు కూడా పౌరాణిక ప్రతీకలను వాడగా రంగారావు ఎప్పుడూ ఆ పని చేయలేదు.

ఇంద్రియ శక్తుల వశమై ఒక పార్శ్వం భౌతిక భూమి అవుతుంది. ఇంద్రియ శక్తుల స్వాధీనంలో ఒక పార్శ్వం ఆత్మశిఖర మవుతుంది మనస్సులో సూర్యుని అరుణ రశ్మిలో హృదయంలో చంద్రుని సుధాకాంతిలో భౌతికం నుండి మనిషి అతీతానికభిలాష పడేను నిరంతరం. (స్వేచ్ఛా కవిత్వం (2003) పే. 437). నా మిత్రుడు, సహచరుడు రంగారావును, అతని కవిత్వాన్ని మరోసారి నెమరు వేసుకొనే అవకాశం లభించింది. మరపునకు రాని స్నేహితుడికి ఇది నా నివాళి.

# స్వేచ్ఛా కవిత్వ ప్రవర్తకుడు

– దుర్గెంపూడి చంద్రశేఖర రెడ్డి




మాదిరాజు రంగారావు

మాదిరాజు రంగారావు గారు 1952 నుండి అంటే తన పదిహేడో ఏట నుండి కవిత్వం రాయడం ప్రారంభించి, నిరంతరాయంగా తన చివరిరోజు వరకు అంటే 2025 జూన్ 21 వరకు, 90 ఏళ్లు పూర్తిచేసికొనే వరకు కవిత్వం రాస్తూనే ఉన్నారు. దాదాపు డెబ్బై మూడేళ్లు ఆయన కవితారచనా వ్యాసంగం అనాహతంగా కొనసాగుతూ వచ్చింది. బహుశా తెలుగు సాహిత్య చరిత్రలో ఇంత దీర్ఘకాలం కవితా వ్యవసాయం సాగించిన కృషీవలురు మరెవరైనా ఉన్నారో! నా దృష్టికయితే రాలేదు. కవిత్వం ఆరంభించిన చిరువయస్సు నాటి మానసిక చైతన్యం, స్ఫూర్తిమత్వం, తాజాతనం, కలుషితం కాని స్వచ్ఛత, చుట్టూ ఉన్న ప్రపంచాన్ని చూసి అద్భుతం పొందే అమాయక హృదయం ఆయన తన తొంభై యేళ్ల వయస్సు వరకు నిలుపుకోగలగడం నిజంగానే మనల్ని అబ్బురపరుస్తుంది. ఈ లక్షణాలకు అదనంగా అపారమైన జీవితానుభవం, తద్వారా ఏర్పడిన ప్రాపంచిక దృష్టి వచ్చి చేరాయి. గొప్పగా చదువుకున్నారు. ప్రాచీన సాహిత్యం నుండి ఆధునిక సాహిత్యం వరకు క్షుణ్ణంగా అధ్యయనం చేశారు. కవిత్వం సృజనకళ. ఆయన దృష్టి ఆది నుండీ సృజనకళా దృష్టి. ఆయన పిహెచ్.డి. కవిత్రయం వారి సృజనకళ గురించి. ఆయన జీవితమే సృజన ప్రధానం. సప్త దశాబ్దాలకు పైగా కవిత్వాన్నే సృజించారు. ఆయన విమర్శ అంతా కూడా ప్రధానంగా సృజనకళపైనే.

**2**

మాదిరాజు రంగారావు గారు తన కవిత్వాన్ని 'స్వేచ్ఛా కవిత్వం' అన్నారు. స్వేచ్ఛాకవిత్వం అంటే ఏమిటి? ఈ మాట వినగానే అదీ ఇదీ ఒకటే అయినా కాకపోయినా దేవులపల్లి వేంకట కృష్ణశాస్త్రి 'స్వేచ్ఛాగానము' స్మృతిలోకి వస్తుంది.కృష్ణపక్షములో స్వేచ్ఛాగానము-1, స్వేచ్ఛాగానము-2 అని రెండు కవితాఖండికలున్నాయి. మొదటి దానిలో 'జగమునిండ స్వేచ్ఛాగాన ఝరులనింతు' అనే మకుటంతో ఐదు పద్యాలున్నాయి. బండరాళ్లు కూడా చివురులెత్తేటట్లు, దాస్యశృంఖలాలు తెగిపోయేటట్లు, చిత్తము ఆనంద మరీచికల తేలేటట్లు, స్వేచ్ఛకోసం ప్రాణాలర్పించేవారి జీవితం ధన్యమయ్యేటట్లు, కష్టాలు, బాధలు మరచి విశ్వమే పరవశమై తన వెంట పాడేటట్లు స్వేచ్ఛా గాన ఝరుల నింతునంటాడు కృష్ణశాస్త్రి. రెండో కవితలో 'నవ్వపోదురు గాక నాకేటి సిగ్గు, నా యిచ్ఛయేగాక నాకేటి వెరపు' అంటూ తాను పక్షిని, నక్షత్రాన్ని, మధుపాన్ని, చందమామను...' అలా అలా 'చిగురాకు, కొండవాగు, పవనము, అల' ఏదైనా అయిపోతాను, మారిపోతాను, మాయమవుతాను అంటాడు. కృష్ణశాస్త్రి ఎటువంటి బంధనాలూ లేని స్వేచ్ఛను కోరుకున్నాడు. ఆకాశంలో స్వేచ్ఛగా విహరించే పక్షి వంటి జీవితాన్ని కోరుకున్నాడు.

మరి రంగారావుగారి స్వేచ్ఛా కవిత్వం!

సృజనాత్మక సాహిత్య ప్రక్రియలను ముఖ్యంగా కవిత్వాన్ని రెండు అంశాలు ప్రధానంగా విశ్లేషించవచ్చు. మొదటిది వస్తువు, రెండోది రూపం. వస్తువు గురించి పరిశీలించినప్పుడు ఆయన మళ్లీ మళ్లీ చెప్పినది, తన కవితా గ్రంథాల



పీఠికలన్నిటిలో చెప్పుకొన్నది ప్రజాస్వామ్య సామ్యవాద దార్శనికత. ప్రజాస్వామ్యం, సామ్యవాదం అన్నని రంగారావుగారి సాహిత్య దార్శనికత్వంలో ప్రధానాంశాలు. ఇదే ఆయన దార్శనికత అయినప్పుడు వ్యష్టినీ, సమష్టినీ, తన స్వీయ అస్తిత్వాన్నీ, సామాజిక అస్తిత్వాన్నీ, ప్రజల పట్ల రాజకీయ, సామాజిక దృక్పథాన్నీ మనం తేలికగా అర్థం చేసికోగలం.

ఈ సంక్లిష్ట స్థితులలో ఎగుడుదిగుడు సమాజతలంపై అందరిని కలుపుకొనిపోయే జనహితకర లక్ష్యం దార్శనికంగా ప్రజాస్వామ్య సామ్యవాద భావజాలం విశ్లేషణకందుతుందని ఆయనే చెప్పుకున్నారు.

స్నేహం, ప్రేమ, బాధ, వేదన, పీడన, ఉదారత, కరుణ, శాంతి, ముఖ్యంగా స్వేచ్ఛ, స్వతంత్రం ఆధారాలతో (ఈ కవితలో) ఆవిష్కృతమయింది అని కూడా ఒక కవితా సంపుటి పీఠికలో అన్నారు.

ఇక రూపం విషయానికి వస్తే స్వేచ్ఛాకవిత్వం అంటేనే ఫ్రీవర్స్ (free verse) అని సమానార్థకంగా ఉపయోగించారు.

ఫ్రీవర్స్ అన్న దాన్ని వచన కవిత్వం/వచన పద్యంగా వ్యవహరించడం సర్వసాధారణమై పోయింది. దీన్ని ఉద్యమంగా నడిపిన కుందుర్తి ఆంజనేయులు గారు ఫ్రీవర్స్ ఫ్రంట్‌నే స్థాపించి నడిపారు.

స్వేచ్ఛా కవిత్వం (Free verse) అని వాడినప్పటికీ రంగారావు గారు 'ఇది వచన కవిత్వం కాదు' అని పలుచోట్ల ఉద్ఘాటించారు.

రూపం అభివ్యక్తిలో స్వతంత్రవిధం దృక్పథం. దార్శనికం పట్ల స్వయంకృత నిర్మాణం తలపుకు వస్తుంది. స్వయం చోదిత ప్రసారంలోని అనుభవ రూపాన్ని పొందుతూంది. ఇది ఎక్కువగా సహజమైన నిర్మాణాన్ని తలపుకు తెస్తుంది. కృత్రిమతకు చోటులేదు. దారులన్నీ కలుపుకొని, వాదాలన్నీ అందుకొనీ, భేదాలన్నీ తొలగిన సహజగుణం గోచరిస్తుందన్నారు.

ఎవరికి వీలయిన, నచ్చిన విధంగా నియతుల తోను, లేకుండానూ వ్యవహరించే అవకాశం పుష్కలం అంటారు. అంటే నియతులూ ఉండవచ్చు. ఉండకుండానూ ఉండవచ్చు. 'ఎక్కువ స్వేచ్ఛ, తక్కువ నియమ నిబంధనలలో బహుళమైన ప్రయోజనాల తో సంక్లిష్టం వేగం ఎన్ని స్థాయిల్లో ఉన్న వారికైనా అందుబాటులో ఉండడంతో పాటు, సులభమైన విజ్ఞానదాయకంగానూ ఉండడం దృష్టికి వస్తుంది' అంటారు.

అందువల్ల నియమనిబంధనలున్న పద్యమూ

కావచ్చు, గేయమూ కావచ్చు, కేవలం వచన పద్యమూ కావచ్చు. ఇలాగే ఉండాలన్న నియమ మవసరం లేదన్నమాట. కవి తనకనుకూలమైన పద్ధతిని ఎంచుకోవచ్చు. ఆధునిక కాలానికి ఎక్కువ అనుగుణమైనది, అందరికీ అందుబాటులో ఉండేది వచనకవిత్వమని రంగారావుగారి అభిప్రాయం.

ఆయన తన కవితల్లో అనేకానేక సందర్భాలలో ఈ స్వేచ్ఛను సలిలంతో, మేఘంతో, గాలితో, మెరవులతో పోలుస్తారు. ఇటువంటి చోట్ల కృష్ణశాస్త్రితో ఆయనకు పోలికలు కనబడతాయి.

### 3

మాదిరాజు రంగారావు గారి కవిత్వంలో స్వేచ్ఛా భావన ఎంత విస్తరించుకొని ఉందో, ఆ పదమూ అంతే విస్తరించి కనిపిస్తుంది.

స్వేచ్ఛ అంటే అన్ని ఇజాలకూ దూరంగా ఉంటుందన్న భావన ఒకటుంది. కాని రంగారావుగారు మాత్రం దీనికి భిన్నం.

'ఇది స్వేచ్ఛాకవిత్వం దేనికీ విరోధం కాదు స్నేహమయం'.

అది ఇజాలకు స్నేహమయం, నిజాలకు హృదయస్థానం. దీన్ని బలపరిచే కవితా పంక్తులెన్నో వీరి కవిత్వంలో.

*ఉద్యమంలో ఊపునుండి విప్లవానికి మార్గం సులభమనీ*

*భావించే తీవ్రవాదుల ఆచరణ సర్గ మొదలయ్యేను*

*కర్మవీరుల పథకం వలయాకారంలో*

*ఏ కోణం నుండైనా సాగవచ్చు ముందుకు.*

కవి స్వేచ్ఛా కవిత్వమంతా కొన్ని దీర్ఘకవితలు వదిలిపెడితే కవితా ఖండికలే. రోజువారీ జీవన క్రమంలో జరిగిన సంఘటనలన్నీ ఆయన కవితా వస్తువులే. అట్లాగే ఆయా సంఘటనలు ఆయనలో కలిగించిన కదలికలన్నీ కవితలుగా రూపొందాయి.

కవిత్వంపై కవితలూ ఉన్నాయి.

*ఒక మహాకావ్య సంకల్పంతో ఉన్న హృదయం*
*లోపలి సత్యంతో స్వర్ణమొ, రజతమొ,*
*ఇనుమొ, మట్టియొ, మరొకటొ ఇష్టమైంది*
*కష్టమైనా సాధించేయత్నం ఘనకార్యమే.*

***

*కవితకు వస్తుభేదం లేదు, విషయవైరం లేదు*
*శబ్దంలో దిగిన భావజగం ప్రజలందరి సొత్తు*
*కొత్తదనం స్వేచ్ఛలో ముందుకు నడిపిస్తుంది*

### 4

కవి తొలినాళ్లలో స్వేచ్ఛాకవిత్వ ప్రియుదయ్యాడు. అదే సమయంలో చక్కని పద్యం కూర్చగలిగిన నేర్పు సాధించాడు. పద్యమూ, వచన పద్యమూ, సమ స్థాయిలో నడపగలిగిన పరిణతి ఆయన సొంతం. కవిత్వ శైలికి ఉదాహరణలివ్వదలచుకుంటే దానికెంతో శ్రమించాలి. గ్రంథమంతా ఉదాహరణీయమే. మచ్చుకు ఒకటి రెండు మాత్రమే చూపగలం. తెలంగాణ-నేడు ఆహ్వానపత్రం అన్న కవితాఖండికలో ఐదు వృత్తాలున్నాయి.

*ఇది తెలంగాణ శాంతిని వరించిన ఉద్యమ భావదీప్తితో*

*ఎద విజయమ్ము తథ్యమని నిన్న జనాళి ప్రతిధ్వనింపగా*

*అది సఫలమ్మునై ఇపుడు పౌరహృదంతరతేజమై నిశా*

*వదనము దూరమై ఉషస్సు స్వర్ణమయాకృతి నొందె! స్వచ్ఛమై*

ఇంత అందమైన ఛందోబద్ధ పద్యమల్లే కవి ఆ పద్యాల అకర్షణలో పడిపోలేదెందుకో. 'ఏ ఛందస్సు లేని కవిత్వాన్ని నిర్వహించడం కష్టమైన పనే' అంటాడాయనొక చోట. బహుశా అందుకే ఛందోబద్ధం కాని రచన మీదే దృష్టి కేంద్రీకరించారేమో.

### 5

రంగారావుగారి కవిత్వంలో ముక్తకాలూ, మినీ కవితలూ కూడా ఉన్నాయి. కొన్ని మూడేసి పంక్తులవి, మరికొన్ని నాలుగేసి పంక్తులవి. మూడు నాలుగు పంక్తుల్లో భావం చెప్పే సందర్భాలు చాలావరకు నీతిబోధకాలు, సందేశ ద్యోతకాలు. ముచ్చటగా మూడు పంక్తుల్లో ఈ కవి చూపించిన భావచిత్రాలెన్నో!

*ఒడ్డునున్న పడవపైన వాలిన విహంగం*
*మరో ఒడ్డుకు చేరేను బహుసులభంగా*
*రెక్కలున్న ప్రాణికి దొరక సరదా! మనిషికి న్యూనం.*

***

*కాలం నిలవదు, బ్రతుకులు ఆగవు*
*నడక ఆగితే నీడ ఆగేను*
*రూపమదే పొడుగు పొట్టి సైజులలో*

***

*అందకుండ పోయేవెన్నో*
*తెలియకుండ జరిగేవెన్నో*
*అనుభవ స్పందనలో గాథలు*

***

*పక్షి ఎగిరి చెట్టుపై గూడును చేరేను*
*పదం తరలి కవితలో చోటును పొందేను*
*పక్షికి నింగితో,*
*కవితకు భూమితో బంధం తెగనిది*

### 6

ఆధునిక తెలుగు సాహిత్యంలో ఎన్నో ఉద్యమాలు వచ్చాయి. ధోరణులు వచ్చాయి. రాజకీయ, సామాజిక పరిస్థితులు, వ్యక్తిపర, సమాజపర, వర్గపర సిద్ధాంతాల ఆధారంగా విస్తారమైన సాహిత్యం వచ్చింది. మాదిరాజు రంగారావుగారు వీటిలో దేనికీ పూర్తిగా కట్టుబడిపోలేదు, అలాగని దేనినీ వ్యతిరేకించలేదు. దేనివైపూ మొగ్గుచూపలేదు, దేనినీ తిరస్కరించలేదు. మానవ శ్రేయస్సు, మానవ సంక్షేమం, మానవాభివృద్ధి ఆయన ఆశయం. సహృదయ మానవుడాయన. స్వేచ్ఛతో పాటు ఆయన కవిత్వంలో స్వచ్ఛత చోటుచేసుకుంది. కౌమార దశనుండి పరమపదం చేరుకునే వరకు ఆయన తనలో ఈ స్వచ్ఛతను కాపాడుకున్నారు. రాస్తూనే ఉన్నారు. విరామమెరుగనిది ఆయన కలం.

ఆయనే ఒక ముక్తకంలో పలికినట్లు–

*'సృజన కృతికి ముగింపు ఉన్నదా? లేదనే*
*క్రాంతి దర్శనంలో శాంతి ప్రయాణంలో*
*మనిషి జీవితం వలెనే ఇంకెంతో మిగిలిపోయి'*

ఆయన ఈ పంక్తులకు ఆయనే ఉదాహరణ.

### 7

మాదిరాజు రంగారావు గారితో నాకు ప్రత్యక్ష పరిచయంలేదు. ఆయననెన్నడూ చూడలేదు. ఆయన కవిత్వంతో మాత్రమే నాకు పరిచయం. ఆయన స్వేచ్ఛాకవిత్వం ఎప్పటికిప్పుడు పోస్టులో నాకందుతూ ఉండేది. చదువుతూ ఉండేవాణ్ణి, కాని వాటిపై ఆయనకు నా అభిప్రాయాన్ని తెల్పుతూ ఎన్నడూ ఒక్క ఉత్తరం కూడా రాయలేదు. వ్యాసమూ రాయలేదు. ఆయనతో ఫోనులో కూడా ఎప్పుడూ మాట్లాడే అవకాశం కలగలేదు. ఆయన కవిగా బహిర్ముఖుడే తప్ప వ్యక్తిగా అంతర్ముఖుడేమో. ఆయన పెద్దవాడు. నాలోని సహజమైన సంకోచం నా కడ్డు వచ్చి ఉంటుంది.

1987లో నా సిద్ధాంతవ్యాస పరీక్షకులు ముగ్గురిలో రంగారావు గారొకరు. నా సిద్ధాంత వ్యాసంపై ఆయన నివేదికలో దాన్ని మెచ్చుకోవడమే కాక దానికి వైవా అవసరం లేదనీ, వైవా లేకుండానే డిగ్రీ అవార్డు చేయవచ్చుననీ రాశారు. కాని విశ్వవిద్యాలయ నిబంధనలు దీనికి అంగీకరించవు కాబట్టి ఉస్మానియా విశ్వవిద్యాలయం వైవా నిర్వహించడానికి రావలసిందిగా ఆయనను రెండు మూడుసార్లు కోరింది. అయినా ఆయన తన మాటను పునరుద్ఘాటించారే తప్ప అంగీకరించక పోవడంతో, మరో పరీక్షకుని పిలిచి ఆ తతంగం ముగించింది విశ్వవిద్యాలయం.

ఆయన అనంతరమే నేనిలా అయన గురించి ఒక వ్యాసం రాయవలసి వచ్చినందుకు విచారిస్తున్నప్పటికీ ఆయనను తలచుకొనే ఒక అవకాశం లభించినందుకు సంతోషిస్తున్నాను.

మాదిరాజు రంగారావుగారి స్వేచ్ఛా కవిత్వం 9వ సంపుటం గురించి వ్యాసం రాసే అవకాశం కల్పించిన శ్రీకృష్ణదేవరాయ తెలుగు భాషానిలయం గౌరవ కార్యదర్శి బి.ఉదయవర్లు గారికి కృతజ్ఞతలు.

ం



# మాదిరాజు సమాలోచనం - సాహిత్య దర్శనం

**- డా. అట్టెం దత్తయ్య**

ఆచార్య మాదిరాజు రంగారావు ఆధునిక తెలుగు సాహిత్యంలో స్వేచ్ఛా కవిత్వం, సమాలోచన, తాత్త్విక చింతన, మానవతా దృక్పథం, ప్రజాస్వామ్య చైతన్యాలను సమన్వయపరచిన ప్రముఖ కవి, విమర్శకుడు, పరిశోధకుడు. 1935 డిసెంబర్ 7న ఖమ్మం సమీపంలోని పండితాపురం గ్రామంలో జన్మించిన ఆయన ఉస్మానియా విశ్వవిద్యాలయంలో సంస్కృతం, తెలుగుల్లో ఎం.ఏ. పట్టాలు పొంది, తెలుగు సాహిత్యంలో పీహెచ్.డి. సాధించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం, కాకతీయ విశ్వవిద్యాలయాలలో అధ్యాపకునిగా, తెలుగు శాఖాధ్యక్షునిగా విశిష్ట సేవలందించారు. 1953 నుండి తెలుగు సాహిత్యంలో కవిత్వం, విమర్శ, పరిశోధన రంగాల్లో నిరంతర సృజన కొనసాగిస్తూ, వందల గ్రంథాలను వెలువరించారు. ఆయన స్వేచ్ఛా కవిత్వంలో ప్రజాస్వామ్య భావజాలం, సామాజిక వాస్తవికత, మానవీయ స్పృహ, కాలచైతన్యం ప్రతిఫలిస్తే, సమాలోచనలో కవి వ్యక్తిత్వం, సాహిత్య సౌందర్యం, మానవత, విశ్వభావన, సృజనశిల్పంపై లోతైన పరిశీలన దర్శనమిస్తుంది. వీరి వివిధకృతుల ద్వారా ఆధునిక తెలుగు స్వేచ్ఛా కవిత్వానికి ప్రత్యేకమైన వ్యక్తిత్వాన్ని చేకూర్చారని చెప్పవచ్చు.

రంగారావు రాసిన వందల పుస్తకాలలో ఒకటి 'సమాలోచనం సాహిత్య వ్యాసాలు' అనేది. ఇందులో మొత్తం 15 వ్యాసాలున్నాయి. చివరలో వారి ముఖాముఖి వారి సాహితీ ప్రస్థావనను తెలియ జేస్తుంది. ఇందులో గల ప్రతి వ్యాసం ఒక పత్యేకతను కలిగి ఉంది అని చెప్పుకోవచ్చు. ఈ పుస్తకాన్ని 2019లో పునర్ముద్రించారు. ఈ వ్యాసాలు భారతీయ సాహిత్య సంప్రదాయంలో తాత్త్వికత, భక్తి, మానవత, సౌందర్యం, సామాజిక చైతన్యం, ఆధ్యాత్మిక అనుభూతి వంటి విభిన్న భావప్రవాహాలు పరస్పర సమన్వయంతో అభివృద్ధి చెందిన విషయాలను తెలియజేస్తాయి. వేద-ఉపనిషత్తుల ఆత్మతత్త్వం నుండి ఆధునిక మానవతా దృక్పథం వరకు విస్తరించిన ఈ సాహిత్యయాత్రలో కవిత్వం కేవలం కళారూపం మాత్రమే కాక, జీవనదర్శనం, ఆత్మాన్వేషణ, సమాజ చైతన్యం, సంస్కృతీ పరిరక్షణకు మార్గదర్శక శక్తిగా నిలిచాయని నిరూపిస్తాయి. రవీంద్రుడి గీతాంజలిలోవిశ్వమానవ అనుభూతి, అరవిందుని సావిత్రిలో ఆధ్యాత్మిక ఆరోహణ, రాయప్రోలు సుబ్బారావు కవిత్వంలో అమలిన ప్రేమతత్త్వం, గుర్రం జాషువారచనల్లో మానవ సమానత్వం, శంకరాచార్య సౌందర్యలహరి లో శక్తి తత్త్వం, డెరెక్వోల్కాట్ సాహిత్యంలో జాతి-సాంస్కృతిక చైతన్యం వంటి అనేక భావ ప్రపంచాలు ఈ వ్యాసాలలో ప్రతిఫలించాయి.

మాదిరాజు రంగారావు గీతాంజలిని 'రవీంద్రుని గీతాంజలి - అనుభూతి కళ' వ్యాసంలోతాత్త్విక - ఆధ్యాత్మిక సాహిత్య దృక్పథంతో పరిశీలించాడు. 'గీతాంజలి'లో భక్తి, ఆత్మానుభూతి, విశ్వచైతన్యం, మానవతా భావన, ఉపనిషత్తుల తత్త్వం వంటి అంశాలను విశ్లేషించారు. దీనిని కవితా సంపుటిగా మాత్రమే చూడకుండా, వ్యక్తి నుండి విశ్వాత్మ వైపు పయనించే ఆత్మసాధనగా చిత్రించాడు. అట్లాగే రచయిత దీనిని అనుభూతి ప్రధాన సాహిత్య దృక్పథంతోకూడా చూశాడు. కవిత్వం ఏ సిద్ధాంతాన్నీ బోధించకుండా, దివ్యానుభూతిని కళాత్మకంగా వ్యక్తీకరించిందని పేర్కొన్నాడు. The God is there where the tiller is tilling వంటి భావాల ద్వారా దైవత్వాన్ని వాస్తవ జీవితంలో దర్శించాడు. సంగీతం, ప్రకృతి, మానవ ప్రేమ, స్వేచ్ఛ, శాంతి వంటి ప్రతీకల ద్వారా గీతాంజలిని విశ్వమానవీయ దృక్పథంతో కూడిన తాత్త్విక కళాఖండంగా రచయిత విశ్లేషించాడు.

'అరవిందుల సావిత్రి'ని మాదిరాజు రంగారావు ఇతిహాసంగా కాకుండా, మానవాత్మ యొక్క ఆరోహణ యాత్రగా, మృత్యువుపై దివ్యచైతన్యం సాధించిన విజయంగా విశ్లేషించాడు. సావిత్రి పాత్రను విశ్వమాత అవతారంగా, జ్ఞానం-వెలుగు-అమృతత్వాలకు ప్రతీకగా చిత్రించాడు. "విధి సూత్రాలు మారవచ్చు కాని నా ఆత్మ సంకల్పం మారదు" అనే భావం ద్వారా మానవ సంకల్పబలం, ఆత్మసాధన, దివ్యచైతన్య శక్తి ప్రధానమని రచయిత చూపించాడు. సావిత్రి-సత్యవంతుల కథను లౌకిక స్థితి నుండి అలౌకిక దివ్యస్థితికి తీసుకెళ్లే ఆధ్యాత్మిక ప్రయాణంగా వారి వ్యాసం ద్వారా అర్థం చేయించాడు.అదేవిధంగా ఈ కావ్యాన్ని మార్మిక - ఆదర్శవాద దృక్పథంతో కూడా చూశాడు. సావిత్రిని ధర్మం, ప్రేమ, సత్యం, త్యాగం, శక్తి, మానవోన్నతి వంటి విలువల సమాహారంగా చిత్రిస్తూ, స్త్రీశక్తి పరమ రూపంగా విశ్లేషించాడు. మృత్యువును జయించడం, చీకటి నుండి వెలుగుకి ప్రయాణం, అజ్ఞానం నుండి జ్ఞానానికి ఆరోహణ వంటి ప్రతీకల ద్వారా కావ్యానికి విశ్వమానవీయతాత్త్వికతను ఆపాదించాడు. అందువల్ల వ్యాస రచయిత దృష్టిలో సావిత్రి ఒక మహాకావ్యంగా మాత్రమే కాకుండా, "మానవుడి దివ్యపరిణామాన్ని ప్రతిపాదించే తాత్త్విక ఆధ్యాత్మిక జగద్గీతం"గా నిలిచింది.

వ్యాస రచయిత రాయప్రోలు సుబ్బారావు కవిత్వాన్ని 'రాయప్రోలు నవ్య కవిత్వ వ్యక్తిత్వం'లో సంప్రదాయ భారతీయ వేదాంత భావనలను ఆధునిక భావజాలంతో మేళవించి, రాయప్రోలు కవిత్వాన్ని 'సంప్రదాయ, నవ్యతల సమన్వయ రూపం'గా విశ్లేషించాడు. రాయప్రోలు కవిగా

మాత్రమే కాకుండా, కవిత్వాన్ని తపస్సుగా భావించిన సాహిత్య సాధకుడిగా పేర్కొంటాడు. ప్రేమ, ప్రకృతి, ఆత్మ, చైతన్యం, అంతఃకరణ సౌందర్యం వంటి అంశాలను తాత్త్విక పరిమళంతో చిత్రించిన కవిగా రచయిత ఈ వ్యాసంలో పొందు పరిచాడు. ముఖ్యంగా "అమలిన శృంగార తత్త్వం" ద్వారా ప్రేమను శారీరక స్థాయిని దాటి మానసిక-ఆధ్యాత్మిక స్థాయికి తీసుకెళ్లిన కవిగా రాయప్రోలు వ్యక్తిత్వాన్ని అభివర్ణించాడు. రాయప్రోలు సాహిత్యాన్ని మానవతా - సంస్కరణ దృక్పథంతో కూడా విశ్లేషించాడు. దేశభక్తి, ఆర్ష సంస్కృతి, స్త్రీ పట్ల గౌరవం, దాంపత్య ధర్మం, సామాజిక సంస్కరణ, మానవ ప్రేమ వంటి విలువలను ఆయన కవిత్వంలో ప్రధానంగా గుర్తించాడు. ముఖ్యంగా 'తృణకంకణం' కావ్యాన్ని ఆధారంగా తీసుకొని, ప్రేమను "స్నేహసౌందర్యం"గా, "శుచిత్వంతో కూడిన మానసిక అనుబంధం"గా చిత్రించిన అభినవ దృక్పథాన్ని వివరించాడు.

రచయిత 'అహంకార కళ-అభివ్యక్తి శిల్పం' వ్యాసాన్ని ప్రధానంగా సాహిత్య-మనోవైజ్ఞానిక దృక్పథంతో పరిశీలించాడు. కవిలోని అహంకారాన్ని సాధారణ దుర్గుణంగా కాకుండా, సృజనాత్మక శక్తికి మూలమైన ఆత్మవిశ్వాసంగా భావించాడు. కవిత్వంలో 'నేను' అనే వ్యక్తిత్వ స్ఫూర్తి కళాత్మక రూపాన్ని పొందినప్పుడు అది "అహంకార కళ"గా మారుతుందని రచయిత వివరిస్తాడు. ముఖ్యంగా విశ్వనాథ సత్యనారాయణ రాసిన "అల నన్నయ్యకు లేదు తిక్కనకు లేదా భోగమస్మాదృశుండ..." అనే పద్యాన్ని ఉదాహరణగా తీసుకొని, కవి ఆత్మప్రత్యయం, గురుభక్తి, వాగ్వైచిత్రి, రసస్ఫూర్తి కలిసి ఎలా కళాత్మక అభివ్యక్తి శిల్పంగా మారాయో విశ్లేషించాడు. అట్లాగే అహంకార కళను వ్యాస రచయిత ఆలంకారిక-రసతాత్త్విక దృక్పథంతో కూడా చూశాడు. అహంకారం కవిత్వంలో వాగ్విలాసం, భావచమత్కారం, శిల్పసౌందర్యం, వ్యక్తిత్వ ప్రకాశం రూపంలో వ్యక్తమవుతుందని పేర్కొన్నాడు. కవి తనను తాను అతిశయోక్తితో వ్యక్తీకరించినా, అది రసరమణీయతతో కూడిన కళారూపమైతే సహృదయులను ఆకర్షిస్తుందని అభిప్రాయపడ్డాడు.

'జాషువా ఆధునిక కవిత్వ వ్యక్తిత్వం' వ్యాసాన్ని రంగారావు మానవతా - సామాజిక దృక్పథంతో పరిశీలించాడు. జాషువా కవిత్వంలో దళితులు, పీడితులు, తిరస్కృతులు, శ్రమజీవులు వంటి అట్టడుగు వర్గాల బాధలను కేవలం వర్ణించడమే కాకుండా, వారి పక్షాన నిలిచిన కవి వ్యక్తిత్వాన్ని రచయిత విశ్లేషించాడు. ముఖ్యంగా 'గబ్బిలం' వంటి రచనల ద్వారా అస్పృశ్యత, దారిద్ర్యం, సామాజిక అసమానత, శ్రమ దోపిడీ వంటి సమస్యలను మానవీయ కరుణతో ప్రతిబింబించిన కవిగా జాషువాను చూశాడు. *"వాని రెక్కల కష్టమ్ము లేనివాడు..."* వంటి పంక్తుల ద్వారా శ్రమజీవి దుస్థితిని, *"వాని తలమీద పులిమిన పంకిలమ్ము..."* ద్వారా దళిత జీవితాలపై ఉన్న సామాజిక మచ్చను రచయిత విశదీకరించాడు. అట్లాగే జాషువా కవిత్వాన్ని ప్రగతిశీల - దళిత చైతన్య దృక్పథంతో కూడా చూసినట్లు కనిపిస్తుంది. జాషువాలో గాంధీజీ ప్రభావం, సమానత్వ భావన, విశ్వమానవత, కులమత విభేదాలకు వ్యతిరేకమైన దృక్పథం ప్రధానంగా గుర్తించాడు. "విశ్వనరుడ నేను" అనే భావన ద్వారా జాషువా కవిత్వం కుల, మత, వర్గ పరిమితులను అధిగమించి సార్వజనీన మానవత్వాన్ని ప్రతిపాదించిందని పేర్కొన్నాడు.



*పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో జరిగిన సాహితీ పురస్కార ప్రదానోత్సవం కార్యక్రమంలో ఆచార్య మాదిరాజు రంగారావు గారిని ఉత్తమ ఆధునిక కవిత్వం పురస్కారంతో సన్మానించిన దృశ్యం (జూలై 13, 1994)*

'మహైక- కవిరాజు మూర్తి అభ్యుదయ దృష్టి' వ్యాసంలో రచయిత 'మహైక' అభ్యుదయ - మార్క్సిస్టు సాహిత్య దృక్పథంతో పరిశీలించాడు. సమాజంలోని పీడితులు, కార్మికులు, మధ్యతరగతి ప్రజలు, పతితుల దుస్థితిని వర్గసంఘర్షణ కోణంలో విశ్లేషిస్తూ, సామాజిక మార్పు అవసరాన్ని ప్రతిపాదించాడు. "కర్మఫలం కాదు కాదు..." వంటి పంక్తుల ద్వారా కర్మసిద్ధాంతం పేరుతో జరిగే దోపిడీని విమర్శించాడు. *"పతితునిగుండియ క్రక్కిన క్రోధం..."* అనే భావం ద్వారా పీడిత వర్గాల్లో విప్లవ చైతన్యం అనివార్యమని రచయిత గుర్తించాడు. ఈ కావ్యంలో శిథిలమైన పాత సమాజవ్యవస్థ స్థానంలో సమానత్వం, సౌభ్రాతృత్వం కలిగిన నవసమాజం రావాలనే అభ్యుదయ ఆశయం వ్యక్తమైందని పేర్కొన్నాడు. అంతేకాకుండా దానినిమానవతా-సామాజిక వాస్తవిక దృక్పథంతో కూడా చూశాడు. కార్మికుడు, మధ్యతరగతి వ్యక్తి, పతిత వంటి పాత్రల ద్వారా ఆకలి, దారిద్ర్యం, అన్యాయం, దోపిడీ, నిరాశ వంటి వాస్తవ జీవిత సమస్యలను కవిత్వంలో ప్రతిబింబించిన తీరు విశ్లేషించాడు. "మనమంతా మానవులం ఏకవృక్షభాగాలం" వంటి భావాల ద్వారా విశ్వమానవ సౌభ్రాత్రాన్ని కవి ప్రతిపాదించాడని చెప్పాడు. రచయిత దృష్టిలో మహైక ఒకవిప్లవకావ్యమేకాదు; ఆశ, సంఘర్షణ, మానవ చైతన్యం, సమానత్వం వైపు పయనించే సామాజిక దర్శన కావ్యం. శ్రీశ్రీ ప్రభావంతో పాటు T. S. Eliot శిల్ప ప్రభావ సూచనలున్నప్పటికీ, మహైక తన స్వంత అభ్యుదయ వ్యక్తిత్వాన్ని నిర్మించుకున్న కవితా రూపమని రచయిత స్పష్టం చేశాడు.

'అవధానం - ఒక కవిత్వ క్రీడ' వ్యాసంలో అవధానం ఒకపద్యరచన ప్రదర్శన మాత్రమే కాకుండా, అది కవి ప్రతిభ, ధారణ, స్మరణ, చమత్కార బుద్ధి, హాస్యస్ఫూర్తి, భాషా నైపుణ్యం, అభివ్యక్తి శక్తి కలిసిన సాహిత్య కళారూపమని విశ్లేషించాడు. సభలో పృచ్ఛకుల ప్రశ్నలకు తక్షణ స్పందనతో పద్యరూపంలో సమాధానమివ్వడం ద్వారా అవధానం "కవిత్వ క్రీడ"గా రూపు దిద్దుకుంటుందని పేర్కొన్నాడు. ముఖ్యంగా "ఇన్‌స్టంట్‌క్రికెట్"తో పోల్చి, పరిమిత సమయంలో కవి తన ప్రతిభను ప్రదర్శించాల్సి ఉంటుందని చెప్పడం ద్వారా అవధాన కళలోని సృజనాత్మక ఉత్కంఠను స్పష్టం చేశాడు.

మాదిరాజు రంగారావు 'పోతన భాగవతం - - భూమిక' వ్యాసంలో భాగవతాన్ని తాత్త్విక-భక్తి



*జీవిత భాగస్వామితో...*

సాహిత్య దృక్పథంతో పరిశీలించాడు. పోతన భాగవతాన్ని పురాణకథల సమాహారంగా కాకుండా, భక్తి, పరతత్త్వం, మోక్షం, ఆత్మాన్వేషణ వంటి ఆధ్యాత్మిక విలువలను ప్రతిపాదించే మహాకృతిగా విశ్లేషించాడు. నన్నయ, తిక్కన, పోతన, విశ్వనాథుల రచనల్లో ప్రవహించిన 'పరతత్త్వాన్వేషణ' ఒక తత్త్వప్రవాహమని రచయిత పేర్కొన్నాడు. ముఖ్యంగా పోతన భాగవతంలో భక్తియోగం, అద్వైత భావన, భగవద్భక్తి, మానవ–దివ్య సంబంధం సమన్వయమై ఉన్నాయని చెప్పాడు. అలాగే రచయిత భాగవతాన్నిసాంస్కృతిక–మానవతా దృక్పథంతో కూడా చూశాడు. పోతన భాగవతం తెలుగు జాతి సంస్కృతీ వారసత్వంలో భాగమై, యుగయుగాలుగా ప్రజల మనోభూమికలో నిలిచిన మహాగ్రంథమని అభిప్రాయపడ్డాడు. ఆధునిక యుగంలో హేతు వాదం, శాస్త్రీయ దృష్టి పెరిగినా, భాగవతం లోని మానవీయ కోణం, మనస్తత్వ వైవిధ్యం, ప్రకృతి–మనిషి–ప్రపంచ సంబంధాల చిత్రణ ఇప్పటికీ ప్రాసంగికమని చెప్పాడు. గజేంద్ర మోక్షం, ప్రహ్లాద చరిత్ర, కుచేలోపాఖ్యానం వంటి కథల ద్వారా మానవుని భయం, భక్తి, సంఘర్షణ, శాంతి, ఆనందం వంటి విశ్వమానవీయ భావాలను పోతన కళాత్మకంగా ప్రతిష్ఠించాడని రచయిత విశ్లేషించాడు. అందువల్ల ఆయన దృష్టిలో పోతన భాగవతం భక్తి, తత్త్వం, కళ, రసానుభూతి, మానవతా విలువలు సమన్వయమైన శాశ్వత మహాకృతి.

'సీతారామాంజనేయ సంవాదం – కవిత్వ స్ఫూర్తి' వ్యాసంలో రంగారావు ఆ గ్రంథం పరమోద్దేశం "జీవ–బ్రహ్మ ఐక్య నిరూపణ" అని రచయిత స్పష్టం చేశాడు. సీతను మాయగా, రాముడిని పరబ్రహ్మంగా, ఆంజనేయుడిని ముముక్షువైన జీవుడిగా భావిస్తూ, ఈ మూడు భావ స్థానాల ఆధారంగా గ్రంథ నిర్మాణం జరిగిందని వివరించాడు. రచయిత దృష్టిలో ఆ గ్రంథాన్ని ఒక కావ్యంగామాత్రమే కాకుండా, వేదాంత, యోగ, బ్రహ్మతత్త్వాలనుపద్యరూపంలో ప్రజలకు సులభంగా అందించిన 'తత్త్వకావ్యం'. "రాముడు నిర్వికారుడు నిరామయుడు..." వంటి పద్యాల ద్వారా రాముడిని పరబ్రహ్మ స్వరూపంగా చిత్రించిన తాత్త్విక భావనను విశ్లేషించాడు.

అట్లాగే రచయిత దీనినికవిత–శాస్త్ర సమన్వయ దృక్పథంతోకూడా చూశాడు. గహనమైన యోగశాస్త్ర, వేదాంత విషయాలను క్లిష్టత లేకుండా, శిల్పసౌందర్యంతో, పద్యరూపంలో చెప్పగలిగిన కవి ప్రతిభను ప్రశంసించాడు. "జ్ఞానోదయ వర్ణన", "చిత్కళా మండల వర్ణన" వంటి సందర్భాల్లో ప్రకృతి చిత్రణ, యోగతత్త్వం, కవిత్వస్ఫూర్తి కలిసిన శైలిని ప్రత్యేకంగా గుర్తించాడు. రచయిత అభిప్రాయం ప్రకారం ఈ గ్రంథంలో ప్రధాన లక్ష్యం శాస్త్రబోధ అయినప్పటికీ, అక్కడక్కడా మెరుస్తున్న కవితాత్మక శిల్పం దానిని సాహిత్య విలువ కలిగిన ఆధ్యాత్మిక కావ్యంగా నిలబెట్టింది.

ఈ గ్రంథంలో 10వ వ్యాసం 'స్ఫోటం–ధ్వని సిద్ధాంతం'. ఆనందవర్ధనుని ధ్వని సిద్ధాంతానికి మూలంగా ఉన్న 'స్ఫోటవాదం'ను వ్యాకరణశాస్త్ర పరంగా విశ్లేషిస్తూ, "కావ్యస్యాత్మాధ్వనిః" అనే ప్రతిపాదనను భారతీయ సాహిత్య తత్త్వంలో అత్యున్నత సిద్ధాంతంగా అభివర్ణించాడు. వాచ్యార్థం కన్నా 'వ్యంగ్యార్థం' ముఖ్యమని, మహాకవుల వాక్యంలో ప్రత్యక్షార్థానికి మించి 'ప్రతీయమానార్థం' సహృదయునికి ఆనందానుభూతిని కలిగిస్తుందని రచయిత వివరిస్తాడు. "యత్రార్థఃశబ్దో వాతమర్థముపసర్జనీకృతస్వార్థావ్యక్తిః..." అనే ధ్వని నిర్వచనాన్ని ఆధారంగా తీసుకొని, కావ్యంలో అంతఃస్ఫూర్తిగా వెలిగే భావవ్యంజక శక్తినే ధ్వనిగా పేర్కొన్నాడు. అట్లాగే వ్యాకరణశాస్త్రంలోని 'స్ఫోట' భావనను శబ్దబ్రహ్మ తత్త్వంతో అనుసంధానిస్తూ, వర్ణాల అనుభవం ద్వారా అర్థస్ఫురణ కలిగే ప్రక్రియను విశ్లేషించాడు. "స్ఫుటత్యర్థోఅస్మాదితిస్ఫోటః" అనే భావన ద్వారా శబ్దం అర్థాన్ని స్ఫుటపరచేనిత్యశక్తిగా చిత్రితమైంది. ఆనందవర్ధనుడు ఈ స్ఫోట భావనను కావ్యశాస్త్రంలో "వ్యంగ్యార్థ భాసురమైనధ్వని"గా వికసింపజేశాడని రచయిత పేర్కొన్నాడు.

వ్యాస రచయిత "అమృత స్పర్శ –ఆత్మతత్త్వం" ను గీతలోని ఆత్మతత్త్వాన్ని ఆధారంగా తీసుకొని, మానవుడు జన్మ–కర్మ–వర్ణ–జాతి భేదాలకు అతీతమైన ఆత్మస్వరూపుడని వివరించాడు. భగవదనుగ్రహం 'అమృతస్పర్శ'గా వ్యక్తి అంతరంగాన్ని ప్రకాశింపజేస్తుందని, ఆత్మోన్ముఖత, సంస్కారం, సాధన, భక్తి, గురూపదేశం ద్వారా వ్యక్తి దివ్యత్వాన్ని పొందగలడని రచయిత విశ్లేషించాడు. "దుర్లభం త్రయమేవైతత్..." వంటి శ్లోకాల ఆధారంగా ముముక్షుత్వం, మహాపురుష సమాశ్రయం, ఆత్మవిద్యలను మానవ జీవితంలోని పరమ సాధనాలుగా ప్రతిపాదించాడు. భగవత్కృపను వెలుగుతో, మాతృస్పర్శతో, అమృతానుభూతితో పోల్చడం ద్వారా రచయిత ఆధ్యాత్మిక అనుభూతిని సున్నితమైన తాత్త్విక రూపంలో చిత్రించాడు. అట్లాగే ఇంకా దీనిని మానవతా – మనోవైజ్ఞానిక దృక్పథంతో కూడా చూశాడు. ఉపకార స్వభావం, ఉదారత, త్యాగం, మానవత్వం వంటి సద్గుణాలు ఆత్మోన్నతికి పునాదులని పేర్కొన్నాడు. మానవ జీవితం ప్రకృతి–మనిషి–చైతన్యాల పరస్పర సంబంధ రూపమని, వ్యక్తిలో సామాజిక శ్రేయస్సు మరియు ఆధ్యాత్మిక శ్రేయస్సు అనే రెండు తలాలు నిరంతరం పనిచేస్తాయని విశ్లేషించాడు. ఆధునిక సంక్లిష్ట జీవితంలో మనోమాలిన్యాన్ని తొలగించి, స్వచ్ఛత, వెలుగు, ఋజుత్వం వైపు నడిపించే శక్తిగానే "అమృతస్పర్శ"ను రచయిత భావించాడు.

వ్యాస రచయిత గీతను "మానవుని కీర్తి శిఖరం"గా భావిస్తూ, అది మతగ్రంథంగా మాత్రమే కాకుండా, మానవ చైతన్య వికాసానికి మార్గదర్శకమైన విశ్వతాత్త్విక గ్రంథమని విశ్లేషించాడు. ఆత్మ, కర్మ, పునర్జన్మ, మోక్షం, ధర్మం, భక్తి, జ్ఞానం, యోగం వంటి భారతీయ తత్త్వప్రపంచంలోని మౌలిక భావనలను సమన్వయపరిచిన గ్రంథంగా గీతను అభివర్ణించాడు."యదాయదాహిధర్మస్య..." వంటి శ్లోకాల ఆధారంగా ధర్మరక్షణ కోసం భగవంతుడు అవతరించే విశ్వనియమాన్ని రచయిత వివరించాడు. అర్జునుని సంశయం నుండి ధైర్యానికి, నిరుత్సాహం నుండి కర్తవ్యచైతన్యానికి నడిపించిన శ్రీకృష్ణుని ఉపదేశాన్ని మానవ జీవిత సంఘర్షణలకు తాత్త్విక పరిష్కారంగా చూపించాడు.గీతలోని తత్త్వం వ్యక్తిగత మోక్షానికే పరిమితం కాకుండా, సమాజ శాంతి, విశ్వమానవత, ధర్మబద్ధ జీవనం, మానసిక సమత వంటి విలువలకు పునాదిగా నిలుస్తుందని పేర్కొన్నాడు. ప్రేమ, కరుణ, సానుభూతి, ఉదారత వంటి విశ్వజనీన భావజాలంతో గీత భారతీయ సంస్కృతికి ప్రాతినిధ్యం వహించిందని చెప్పాడు. ఆధునిక విజ్ఞానశాస్త్ర యుగంలో కూడా మానవుని అంతరంగ సంక్షోభాలకు సమాధానం చూపగలిగిన ఆధ్యాత్మిక–నైతిక గ్రంథంగా గీతను రచయిత చూశాడు. అందువల్ల ఆయన దృష్టిలో గీత ఒక మతగ్రంథం మాత్రమే కాదు;

*'జాషువా ఆధునిక కవిత్వ వ్యక్తిత్వం' వ్యాసాన్ని రంగారావు మానవతా - సామాజిక దృక్పథంతో పరిశీలించాడు. జాషువా కవిత్వంలో దళితులు, పీడితులు, తిరస్కృతులు, శ్రమజీవులు వంటి అట్టడుగు వర్గాల బాధలను కేవలం వర్ణించడమే కాకుండా, వారి పక్షాన నిలిచిన కవి వ్యక్తిత్వాన్ని రచయిత విశ్లేషించాడు. ముఖ్యంగా 'గబ్బిలం' వంటి రచనల ద్వారా అస్పృశ్యత, దారిద్ర్యం, సామాజిక అసమానత, శ్రమ దోపిడీ వంటి సమస్యలను మానవీయ కరుణతో ప్రతిబింబించిన కవిగా జాషువాను చూశాడు.*



**కుటుంబంతో...**

మానవజాతిని ఆత్మోన్నతి, శాంతి, ధర్మం, విశ్వచైతన్యం వైపు నడిపించే శాశ్వత తత్త్వదర్శనం.

ఉపనిషత్తులను 'బ్రహ్మవిద్య','ఆత్మవిజ్ఞానం'ల పరమోన్నత రూపాలుగా భావిస్తూ, జీవుడు-పరమాత్మ-పరబ్రహ్మ ఐక్యాన్ని ప్రతిపాదించే శాశ్వత తత్త్వసంపదగా 'ఉపనిషద్భావన- ఈనాటి అవసరం' అనే వ్యాసంలో మాదిరాజు విశ్లేషించాడు. జీవతత్త్వం, మోక్షం, జ్ఞానమార్గం, ఆత్మసాక్షాత్కారం వంటి అంశాలను మానవ వికాసానికి మార్గదర్శకాలుగా పేర్కొన్నాడు. "ఈశావాస్యమిదం సర్వం..." మంత్రాన్ని ఆధారంగా తీసుకొని జగత్తంతా ఈశ్వర స్వరూపమైందని, త్యాగబుద్ధి, పవిత్రత, స్వార్థ రాహిత్యం ద్వారా మాత్రమే నిజమైన శాంతి-శ్రేయస్సులు సాధ్యమవుతాయని రచయిత వివరిస్తాడు. ఉపనిషత్తులలోని భావజాలం స్థూలం నుండి సూక్ష్మానికి, ఇంద్రియం నుండి అతీంద్రియాని కి, జీవితం నుండి బ్రహ్మానుభూతికి నడిపించే ఆధ్యాత్మిక యాత్రగా చిత్రితమైంది. అట్లాగే దీనిని మానవతా-సామాజిక దృక్పథంతో కూడా చూశాడు.

ఆధునిక సమాజంలో పెరుగుతున్న హింస, స్వార్థం, వంచన, అస్థిరత వంటి సంక్షోభాలకు ఉపనిషత్తుల ప్రబోధం అత్యవసరమని పేర్కొన్నాడు. ఉపనిషత్తులు కేవలం మోక్షశాస్త్రాలు కాకుండా, మానవ సమాజానికి నైతికత, త్యాగశీలం, సత్యాన్వేషణ, విశ్వసౌభ్రాతృత్వం వంటి విలువలను అందించే జీవనదర్శనమని విశ్లేషించాడు. వ్యక్తి, సమాజం రెండింటి శ్రేయస్సు కోసం భౌతిక-ఆధ్యాత్మిక సమన్వయం అవసరమని రచయిత అభిప్రాయ పడ్డాడు.

సౌందర్యలహరినిస్తోత్రరచనగా కాకుండా, శ్రీవిద్య, త్రిపురసుందరీ ఉపాసన, కుండలినీ యోగం, శివ-శక్తి తత్త్వ సమన్వయాన్ని ప్రతిపాదించే ఆధ్యాత్మిక మహాగ్రంథంగామాదిరాజువిశ్లేషించాడు. శక్తిని పరబ్రహ్మ మహిషిగా, జగత్తు యొక్క మూల చైతన్యరూపిణిగా, ఇచ్ఛా-జ్ఞాన-క్రియాశక్తుల సమాహారంగా చిత్రించిన తీరు రచయితకు ముఖ్యమైంది.

"శివశ్శక్త్యాయుక్తోయదిభవతిశక్తఃప్రభవితుం" వంటి శ్లోకాల ద్వారా శివునికి కూడా శక్తి సహకారం ద్వారానే సృష్టిశక్తి సిద్ధిస్తుందని పేర్కొన్నాడు. కుండలినీ శక్తి మూలాధారం నుండి సహస్రారం వరకు ఆరోహణం చెంది శివునితో ఐక్యం పొందే యోగసాధనను రచయిత 'సౌందర్యలహరి శక్తి తత్త్వం' వ్యాసంలో విశదీకరించాడు.

వెస్ట్ ఇండీస్ ప్రజల చరిత్ర, వలసవాద అనుభవం, జాతి వ్యక్తిత్వం, కరేబియన్ సంస్కృతిని ప్రపంచస్థాయిలోప్రతిష్ఠించిన కవిగా వాల్కాట్‌ను విశ్లేషించిన మాదిరాజు వ్యాసం 'డెరెక్ వాల్కాట్- నోబెల్ బహుమతి గ్రహీత'. ముఖ్యంగా Omeros మహాకావ్యాన్ని ఆధారంగా తీసుకొని, కరేబియన్ ప్రజల జీవితం, జానపదం, చరిత్ర, వలసపాలన వల్ల కలిగిన సంఘర్షణలను కళాత్మకంగా ప్రతిబింబించిన రచయితగా వాల్కాట్‌ను అభివర్ణించాడు. All the races of the world are represented in the Caribbean... అనే వాక్యాన్ని ఉదాహరణగా చూపిస్తూ, జాతి ఐక్యత, సాంస్కృతిక సమన్వయం, మానవ ఐక్య భావన వాల్కాట్ సాహిత్యానికి కేంద్రబిందువులని పేర్కొన్నాడు. వలసవాదం, బానిసత్వం, జాత్యహంకారం వంటి అమానవీయ పరిస్థితులను నిరసిస్తూ, మానవ ఐక్యత, సంస్కృతీ గౌరవం, స్వీయ గుర్తింపు, విశ్వమానవత వైపు దారి చూపిన కవిగా వాల్కాట్‌ను విశ్లేషించాడు. You cannot be a poet and believe in division of man అనే భావాన్ని ఆధారంగా తీసుకొని, మానవ విభజనలను అధిగమించి విశ్వభావనను స్థాపించే కవి వ్యక్తిత్వాన్ని రచయిత ప్రశంసించాడు. ప్రకృతి, సముద్రం, ద్వీప జీవితం వంటి ప్రతీకల ద్వారా కరేబియన్ అనుభవాన్ని విశ్వమానవీయ స్థాయికి తీసుకెళ్లిన సృజనాత్మక శక్తిగా వాల్కాట్‌ను వ్యాస రచయిత చిత్రించాడు.

మొత్తం మీద ఈ పదిహేను వ్యాసాలు భారతీయ, విశ్వసాహిత్యాల మధ్య ఉన్న తాత్త్విక, ఆధ్యాత్మిక, మానవతా, సౌందర్య, సామాజిక చైతన్య సంబంధాలను సమగ్రంగా ప్రతిబింబిస్తున్నాయి. ఈ వ్యాసాల సమాహారం ద్వారా సాహిత్యం కేవలం వినోద సాధనం కాదని; అది మానవుని అంతరంగాన్ని మేల్కొలిపే ఆత్మసాధన, సమాజాన్ని చైతన్యపరచే శక్తి, సంస్కృతిని నిలబెట్టే ఆధారం, విశ్వమానవతకు దారి చూపే వెలుగు అని స్పష్టమవుతుంది.

తాత్త్వికత, భక్తి, మానవత, సౌందర్యం, సామాజిక చైతన్యం, కళాత్మక అభివ్యక్తి అనేవి ఈ వ్యాసాలలో సమన్వయమై ఒక సమగ్ర సాహిత్య దర్శనంగా రూపుదిద్దుకున్నాయి. అందువల్ల ఈ వ్యాసాలు తెలుగు సాహిత్య విమర్శలో మాత్రమే కాక, భారతీయ సాహిత్య చింతనలోనూ విలువైన సమాచారంగా నిధులుగా నిలుస్తాయి.

*రచయిత సెల్: 9494715445*

# సామాజిక పరిణామాలు: మాదిరాజు కవిత్వం

- రాచపాళెం చంద్రశేఖరరెడ్డి

*"జీవితం ఫోటోగ్రాఫ్ కాదు ఫ్రేమ్ లో*
*బంధించడానికి*
*ఉదరంలో ఎర్రదనంతో పాటు*
*వివిధవర్ణమయం సమాజం"*

(స్వేచ్ఛాకవిత్వం-1: పు.78)

కాకతీయ విశ్వవిద్యాలయంతో నాకు మిగతా విశ్వవిద్యాలయాల కన్నా అనుబంధం ఎక్కువ. అక్కడి తెలుగు శాఖలోని నాకు ముందుతరంవారు నా గురువు ఆచార్య తుమ్మపూడి కోటీశ్వరరావుగారి ద్వారా పరిచయమైనవారు. వాళ్ళందరూ నాకు గురుతుల్యులు. నాతరం అధ్యాపకులు నాకు మంచి స్నేహితులు. మాదిరాజు రంగారావుగారు నా ముందుతరం ఆచార్యులు. వారితో నాకు పరిచయం పరిమితమే. తెల్లటి మనిషి. తెల్లటి ఆహార్యం. నేను ఏపనిమీదనో అక్కడికి వెళ్ళినప్పుడు "రాచపాళెం గారూ! బాగున్నారుకదా!" అనే పలకరింపుతో కనిపించేవారు. అంతే. చాలా నిరాడంబరులు. ఆయనది మితవాక్కు. నాకు తెలిసి మాదిరాజు గారు ఏసాహిత్యసంస్థలోనూ కవుల సమూహంలోనూ భాగస్వామి కాలేదు. తానే ఒక సంస్థగా నిలబడ్డారు. ఆయన చేతనావర్త కవులలో ఒకరు ఎందుకు కాలేదా? అని కొన్నిసార్లు అనుకున్నాను. మాదిరాజు రంగారావు గారు(08.06.1935-21.06.2025) మధ్య తొంభయ్యేళ్ళు జీవించారు. 1953-2025 మధ్య ఏడు దశాబ్దాలు సాహిత్య జీవితం గడిపారు. ఈమధ్యకాలంలో ఆయన 144 వచనకావ్యాలు, అనేక విమర్శ గ్రంథాలు రచించారు. ఇది ఒక అపురూపమైన సాహిత్య కృషి.

మాదిరాజు గారు సాహిత్య రంగంలోకి అడుగు పెట్టే సమయానికి అభ్యుదయ సాహిత్యం ప్రధాన సాహిత్య స్రవంతిగా ఉంది. సంప్రదాయ సాహిత్యం మరోపాయగా కొనసాగుతున్నది. ఆ తర్వాత దిగంబరకవులు, పైగంబరకవులు, తిరగబడుకవులు వంటి కవి సమూహాలు ఏర్పడ్డాయి. విప్లవ రచయితల సంఘం ఆవిర్భవించింది. విప్లవ సాహిత్యం ఉప్పెనలాగా విరుచుకుపడింది. ఆతర్వాత అస్తిత్వ వాద సాహిత్యాలు (స్త్రీ, దళిత, బహుజన, ముస్లిం, ప్రాంతీయ అస్తిత్వవాద సాహిత్యాలు), ప్రపంచీకరణ సాహిత్యం సరికొత్త సాహిత్య స్రవంతులుగా చొచ్చుకు వచ్చాయి. ఈ ఏడు దశాబ్దాలలో అంతర్జాతీయంగా, జాతీయంగా, రాష్ట్రీయంగా వైవిధ్యభరితమైన సామాజిక



పరిణామాలు సంభవించాయి. ఆయన సాహిత్య రచన మొదలుపెట్టేసమయానికి భారత రాజ్యాంగం అమలులోకి వచ్చింది. తొలి సార్వత్రిక ఎన్నికలు జరిగాయి. తెలంగాణ రైతాంగ పోరాటం, జమీందారీ వ్యతిరేక ఉద్యమం ముగిశాయి. 1978 దాకా కేంద్రంలోనూ, 1982 దాకా రాష్ట్రంలోనూ కాంగ్రెస్ పార్టీ పాలన అవిచ్ఛిన్నంగా కొనసాగింది. తర్వాత రాజకీయంగా మార్పులు వచ్చాయి. అనేక ఉద్యమాలు నడిచాయి. రాజకీయ రంగంలోకి రాజ్యాంగం స్ఫూర్తికి భిన్నంగా మతవాదం ప్రవేశించింది. ఆంధ్రరాష్ట్రం ఏర్పడింది. ఆ తర్వాత ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం వచ్చింది. ప్రత్యేకతెలంగాణ, జై ఆంధ్ర ఉద్యమాలు కొనసాగాయి. 1956లో ఏర్పడిన ఆంధ్రప్రదేశ్ తిరిగి విడిపోయింది. 1917 బోల్షెవిక్ విప్లవం ద్వారా ఏర్పడిన విప్లవ ప్రభుత్వం కనుమరుగైంది. 1964 లో అంతర్జాతీయ కమ్యూనిజంలో చీలికలు వచ్చాయి. భారతీయ కమ్యూనిజంలోను అనేక చీలికలు వచ్చాయి. ప్రపంచీకరణ ప్రజల ఆమోదం లేకుండానే దేశంలోకి చొచ్చుకు వచ్చి అనేకరకాల విధ్వంసం సృష్టించింది. అనేక కుల, తాత్విక ఘర్షణలు జరిగాయి. రాజ్యాంగం అనేక సంస్కరణలకు గురైంది. ఆ రాజ్యాంగం ఇప్పుడు అతిక్రమణలకు గురౌతున్నది. ఇది రంగారావు గారి రచనా జీవితానికి నేపథ్యం.

రంగారావు గారి రచనాజీవితం మొదలయ్యే నాటికి వచనకవిత్వం మిగతా వాహికలను పక్కకునెట్టి, తాను ప్రధాన ఛందస్సుగా నిలిచింది. కొత్త ఛందస్సు మీద విస్తృతంగా చర్చ జరిగింది. వాటన్నింటినీ అలా ఉంచి రంగారావు గారు "స్వేచ్ఛా కవిత్వం" అనే పేరును తనకుతాను స్థిరపరచుకున్నారు. "స్వేచ్ఛా కవిత్వం అనేది వచనపద్యం, వచనగేయం, ముక్తచ్ఛందం, వచనగీతం, స్వచ్ఛంద కవిత్వం, వచనకవిత్వం మొదలైన వాటి కుండే పరిమితుల్ని తనలో అంతర్భవించుకున్న విస్తృత రూపం" (స్వేచ్ఛా కవిత్వం -1, పు.124) అని ఆయన ఒక నిర్ణయానికి వచ్చి, ఆ ఆలోచనతోనే కవిత్వ రచన చేశారు. స్వేచ్ఛాకవిత్వం అంటే ఆయన దృష్టిలో కేవలం రూపపరమైన భేదం కాదనీ, అది భావ జాలానికీ, వస్తువుకూ, అభివ్యక్తికీ కూడా చెందినదని ఆయన కవిత్వం రుజువు చేస్తున్నది. సమాజంలో ప్రబలంగా ఉన్న భావజాలాలకు భిన్నంగా తనదైన సామాజిక తాత్విక చింతనను ఏర్పరచుకున్నారు రంగారావు గారు.అందరూ స్వీకరించే వస్తువులను తానూ స్వీకరించారు. అందరికన్నా భిన్నంగా వాటిని కవిత్వీకరించారు. కవిత్వవస్తువును భావజాలాలు నియంత్రించడానికి రంగారావు గారు ఆమోదించినట్లు లేదు. ఆయన పూర్తిగా గతంలో ఉండిపోలేదు. అట్లని గతంతో తెగతెంపులు చేసుకోనూలేదు.

రంగారావు గారు తాత్వికంగా భౌతికవాది కారు. నాస్తికులు కారు. అట్లని తాత్విక విమూఢులు కారు. ఆయనది అరవిందుని మార్గం. 'అమృతలిప్తలు', 'ఆనందధుని' అనే కవితలు అరవిందుని 'డివైన్ లైఫ్', 'సావిత్రి' చదివిన అనుభవంతో రచించినట్లు ఆయనే చెప్పుకున్నారు (పైది:పు.261,262). తాత్వికంగా ఆయనది 19, 20 శతాబ్దాలలో ప్రవర్థిల్లిన సంస్కరించబడిన భారతీయతాత్విక చింతన అని చెప్పవచ్చు. బహుశా చివరిదాకా ఆ మార్గంలోనే ఆయన రచనా జీవితం కొనసాగింది. ఒక అతీత శక్తి మీద నమ్మకమున్నా, అది ఆధిపత్యంలో ఉన్న విగ్రహారాధన సంప్రదాయం కాదని పిస్తుంది. "ఈశ్వరుని సృష్టి చివరి రూపం మానవరూపం" (పైది:పు.199) అన్నది ఆయన విశ్వాసం. ఆ విశ్వాసం ఉన్నా, ఆయన నేటి మతరూప భౌతిక ఆధిపత్యసమర్థకులు కాలేదు. అందుకే ఆయన

ఆ కాలంలో పుట్టుకొచ్చిన కవుల సమూహాలలో కలవలేదు. ఆయన కవిగానూ, వ్యక్తిగానూ స్వేచ్ఛా వాది.

"స్వేచ్ఛా కవిత్వం" మొదటి సంపుటంలో 1953–2002 మధ్య అర్ధ శతాబ్ది కాలంలో రంగారావు గారు రచించిన ముప్పై కావ్యాలు ఉన్నాయి. వీటిలో ముక్తకాలు పోను కవిత్వ ఖండిక లు, దీర్ఘ కవితలు కలిసి 500 ఉన్నాయి.1953 లో "మనోభూమిక"లో "అరుణకిరణ సరణియై, సామాజిక చేతనయై ఉష" అని మొదలైన రంగారావు గారి కవిత్వం, 2002 నాటికి, ఉగ్రవాద నిరసన చేస్తూ "కిరణం కదులుతుంది... కిరణం మానవులకు సంకేతం, సృజనకు స్విచ్ ఆన్" అని ముగుస్తుంది. ఇది చూడడానికి మొదలైన చోటనే ఉన్నట్లనిపిస్తుంది. కానీ కాదు. సూర్యోదయాన్ని మనిషి జీవితాచరణకు, సామాజిక చలనానికీ సంకేతంగా తీసుకొని, అక్కడ మొదలుపెట్టి, చరిత్రంతా సంచరించి, మళ్ళీ సూర్యకాంతి దగ్గరకు చేరుకుంటాడు.

రంగారావు గారు స్వాతంత్ర్యానంతరం తొలితరం తెలుగు కవి. ఆరుద్రాదులకు మలితరం కవి.అందువలన ఆయన కవిత్వం స్వాతంత్ర్యానంతర సామాజిక పరిణామాల ప్రతిఫలనమే. ప్రారంభంలో రంగారావు గారి మీద 1950 లో నాటికి తెరమరుక్కి పోతున్న భావకవిత్వం ప్రభావం కనిపిస్తుంది. కానీ ఆయన కేవల భావకవి కాదు. తాత్త్వికంగా ప్రాకృతిక మానవీయ కవి ఆయన. ఆయన కవిత్వం నిండా పంచభూతాత్మకమైన ప్రకృతి, ప్రపంచం, ఆ ప్రపంచంలో వస్తున్న మార్పులు, వాటిపట్ల కవికి గల అవగాహన పరుచుకొని ఉంటాయి. సూర్య చంద్రోదయాస్తమయాలు, పగలు రాత్రి, వెలుగు చీకటి, భూమి ఆకాశం, వీటి మధ్య సమాజం – ఆయన కవిత్వావరణం. రంగారావు గారి కవిత్వంలో తొలినాళ్ళలో ఊహారూపభావుకత ఆధికంగానూ వాస్తవికత పరిమితంగానూ ఉండేది. కవిగా ఆయన ఎదుగుతున్న కొలదీ కంటి ముందు సమాజంలో జరిగే విపరీత పరిణామాలు కనిపిస్తూ ఉండడం వలన భావుకత, వాస్తవికతల సమతుల్యతను సాధించారు. ఆయన స్వేచ్ఛాకవిత్వం వచనమై తేలిపోకుండా జాగ్రత్తపడుతూ వచ్చారు. తన కాలంలో చొచ్చుకు వచ్చిన భావజాలాలు, వాటి ఆచరణలు ఆయన పట్టించుకోకపోయినా, ఆ భావజాలాలను పుట్టించిన సమాజాన్ని ఆయన విస్మరించలేదు.ఆయన తనను తాను మానవతా వాదకవిగా పరోక్షంగా నిర్వహించుకున్నారు. మార్క్సిజాన్ని ఆమోదించలేనివాళ్ళంతా మానవతా వాదాన్ని ఆలింగనం చేసుకోవడం పట్ల త్రిపురనేని మధుసూదనరావు గారు విమర్శ పెట్టారు. అయితే రంగారావు గారి మానవతావాదం పలాయన వాదం కాదనిపిస్తుంది.

1953లో ఉషస్సు దర్శనంతో నడక మొదలుపెట్టిన కవి రంగారావుగారు, 2002 నాటికి ప్రపంచ వాణిజ్య సంస్థ మీద ఉగ్రవాదం దాడిని నిరసించే దాకా చేరుకున్నారు. ఇదొక పయనం. సమాజపరిణామాలు కవిని చేయిపట్టి నడిపించిన పయనం. ప్రకృతి దర్శన పారవశ్య కేంద్రం నుండి ప్రపంచవాస్తవికతాదర్శన కేంద్రానికి కవి చేరుకోవడం సహజ పరిణామం. ఉషస్సు కోసం ఎదురు చూసినకవికి ఆమె "దివినుండి భువికి దూకే దివ్య కాంతిధుని" (పు.254) గా దర్శనమిచ్చింది. అనేక కళలుగా అవతరించింది. కవి ఆమెతో మాట్లాడాడు.

"ఎదలోతుల్లో నుండి వచ్చే సౌందర్య రసావిష్కా రం నీ కృతి" (పు. 256) అని విన్నవించాడు. "నీరాకతో ఆదర్శానికీ వాస్తవానికీ మధ్య రేఖ చెల్లుతుంది" (పు.258) అని చెప్పుకున్నాడు. ఇది ఒక దశ.

1970 నాటికి ప్రపంచం మారింది. దేశం మారింది. రాష్ట్రం మారింది. బెంగాల్లో మొదలైన విప్లవోద్యమం తెలుగు నేల మీద అడుగు మోపింది. శ్రీకాకుళం జిల్లాలో అణచివేయబడి ఉత్తర తెలంగాణలో తలెత్తింది. దట్టమైన భావుకతలో ఓలలాడిన కవి, కఠిన వాస్తవికతలోకి నడిచి వచ్చాడు. రంగారావు గారు వరంగల్లు వాసిగా ఆ అలజడికి దూరంగా ఉండలేకపోయారు. మార్పును గుర్తించారు.

*"నిన్న శిల్పంలో సౌందర్యం,*
*నేడో శ్రమ శక్తుల స్పందనం*
*నిన్న సమస్తం దైవమయం,*
*నేడో సామాజిక గతిమయం"* (పు.206)

అని గుర్తించారు. మార్పును గుర్తించడమే గాక దానిని తాత్వీకరించారు. ఇంకా చెప్పాలంటే సూత్రీకరించారు.

"ప్రకృతినీ సమాజాన్నీ కలిపే సూత్రం! మనిషిలో
ఒకవైపు నింగీ, మరోవైపు మట్టీ,
మధ్యలో జీవితం" (పైది)

సూర్యాస్తమయం మనదేశంలో వైదిక వాఙ్మయం లోనే ఉంది. 1970 లో నాటికి సూర్యుడు విప్లవ ప్రతీక అయ్యాడు. ఆధ్యాత్మిక భావాభివ్యక్తికి తోడుగా నిలిచిన సూర్యుడు, భౌతిక భావాభివ్యక్తికి ఆధారమయ్యాడు. రంగారావు గారు 1970 లలో కవిత్వం రాస్తూ తన పురాతన భావుకతను, ఆధునిక భావుకతతో సమన్వయం చేసుకునే ప్రయత్నం చేశారు. 'మానవీయం' కావ్యంలో ఉదయించే సూర్యుని యెదురుగా నిలబడగా,

*"కొండకొమ్ము మీదినుండి రసధుని పరిగెత్తి నట్లు"* (పు.13) అనుభూతి కలిగింది. ఇది వైయక్తికం. కవి క్రమంగా 'మానవీయం' కావ్యాన్ని పొడిగించుకుంటూ పోయాడు. సూర్యుడు

*"గగన కాసారంలో తలెత్తి*
*సహస్రకరాలతో ఈది వచ్చేను సూర్యుడు*
*ఒడ్డున మేల్కొన్న ప్రాణికోటి ఆశ పతాక"* (పు. 48) అయ్యాడు.

ఒక గ్రహంగా సూర్యుడు ఉదయించిన సమాజంలో తీసుకొచ్చే కదలిక, ప్రతీకగా చలన రహిత సమాజంలో ఉద్యమం తీసుకొచ్చిన మార్పు– ఈ రెంటినీ సమన్వయం చేశాడు కవి. క్రమక్రమంగా కవి వాస్తవికతలంలోకి ప్రవేశించగానే ప్రపంచం, దాని నిర్మాణం స్పష్టంగా ఆయనకు దర్శనమిచ్చాయి.

*"సామాన్యుల దృష్టికి మట్టిముద్దవలె*
*వైజ్ఞానిక దృష్టికి ప్రేమించే గోళంవలె*
*వేదాంతికి భ్రమోదిత స్వప్నంవలె*
*స్పష్టంగా సంపూర్ణా సంపూర్ణంగా*
*భావించే సుఖదుఃఖాత్మక ప్రపంచం*
*బహువిచిత్ర మనఃప్రభావసంకలనం*
*వివిధభౌతికశక్తి రూప సమీకరణం"* (పు.44)

అని విపులీకరించారు. సమాజం విభిన్న శక్తుల సంఘర్షణల కేంద్రంగా కవికి అర్థమైంది. ఇప్పటి దాకా మనకు తెలిసిన చరిత్రంతా వర్గపోరాటాల చరిత్ర అనే కమ్యూనిస్టు ప్రణాళికలోని మొదటి వాక్యాన్ని రంగారావు గారు తనదైన తాత్వికతలో విపులీకరించారు. ఈ అవగాహనకు 1940 లలోనే పునాది పడినా, 1970 లలో అది మళ్ళీ చర్చనీయాంశం అయింది.

*"ఆరంభం నుండి నేటివరకూ*
*సమాజ భౌతికశక్తుల*
*ఆకర్షణ, సంసర్గం, సంఘర్షణ*
*ఏనాటికైనా ఒకే తీరు"* (పు.47)

అని కవి ఊరికే అనలేదు. తనకాలపు అసమ సమాజంపోయి మరొక మంచి సమాజం రావాలి అని కోరుకోవడమే ఆధునిక కవి కర్తవ్యం.

"మరో మనోలోకాన్ని కల్పించుకోవాలిప్పుడు" (పు.48) అని కవి సంకల్పం చెప్పుకున్నాడు. "అది పరిమితి ఎరుగని సుందరసమాజం" (పు. పైది) అని కూడా ప్రకటించాడు. భారతీయ సమాజంలో బహుళత్వరూపంలో వైరుధ్యాలనిలయంగా మారిన సమాజం స్థానంలో కవి వాటినన్నిటినీ మానవత్వం బంధంతో పరిష్కరించుకోవాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పాడు.

*"తిండికి బట్టకు స్వేచ్ఛకు కరువులేని*
*సామ్యవాద సామాజిక వ్యవస్థలోనూ*
*మానవజాతి సమగ్రవికాసం ఏనాటికైనా*
*భౌతికశక్తుల నైతిక రక్తితో మానసికవికాసంలోనే*
*వైజ్ఞానిక భూమిలో నవసమాజ రూపంతో*
*మానవతా హృదయంతో పురోగమన లక్ష్యంతో*
*నేటి మనిషి ఎత్తక తప్పదు"* (పు. (52,53)

1970–80 దశాబ్దాన్ని 'దందహ్యమాన కల్లోలదశాబ్దం'గా పిలిచారు. కారణం అప్పటి ప్రత్యేక తెలంగాణా రాష్ట్రోద్యమం కొనసాగుతుండ

గా, ఒక ఉప్పెనలాగా నగ్జల్బరీ ఉద్యమం తెలుగునాట దూసుకువచ్చి విజృంభించడమే. రంగారావు గారు 1953 లో

"మనోయవనికలో" ప్రచురించిన తర్వాత, 1970-80 మధ్య పన్నెండు కావ్యాలు రాశారు. వాటిలో ఆయనకు నమ్మకమున్న ఆధ్యాత్మిక విషయాలు, ప్రజాస్వామ్యం, మానవత్వం, ప్రకృతి వంటి అంశాలతో పాటు, కొన్ని సాధారణ సామాజిక వికృతులను చిత్రిస్తూ, బంగ్లాదేశ్ విమోచనోద్యమం, వియత్నాం ప్రజలు ఉద్యమాలను చిత్రించారు గానీ, తననివాసస్థలంలో జరుగుతున్న ప్రత్యేక తెలంగాణా, నగ్జల్బరీ ఉద్యమాల విషయంలో రంగారావు గారు మౌనం వహించారా! అనిపిస్తుంది. పార్లమెంటరీ ప్రజాస్వామ్యం మీద నమ్ముకున్న కవి నూతన ప్రజాస్వామిక విప్లవం పట్ల వ్యతిరేకత కూడా ప్రకటించినట్లు లేదు. సిరిసిల్ల కాల్పులు సంఘటన అప్పట్లో పెద్ద సంచలనం. అది రంగారావు గారి కవిత్వంలో కనిపించదు. ఆంధ్రప్రాంతం ఆధిపత్యాన్ని ధిక్కరిస్తూ వచ్చిన ప్రత్యేక తెలంగాణ రాష్ట్రోద్యమం పట్ల కూడా ఆయన మౌనం వహించారు. దాశరథి, సి. నారాయణ రెడ్డి వంటి కవులు ఆ ఉద్యమాన్ని వ్యతిరేకించారు. రంగారావు గారు ఆపనికూడా చేయలేదు. 1970 నాటి "ముక్తకాలు" ద్విపదలవంటివి. రెండేసిపాదాలతో అసంఖ్యాక ద్విపదలు రాశారు. అవన్నీ రంగారావుగారికి సహజమైన తాత్విక, ప్రాకృతిక, మనస్తాత్విక విషయాల వర్ణనలే. వాటిలో అప్పటి రాజకీయ వాతావరణం ఎక్కడా కనిపించలేదు. అంతటి ఉద్రిక్త వాతావరణంలో కవి అలా ఉండి పోవడం ఆశ్చర్యమే.

*"అగ్నిని ఆర్పుతూ కొందరు రగుల్పుతూ కొందరు"* (పు.201)

*"ఉజ్వల స్వాతంత్ర్యం వెలిగింది సూర్యునివలె ఎందులో మానవత సూర్యునివలె వెలిగితే మంచిదే"* (పు.202)

*"తుపాకి దెబ్బకు పిట్టలు వలె ఎగిరే కాలం*
*మారింది కాని*
*రూపాయి గుప్పిట్లోని కాలం కదలడానికే భయపడుతూ ఉంది"* (పు.205) వంటి వ్యాఖ్యలు మాత్రం కనిపిస్తున్నాయి.

1970ల నాటికి తెలుగునాట విప్లవోద్యమం, తెలంగాణ, సమైక్యాంధ్ర ఉద్యమాలు కొనసాగు తుండగా మన పొరుగున ఉన్న పాకిస్తాన్ నుండి బంగ్లాదేశ్ విమోచనోద్యమం ముజిబుర్ రెహమాన్ నాయకత్వంలో మొదలైంది. భారతదేశం బంగ్లాదేశ్ కు మద్దతు ఇచ్చి, బంగ్లాకు మద్దతుగా సైన్యాన్ని కూడా పంపింది. అప్పుడు భారతీయ భాషలలో రచయితల నుండి భారత ప్రభుత్వానికి గట్టి మద్దతు లభించింది. రంగారావు గారు 'ముక్తధాత్రి' కావ్యంలో మద్దతు తెలిపారు. కావ్యం సాంతం యుద్ధభాషతో అలంకరించారు. కవి బంగ్లా ప్రజల ప్రజాస్వామిక ఆకాంక్షను, భారత్ అందిస్తున్న చేయూతను సమర్థించారు. పాకిస్తాన్ నుండి విడిపోయిన బంగ్లాదేశ్ ను కవి 'ముక్తధాత్రి' అని నిర్వచించారు.

ఆ సమయంలో పాకిస్తాన్ అనుసరించిన దమననీతిని కవి చారిత్రక దృష్టితో వీక్షించి ఇలా వ్యాఖ్యానించాడు.

*"మానవ మహాశోకం ముద్దకట్టినట్టివిధం*
*యుగాల నుండి వచ్చే సంస్కారం భగ్నమై*
*నియంతృత్వపవనంతో జ్వలించే శ్మశానమై*
*భుగ్నభావ లసితక్షణం,*
*స్వాతంత్ర్యాశయ చరణం*
*పోరాడే వెలుగుతో పాలుపోక*



*తారాడే నీ సమయం"* (పు.83)

పాక్ పోలీసుల కాల్పుల్లో మరణించిన ఉద్యమ కారుని కవి ఆవేశంగా, ఉద్విగ్నంగా, పాఠకులకు కూడా ఆ భావాలు ఉప్పతిల్లే భాషలో వర్ణించాడు.

*"ఎవరతడు? విప్లవసంకేతం, స్వేచ్ఛకు చిహ్నం*
*నెత్తురు మడుగులో విరిసిన అనలపద్మం"*
(పు.85)

రంగారావు గారి స్వభావానికి ఈ భాష కొత్తది. అప్పటి తెలంగాణ నుంచి వస్తున్న కవిత్వ వాతావరణం, బంగ్లాదేశ్ ఉద్యమం కవితో ఆ భాషలో కవిత్వం రాయించాయనిపిస్తుంది. ఆ యుద్ధంలోని విభిన్న సంఘటనలను రంగారావు గారు, యుద్ధం క్షేత్రంలో సంచరిస్తూ వర్ణించినంత ఉత్సాహంగా రాశారు కావ్యాన్ని. పాకిస్తాన్ తోకముడిచిన తర్వాత కవి "సోనార్ గాలిలో చిలకలెగురుతున్నాయి" (పు .101) అని ఎగిరి గంతేశారు. బంగ్లాదేశ్ అవతరణను "ఇప్పుడు తెరుచుకుంది స్వర్ణ బంగ్లాదేశ్ ద్వారం" (పు.109) అని ప్రస్తుతించారు. ఈ కావ్యానికి అనుబంధంగా, ముజిబుర్ రెహమాన్ హత్య జరిగినప్పుడు కవి

*"ఈనాటి ముజిబ్ హత్య రక్తంతో దూకిన స్వప్నం*
*ఆనాటి ముజిబ్ విజయం*
*రక్తంలో విరిసిన పద్మం"* (పు.103) అని వర్ణించాడు.

1955-1975 మధ్య కాలంలో ఉత్తర ,దక్షిణ వియత్నాంల మధ్య జరిగిన యుద్ధం కమ్యూనిజాని కీ, క్యాపిటలిజానికీ మధ్య జరిగిన యుద్ధం. అమెరికా తన సహజ బుద్ధితో దక్షిణ వియత్నాం కు చేయూతనిచ్చింది. వట్టి చేయూత కాదు, నేరుగా యుద్ధంలోకి దిగింది. అనివార్యంగా కమ్యూనిస్టు దేశాలు ఉత్తర వియత్నాంకు సహాయం చేశాయి.1975 లో సైగాన్ పతనంతో అమెరికా తోక ముడిచింది. అమెరికా యుద్ధంలోకి ప్రవేశించినప్పటి నుండి యుద్ధం ముగిసే దాకా జరిగిన యుద్ధాన్ని రంగారావు గారు "ఇది వియత్నాం'' కావ్యంగా రాశారు. అమెరికాది "అహంకార గర్జాధ్వని" (పు.110)అన్నారు.

*"అహం ప్రేలే యుద్ధానికి దగ్ధమౌతూంది*
*వియత్నాం భగ్నమయ్యే జాతిస్వేచ్ఛకు సంకేతం*
*వహిస్తూంది"* (పు.114)

అని యుద్ధం చేస్తున్న విధ్వంసాన్ని నిరసించారు. వైజ్ఞానికంగా ఎంతో పరిణతి చెందిన సమాజంలో యుద్ధం జరగడం ఒక వైరుధ్యమన్నారు. ఆటవిక దశలో మనిషికి అవసరమైన ఆయుధం ప్రజాస్వామ్య యుగంలో కూడా ఉపయోగించడాన్ని కవి ఆమోదించలేదు. అయినా తుది విజయం ప్రజలదే అని కొనియాడారు.

రెండు దేశాల మధ్య యుద్ధం వస్తే పెద్దమనిషి దేశం చర్చలద్వారా పరిష్కరించకుండా ఒక దేశానికి ఆయుధాలందించడాన్ని కవి వ్యతిరేకించాడు.

*"ఇది వియత్నాం, ఇపుడు*
*అభ్యుదయ ప్రగతిలో వీరాంగణం*
*స్వేచ్ఛతో రెపరెపలాడే సమాజ కేతనం"*
(పు.121)

అని వియత్నాం విజయాన్ని కీర్తించారు.

1973 నాటి "ఆవాహనం" కావ్యం 68 కవితల సంపుటి. చివరి అయిదు ఉగాది కవితలు. తక్కినవి అనేక వస్తువుల వర్ణనలు. ఏ వస్తువును తీసుకున్నా కవి కాలం అనే కాన్వాసును విస్మరించలేదు.

*"దీనహీనహిమశిలా శ్రేణులపై చరించే నేను*
*ఎవరికోసమో జోలపాట పాడలేను"* (పు.129)

అని తన ప్రజా నిబద్ధతను చాటారు. ఆధ్యాత్మికవాది అయిన రంగారావు గారు దేవుడైనా సరే మార్పును ఆపడం అసాధ్యమనడం విశేషం. ప్రపంచాన్ని కవి ఒక విశాలవేదికగా భావించాడు.

*"మనోనేత్రం విప్పి చూస్తే ఈ ప్రపంచం*
*శాఖోపశాఖలుగా విస్తరించిన మహావృక్షం"* (పు.136) అనడమేగాక, తన దృష్టిలో సమాజం ఎలా ఉండాలో చెప్పారు.

*"మనిషిలో చీకటి వృక్షమైనపుడు ఏదేశమైతేనేమి!*
*వేరు వేరు పోతల్లో అంతా అజ్ఞాన శిల్పాలే*
*మనిషిలో మానవత వసంతమైనపుడు*
*ఏ భాగమైతేనేం?*
*అంతా చైతన్య శిఖలే ప్రజలు!"* (పు. 140–141)

మానవత్వ దృక్పథంగల కవులు సమాజంలో పేదరికం, హింస ఉండటాన్ని సహించలేరు.

*"ఆకలిగొన్న ముఖాలు రొట్టెముక్కతో శాంతిస్తే*
*ఆకలిగొన్న ఊహలు అధికారంతో గాని*
*తృప్తిపడవు.*
*ఆకలిగొన్న చేతలు రక్తంతో గానీ శమించవు*
*ఆకలిగొన్న అహంకారం హింసతో గాని నిద్రించదు"* (పు.192).

నగరజీవితం, నెహ్రూ వంటి ఇతరాంశాల మీద కవితలు రాసిన రంగారావు గారు ఈ కావ్యంలో జీవితాన్ని కొత్తగా అర్థం చేసుకోమని పిలుపునిచ్చారు.

*"ప్రపంచం విజ్ఞాన యంత్రమయమైన ఈనాడు*
*జీవితానికి సరికొత్త వ్యాఖ్యానం*
*అవసరమౌతున్నది"* (పు.172)

1974 నాటికి మనదేశంలో జాతీయ సమైక్యతా భావన బాగా ప్రచారం జరుగుతోంది. ప్రత్యేక రాష్ట్రోద్యమాలు చల్లారిపోయాయి. ఈ నేపథ్యంలో రంగారావు గారు "వెలుగులో ఈ నేలపై" (1974) కావ్యం రాశారు. ఈ కావ్యంలో కవి స్వాతంత్ర్యాన్ని స్మరించుకొని

*"త్యాగభూమినుండి పుట్టిన స్వాతంత్ర్య మహావృక్షం ఛాయల్లో*
*ఎద ఎదలో సమైక్య శిబిరం ఈసమయం తేజోమయం*
*లక్ష్యం ప్రజాహృదయక్షేత్రంలో స్వర్ణకాంతి సస్యఫలం"* (పు.303)

అని సమైక్య వాదం వినిపించారు. స్వతంత్రం వచ్చిన తర్వాత మనదేశం సాధించిన ప్రగతిని ఆమోదిస్తూనే ఇంకా కొనసాగుతున్న అసమానతలను ప్రస్తావించి, చెలరేగుతున్న అలజడులను ఎత్తి చూపారు.

*"సమతామానవతా లక్ష్యంతో ప్రేమలో ఆనందం*
*ఇంకా రావాల్సి ఉంది"* (పు.309)

1975–78 మధ్య భారతదేశం రాజకీయంగా అనిశ్చితికి, ఆందోళనలకు నెలవైంది. అప్పటి ప్రధానమంత్రి ఎన్నిక చెల్లదని అలహాబాద్ హైకోర్టు తీర్పు నివ్వడం, శ్రీమతి ఇందిరాగాంధీ ప్రభుత్వం అత్యవసరపరిస్థితి ప్రకటించి ప్రశ్నించే వాళ్ళను నిర్బంధించడం, జయప్రకాష్ నారాయణ్ సంపూర్ణ విప్లవం పేరుతో ఉద్యమించడం, అత్యవసరపరిస్థితి లోనే ప్రభుత్వం అనేక సంక్షేమ పనులు ప్రారంభించినా, అనూహ్యమైన అరాచకాలు జరగడం, ఆఖరికి అత్యవసర పరిస్థితిని రద్దు చేసి ఎన్నికలు ప్రకటింపబడడం, 1978 లో జరిగిన ఎన్నికల్లో జనతాపార్టీ పాలన ఏర్పడడం– ఇవన్నీ మూడేళ్ళ పరిణామాలు. విప్లవోద్యమం విస్తరిస్తున్న ది. కార్మిక సంఘాలు చైతన్యవంతమౌతున్నాయి. ఈ కాలంలో రంగారావు గారు 'జీవనరేఖలు' (1975), 'మేల్కొన్న ఈసమయం' (1975), 'శబ్దమై ప్రాణమై' (1976) అనే మూడు కావ్యాలు రాశారు. ఈ కావ్యాలలో రంగారావు గారు, వాచ్యంగా, నేరుగా ఈ పరిణామాల మీద విమర్శనాత్మకంగా కవితలు రాసినట్టు లేదుగానీ, అప్పటి సంఘర్షణాత్మక పరిస్థితులను మాత్రం ఆయన చిత్రించారని చెప్పవచ్చు. "నవమానవనిర్మాణం నా బింబం" (పు.281) అని తన సామాజిక స్వప్నాన్ని నిర్వచించుకున్నారు. అప్పటి ఉద్యమ వాతావరణాన్ని

*"గుడిసె నుండి నీడలు బయటికొచ్చీ,*
*వెలుగులో ఒక్కటై నడుస్తున్నాయి*
*నిరంకుశుల నిశాగతుల్ని మాపే*
*కిరణ్ శక్తి వహిస్తున్నాయి"* (పు.283)

అని గుర్తించారు. హెచ్చరించారు. 'జీవనరేఖలో' కావ్యంలో రంగారావు గారు గుడిసెలు ప్రస్తావన ఎక్కువ చేశారు. శ్రామికులను కీర్తించారు. 'మేల్కొన్న ఈసమయం' కావ్యంలో మానవహక్కుల ప్రస్తావన చేయడం అత్యవసర పరిస్థితికారణంగానే. "హక్కులపై ఆక్రందన కల్లోల నినాదాలు పరివర్తనకై పోరాటం" (పు.321) దేశానికి స్వాతంత్ర్యం వచ్చి మూడు దశాబ్దాలు అవుతున్నా ఒకకవి "ఈ దేశంలో సామాన్యుని జీవితం శూన్యాన్ని స్మరింపజేసే చిత్రం" (పు.322) అనడం పెద్ద రాజకీయ వ్యాఖ్య. అందుకనే ఆయన సమాజంలో సాత్విక చైతన్యాన్ని ప్రబోధించారు

*"ఈ సమయం మనిషి చేయగలిగిందొకటే*
*మనస్సులో సుకుమార సూర్యబింబమై మేల్కోవడం"* ( పు.327)

1979–1986 మధ్య రంగారావు గారు నాలుగు కావ్యాలు రాశారు. అవి.

1. కాలాన్ని నిలిపిన క్షణం (1979)
2. అగ్ని మయం జీవితం (1980)
3. ఈతరం స్వరం (1986)
4. నాలో ప్రవహిస్తోంది నది (1986).

ఈకాలంలో అనేక సామాజిక పరిణామాలు సంభవించాయి 1978లో అత్యవసరపరిస్థితి తర్వాత జరిగిన ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ ఓడిపోయింది. జనతాపార్టీ అధికారంలోకి వచ్చింది. ఆ ప్రభుత్వం రెండున్నరేళ్ళకు అంతర్గత వైరుధ్యాలతో కూలిపోయింది. 1980 లో మళ్ళీ జరిగిన ఎన్నికల్లో శ్రీమతి ఇందిరాగాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. ఆంధ్రప్రదేశ్‌లో ఎన్ టి రామారావు తెలుగు దేశం పార్టీ స్థాపించి 1983 లో అధికారంలోకి వచ్చారు. 1984లో శ్రీమతి ఇందిరాగాంధీ సొంత అంగరక్షకుల చేతిలో చంపబడ్డారు. అంతకుముందు బింద్రన్ వాలాను పట్టుకోడానికి అమృతసర్ లోని స్వర్ణ దేవాలయంలోకి సైన్యాన్ని పంపించి కాల్పులు జరిపించడమే ఇందుకు కారణమంటారు. ఆ వెంటనే ఆమె పెద్దకుమారుడు రాజీవ్ గాంధీ ప్రధానమంత్రి అయ్యారు. 1885 లో కాంగ్రెస్ శతజయంతి ఉత్సవాలు జరిగాయి.

రంగారావు గారి కావ్యాలలో ఈ నిర్దిష్ట సంఘటనలు, సందర్భాలు యథాతథంగా వస్తువులు కాలేదు గానీ, వాటి నేపథ్యంలో సమాజ సంచలనాలను ఆయన కవిత్వంగా మార్చుకున్నారు. భోపాల్ విషవాయువు బయటపడి జనం వేలల్లో మరణించిన సందర్భంలో మాత్రం కవి బయటి కొచ్చాడు. "భోపాల్ విషాదం" కవిత రాశారు. విషవాయువు వెలువడడంతో జనం భయంతో పరుగెత్తడం, వాళ్ళ జీవితాలు అల్లకల్లోలం కావడాన్ని వర్ణించారు.

*"భోపాల్ విషాదం స్మృతిలో ఎప్పటికీ మిగిలే ఉంటుంది*
*నాగరిక సమాజంలో అశ్రద్ధకూ అలసతకూ చిహ్నంగా"* (పు.394)

అని ప్రకటించారు. ఈ నాలుగు కావ్యాలలో రంగారావు గారు ప్రపంచ శాంతిని, అహింసను, మానవత్వాన్ని ఆకాంక్షించేకవిగా బుద్ధుడు, క్రీస్తు, గాంధీలను స్మరించుకున్నారు. వాళ్ళలో "కరుణజలం" ఉందన్నారు (పు.217) గుర్రం జాషువ చాలాసార్లు ఈత్రయాన్ని స్మరించారు. రంగారావుగారు

"ఉదయ చేతనతో" కవితలో కవి చాలా స్పష్టంగా తన శ్రామిక ప్రీతిని ప్రకటించారు.

*"పొలాల్లో గగనుల్లో కర్మాగారాల్లో ఉగ్రశక్తి నర్తనతో నేరాల్లో*
*కర్షక కార్మిక జీవితాలు శిశిరంలో చిటారు కొమ్మన చుక్కలు"* ( పు.367)

అనేక సామాజిక ఆందోళనల మధ్య సామాజిక సామరస్యం దెబ్బ తింటుండడం కవికి ఆందోళన కలిగించింది. అందుకే ఆయన ఒక లౌకిక వ్యవస్థ ఆవిర్భావాన్ని భావించారు.

*"జాతి వర్ణ భేదం లేని వర్గరహిత*
*సమభావం నవరాగం స్పందిస్తూ అందిస్తూ*
*చరిత్రలో సమాజానికి కొత్త విలువ లేర్పడుతున్నాయి"* (పు.347)

ఆ తర్వాత రాసిన కావ్యాలలో కూడా రంగారావు గారు నవసమాజ ప్రస్తావన చేస్తూనే వచ్చారు. 1987-91 మధ్య ఆయన "నాకు జ్ఞాపకం ఉంది" (1987), "అశాంతి ఆర్కెస్ట్రా" (1991), "వర్తమానం స్క్రీన్ పై" (1991) అనే కావ్యాలు రాశారు. ఇది 1984-91 మధ్య. 1984లో రాజీవ్ గాంధి ప్రధానమంత్రి కావడం, 1989లో ఆయన ఓడిపోవడం, తర్వాత వి. పి. సింగ్, చరణ్ సింగ్, చంద్రశేఖర్ మొదలైనవారు పాలకులు కావడం, మధ్యంతర ఎన్నికలు రావడం,చివరికి రాజీవ్ గాంధి తమిళనాడులోని శ్రీపెరంబుదూరులో హత్యకు గురికావడం, అప్పుడు గెలిచిన కాంగ్రెస్, పి వి నరసింహారావు ప్రధాన మంత్రి కావడం, అప్పుడే సోవియట్ రష్యాలో వామపక్ష ప్రభుత్వం పతనం



కావడం, గాట్ ఒప్పందం రూపంలో ప్రపంచీకరణ ప్రవేశించడం- ఇది అనేక పరిణామాల కాలం.

ఈ కాలంలో రాసిన కావ్యాలలో కూడా రంగారావు గారికి సహజమైన పద్ధతిలో కొన్ని నిర్దిష్టతలమీద, ఎక్కువ సామాజిక చలనాల మీద తనదైన దృక్పథంతో కవితలు రాశారు. "నాకు జ్ఞాపకముంది" అన్నది ఒక దీర్ఘ కవిత. ఇది కవి జ్ఞాపకాల దొంతరలవర్ణన. బస్ ప్రయాణం, రైలు ప్రయాణం, పగలు, రాత్రి ఇలా అనేక సందర్భాల్లో కవి చూచిన మానవ జీవన దృశ్యాల చిత్రణే ఈ కావ్యం. ఇది ఒక ప్రయాణకావ్యం అనిపిస్తున్నది. కవి ఆధ్యాత్మిక జీవి అయినా, వాస్తవిక సమాజాన్ని ఆయన అడవిలో వదిలేయలేదని ఈ కావ్యం రుజువు చేస్తున్నది. రంగారావు గారు ఒక అనుభవాల పుట్టగా ఈ కావ్యంలో కనిపిస్తారు. 15 కవితల సంపుటి "అశాంతి ఆర్కెస్ట్రా" ఇందులో "ఈశతాబ్ది స్వేచ్ఛలో" అనే కవితలో 20 వ శతాబ్ది వాస్తవికతను వర్ణించారు. రెండు ప్రపంచ యుద్ధాలు మొదలు నెల్సన్ మండేలా విడుదల వరకు చిత్రించారు. మండేలాను "ఈ శతాబ్ది స్వేచ్ఛకు మహోదయం" (పు.399) అనడం కళ్ళలో నీళ్ళు తెప్పిస్తుంది. తర్వాతి కవితల్లో కవి కాశ్మీర్ పంజాబ్ కల్లోలను చిత్రించారు.

*"కాశ్మీర్ పంజాబ్ చంద్ర నిప్పుల కళ్ళతో హిమజలాల్లో అగ్నులైనాయి"* (పు.399) చరిత్రలో జరగకూడనివి జరిగినపుడు కవికి *"చంద్రునిలో మచ్చలవలే చరిత్రలో గాయాలు"* (పు.408) అనిపించడం సహజం. ఎన్ని జరగరాని సంఘటనలు జరిగినా కవికి ప్రజలమీద నమ్మకం సడలిపోకపోవడం, కవి నిరాశకు లోను కాకపోవడం ఒక పాజిటివ్ అంశం.

*"ప్రజాస్వామ్య నవసమాజ చలనంతో*
*పవనంలో గతులతో, కిరణంలో రుచులతో*
*ప్రజల్లో పలుకుతూంది సూర్యుని*
*ఆర్కెస్ట్రా హృదయం"* (పు.412)

రంగారావు గారు వ్యక్తి వాదిలాగా కనిపిస్తారు గానీ, అది నూరుశాతం కాదు. ఆయనలో గొప్ప సమూహ వాది ఉన్నాడు. "సంఘర్షణ లేంది జీవితం లేదు, సంచలనం లేంది పరివర్తన లేదు" (పు.415) అని గలిగిన ఆధునికుడాయన. "నవసమాజం ఊహతో జనశక్తి రూపం పొందుతూంది" (పు.415) అని గలిగిన సమూహం వాది ఆయన. రంగారావు గారు యూజీనీ పాటియర్ రాసిన ఫ్రెంచికవితను "శ్రామిక గీతం" పేరుతో అనువదించడం (పు.428) ఆయన కవిత్వంలో గొప్ప సందర్భం. ఆయన తన కవిత్వమంతా కలవరించే నవసమాజానికి బహుశా సంగీతం ప్రేరణ కావచ్చేమోననిపిస్తుంది.

1991-2002 మధ్య ప్రపంచవ్యాప్తంగా ఒక కొత్త సంచలనం సంభవించింది. సోవియట్ రష్యాలో రాజకీయ మార్పులు తర్వాత ప్రపంచదేశాల్లోకి ఎల్ పి జి వ్యవస్థ ప్రవేశించింది. భారతదేశంలో అప్పుడే కాంగ్రెస్ తిరిగి అధికారంలోకి వచ్చింది. నిరభ్యంతరంగా ప్రపంచీకరణను ఆలింగనం చేసుకుంది. ఆంధ్రప్రదేశ్ అన్ని రాష్ట్రాల కన్నా ముందు ప్రపంచబ్యాంకు విధానాలకు ఆహ్వానం పలికింది. దేశం నలుమూలలా ప్రభుత్వ రంగ సంస్థలు ప్రైవేట్ వ్యక్తులపరమయ్యాయి. తర్వాత బిజెపి పాలన వచ్చి ఇంకా ఎక్కువగా ప్రైవటైజేషన్ ను అమలు చేసింది. పెట్టుబడుల ఉపసంహరణశాఖ అని ఒక కొత్త మంత్రిత్వశాఖను ఏర్పాటు చేశారంటే పాలకులు ప్రైవేటీకరణకు ఎంత ఆతృతగా ఉన్నారో అర్థం చేసుకోవచ్చు. దీనివలన రైతులు, చేనేత కార్మికులు ఆత్మహత్యలు చేసుకున్నారు. ఆ మరణాలను పాలకులు అపహాస్యం చేశారు. విద్యుత్ చార్జీల పెంపును వ్యతిరేకించిన రైతులను బషీర్ బాగ్‌లో కాల్చిచంపారు. రైతులను కరెంట్ దొంగలు గా ముద్రవేసి జైళ్ళలో వేశారు. సేద్యం దండగ అని ప్రచారం చేశారు. ఈకాలవ్యవధిలో అంటే 1991-2002మధ్య మొదట బాబ్రీ మసీదు కూల్చివేత, చివర గుజరాత్ మారణకాండ, బషీర్ బాగ్ కాల్పులు దేశచరిత్రలో మాయని మచ్చలుగా నిలిచిపోయాయి.

రంగారావు గారు ఈమధ్యకాలంలో ప్రత్యక్షంగా కాకపోయినా పరోక్షంగా ఈ పరిణామాలు పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. 1996నాటి "జైలు కార్నర్" నుండి 2002 నాటి "కిరణపథం" దాకా కవి పడిన సామాజిక, మానసిక ఆందోళనను, కవి తనను తాను ఓదార్చుకుంటూ చేసిన ప్రబోధాలను మనం గమనించవచ్చు.

"జైలు కార్నర్ నుండి" కావ్యంలో కవి జైలు ప్రస్తావన ఎక్కువగా చేశారు. ఆయన ఆలోచన ఏమిటో గానీ 'జైలు గదిలో' కవితలో గదిలో నిర్బంధంలో కూర్చున్న స్త్రీని వర్ణించారు.

*"నిన్నటివరకు ఉషఃకిరణం! నేడేదో నేరానికి నిశీథినీ శిల"* (పు.481) అన్నారు. ఈకావ్యమంతా జైలు, ఖైదీ, ఇనుప తీగలు వంటి మాటలతో నిండి ఉంది.

*"జైల్లో పాతేసిన ఖైదీ జీవితం కొత్త సృష్టికై కలగంటూంది"* (పు.484) అనడం ఒక పెద్ద రిలీఫ్. ఈ కావ్యంలో ఆయన సాయుధ పోరాటాన్ని వ్యతిరేకించారా? అని కూడా అనిపిస్తుంది. శాంతి ప్రియుడైన కవి, ఏ సమస్యనైనా మానవత్వ సంభాషణలతో పరిష్కరించవచ్చుననే నమ్మకం గల కవి

*"ఆయుధం మనసును నియమించలేదు; ప్రకృతిని శాసించలేదు"* (పు.484) అనడం సహజం. "ప్రయాణం నుండి ప్రయాణం" కావ్యంలో కవి సమాజ గమనాన్ని మానవతా కోణం నుండి ఆవిష్కరించారు. ఈకాలంలో విప్లవోద్యమానికీ ప్రభుత్వానికీ మధ్య జరుగుతూ ఉండిన సంఘర్షణ కవి మనసులో ఉండిందనిపిస్తుంది. లేకపోతే

*"అడవిలో కొండల మధ్య తగలబెట్టిన*
*బస్ తో పాటు*
*ఆక్రందించే ప్రజలు గళాల్లో*
*ఆవేదన విని ఆనందించేరా?"* (పు.497)

అని ప్రశ్నించరు. రంగారావు గారికి భారతీయ గ్రామీణ జీవితం, అందులోని శ్రామిక పార్శ్వం బాగా తెలుసు. తెలవడమేకాదు, దాని పట్ల మమేకత్వం కూడా ఉందని "ఈ శతాబ్ది రెక్కలు పై" కావ్యం రుజువు చేస్తున్నది.

*"రైతు పిడికిట్లో దున్నే నాగలితో,*
*చేతిలో పంటకోసే కొడవలితో*
*శక్తినదితీరంలో శ్రమఫల కేతనంతో*
*నాలో సృజన భూమి బింబిస్తున్నది"* (పు.507)

అన్న భావన ఇందుకు నిదర్శనం. శ్రామికుల ఆయుధాలను సమర్థిస్తూ, ఉద్యమాలలో ఆయుధం వినియోగాన్ని కవి వ్యతిరేకించారా అనిపిస్తుంది. అట్లని ఆయన ఉద్యమాలను అడ్డుకోలేదు.

*"శ్రమశక్తి, పోరాటం సమాజానికి రెండు కళ్ళు*
*నాగలీ కొడవలీ*
*శ్రమజీవికి రెండు చేతులు"* (పు.508)అన్నారు.

దీనికి కొనసాగింపుగా "డైరీ దర్పణం" కావ్యంలో కూడా ఆయుధం ప్రస్తావనలు చేశారు. శాంతిని కలవరించారు. అంతర్జాతీయంగా అలముకుంటున్న ఆందోళనా వాతావరణాన్ని చెచెన్యా, బోస్నియా దేశాలను పేర్కొంటూ ఆందోళన వద్దారు. దేశీయంగా విప్లవోద్యమం దేశమంతా విస్తరిస్తున్న వాస్తవాన్ని ఆయన గమనించారు. దేశంలో క్రమక్రమంగా పెరుగుతూన్న వ్యాపార సంస్కృతిని కవి అధిక్షేపించారు.


*''రవిబింబాన్ని సైతం అమ్మకానికి పెట్టి*
*చంద్రబింబాన్ని తాకట్టు పెట్టి*
*అవసరానికి డబ్బు గడుపుకొనే చీకటి బేహారులు*
*తటస్థ పడతారు"* (పు.525)

1975-85 మధ్య అంతర్జాతీయ మహిళా దశాబ్దం జరిగింది. దాని పర్యవసానంగా ప్రపంచ వ్యాప్తంగా స్త్రీవాదం దూసుకువచ్చింది. ఉత్తర భారతంలో కాన్షీరాం ఉద్యమం, డా. బి. ఆర్. అంబేద్కర్ శతజయంతి, 1983 లో చిత్తూరు జిల్లాలో పదిరికుప్పం, 1985 లో ప్రకాశం జిల్లాలొ కారంచేడు, 1992 లో గుంటూరు జిల్లాలో చుండూరు లలో దళితులమీద జరిగిన మారణకాండ – వీటి పర్యవసానంగా దేశవ్యాప్తంగా దళిత ఉద్యమం మొదలైంది. ఆ ప్రభావాలతో స్త్రీవాద, దళితవాదసాహిత్యాలు అస్తిత్వ వాద సాహిత్యాలుగా పుట్టుకొచ్చాయి. ఆధ్యాత్మిక వాది అయిన రంగారావు గారు వీటి పట్ల చలించిపోయి కవితలు రాశారు. "ఈ శతాబ్ది రెక్కలు పై" కావ్యంలో 'నారీవాద పథం', 'దళిత స్వరం', 'దళితపథం' కవితలు రాశారు.

''స్త్రీవాద చైతన్యం భవిష్యత్తుకు ఉదయ రూపమిస్తుంది'' (పు.535) అనే భరోసా కలిగిందాయనకు. అందుకే "ఈనాటి స్త్రీ ఒక విజేత" (పు. 537) అని ప్రకటించారు. దళితులకు గతంలో జరిగిన అవమానాలుగా ప్రగతిశీలవాదులు చేసే వాదాన్ని రంగారావు గారు ఆమోదించారు. ''మనిషిని మనిషి బహిష్కృతి" (పు.538) అని నిరసించారు. దళితులను నీళ్ళుతాగనీకుండా ఆధిపత్య కులాలు అడ్డుకోవడాన్ని ఆయన తీవ్రంగా అధిక్షేపించారు.

*"ఊరుబయట చెరువులో నీరు దోసిట్లో*
*తళతళ మెరిసేను*
*త్రాగే ముందు తోటి మనిషి మరచిన*
*మానవతను జ్ఞాపకం చేసేను"* (పు.539)

దళితుల్లో క్రమంగా పుంజుకుంటున్న చైతన్యాన్ని




ఆహ్వానించిన కవి దళితులతో స్వరం కలిపి

*"ఇపుడు మేం దళితులు కాం*
*జ్వలితులం*
*ఇరవయ్యొకటో శతాబ్దపు ముఖబింబాలం"*
(పు.546) అని హెచ్చరించారు.

ఈ సంపుటంలో చివరి రెండు సంపూటాలు "అగ్ని పీఠం", "కిరణపథం". ఈ రెండూ 2002 లో వచ్చాయి. మొదటి సంపుటంలో క్రాస్ ఫైర్, సీజ్ ఫైర్, నేడు రేపుమధ్య అనే కావ్యాలున్నాయి. రెండో దానిలో స్వేచ్ఛకు సిగ్నల్, స్విచ్ ఆన్ అని రెండు భాగాలున్నాయి. ''నేడు రేపు మధ్య'' కావ్యంలో ఏముందో కవే ముందుమాటలో సూచించారు. "ఒకటీ రెండు భాగాల్లో వస్తువు భౌతిక పరిధుల్లో నిబంధింపబడింది. మూడో భాగంలో వస్తువు మనఃపరిధిలో చిత్రితమైంది" (పు.604) ఈ కావ్యంలో మొదటిభాగం ప్రకృతిపరంగా సంభవించిన లాతూర్, గుజరాత్ భూకంపాలు, ఒరిస్సా తుపాను, జపాన్ దీవులలో అగ్నిపర్వతం బద్దలు కావడం వస్తువు, రెండో భాగంలో మనుషులు సృష్టించుకునే యుద్ధాలు, అణ్వస్త్రాలు వంటివి వస్తువు. మూడవది కాలగమనంలో మానవమనోరూప ప్రదర్శనం వస్తువు. మొత్తం మీద ప్రకృతి, ప్రపంచం, మనస్సుల సంబంధాల కలయిక ఈ కావ్యం.

2002 నాటికి నక్సల్బరీ ఉద్యమం తీవ్రరూపం ధరించింది. కాల్పులు ఎన్ కౌంటర్లు రెండు వైపులా ప్రాణం నష్టం పెరిగిపోయింది. మేధావులు ఇరుపక్షాల మధ్య చర్చలు జరగాలని ఆకాంక్షిస్తున్నారు. ఇది "క్రాస్ ఫైర్" కావ్యనేపథ్యం. రంగారావు గారు చాలా ప్రతీకాత్మకంగా ఈ కావ్యం రాశారు.

*"న్యాయం కావచ్చు, చట్టం కావచ్చు, ప్రతీకారం కావచ్చు, ఆదర్శం కావచ్చు*
*జీవించే హక్కును మనిషి నుండి మాయం చేసే లోహపదం కారాదు"* (పు.564) అన్నది ఈ కావ్యం చేసిన ప్రతిపాదన. సమాజం నిరంతరం సంఘర్షణలో కొనసాగరాదనీ, విరామం అవసరమనీ ప్రపంచ పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని "సీజ్ ఫైర్" కావ్యం రాశారు. "జన సంభాషణ మృత్యుముద్ర చుట్టూ తిరుగుతూంది" (పు.589) అనే ఆవేదన ఉంది కవిలో. కార్గిల్ యుద్ధ కవితలు కూడా యుద్ధ విముఖత్వంతోనే రాశారు రంగారావు గారు.

*"కాశ్మీర్ సుందర స్వప్నం ఇపుడు ద్వేషఫలంగా మారుతూంది"* (పు.597) అనే ఆవేదన ఉంది కవిలో. "నిన్న నేడు మధ్య" కావ్యంలో ప్రకృతి వైపరీత్యాల వలన మానవ జీవితం అల్లకల్లోలం కావడం పట్ల కవిలోని ఆందోళనాత్మ ఆలోచనల పరంపర కనిపిస్తుంది.

*"తుపాను తాండవమైనా*
*భూకంపం ఆందోళనమైనా*
*మనిషిబలం ధనం సంకల్పం వికల్పం!*
*శక్తీ యుక్తీ ప్రజరూపం!.ప్రజ కోసం!*
*మానవ చైతన్యం అస్తిత్వం! సంస్కృతి!*
*సర్వం లక్ష్యం ఒకటే!*
*నవసమాజం!''* (పు.609) అని ఆయన ప్రతిపాదన చేశారు. ఉదారవాద ప్రజాస్వామ్యం ఆయనలో బలంగా నాటుకొని ఉంది.

21 వ శతాబ్దం మొదలవ్వగానే ప్రపంచం దద్దరిల్లేట్లు జరిగిన సంఘటన ప్రపంచవాణిజ్య సంస్థ భవనం మీద దాడి, కూల్చివేత. అమెరికా ఆధిపత్యంలోని సామ్రాజ్య వాద పెట్టుబడిదారి వ్యవస్థకు నిలువుటద్దం వంటి భవనం కూల్చివేతకు గురికావడం, అందులో అనేకమంది ప్రాణాలు కోల్పోవడం ప్రపంచం నివ్వెరపోయి చూచింది. రంగారావుగారు ''స్వేచ్ఛకు సిగ్నెల్'' కావ్యంలో వస్తువు ఇదే. దీనికి విషాదం పర్వం అని పేరు పెట్టారు.

*"ఈ శతాబ్ది ఆరంభం*
*రణనీతి చరిత్రలో బాంబింగ్ వ్యూహంతో*
*గగనతలం నుండి*
*వేటకు శ్రీకారం జరుగుతూంది"* (పు.635) అని కవి కొత్త శతాబ్ది బీభత్సంతో మొదలవ్వడాన్ని గుర్తించారు. రెండో భాగమైన కిరణపర్వంలో తీవ్రవాద యుద్ధధోరణులను కవి ఖండించాడు.

*"ఉన్మాదం గ్రూపుల్లో ఉన్నా*
*అద్దం పై రాయి విసిరి నట్లే"* (పు.641) అని హెచ్చరించారు. "స్విచ్ ఆన్" అనే చివరి భాగంలో కవి తనదైన ప్రజాస్వామ్య, మానవీయ సమాజ నిర్మాణావశ్యకతను చెప్పారు. అందుకే కవి "కిరణం మానవులకు సంకేతం" (పు.658) అన్నారు

మాదిరాజు రంగారావుగారు వ్యక్తి గానూ, కవి గానూ స్వేచ్ఛావాదే. అదే ఆయనలోని విలక్షణత. సామాజిక పరిణామాలను తృణీకరించకుండా వాటిని దట్టమైన భవుకతతో తనదొన స్వేచ్ఛా మార్గంలో కవితలుగా మలిచారు. పండిత శైలీ విన్యాసం ప్రదర్శిస్తూనే ప్రజలపక్షాన్ని విస్మరించలేదు.


***రచయిత సెల్: 94402 22117***

# అధికారభాష చిరునామా చెప్పిన

# ఆచార్య మాదిరాజు రంగారావు

**- టి. ఉదయవర్లు**

ప్రపంచ ప్రసిద్ధమైన సతీష్‌ధావన్ రోదసీ కేంద్రం ఉన్నది నిజానికి మన రాష్ట్రంలోని నెల్లూరు జిల్లా శ్రీహరి కోటలో. కాని ఆ కేంద్రం ఏర్పడిన నాటి నుంచి వారు అధికారికంగా ప్రకటించిన చిరునామాలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రస్తావనగాని, కనీసం నెల్లూరు జిల్లాలో ఉందని కాని లేదు.అదేమి చిత్రమోగాని చెన్నైకి (మద్రాసు) వంద కిలోమీటర్ల దూరంలో ఉందని వారి వెబ్‌సైట్‌లో, వారి సమాచార లేఖలలో, ఇతర రాతకోతలలో పేర్కొనేవారు.

ఈ విషయం గమనించిన ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం అధ్యక్షులు నిజానిజాలు తెలుపుతూ "ఇస్రో" అప్పటి అధ్యక్షులు మాధవన్ నాయర్‌కు నిరసనతో కూడిన లేఖ వ్రాశారు. అంతే వారి చిరునామాలో ఆనాడు ఆంధ్రప్రదేశ్ చేరిపోయింది.

అంతేకాదు రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నగరం నడిబొడ్డున ఆబిడ్స్‌లో ఉన్న కేంద్ర తంతి తపాల కార్యాలయం (జి.పి.ఓ) పై దశాబ్దాలుగా ఇంగ్లీషు, హిందీ భాషల నామఫలకం మాత్రమే ఉండేది. నామ ఫలకంలో తొలుదొలుత రాష్ట్ర అధికార భాష తెలుగుకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరుతూ పోస్ట్‌మాస్టర్ జనరల్‌కు భాషా సంఘం అధ్యక్షులు లేఖ వ్రాయడంతో వెంటనే ఆమేరకు వారు చర్య తీసుకున్నారు.

దేశవిదేశీయుల సౌకర్యార్థం విమానాల రాక పోకలకు సంబంధించిన ప్రకటనలు రాష్ట్ర రాజధానిలో ఇంగ్లీషు, హిందీతో పాటుగా అధికార భాష – తెలుగులోను చేయాలని అధికార భాషా సంఘం సూచించడంతో తక్షణం వారు దాన్ని అమలు చేశారు.

వీటన్నింటినిమించి – తెలుగుకు ప్రాచీన భాషా ప్రతిపత్తి ఇవ్వకుండా కొందరు కుట్రచేసి, దేవభాషగా చెప్పే సంస్కృతం కన్నా ముందుగానే తమభాష ప్రాచీనమైందని రాజకీయం చేసిన వారి కళ్ళు తెరిపించడానికి ఆనాటి ముఖ్యమంత్రి డా.వై.ఎస్. రాజశేఖరరెడ్డి చేయూతతో భాషా సంఘం పక్షాన తెలుగు భాషా ప్రాచీన ప్రతిపత్తి సాధన సారథ్య సంఘంలో కీలక సభ్యుడై భాషా ప్రాచీనతను రుజువుచేసే సకల అంశాలు శీఘ్రంగా సేకరించి నిపుణుల సంఘానికి అప్పటి ప్రధాని డాక్టర్ మన్మోహన్‌సింగ్ ద్వారా సమర్పించి, వెంటపడి చివరికి లక్ష్యం సాధించడానికి దోహదపడింది భాషా సంఘం అప్పటి అధ్యక్షుడు, సీనియర్ జర్నలిస్టు ఎబికె.ప్రసాద్ అక్షరాల పని రాక్షసుడై వ్యవహరించడం వల్లనే.

ఇదంతా ఎందుకు చెప్పవలసివచ్చిందంటే అధికారభాష మండల స్థాయి నుంచి సచివాలయ స్థాయిదాకా అమలైనప్పుడే రాష్ట్ర ప్రయోజనాల పరిరక్షణ పొందడంతోపాటు రాష్ట్ర గౌరవం పెరుగుతుంది. సంస్కృతి పతాకం రెపరెపలాడుతుంది.

ఆచార్య మాదిరాజు రంగారావు గారు స్వేచ్ఛా కవిత్వంతోపాటుగా మధ్యమధ్య తమ విమర్శనా పాటవాన్ని వెల్లడిస్తూ వెలువరించిన సమాలోచన సాహిత్యంలో "అధికారభాష" కూడా చోటు చేసుకున్నది. ఈ లఘు పరిశోధనాత్మక వ్యాసాన్ని వారి సహచరుడు, సంప్రదాయ మూలాలకు, ప్రగతి శక్తులకు మధ్య సమన్వయాన్ని కోరే సాహితీమూర్తి – కేతవరపు రామకోటి శాస్త్రికి అంకితమిచ్చారు.

ఈ సుదీర్ఘ వ్యాసంలో అధికారభాష – తెలుగు, తెలుగులో సాధారణ పాలన, తెలుగులో న్యాయపాలన, విద్యామాధ్యమం – తెలుగు అనే శీర్షికల క్రింద పలు అంశాలు చర్చించారు.

వాస్తవానికి తెలుగు సాహిత్య భాషగా ఆదరణ పొందినప్పటికీ, పాలనా భాషగా మాత్రం మౌఖిక రూపంలో పరిమితమైన పరిధిలో ప్రచలితమైందని తెలిపారు. అంతేకాకుండా క్రీ.శ.6,7 శతాబ్దాల నుంచి లిఖిత రూపం పొందిన సూచలున్నాయన్నారు. రేనాటి చోళుల కాలం ఈ స్థితికి ఆరంభ దశగా పేర్కొన్నారు. ఆ తర్వాత కాకతీయులు, వెలనాటి చోళులు, రెడ్డిరాజులు, రేచర్ల వెలమలు, విజయ నగర రాజులు, గజపతులు, కులీకుతుబ్‌షాహీ సుల్తానులు తమ పాలనా కాలంలో ఈ తెలుగు గడ్డపైన తెలుగును ప్రోత్సహిస్తూ వచ్చారు. ఆంగ్లేయులు ఆంధ్రప్రాంతంలో, నిజాం రాజులు తెలంగాణాలో తెలుగుకు తగు ప్రోత్సాహం కల్పించారు. ఆ కాలంలో అంటే రాజుల కాలంలో రాజభాషగా వ్యవహరించిన భాషనే దేశ స్వాతంత్ర్యానంతరం ప్రజాస్వామ్యంలో అధికార భాషగా పేర్కొనడం జరిగింది. ప్రభుత్వ కార్య కలాపాల నిర్వహణలో శాసన పాలన, న్యాయ, విద్య మొదలైన వ్యవహారాల్లో అధికార స్థాయిలో ఉపయోగించే భాషే అధికార భాషైంది. ప్రజాస్వామ్యంలో ప్రాంతీయ భాషలకు ఈ అవకాశం రావడం అనివార్యమయింది.

అయితే 1953లో ఆంధ్రరాష్ట్రం ఏర్పడిన తర్వాత తెలుగు అధికారభాష అయింది. ఆ తర్వాత 1956లో తెలంగాణ విలీనమై ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ తొలి భాషాప్రయుక్త రాష్ట్రంగా ఆవిర్భవించిన తర్వాత 1966లో అధికారభాషా చట్టాన్ని తేవడం జరిగింది. ఆ తర్వాత 1974వ సంవత్సరంలో అధికారభాషా సంఘం ఏర్పడింది. తొలి అధ్యక్షులుగా వావిలాల గోపాలకృష్ణయ్య నియామక మయ్యారు. 1967, 1968, 1973, 1974, 1976, 1977 సంవత్సరాల్లో అంచెలంచెలుగా శాసన సంబంధమైన, శాసనేతరమైన అవసరాలకు కూడా తెలుగు వాడకాన్ని విస్తరింపచేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అధికార భాషే, రాష్ట్ర మాతృభాష అయిన తెలుగును పరిపాలనలో అన్ని స్థాయిలలో ముమ్మరంగా అమలు చేయడానికి, సామాన్యుడికి కూడా అర్థమయ్యే రీతిలో పరిపాలన సాగించడానికి దోహదపడే ప్రయత్నంలో అధికార భాషగా తెలుగును ప్రకటించడం జరిగింది.

అధికార భాషా సంఘంలో ఒక అధ్యక్షుడు, నలుగురు సభ్యులు, సంఘం కార్యదర్శిగా సచివాలయ స్థాయిలో ఉప/సంయుక్త కార్యదర్శి హోదాలో ఉన్నవారు కొనసాగించడానికి ఉత్తర్వులిచ్చారు. ఈ అధికార భాషాసంఘం ప్రభుత్వ అవసరాలకు, తెలుగు వాడకానికి సంబంధించిన ప్రగతిని సమీక్షించి ప్రభుత్వానికి తగు సిఫార్సులు, సూచనలు చేయాలి. ఇప్పటి వరకు అధికార భాషా చట్టంలోని మూడవ సెక్షన్ ప్రకారం బిల్లులు, ఆర్డినెన్సులు, ప్రభుత్వ ఉత్తర్వులు, నిబంధనలు, నియమాలు, ఉత్తర ప్రత్యుత్తరాలు – అన్నీ కూడా విధిగా తెలుగులోనే ఉండాలనీ, అధికార భాషా సంఘం ప్రభుత్వం ద్వారా ఎన్నో ఉత్తర్వులు జారీచేసింది.

తొలి అధ్యక్షుడు వావిలాల గోపాలకృష్ణయ్య తర్వాత ఇప్పటి వరకు 17 మంది అధికారభాషా సంఘం అధ్యక్షులుగా మారినా, నానాటికి దిగదుడుపుగా మారి ఎక్కడ వేసిన గొంగడి అక్కడే ఉన్న చందాన ఉంది.

ఒకప్పుడు ఏడు జిల్లాల్లో నూటికి నూరు శాతం తెలుగు అమలు జరిగింది. ఇంకా శాఖాధిపతుల కార్యాలయాలు, రాష్ట్ర పాలనకు కేంద్ర బిందువైన సచివాలయంలో తెలుగు వాడకం ఆశించిన స్థాయిలో లేదన్న విమర్శలు ఉన్నప్పటికీ, ఇప్పుడైతే సచివాలయమే కాదు, జిల్లాస్థాయిలోనూ "అధికార భాష – తెలుగు ఎక్కడమ్మా ! నీ చిరునామా" అని టార్చిలైటు వేసి వెతకవలసిన పరిస్థితులు దాపురించాయి.


తెలుగు మాధ్యమం పట్ల ప్రభుత్వానికే చిన్న చూపు ఉండి, తెలుగు మాధ్యమం పాఠశాలలను ఆలోచనా రహితంగా ఇంగ్లీషు మాధ్యమం పాఠశాలలుగా చేయడం వల్ల విద్యార్థుల భాషా జ్ఞానం "రెండింటికి చెడిన రేవడు" లాగయింది.

భారతదేశంలో అత్యధికులు మాట్లాడే హిందీభాష తర్వాత రెండవ స్థానంలో తెలుగు ఉండేది. అందుచేత బ్రిటీష్ పాలన కాలంలో 1943 నాటి నాణెలమీద ముద్రించిన నాలుగు భాషలలో – "తెలుగు భాష" కూడా ఉండేది. అప్పుడు దేశంలో రెండో స్థానంలో ఉన్న తెలుగు ఇవాళ్ళ నాలుగో స్థానానికి పడిపోయింది. ఇంతకాలం మూడో స్థానంలో ఉన్న బెంగాలి రెండవ స్థానంలోకి చేరింది. మూడోస్థానాన్ని మరాఠీభాష ఆక్రమించింది. తెలుగు భాష స్థానం నాలుగైంది. ఇదంతా ఆయా ప్రభుత్వాల ఆనాలోచిత చర్యల వల్లనే సంభవించింది.

వాస్తవానికి 2005 – 2009 లో ఎబికె.ప్రసాద్ తర్వాత తెలంగాణ ప్రభుత్వంలో నియామకమైన అధ్యక్షుడు కడుపులో చల్ల కదలకుండా కుర్చీకి అతుక్కుపోయి, దాదాపు పదేండ్లు ఏ ఒక్క జిల్లా పర్యటించకుండా, ఏ ఒక్కశాఖ పర్యవేక్షించకుండా అసలు తెలుగు అమలు సమీక్ష కూడా జరపకుండా కాలం గడిపారు. ఆయన తర్వాత వచ్చిన మహిళా అధ్యక్షులు కుర్చీ పదిలపరచు కునేంతలోనే ఎన్నికలొచ్చి ఆ ప్రభుత్వం అధికారం కోల్పోయింది. ఇక కొత్తగా వచ్చిన ప్రభుత్వం రెండేండ్లు గడచిపోయినా అధికార భాషపట్ల దృష్టి పెట్టలేదు. ఆ సంఘానికి ఒక అధ్యక్షుణ్ణి వేయాలనే అంశానికి ఏమాత్రం ప్రాధాన్యమివ్వక పోవడం వల్ల అధికారభాష అమలు ఇవాళ్ళ నానాటికి తీసికట్టు నాగం బొట్లు అన్న విధంగా తయారైంది.

కనీసం లోగడ ఎబికె.ప్రసాద్ హయాంలో అధికారభాషగా తెలుగు అమలుకు దోహదంచేసే 40 ప్రత్యేక ప్రచురణలు వెలువరించారు. వాటిలో ముఖ్యమైనది ఉద్యోగుల ఉపయోగార్థం ప్రచురించి న సర్వీసు నిబంధనావళి పుస్తకాలు, శాఖాపరమైన పదకోశాలు, సచివాలయ ఆదేశాలు, తెలుగు భాష ప్రాచీనతకు ఆధారాలైన పుస్తకాలు, తెలుగులో న్యాయస్థానాల తీర్పులు, ఉర్దూ–తెలుగు నిఘంటువు మొదలైనవి ఉన్నాయి. అవి ఎప్పటికప్పుడు మారు తున్న ఉద్యోగులకు అందుబాటులో ఉంచడానికి పునర్ముద్రణలు చేయవలసిన అవసరం ఉంది.

ఇది కాకుండా భాషాసంఘం అనుసరించవలసిన విధానాలు ఏమిటంటే రాష్ట్ర అధికార కార్యక్రమాలకు తెలుగు భాషను ఉపయోగించడంలో సాధించిన ప్రగతిని సమీక్షించాలి. రాష్ట్ర అధికార కార్యక్రమాలలో ఆంగ్లభాష ఉపయోగంపై నిర్బంధాలువంటి అంశంపై తన సిఫారసుల ప్రభుత్వానికి నివేదించాలి. ఇక జిల్లాల్లో తెలుగు అమలు తీరు పరిశీలించడానికి జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో జిల్లా సమీక్ష సంఘాలను అధికార భాషా సంఘం నియమిస్తుంది. అంతేకాక జిల్లామొత్తం మీద తెలుగు అమలు పై అన్ని స్థాయిలలోను జరుగుతున్న తీరు జిల్లా కలెక్టర్ ప్రతినెల తన నివేదికను పంపాలి. అదేవిధంగా రాజధానిలోని శాఖాధిపతుల కార్యాలయాలకు ప్రతినెల తనిఖీ అధికారులను పంపి, వారి కార్యాలయాల్లో తెలుగు అమలుపై తనిఖీ చేయించి వారి నివేదికలతో పాటు శాఖాధిపతుల నుంచి



కూడా నివేదికలు తెప్పించి, వాటిని సమీక్షించి తగు సూచనలు, సలహాలు వారికి ఇవ్వవలసి ఉంటుంది. కాని సంవత్సరాలకు సంవత్సరాలు అధికార భాషా సంఘాన్ని ప్రభుత్వం నియామకం చేయని దృష్ట్యా, ప్రతిస్థాయిలోను తెలుగు వాడకం గణనీయంగా పడిపోయింది.

బండిని లాగే కోడెలెంత చురుకైనవైనా, ములుకర్ర అవసరమైనట్టే, నడిచే పాలనా శకటానికి అనుసంధానమైన అధికారులు పాలనా భాషగా 'తెలుగు' అమలు సరిగా చేస్తున్నారో, లేదో పర్యవేక్షణకు ములుకర్రలాంటి అధికారభాషా సంఘం ఉనికి అనివార్యం. పాలనా వ్యవహారాలలో తెలుగు అమలై తీరాలనే పట్టుదల ప్రభుత్వానికుంటే భాషా సంఘానికి తగిన అధికారాలను ఇస్తే చురుకైన అధ్యక్షుడికి లక్ష్య సాధన నల్లేరుమీద నడకయ్యేది.

తెలుగులో న్యాయపాలన గురించి వివరించిన విభాగంలో న్యాయశాస్త్రంలోని వివిధ శాఖలకు చెందిన ప్రధానమైన గ్రంథాలు తెలుగులో అందు బాటులోకి తేవాలని సూచించారు. అనువాదంలో మూలంలోని అర్థానికేమాత్రం భంగం కాకూడదన్నా రు. అర్థంలో మార్పువల్ల నష్టం వాటిల్లే ప్రమాదం ఉంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం న్యాయశాఖ లో ఈ పనికై ఒక విభాగాన్ని ఏర్పాటు చేసింది. తెలుగులోకి అనువదించిన వాటిని పరిశీలించి ఆమోదించే సంఘం కూడా లోగడ నియామకం చేశారు. కాని ప్రస్తుతం అవి ఏ స్థితిలో ఉన్నాయో చూచే నాథుడు లేడు.

దేశంలో వివిధ న్యాయస్థానాలలో జరిగిన నిర్ణయాలు, వివరణలు, వ్యాఖ్యానాలు ముఖ్యమైనవి తెనిగించాలని ఆచార్య మాదిరాజు రంగారావు సూచించారు. రాష్ట్రాల్లో హైకోర్టులు సుప్రీం కోర్టుల్లోని వాదాలు, తీర్పులు తెనిగించాలనీ, న్యాయస్థానాల్లో తెలుగు భాష, న్యాయ శాస్త్రానికి సంబంధించిన మంచి గ్రంథాలయాలు ఏర్పాటు చేయాలి. ఇప్పటినుండైనా తెలుగులోనే చట్టాలు రూపొందించాలి. తెలుగులోనే నియమ నిబంధనలు వ్రాయాలన్నారు.

వివిధ హైకోర్టులలో న్యామూర్తుల తీర్పులు ఎప్పటికప్పుడు ప్రాంతీయ భాషలోకి అనువదించాలి. వాదప్రతివాద పత్రాలు, అర్జీలు మొదలైనవి తెలుగులో ఉండాలనీ, సాక్ష్యం తెలుగులో జరగాలనీ, న్యాయవాదులు తెలుగులో వాదించాలని సూచించారు. న్యాయమూర్తుల తీర్పులు, ఉత్తర్వులు, డిగ్రీలు మొదలైనవి తెలుగులో వెలువరించాలని, న్యాయశాస్త్ర పదజాలం తెలుగులో నిర్దిష్టంగా ప్రమాణీకరించాలని కూడా వారు సూచించారు.

విద్యామాధ్యమం – మాతృభాష తెలుగు అనే శీర్షిక క్రింద తెలుగులో అవసరమైన పాఠ్య పుస్తకాలు సప్రమాణంగా ప్రచురించాలనీ, వాటికి అనుబంధం గా వివిధ విషయాలపై విశేష గ్రంథాలను వెలువరించాలన్నారు. ఆయా విషయాలకు సంబంధించిన విజ్ఞాన సర్వస్వాలను, విజ్ఞానప్రదమైన మౌలిక గ్రంథాలను తెనిగించాలన్నారు. శాస్త్ర సాంకేతిక అంశాలను తెలుగులో నేర్చుకోవడానికి, బోధించడానికి, పరిశోధించడానికి తగిన వాతావరణాన్ని నెలకొల్పాలన్నారు.

రాష్ట్రంలో అధికారభాషగా సాధారణ పాలన, న్యాయపాలన, విద్యామాధ్యమంగా తెలుగు భాష విజయవంతంగా అమలు చేయుడానికి – అధికారభాషకూ విద్యామాధ్యమానికీ కావలసిన పరిభాషను తెలుగులో సిద్ధం చేసుకోవాలన్నారు.

అవసరమైతే ఇతర భాషా పదాలను తీసుకుని వాటిని యథాతథంగానో లేక తెలుగు భాషా స్వరూపాన్ని దృష్టిలో ఉంచుకుని భాషా దారిద్ర్యాన్ని నివారించాలి. శాసనాలు, చట్టాలు, బిల్లులు, నియమ నిబంధనలు, అధికారిక పాఠాలు తెలుగులో ప్రామాణికంగా రావాలన్నారు.

పిటీషన్ మొదలైన ఎన్నో వ్యావహార పత్రాల నమూనాలను, విషయ రూపాలను ప్రామాణికంగా సిద్ధం చేయాలని సూచించారు. అన్ని ప్రభుత్వ శాఖల్లో విద్యా సంబంధమైన క్షేత్రాల్లో అన్ని సందర్భాలలో ఒకేవిధమైన పరిభాషను రూఢిచేయాలి. మధ్యమధ్య పాలనారంగంలోనూ, న్యాయరంగంలోను, విద్యారంగంలోను తెలుగు అమలు గురించి శిక్షణ తరగతులు, గోష్టులు, చర్యలను నిర్వహించాలి. ఇలాంటి సకల చర్యలు తీసుకోడానికి, వాటిని అమలుకు దోహదం చేయడానికి విద్యావేత్తలతో నిపుణులతో ఒక సంస్థను ఏర్పాటు చేస్తే మంచిదని ముగించారు.

## అనువాద కళ

ఈ గ్రంథంలోనే 'అనువాదకళ' గురించిన ఆచార్య మాదిరాజు రంగారావుగారి అర్థవంతమైన, సమగ్రమైన మరొక వ్యాసమున్నది.

అనువాదమంటే అనుసరించి చెప్పడం. ఒక భాషలోని విషయాన్ని మరో భాషలోకి యథాతథంగా అనుసరించడం. దీన్నే భాషాంతీకరణమని అంటారని వారు వివరించారు. ఇందులో అనువాద స్వరూపం, అనువాద విధానాలు, కవిత్వానువాదం అను సృజన, నాటకానువాదం, అనువాద పద్ధతులు, అనువాద సమస్యలు పరిభాష, పరిభాష – పదకల్పన – అన్యభాషా పదస్వీకారం, అనువాదకుని బాధ్యతలు, అనువాద ప్రయోజనం అనే ఉపశీర్షికలతో వారు పాఠకునికి ఇట్టే అరటిపండు ఒలిచిపెట్టిన విధంగా సులభం, సుస్పష్టం చేశారు.

ఒక భాష మాట్లాడే వారి ఆలోచనను మరోభాష మాట్లాడేవారికి తెలిపే కార్యం కాబట్టి ఒకరి అనుభవాన్ని ఆ భాషరాని మరొకరికి తెలియజేయడంతోపాటు సాంస్కృతిక బంధాన్ని ఏర్పరచడము జరుగుతుందన్నారు. ఒక్కొక్క భాష ఒక్కక్క ప్రత్యేకతను కలిగి ఉంటుంది కాబట్టి అనువాదం సంపూర్ణమైన తృప్తినీయకపోవచ్చునని కూడా ఆయన అభిప్రాయపడ్డారు. సోదరభాషలైనా మూలభాష అనువాదభాష ఒకే విధంగా ఉండవు. పైగా సోదర భాషలు కాకపోతే మరీ విభేదిస్తాయని, ఈ కారణం చేత సాధ్యమైనంత వరకు సమానత్వాన్ని పాటించాలన్నారు.

నిజానికి అనువాదం ఒక కళ. ఇది వివిధ భాషల మధ్య జాతుల మధ్య, సంస్కృతుల మధ్య, దేశాలమధ్య స్నేహబంధమైంది. అయితే అనువాదం యథాతథంగాను, యథాసంభవంగాను, స్వతంత్రంగాను ఉండవచ్చు. స్థూలంగా యథాతథంగా ఉండేది అనువాదమనీ, దీనికి భిన్నంగా ఉండేది యథాసంభవమనీ, స్వతంత్రమై ప్రతిభాయుతమైంది అనుస్పందన అనవచ్చు. అన్నిటిని కలిపి అనువాదమని అంటున్నాము. అనువాదకుని శక్తి, లక్ష్యం, ప్రతిభను బట్టి ఒక రచనకు అనువాదాలు వేరువేరుగా ఉండ వచ్చు ననీ, విషయం ఒకటే అయినా ప్రయోజనాభిలాషను బట్టి అనువాదం భేదిస్తుందని వివరించారు.

ఆధునిక యుగంలో వివిధ భాషల మధ్య, దేశాలమధ్య, జాతుల మధ్య సంబంధాలు పెరగడంతో ఒక్క సాహిత్యమే కాదు, శాస్త్ర సాంకేతికాంశాలు ఇంకా అనేక విషయాలు అనువదించడం జరుగుతున్నవి. సంస్కృతి, విజ్ఞానం, సార్వకాలికాలయి వరకు అనువాద ప్రక్రియ అవ్యాహతంగా సాగుతూనే ఉంటుందని ఆచార్య మాదిరాజు రంగారావు నొక్కిచెప్పారు.

పైగా పదం, పదబంధం, వాక్యం, సామెత, జాతీయం, వాక్యాంశం, ఉపవాక్యం కారకంలో ప్రత్యేకతలు కలిగి భాషా స్వరూపం మనదృష్టికి వస్తున్నందున, మరో భాషలో జరిగే అనువాదంలో ఈ ప్రత్యేకతలను సంపూర్ణంగా సాధించడం కష్టమని కూడా వారు స్పష్టం చేశారు.

అనువాదం విషయాన్నిబట్టి మాదిరాజుగారు నాలుగు విధాలుగా విడగొట్టారు. వాటిని సామాన్యం, సాధారణం, శాస్త్రీయం, సాహిత్యకంగా వారు వింగడించారు. ఒక్కొక్కదాని గురించి సోదాహరణంగా చెప్పారు.

కవిత్వానువాదం – అను సృజన గురించి వారు చెబుతూ – కవిత్వాను వాదం ఏమాత్రం సులభం కాదన్నారు. ఈ సందర్భంలో శబ్దం, భాష, శైలి, అభివ్యక్తి, ఛందస్సు లేదా గమనం, ఆవేశస్థాయి, అనుభూతి సాంద్రత, అర్థ స్ఫూర్తి, లక్ష్యం అనే అంశాలను దృష్టిలో ఉంచుకోవలసి వస్తుందన్నారు.

కవిత్వానువాదంలో మూలంలోని అన్నీ శబ్దాలకు సమానమైన పదాలు దొరకకపోవచ్చు. అలంకార శక్తిని యథాతథంగా తీసుకురావడం కష్టం. భాషాగతమైన వైచిత్రి, విన్యాసం నుండి కాకువు వరకు నిక్షిప్తమైంది. అనువాద భాషా వైచిత్రి వేరుగా ఉండవచ్చు. భాషా లక్షణాలన్నీ కుదరకపోవచ్చుననే సందేహపడ్డారు. అట్లాగే మూలంలోని ఛందస్సు అనుబంధంలో కుదరకపోవచ్చు. అనువాద సందర్భంలో సహజమైన సృజనాత్మకశక్తిని అణచుకోవడం కష్టం. అంతేకాక మూల రచయిత పొందిన ఆవేశస్థితి, అనుభూతి సాంద్రత యథాతథంగా అనుభవంలోకి రాదు. ఇక ఇలాంటి ఐదారు సమస్యలు వారు ప్రస్తావించారు. ఈ సమస్యలను దృష్టిలో పెట్టుకునే కాబోలు "Poetry cannot be translated" అన్న మాట ఏర్పడిందని మాదిరాజుగారు మనవి చేశారు.

పోతే "నాటకానువాదం" గురించి మరో ఉప శీర్షికలో సాహిత్యంలో ఒక్కొక్క ప్రక్రియకు ఒక్కొక్క విధంగా అనువాద కార్యాన్ని చెపట్టవలసి ఉందన్నారు. ముఖ్యంగా నాటకానువాదానికి నాటక సిద్ధాంత పరిచయంతో పాటుగా రంగస్థల పరిజ్ఞానం అవసరమన్నారు. నాటకంలో వాడిన భాష దాని స్వరూప స్వభావాలు, ఏ కాలానికి చెందినది తెలుసుకోవాలి. నాటకంలో అభినయంతోపాటు సంభాషణలు ముఖ్యం కాబట్టి ఈ రెండింటిని గురించి అధ్యయనం చేయవలసి ఉంటుందన్నారు. ముఖ్యంగా సంభాషణల్లో మానసిక స్థితినీ, భాషాశక్తినీ, ప్రయోగ వైచిత్రినీ గమనించవలసి ఉంటుందన్నారు.

అనువాద పద్ధతుల గురించి ప్రత్యేకంగా మరో ఉపశీర్షికలో గొప్ప గ్రంథాల అనువాదంలో మూల రచయిత ప్రతిభతో, శిల్పశక్తితో సమానంగా అనువాదకర్త కన్పించడం కద్దు అన్నారు. అయినా అనువాద పద్ధతులను వారు ఎనిమిది రకాలుగా చెప్పారు. అందులో పద వాక్యానువాదం, భాషానువాదం, ఛాయానువాదం, సార సంగ్రహానువాదం, వ్యాఖ్యానువాదం, రూపాన్తరం, అనువాదం, స్వతంత్రానువాదాలను ప్రస్తావించి, ఒక్కొక్క దాని గురించి విస్తారంగా చెప్పారు.

ఆ తరువాత 'అనువాద సమస్యలు – పరిభాష గురించి చెబుతూ, వివిధ దశలలో వివిధ స్థాయిలలో విద్యార్థులకు ఉపయోగపడే విధంగా విషయ పరిజ్ఞానంపై దృష్టితో గ్రంథాలు రావలసి ఉందనీ, తెలుగులో విశేష ప్రసంగాలు లేదా విస్తరణోప న్యాసాలు ఏర్పాటు చేయాలన్నారు. తెలుగులో క్విజ్‌లు నిర్వహించాలనీ, తెలుగులో విషయ విభాగం దృష్ట్యా పత్రికలను నిర్వహించాలనీ, తెలుగులో పుస్తకాల సేకరణతో విద్యార్థులకు ఉపయోగపడే విధంగా గ్రంథాలయాలను ఏర్పాటు చేయాలని సూచించారు. అనువాదాల విషయంలో ముఖ్యంగా శాస్త్ర సాంకేతిక క్షేత్రాలకు సంబంధించిన వాటిపట్ల శ్రద్ధతో వ్యవహరించాలన్నారు.

పదాల ప్రమాణీకరణ గురించి వివరిస్తూ స్టాటిస్టిక్స్ (Statistics) ను ఒకరు స్థితి శాస్త్రమనీ, ఇంకొకరు నిశ్చల శాస్త్రమనీ, వేరొకరు ఘన శాస్త్రమనీ, మరొకరు మరొక పదం వాడడం మానివేసి ఇంగ్లీషు భాషలో మాదిరిగా ఒకే పదం ప్రామాణీకృతం కావాలన్నారు.

ఇదేవిధంగా మరో ఉదాహరణ చెబుతూ – రిప్రొడక్షన్ (Reproduction) ను ఒకరు పునరుత్పత్తిలనీ, ఇంకొకరు – సంతానోత్పత్తి అనీ, మరొకరు – ప్రత్యుత్పత్తి అనీ, వేరొకరు వేరొక పదం వాడడం మానివేసి ఇంగ్లీషు భాషవలెనే ఏదో ఒక పదం ప్రామాణీకృతం కావాలన్నారు.

ఇక న్యాయశాస్త్రంలో ఒకే అర్థం వచ్చేట్టు పైకి

కన్పించే పదాన్ని వివిధ సందర్భాలలో వాడడం కద్దు. వీటిని పరిశీలించి తెలుగులో ఏ పదానికి ఆ పదం రూఢిగా ఉపయోగించాలన్నారు. అవసరమైతే కొత్తపదాలను నిర్మించు కోవాలన్నారు. అది సాధ్యం కాకపోతే మరో భాషనుంచి లేదా ఇంగ్లీషు నుంచి స్వీకరించవచ్చునన్నారు.

కొన్ని ఉదాహరణలు ఆచార్య మాదిరాజువారు ప్రస్తావిస్తూ (1) Investigation (by the police) (2) Enquiry (by the magistrate) (3) Trial (by the Judge) ఈ మూడింటికి తెలుగులో 'విచారణ' అనే పదాన్ని వాడుతున్నాము కాని అది ఎంత మాత్రం సముచితమైంది కాదన్నారు. దీనివల్ల అనేక సమస్యలు ఉత్పన్నమవుతాయనీ, న్యాయస్థానాల్లో తీవ్ర పరిణామాలకు దారితీస్తాయని హెచ్చరించారు.

అట్లాగే Announcement, publication, Advertisment, Broadcasting, Declaration పదాలకు తెలుగులో సరైన పదాలు రూఢీ కాలేదని అట్లాంటి పదాలు అనేకం ఉన్నాయన్నారు.

భాషావేత్తల సంస్థ లండన్‌లో ఏర్పాటు చేసిన సంఘం తయారుచేసిన నివేదిక, సాంకేతిక పదాల ఎన్నికలో అందరూ అంగీకరించిన నియమావళి ప్రకారం, ఒకపదం ఒకే అర్థం కలిగి ఉండాలి. వాడుక భాష నుంచి సాధ్యమైనంత వరకు పదాన్ని గ్రహించాలి. ఒకవేళ పదాన్ని సృష్టిస్తే అది సహజంగా, అర్థవంతంగా ఉండాలి. సులభంగా పట్టుపడేవైతే, బాగా ప్రచారంలో ఉండే విదేశీ భాషల్లోని పదాలను సైతం గ్రహించవచ్చునని అంగీకరించారు. శాస్త్ర, సాంకేతికానువాదాల్లో నిర్దిష్టత, స్పష్టత ముఖ్యం కాబట్టి అనువాదం చేసే భాష సహజ లక్షణాల్ని కోల్పోకూడదని నియమావళిలో మొత్తం పది అంశాలను పేర్కొన్నారు.

పరిభాష – పదకల్పన – అన్యభాషా పద స్వీకారం, అనువాదకుని బాధ్యతలు, అనువాద ప్రయోజనం గురించి మూడు వేరువేరు శీర్షికల క్రింద విస్తారంగా చర్చించారు.

లోగడ మన విద్యార్థుల పాఠ్యపుస్తకాల నిమిత్తమై పండితులుగా ప్రభుత్వం పరిగణిస్తున్నవారు నిర్ధారించిన పదాలు పిల్లిని పిల్లి అనకుండా మార్జాలం అన్నట్టుగా ఉన్నాయి.

కొన్ని ప్రభుత్వ శాఖలు వాడే తెలుగు పదాల కంటే ఇంగ్లీషు పదాలే సులభంగా అర్థమవుతాయి. "ఎమిషన్స్" ను ఉద్గారాలు అంటే ఎంతమందికి తెలుస్తుంది?

అట్లాగే "రైల్ సిగ్నల్" ను "ధూమశకట గమనాగమన స్తంభాగ్ర చిహ్నఫలకం" అని పాండిత్యమంతా ఒలకపోస్తే పిచ్చి అంటారు. కొన్ని ప్రాంతాల్లో వాడుకలో ఉన్న 'రెక్కమాను' అనవచ్చు. 'సిగ్నల్' అన్నా తప్పులేదు. అంతగా మడికట్టుకుని కూచుని ఇతర భాషాపదాలు తెలుగులో ప్రవేశించకుండా చేస్తే భాష ఇట్లా వృద్ధిచెందుతుంది.

ఇంగ్లీషు పదాన్ని మక్కికి మక్కి అనువదించినప్పుడు విపరీతార్థం రాకుండా చూచుకోవాలి. 'వైర్‌లెస్' అంటే వితంతు అనకూడదు కదా! అట్లాగే కోపరేషన్ అనే పదం మహిళల విషయంలో వాడినప్పుడు పరపతి సౌకర్యం అనడం ఎంత నీచంగా ఉంటుందో ఊహించగలగాలి. ఇట్లా ఇంకా ఎన్ని పదాలైనా చెప్పొచ్చు.

ఒక పత్రిక 'Round Table Conferance' అనే పదాన్ని గుండ్ర బల్ల సమావేశం అని వాడడం ఎంత కృతకంగా ఉందో వేరుగా చెప్పనవసరం లేదు.

ఏమైనా "కాటుక కంటినీరు చనుకట్టు పయిబడ నేల నేడ్చెదో" అని వాగ్దేవిని ఓదార్చిన పోతననే, తెలుగు పదాల అనువాదాలు చూచి, ఆయన కూడా ఆమెతో కలిసి విలపించవలసిన దారుణ పరిస్థితి ఏనాటికీ ఏర్పడకూడదు.

*రచయిత సెల్: 98856 86415*



# సంక్షిప్త పరిచయం

మాదిరాజు రంగారావు గారి జననం జూన్ 8, 1935న పండితపురం గ్రామం, ఖమ్మం, తెలంగాణ రాష్ట్రం.మాదిరాజు రంగారావు ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యను పూర్తి చేసి నిజాం కాలేజీ ఉస్మానియా యూనివర్సిటీ (O.U), హైదరాబాద్, తెలంగాణాలో చేరారు. మాదిరాజు రంగారావు తెలుగు మరియు సంస్కృత సాహిత్యంలో M.A. సంస్కృతం 1960 (O.U), M.A. తెలుగు 1962 (O.U), Ph.D. తెలుగు 1966 (O.U) మరియు యూనివర్శిటీ గ్రాంట్స్ కమిషన్ (UGC) యొక్క పరిశోధనా పండితులు.


డాక్టర్ మాదిరాజు రంగారావు ఆంధ్ర మహాభారతం మరియు ఆంధ్ర మహాభాగవతం యొక్క విమర్శనాత్మక సంచికల సంపాదక మండలిలో సభ్యులుగా ఉన్నారు. 1964లో హైదరాబాద్‌లోని ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు విభాగంలో డాక్టర్ మాదిరాజు రంగారావు గారికి మొదటి విద్యాసంబంధ నియామకం లభించింది. ఆ తరువాత తెలంగాణలోని వరంగల్‌లో ఉన్న కాకతీయ విశ్వవిద్యాలయంలో ఆచార్యులుగా, బోర్డ్ ఆఫ్ స్టడీస్ ఛైర్మన్‌గా మరియు డీన్‌గా పనిచేశారు. ఆచార్య మాదిరాజు రంగారావు గారు యూజీసీచే మంజూరు చేయబడిన రెండు ప్రధాన పరిశోధన ప్రాజెక్ట్ గ్రాంట్లకు మరియు భారత ప్రభుత్వ మానవ వనరుల శాఖ, న్యూఢిల్లీచే స్పాన్సర్ చేయబడిన ఒక పరిశోధన ప్రాజెక్ట్ గ్రాంటుకు ప్రధాన పరిశోధకులుగా ఉన్నారు. ఆచార్య మాదిరాజు రంగారావు రావు గారు 'రసధుని సాహితీ పరిషత్' అనే సాహిత్య సంస్థకు వ్యవస్థాపకులు మరియు అధ్యక్షులుగా ఉన్నారు.

ప్రముఖ కవి, రచయిత మరియు సుప్రసిద్ధ సాహిత్య విమర్శకులైన ఆచార్య మాదిరాజు రంగారావు, సాంప్రదాయ సాహిత్యం, ఆధునిక కవిత్వం మరియు విమర్శతో సహా తెలుగు సాహిత్యం యొక్క వివిధ ప్రక్రియలకు విస్తృతంగా సేవలందించారు. మాదిరాజు రంగారావు గారు తమ స్వేచ్ఛా కవిత్వం మరియు సాహిత్య విమర్శ రచనల ద్వారా సమకాలీన ఆధునిక తెలుగు సాహిత్యంలో తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని ఏర్పరచుకున్నారు. ప్రముఖ పత్రికలైన భారతి, స్వతంత్ర, స్రవంతి, జయంతి, ఆకాశిక, ఆంధ్రపత్రిక, ఆంధ్రప్రభ, ఆంధ్రజ్యోతి మరియు ఆంధ్రభూమి వంటివి ఆయన సృజనాత్మక రచనలను క్రమం తప్పకుండా ప్రచురించాయి. తన సుదీర్ఘమైన మరియు అత్యంత ఫలవంతమైన సాహిత్య జీవితంలో, ఆచార్య మాదిరాజు రంగారావు యొక్క సృజనాత్మక రచనలు జూన్ 21, 2025న కాలధర్మం చెందిననాటికి 'స్వేచ్ఛా కవిత్వం' పై 150కి పైగా పుస్తకాలుగాను, సాహిత్య విమర్శపై 20 పుస్తకాలుగాను, మొత్తం సుమారు 170 పుస్తకాలుగాను వెలువడ్డాయి.

ఆచార్య మాదిరాజు రంగారావు కవిత్వానికి మూలస్తంభం మానవతా ఆదర్శాలు మరియు శాంతికి ప్రతీకగా నిలిచే ప్రజాస్వామ్య దృక్పథం. ఇవే వారి స్వేచ్ఛా కవిత్వానికి ఆయువు పట్టులాంటివి. మాదిరాజు రంగారావు గారు స్వేచ్ఛా కవిత్వ ప్రక్రియలో సాగించిన ప్రస్థానం వారి విశిష్ట వ్యక్తిత్వం, సామాజిక స్పృహ, మానవతా భావాలు, ప్రజాస్వామ్య, సామరస్య దృక్పథం మరియు శాంతి సందేశం ద్వారా సుసంపన్నమైంది.

# స్వేచ్ఛా జగతిన ...

**– డా. అమ్మంగి వేణుగోపాల్**




మాదిరాజు రంగారావు

'కవిత్వం ప్రధానంగా మనస్సు కేంద్రంగా సాగే సృజన చేతనకు సంబంధించింది'. ఇదీ ఆచార్య మాదిరాజు రంగారావుగారు కవిత్వానికి ఇచ్చుకున్న నిర్వచనం. మనసును హృదయానికి (సీ ఆఫ్ ఎమోషన్స్) సమానార్థకంగా భావించటమే కాక, 'సృజన చేతన'కు సంబంధించిందని కూడా అన్నారు. ఇక్కడ సృజనచేతన అంటే అనుభూతి, కళల మేలు కలయికగా భావించవచ్చు.

తాము రాస్తున్నది స్వేచ్ఛాకవిత్వం అని భావిస్తున్న రంగారావుగారు ఈ కవిత్వం 'సామ్యవాద స్పృహ'ను 'ప్రజాస్వామ్య దార్శనికత'ను కలగలసిందిగా భావిస్తారు. ఈ రెండూ ఎంత సన్నిహితమైనవో అంత చర్చనీయాంశాలు. మొత్తంమీద ఊహాలోకం నుండి భౌతిక లోకానికి ప్రస్థానం చేయవలసిన అంశాలు.

*'ప్రజాస్వామ్య మార్గదర్శి,*
*యుగకర్త, మహా రచయిత*
*గురజాడ అప్పారావుగారికి'*

ఈ స్వేచ్ఛాకవిత్వం మూడవ సంపుటం అంకితం చేయటం కూడా కవి నిర్దేశించుకున్న కవిత్వ ఆదర్శాలకు అనుగుణంగా ఉన్నది.

రంగారావు గారిలో చెప్పుకోదగ్గ గొప్ప లక్షణం ఎడతెగని కవిత్వరచన. మేధాపరమైన పరిశోధనలు, విమర్శలు ఎన్నిచేసినా వారికి సృజనశక్తి పట్ల ఉన్న ప్రగాఢమైన శ్రద్ధాసక్తులు అనితరసాధ్యాలు, సుమారు 70 సంవత్సరాల సాహిత్య సేవ అసాధారణం.

వీరి ప్రతి సంపుటంలో ప్రధాన శీర్షికలు / ఖండికలుంటాయి. ఆ ప్రధాన శీర్షికల కింద కొన్ని కవితలుంటాయి. చాలావరకు దీర్ఘకవితలు. కవితా విమర్శ కలిపి మొత్తం 11 సంపుటాలు. ఇతర రచనలు కలిపితే సుమారు నాలుగు వేలపేజీలు ఉండవచ్చు. ఇవన్నీ స్వేచ్ఛ నుండి స్వేచ్ఛ వైపు స్వేచ్ఛ కోసం పయనించినవి, ప్రవహించినవి, రెక్కలు కట్టుకొని ఎగిరినవి.

'ఖడ్గం కన్నీరు కార్చదు' అన్న ప్రధాన శీర్షిక కింద 'నీలి కవర్ నుండి' అన్న కవితలో మూడవ సంపుటం ప్రారంభమవుతుంది.

*'తెరిచిన నీలికవర్ నుండి*
*చేతిలో విప్పారే ఉత్తరంలా*
*ఈ రోజు వర్తమాన రూపం*
*చిరసమాజ బంధంలో సృజనమయం*
*పదం వెంటపదం చదివేకొద్దీ*
*క్షణం వెంట క్షణం నడిచేకొద్దీ*
*పదం క్షణం రెండూ కలిసి*
*జీవన పథాన మనిషిరూపం'*

అంటున్నారు గంభీరంగా రంగారావు గారు. నీలికవర్ తెరవటమే స్వేచ్ఛాభివ్యక్తి. విప్పారే ఉత్తరం క్రమవికాస సూచన.లేదా ధ్వని. ప్రతి ఈ రోజు (నేడు) వర్తమాన స్వరూపమే. పుట్టిన ఈరోజు కలకాలంగా సామాజిక బంధంలో ఉంటున్న సృజనాత్మక ప్రక్రియ.

అయితే, కాలానికి ప్రత్యేక ప్రతిపత్తి ఉండదా? అన్నది ప్రశ్న. 'నేడు' అంటే కాలమే కదా! 'పదం క్షణం రెండూ కలుస్తాయి. అంటే పదం సృజన, క్షణం –కాలం రెండూ సమన్వయం చెందకుండా బతుకు మార్గంలో మానవ వ్యక్తిత్వం రూపొందదు'. ఈ వ్యాఖ్యానం రంగారావు గారి తాత్విక శక్తిని పూర్తిగా చెప్పడానికి సమర్థం కాకపోవచ్చు. కవుల అంతరంగాలలో వ్యాఖ్యాతలకు అందని మార్మిక ఛాయలు ఉంటాయి. అయినా స్వేచ్ఛ పట్ల, కవితా సృజన పట్ల వెరసి మానవ వ్యక్తిత్వ శక్తి పట్ల రంగారావు గారికి ఉన్న అకుంఠిత విశ్వాసం అనిర్వచనీయం. దీన్ని ప్రారంభంలోనే వ్యక్తం చేయటం నాందీ శ్లోకం ద్వారా నాటక కర్తలు వ్యక్తంచేస్తూ వచ్చిన సంప్రదాయాన్ని గుర్తుకు తెస్తున్నది.

*'ఏ దిశ అయినా ఒకటే గగనానికి*
*ఏ దారి అయినా ఒకటే భూమికి*
*శిలకే దేవత శిల్పమయినా ఒకటే*
*మనిషికి మాత్రం దేనికది ప్రత్యేకం'*
(పురస్కారంలో తిరస్కారం)

ఒక ఎత్తైన శిఖరం అధిరోహించి మాట్లాడుతున్నారు రంగారావు గారు. అప్పుడు గాని రంగారావు గారికైనా, మరెవరికైనా ప్రకృతి స్వభావం అవగతమవుతుంది. భూమికి నాలుగు దిక్కులనీ, నాలుగు మూలలనీ లేవు. వాస్తవమే తప్ప వాస్తు లేదు. మనిషికే ఆ దారి ఈ దారి అన్న వివక్ష. కాని భూ ప్రకృతికి అన్ని దారులు తనలో సంగమించేవే. శిల చెక్కక ముందు నుండే నిరాకార నిర్గుణ బ్రహ్మమే. త్రిమూర్తుల విగ్రహాలుగా తనను తయారు చేయాలనే కాంక్ష శిలకు లేదు. కాని ప్రకృతికన్నా వేగంగా అస్తమించే మనిషికి మాత్రం అన్నీ ఆంక్షలే, అన్నీ అనుమానాలే. అందుకే మనిషి నిర్దిష్ట వాంఛా పరివృతుడు. అందుకే సంస్కరణ అవసరం.

## స్వేచ్ఛా ప్రియుడైన కవి :

*'ఒక సమయంలో జీవితం జైలును తలపిస్తుంది*
*బాష్పకణం బయటికి రావడానికి సిగ్గుపడుతుంది*
*శూన్యాన్ని భరించటం కష్టమై*
*ఒంటరిగా నిశ్శబ్దంలో*
*ఎవరయినా ఒక మనిషి స్వరం*
*వినాలనిపిస్తుంది'*

అంటున్నారు. ఒకానొక సమయంలో భౌతిక అభద్రత చుట్టుముడుతుంది. అనిరపేక్షంగా మరణ కాంక్ష చుట్టుముడుతుంది. అప్పుడు ఒక కన్నీటి చుక్కయినా బయటకు రావటానికి సిగ్గుపడుతుంది. ఎందుకు? ఆ సందర్భం ఒక్క మానవునికి సంబంధించింది కాదు. జాతికి సంబంధించింది కనుక. కాని అనంత దు:ఖాన్ని కడుపులో దాచుకునే శక్తీ మనిషికి లేదు కదా!

చార్‌ధామ్ (గంగోత్రి, యమనోత్రి, కేదార్‌నాథ్, బదరీనాథ్) జల విలయం గూర్చి ప్రత్యేకంగా దీర్ఘ కవిత వుంది. ఇది భక్తి కవిత్వంకాదు. చార్‌ధామ్ లో విపరీతమైన వానలకు కొండ చరియలు విరిగిపడి, ఆకస్మిక వరదలు రావటం తో జరిగిన జల విలయ విషాద కథనం ఇది దీర్ఘకవిత.

*'ఒకరి చేయిమరొకరు పట్టుకొని గట్టిగా*
*పొరలి తరలి వచ్చే వరదల ఉధృతిలో*
*భర్తనుండి భార్య*
*తల్లి నుండి పిల్లలు*
*జారిపోతూ కనబడకుండా*
*తమ కళ్ళముందు మృత్యుపాశవశులవుతూ'*

ప్రకృతి సంబంధమైన వాతావరణం భవిష్యత్తుకు అంధకార బంధురం చేస్తున్నప్పుడు బలిపశువులవుతున్న జనం మానసిక వాతావరణంలో మృత్యువు కాళరాత్రులను సృష్టిస్తున్నది. పై ఆరు పాదాలలోని ఉధృత భయంకరమైన సంభవ మృత్యువుకు అనతి పూర్వ దృశ్య ఘోష హృదయ విదారకం. ఇది ఎక్కడో సర్వసాధారణమైన ప్రదేశం లో జరిగితే అంతగా బాధ ఉండదు. కాని పరమ పవిత్రమైన పుణ్యక్షేత్ర కేంద్రాలలో జరిగినపుడు పవిత్ర భక్తి శ్రద్ధలతో దైవాంకిత భక్తి శ్రద్ధలతో ప్రస్థావిస్తున్న వారి విషయంలో జరిగినపుడు, భర్త

నుండి భార్య, తల్లి నుండి బిడ్డ వాళ్ళ కళ్ళ ముందే ఎడబాసి మృత్యువు ఒడిలోకి నిష్క్రమిస్తున్నపుడు అసలు దేవుడున్నాడా? అన్న నాస్తిక ప్రశ్నోపనిషత్తు తలెత్తుతుంది.

*'విషాద భావనిలయమై చార్‌ధామ్ క్షేత్రం*
*దైవం ఉనికిపై ఊహచెదిరిపోతుంది'*

అని కవి అంటున్నది అందుకే చర్చ ఏ దిశగా సాగినా అంతిమంగా ఇది కరుణ రసాత్మకం. భక్తుల చివరి కన్నీళ్ళు ఆ నదుల్లో నిమజ్జనమైన దు:ఖ ఘటన. ప్రకృతిని ప్రేమించే కవికి వికృతి ఎదురు కావటం శరాఘాతం.

'అడవిలో ఆయుధం' ఒక దీర్ఘకావ్యం. అందులో తీవ్రవాదాన్ని వ్యతిరేకించే కావ్యం కూడా. సామాజిక అసమానతలు ప్రబలినప్పుడు వెట్టిచాకిరీ, స్త్రీల పట్ల అక్రమాలు చెలరేగినపుడు, భూదోపిడీ జరిగినపుడు నిరసనలు, తిరుగుబాట్లు సహజం. గ్రీక్ రోమన్ల కాలం నుంచి కథలు కథలుగా వీటిని గూర్చి వింటున్నాం. రైతాంగపోరాటం తెలంగాణలో ఇట్లాంటిఉద్యమాలకు ల్యాండ్ మార్క్.

అందుకే - కవి :

*'కాలచక్ర భ్రమణంలో విచ్చేసే వసంతం*
*వీరి జీవితానికి వచ్చీరానట్లే ఉంటుంది'*

అంటున్నారు రంగారావు గారు. 1970 తదనంతరకాలంలో వచ్చిన విప్లవ ఉద్యమం

*'సహింపరాని పీడనలో భరింపరాని బాధలలో*
*నిశితమైన ఆలోచన, తీవ్రమైన క్రియాశక్తి*
*చర్యలతో సమాజం! శిశిరాకృతి పొందుతుంది'*

అంటున్నారు 'శిశిరాకృతి' అన్న ఒక్క కవితాత్మక అభివ్యక్తిలో పై పాదాలు మొత్తం భావం ఇమిడి ఉంది.

*'మమతలేని మనసు ఉండనే ఉండదు*
*ఒక సమయంలో బిగిసి శిలామయం కావచ్చు*
*సాయం సంధ్యాదృశ్యంలో అరుణ చిత్ర శకలాలు*
*గాయాలముందు*
*మోదుగుపూవు చిన్నబోతుంది'*

ఇవన్నీ జీవితసత్యాలు. వీటిని కవి రంగారావు గారు కవితామయం చేశారు. 'మోదుగుపూవు'ను ఎక్కువగా తమ రచనల్లో దాశరథి సోదరులు వాడుకున్నారు. వీరుడే గాయాలపాలవుతాడు. అవి మానసికగాయాలు కావచ్చు, శారీరక గాయాలు కావచ్చు.

'చెదిరిన ప్రజాస్వామ్యం' అన్న ఖండిక సమకాలీన ప్రపంచాన్ని ప్రతిఫలిస్తుంది. కవిగారి భావనలో 'వ్యక్తి, జీవితం, సమాజం' చుట్టూ ఆవరించి వున్న ప్రపంచాన్ని ప్రదర్శిస్తుంది.

'ఈనాటి నిజం' ఖండిక కవితాధారలో తడిసిన సత్యాల సంపుటి

*'చీకటిలో చుక్కల్ని లెక్కపెడుతూ*
*మనిషిని మనిషి కలుస్తూ వీడుతూ*
*చలన సమాజంలో ఎక్కడికక్కడ*
*చీలే దారుల్లో సువిశాల ప్రపంచం'*

పైన చుక్కలు కింద మనుషులు. చుక్కలను లెక్కపెట్టటం అసాధ్యం. కాని అదొక వ్యసనం. లేదా కాలక్షేపం. మనుషులు విడిపోవటానికే కదా కలుస్తారు' ('మిల్‌తే హై బి ఛడ్ జాన్ కో'- హిందీ సినిమా పాట చరణం)

ప్రపంచ వైశాల్యాన్ని చీలిన దారులలో కొలిచే ఈ కవి సామాన్యుడు కాదు. ఈ దారులు ఏవైనా కావచ్చు. విభిన్న జీవన మార్గాలు కావచ్చు. విభిన్న తాత్త్విక చింతనలు కావచ్చు.

మాదిరాజు రంగారావు గారి కవిత్వంలో వ్యంగ్యం పాలు తక్కువే. అప్పుడప్పుడు మెరుపులు కురిపిస్తారు.

*'మానవ జీవితమంతా చిన్నదో పెద్దదో*
*సమస్యతో అలంకృతం కాని రోజు లేదు'* (58)

అంటూ సంకెలగా భావించే సమస్యను అలంకారంగా భావించటం ద్వారా మానసిక భారాన్ని తగ్గిస్తారు.

*'కాలం కవితయై కదులుతుంది'*

అంటారు మరోచోట. కాలం చలనశీలం. కవితా చలనశీలమే. ఈ రెండింటి సమన్వయంతో జీవితాన్ని నిర్వచించటమే కదా కవి చేయగలిగింది!

*'అద్దంలో బింబంలా శబ్దంలో కవితా*
*ఆర్ద్రమైన కళ్ళలో మెరుపు కళతో'*

కనిపిస్తుంది. ఇందులో బింబ ప్రతిబింబ భావం లోను, తడికళ్ళ (ఆనందము, విషాదము) మెరుపు కళలోను కవిత్వాన్ని దర్శిస్తున్నారు.

అజంతా ఎల్లోరాలు ప్రస్తావన లేకుండా 'సంస్కృతి' వర్ణన ఉండదు. నిజానికి సంస్కృతి ఎంత గొప్పదో, దాని నిర్మాతలు అంత సామాన్యులు.

*'జీవ కళ తొణికే శిల్పం చెక్కే*
*అగ్గిపెట్టెలో ఒదిగే చీరను నేసే*
*చేతులు తొలగించే క్రూరమతులు నియంతలు*
*నీలిరాత్రిలో ముంచితీసిన మనసులతో'*

అంటున్నారు. మొదటిపాదంలోని శిల్పంతో సంవదించే నీలిరాత్రిని వర్ణిస్తూ, ఈ పాదంలో అరుదైన కవిత్వం జాలువారింది. మనసు అమూర్తం. నీలిరంగు రాత్రిని సూచించేది. కాలసూచి కూడా. అమూర్తమైన మనసులను నీలిరాత్రిలో ముంచి తీయటం ఆంగ్లేయుల కఠిన శిలాసదృశమైన మనసులను సౌందర్యాత్మకంగా చెప్పటమే.

కవిత్వ స్వరూప స్వభావాలను 'హృదయం నుండి హృదయానికి పరిచయ స్పర్శ' అన్న ఖండికలో తెలియజేశారు రంగారావు గారు. 'కవిత్వం మనిషి హృదయ స్పందనకూ, మనోభావ సూక్ష్మతలకూ సంబంధించి అభివ్యక్తి కళకూ, అంతో ఇంతో స్థానం కలిగిందీ' అన్న రంగారావు గారి మాటలతో కవిత్వ విశ్లేషకులు చాలా వరకు ఏకీభవిస్తారు.

*'తన ఆలోచనా రాజ్యానికి ప్రభువు కవి*
*అనుభూతికి చెందిన అధికారం సహజమైంది'*

అనటంలో రంగారావు గారు కవిత్వ తత్వానికి సంభవించిన అధికారాన్ని సంపాదించారని చెప్పవచ్చు.

*'తాను మేల్కొని మానసికంగా కవి*
*మరొకరిని మేల్కొల్పడం*
*అక్షర సుందర సందర్భం'*

మానసికంగా మేల్కొన్నవాడే ఇతరులను మేల్కొలువగలుగుతాడు. ఈ మరొకరిని మేల్కొల్పడం 'అక్షర సుందర సందర్భం' అనటంలో జడ ప్రపంచం నుండి జాగృతి ప్రపంచంలోకి రావడం కొత్త లోకంలోకి రావటం ఇక్కడ 'అక్షర' అంటే 'అనశ్వర'మనే అర్థం.

***

19వ శతాబ్దం యుద్ధభయంతో, యుద్ధాలతో ప్రపంచం కునారిల్లుతూ వచ్చింది. మొదటిరెండు ప్రపంచ యుద్ధాల కారణంగా పీడనకు, దారిద్ర్యానికి, అనారోగ్యానికి, అవిద్యకు ప్రపంచం తల్లడిల్లింది. ఆహారం దొరకలేదు సరికదా స్వేచ్ఛగా ఊపిరి పీల్చుకొనే అవకాశం కూడా దొరకలేదు. జైలులో ఉన్న భ్రాంతి కలిగింది. అప్పటి కవులు శ్రీశ్రీతో సహా అనేకులు యుద్ధోన్మాదానికి వ్యతిరేకంగా రచనలు చేశారు. వచనంలో కొడవటిగంటి కుటుంబరావు ప్రపంచవ్యాప్త ఆర్థిక మాంద్యం గూర్చి రాశారు. కాళోజీ, ఆళ్వారుస్వామి, దాశరథి రైతాంగ పోరాటం గూర్చి, నిజాం నిరంకుశత్వం గూర్చి రాశారు. భావాలు ఆచరణరూపం ధరించాయి.

ప్రపంచవ్యాప్తంగా స్వేచ్ఛాస్వాతంత్ర్యాల కోసం అనేక ఉద్యమాలు ఉవ్వెత్తున ఎగిశాయి. దేశ స్వేచ్ఛలో వ్యక్తి స్వేచ్ఛ కూడా ఒక భాగమే. రంగారావుగారు తమ మానిఫెస్టోలో పేర్కొన్నట్లు-

'ఇందులో ప్రజాస్వామ్య స్వేచ్ఛాకవిత్వంలో శ్రామిక వర్గానికేకాక ప్రగతి దృష్టితో సమాజంలో అన్ని వర్గాలకూ, శ్రేణులకూ, తరగతులకూ, భేద రూపాలకూ ప్రాతినిధ్యం ఉంది'

పై వాక్యాలలోని భావజాలం రంగారావు గారి విలువైన అనుశీలనల్లో ఒకటిగా భావించవచ్చు.


'స్వాతంత్ర్యానంతర కాలం గడిచేకొద్దీ స్వేచ్ఛాకవిత్వం నైక ముఖంగా వికసించింది' అని కూడా అంటున్నారు.

రంగారావు గారు ప్రపంచ ప్రజల ప్రేమికుడు. స్వేచ్ఛ ఆయన ప్రాణం. కవిత్వం రాసినా మరే ప్రక్రియ రాసినా, మాట్లాడినా ప్రేమాస్పదమైన స్వేచ్ఛ ప్రసక్తి లేకుండా ఉండదు. వారు రాసిన అక్షరాలు, ఆ అక్షరాలలోని భావాలు వారి సొంతం అవి మన సందేహాలు తీర్చే సందేశాలు.

సాహిత్య ప్రపంచంలో వారి కీర్తికాయం చిరస్థాయిగా ఉంటుంది.

***రచయిత సెల్: 94410 54637***

# మాదిరాజు రంగారావు గారి సిద్ధాంతగ్రంథం - ఒక పరిశీలన



**- ఆచార్య మసన చెన్నప్ప**

ఆచార్య మాదిరాజు రంగారావుగారు ప్రాచీన, ఆధునిక సాహిత్యాలను సమగ్రంగా అవలోకనం చేసిన ఆచార్యులు. సంస్కృతాంధ్ర భాషలలో ఎం.ఏ చేసి, 1962లో పిహెచ్.డి. డిగ్రీ అందుకున్నారు. యూ.జి.సి పరిశోధకవిద్యార్థిగా ఉండి, మహాభాగవత, మహాభారత పరిష్కరణ సమితిలో సభ్యులయ్యారు. కాకతీయ విశ్వ విద్యాలయంలో చాలాకాలం ఆచార్యులుగా పని చేసినారు. 1952-2014 మధ్యకాలంలో 'స్వేచ్ఛా కవిత్వం' మీద, పరిశోధన మీద సుమారు 80 పుస్తకాలు ప్రచురించారు.

రంగారావుగారికి సృజనశీలమైన కవిత్వం అంటే ఎంత ఇష్టమో, మానవీయ కోణంలో సాహిత్యాన్ని అనుశీలించడం కూడా అంతే ఇష్టం. నా అదృష్టం ఏమంటే వారు రచించిన 'స్వేచ్ఛా కవిత్వం' ఉద్గ్రంథాన్ని చదివి, వారి ప్రజా స్వామ్య దృక్పథాన్ని, సామాజిక వాస్తవికతను అర్థం చేసుకున్నాను.

నిజానికి రంగారావు గారు సృజనశీలురైన కవులు. కనుకనే వారే కావ్యాన్ని అనుశీలించినా కవి సృజన శక్తితో పాటు, కవితాశిల్పాన్ని పరామర్శించడం జరిగింది.

శ్రీరంగారావుగారు తనకు నచ్చిన అంశాన్ని పరిశోధనకు తీసుకొని, దాన్ని విశదంగా లోకానికి తెలియపరిచారు. చాలా మంది పిహెచ్.డి పరిశోధకులు కావ్యేతివృత్తాన్ని అనుశీలిస్తారు. కాని రంగారావుగారు కావ్యానికి ప్రాణభూతమైన కవి సృజనశక్తిని గుర్తించి, కావ్య నిర్మాణ శిల్పాన్ని గూర్చి వివరిస్తారు. ఇది నిజంగా తెలుగు పరిశోధనలో ఒక క్రొత్త బాట, కొత్త ఒరవడి.

శ్రీ రంగారావు గారి పిహెచ్.డి సిద్ధాంత గ్రంథం "కవిత్రయం - సృజనరూపం - నిర్వహణశిల్పం - అనుశీలనం" వీరి పర్యవేక్షకులు డా॥పల్లా దుర్గయ్యగారు. ప్రబంధ సాహిత్యాన్ని ఔపోశనం పట్టిన మహనీయులు దుర్గయ్యగారు. వీరి పర్యవేక్షణలో శ్రీ రంగారావుగారు నన్నయ, తిక్కన, ఎఱ్ఱనల రచనలను పరిశోధనాంశంగా గ్రహించి అద్భుతంగా సిద్ధాంత గ్రంథ రచన చేశారు.

నన్నయ భారతాన్ని దృష్టిలో పెట్టుకొని భారతావతారిక లోని విశేషాలను, ఉపాఖ్యానాలను, 'ప్రసన్న కథాకలితార్థయుక్తి', 'అక్షర రమ్యత', 'నానారుచిరార్థ సూక్తి నిధిత్వం' అనే కవితా గుణాలను పేర్కొని, ఇతరభారత కవులు తమ కృతులలో అనుసరించిన రూపాన్ని, నిర్మాణ శిల్పాన్ని ఎఱుకపరిచినారు.

నన్నయ భారతావతారిక శ్రోత కేంద్రంగా ఉందని, తన భారతరచనకు ప్రేరకుడైన రాజరాజనరేంద్రుణ్ణి నన్నయ శ్రోత గా చేసుకున్నాడని, కృతి సమర్పణాది విషయాలేవీ లేవని రంగారావు గారు ఒక కొత్తవిషయం చెప్పారు.

అవతారికలోని "శ్రీవాణీ గిరిజాశ్చిరాయ ---" అనే పద్యం సంస్కృత నాటకాల్లోని నాందీ శ్లోకాన్ని తలపిస్తుందని, అది ముగ్గురు కవులచే దీర్ఘకాలంలో నిర్వహింపబడే విషయం ధ్వని గర్భితంగా చెప్పబడిందని, రాజరాజనరేంద్రుని గుణగణాలు ఒక రాజుకుండవలసిన గుణగణాలను వ్యక్తపరుస్తున్నాయని రంగారావు గారు తెలియజేశారు. నన్నయ తన కుల గోత్రాలకు సంబంధించిన 16 విశేషణాలను అవతారిక స్పష్టం చేస్తుందని, కవి సర్వజ్ఞుడు కాకపోయినా, లోకజ్ఞుడు కావాలని తమ ఉద్దేశాన్ని రంగారావు గారు చక్కగా వివరించారు. భారతం వ్యక్తి జీవితాన్ని ధర్మబద్ధం కావడానికి తోడ్పడుతూ, సమాజ శ్రేయస్సును లక్ష్యంగా కల్గి ఉందని భారతకథా శ్రవణం ఉత్తమ దాన ఫలంతో, బహుయాగఫలంతో సమానమైందని చక్కని విశ్లేషణ చేశారు.

వ్యక్తి ఏ పని చేసినా ఒక ప్రణాళిక ఏర్పాటు చేసుకోవాలని, నన్నయ కూడా భారత రచన అనే మహత్కార్యాన్ని, నిర్వహింపబోతూ చక్కని ప్రణాళికను అవతారిక ద్వారా అందించాడని, నారాయణ భట్టు తోడ్పాటుతో రచనకు శ్రీకారం చుట్టాడని, సమగ్రమైన చర్చ చేశారు రంగారావు గారు ఈ ఈ ప్రకరణంలో.

నన్నయ కవితాగుణాలను అందరూ పేర్కొన్నవారేగాని, వాటి అంతరార్థాన్ని రంగారావుగారి లాగా సవిస్తరంగా వివరించలేరేమో అనిపించే విధంగా రంగారావు గారు 3 ప్రకరణాలను రచించారు. కవి సామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ 'ప్రసన్న కవితా కవితార్థయుక్తి' అనే విమర్శన గ్రంథాన్ని ఈ సందర్భంలో గుర్తుంచుకోవడం అవసరం.

ప్రసన్నకథా కవితార్థయుక్తి : ఇందలి ప్రసన్న పదం కథతో అన్వయిస్తుందని, ఆ తర్వాత అది అర్థాన్ని స్ఫూర్తికి తెస్తుందని, అర్థమంటే ఇక్కడ వాచ్య లక్ష్య వ్యంగ్యార్థాలను మూడింటిని గ్రహించాలని రంగారావుగారు త్రివిధ శబ్ద శక్రాలను దృష్టిలో పెట్టుకొని చక్కగా విశ్లేషించారు.

అక్షర రమ్యత : "రచనలో నశ్వరం కాని రమ్యత మీ అక్షర రమ్యత" అని రంగారావుగారు నిర్వచించారు. ఇంకా వారు "శబ్దం యొక్క సార రూపం నాదం. నన్నయ రచనలో నాదశక్తి అనుభవానికి వస్తుంది. దాని గతి అక్షర సంయోజనం, దాని గతి శ్రవణపేయమైంది. నన్నయ కావ్యసృష్టిలో శబ్దగతి నాదశక్తి చేత రమ్యతను పొందింది" అని వివరించారు.

నానారుచిరార్థ సూక్తి నిధి: ఇది నన్నయ గారి బిరుదని స్పష్టంగా రంగారావుగారు తెలియజేశారు. నన్నయ మొదటి కవితా లక్షణం కథా సంబంధమైంది. రెండవ కవితా లక్షణం అక్షర పద ప్రయోగ సంబంధమైంది.

మూడవ కవితాలక్షణం భావార్థ సంబంధమైంది అని నన్నయ కవితా లక్షణాల పరమార్థాన్ని వివరించారు. నన్నయ భారతంలోని సూక్తి వస్తువునో లేక సంఘటననో లేక పాత్రనో ఆశ్రయించి ఉంటుందని, అది సార్వకాలికమై, సార్వదేశికమై, సార్వ జనీనమై ఉంటుదని రంగారావు గారు చేసిన విశ్లేషణ ప్రతిభావంతమైంది.

మహాభారతంలోని కథా నిర్మాణ ప్రణాళిక వ్యాసునిదే ఐనప్పటికీ, కథా కథన విధానం నన్నయగారి ప్రత్యేకత అని, అందుకు శకుంతులోపాఖ్యానం చక్కని ఉదాహరణ అని రంగారావుగారు అభిప్రాయపడినారు. ఇట్లే బదరికోపాఖ్యానంలో మానవశక్తి పరిమితుల్ని, దివ్యశక్తుల పరిధుల్ని స్పృశిస్తూ,

ఉపకారం, ఉదారత, త్యాగశీలత మొదలైన గుణాలు ఆవిష్కృతమయ్యాయని, ఇవి కథలోని వివిధాంశాల ప్రసన్నతకు తోడ్పడినాయని రంగారావుగారు విశ్లేషించినారు.

పీఠిక ప్రాయమైన భాగాన్ని వదిలితే, ప్రధాన భారతకథ అంతా కుమారాస్త్ర విద్యా ప్రదర్శనం నుండి మొదలవుతుందని, ప్రధాన కథ పాండవులకు సంబంధించినప్పటికీ ముగింపు కురుక్షేత్ర సంగ్రామమని, దానికి అంకుర గ్రామమైంది కుమారాస్త్ర విద్యా ప్రదర్శనమని, అది వ్యాసుని హృదయానికి రమణీయ కళా రూపమని రంగారావుగారు వివరించారు.

సుహృద్ద్యూతం మహాభారతకథను కొత్తమలుపు తిప్పిందని, ఈ ద్యూతంలో ద్రౌపది పాత్ర కీలకమైందని, ఈ ఘట్టంలో నన్నయ ప్రధాన అంశాలను మాత్రమే స్వీకరించడంలో, సుదీర్ఘ వర్ణనలను క్లుప్తీకరించడంలో ఎంత ప్రతిభను చూపాడని, కథానిర్మాణ శిల్పానికి సుహృద్ద్యూతం కథ చక్కని నిదర్శనమని రంగారావుగారు పేర్కొన్నారు.

పద్యవిద్య కేవలం ఛందో పరిజ్ఞానం చేతనే సిద్ధించదని, గురు లఘ్వక్షరాల విన్యాసం, వాటి బరువు, తూగు, గతి, భావానుబంధం మొదలైన అంశాలు సౌందర్యాన్ని, సమగ్రతను చేకూరుస్తాయని చెబుతూ, రంగారావు గారు ఉదాహరణగా అక్షరరమ్యతా గుణాన్ని భాసింపజేసే

"కమ్మని లతాంతములకు న్నొనసి..."

"చందన తమాల లతలందు.........."

అనే రెండు లయగ్రాహి పద్యాలను చూపారు.

ప్రసన్న కథాకలితార్థయుక్తికి ఉదాహరణగా రంగారావు గారు కద్రువ వినతల కథలను గ్రహించారు. సూక్తులు రెండు విధాలుగా ఉంటాయని, ఒకరకం సూక్తులు కథతో ప్రత్యక్ష సంబంధం కల్గినవి కాగా మరొకరకం సూక్తులు కథలో ప్రత్యక్ష సంబంధం లేనివిగా కనిపిస్తామని చెబుతూ నన్నయ ఎడనెడ రచించిన సూత్రాలు మానవ స్వభావంతో పాటు, సార్వకాలికమైన ధర్మాన్ని ప్రతిబింబిస్తాయన్నారు.

"తల్లి పనిచెనని యధర్మువుసేయంగ
నగునె, యెఱుక గలరె ముగుదలెంగు"

తల్లి చెప్పినప్పటికీ అధర్మానికి పాలుపడరాదన్న విషయం సార్వకాలికమైంది, సార్వ దేశికమైంది. కద్రువ తన కుమారులైన సర్పాలకు చేసిన బోధ అధర్మమని చెప్పిన సందర్భం ఇది.

రంగారావుగారు సిద్ధాంత గ్రంథానికి తీసుకున్న అంశం విస్తృతమైంది. నిజానికి వారు కేవలం నన్నయ భారతాన్ని పరిశోధనాంశంగా గ్రహిస్తే బాగుండుననిపిస్తుంది. కాని పర్యవేక్షకుల సూచననుసరించి విస్తృతిగల అంశాన్ని పరిశోధనాంశంగా గ్రహించినప్పటికీ, రంగారావుగారు సిద్ధాంత గ్రంథాన్ని రచించడంలో ఎక్కడా ఇబ్బంది పడినట్లు కనిపించదు.

మరొక విషయాన్ని కూడా ఇక్కడ నేను చెప్పవలసి ఉంది. రంగారావు గారు కేవలం కవిత్రయ భారతం ఆధారంగా 'సృజన రూపం – నిర్వహణ శిల్పం' అనే అంశాన్ని పరిశోధనాంశంగా తీసుకున్నా బాగుండేది. కాని అలా జరగలేదు. నన్నయ భారతంతో పాటు, భారత కవులైన తిక్కన, ఎఱ్ఱనల కృతులన్నింటినీ తమ పరిశీలనకు అనుగుణంగా గ్రహించారు.

తిక్కన నిర్వచనోత్తర రామాయణం రాసే కాలంలో "కవితావిలాస విస్తర మహనీయుడు" కాని భారతం రాసే కాలంలో అమలోదాత్త మనీషనేనుభయ కావ్య ప్రౌఢి పాటించు శిల్పముననే పారగుడనే కళావిదుడ''నని ప్రకటించుకున్నాడు.

తిక్కన నన్నయల మార్గంలో "సరసమైన, మధురమైన మాటల కూర్పుతో సుప్రసాద గోచరంగా బహువిధార్థ తాత్పర్యంగా కావ్యరచనకు ఎంచుకున్నాడు" అని ఒక్క వాక్యంలో తిక్కనగారి శైలీరమ్యతను, కావ్య నిర్మాణ శిల్పాన్ని రంగరావుగారు తెలియజేశారు.

పద్యం, వచనం ఈ రెండూ విభిన్నసాహిత్య ప్రక్రియలనీ, ఈ రెండింటి స్వభావం, ఉపయోగం, ప్రయోజనం భిన్నమని గ్రహించిన వాడు కనుకనే తిక్కన వచనం లేకుండా ఉత్తర రామాయణ రచన చేశాడని రంగారావు గారు తెలియజేశారు. ఇది ఒక కొత్త విషయం.

తిక్కన భారతం "శ్రీయన గౌరినాబరగు" అనే తెలుగు పద్యంతో మొదలైంది. నన్నయ మూర్తిత్రయానికి భేదం పాటించని సంప్రదాయాన్ని సాహిత్యంలో స్థిరపరిస్తే తిక్కన మాత్రం పరతత్త్వాన్ని గుర్తించి శివకేశవాభేద స్థితిని నెలకొల్పాడని రంగారావుగారు తెలియజేశారు. తిక్కన హరిహరనాథ చిత్రణలో పరతత్త్వం భాసిస్తుందని రంగారావు గారి మాటలతో విభేదించే వారుండరు.

తిక్కన భారత రచనలో మార్గదేశి సమన్వయంతో ఉదాత్త కావ్యమార్గం గోచరిస్తుందని, తిక్కన సృష్టించిన స్వప్న వృత్తాంతం తర్వాతి కవులను ప్రభావితం చేసిందని నన్నయ భారతానికి లేని కృతిపతి తిక్కన భారతానికి ఉన్నాడని, తిక్కన ఒక్కొక్క పర్వాన్ని ప్రబంధ దృష్టిలో రచించాడని, తిక్కన అవతారికలు సృజన కళకు, నిర్వహణ శిల్పానికి ఆలవాలంగా ఉన్నాయని రంగారావుగారు తెలియజేశారు.

విరాటుని కొలువు కూటంలో పాండవులు మారువేషాలతో ఏవిధంగా ప్రవేశించారో, తిక్కన చేసిన వర్ణనలు కవిబ్రహ్మ కావ్యనిర్వహణ శిల్పానికి ఉదాహరణగా ఉన్నాయని రంగారావుగారు వివరించారు. సైరంధ్రి ప్రవేశం, కీచకవధ మొదలైన ఘట్టాలలో తిక్కన చూపిన నేర్పును రంగారావుగారు తమ సిద్ధాంత గ్రంథంలో చక్కగా తెలియజేశారు.

తిక్కన రాయబారాలను మూడింటిని వైవిధ్య భరితంగా, నాటకీయంగా ఏవిధంగా తీర్చిదిద్దినాడో రంగారావు గారు ఎంతో అభినివేశంతో తెలిపారు.

స్త్రీ పర్వంలో తిక్కన చూపిన నిర్మాణ శిల్పం గురించి రంగరావుగారు వివరిస్తూ, స్త్రీ పర్వాన్ని అనుసరించే శాంతిపర్వం ఉందని, ప్రధానమైన శాంతరస ప్రముఖత్వానికి దీని ముందున్న కరుణరసోత్కట్యం (స్త్రీ పర్వం) ఎంతగానో తోడ్పడుతుందని తాత్వికమైన వివరణ ఇచ్చారు. తిక్కనగాని రసాభ్యుచిత బంధానికి ఈరెండు పర్వాలు మంచి ఉదాహరణ అని అభిప్రాయ పడ్డారు. సందర్భానుగుణంగా ఛందస్సులను వాడడంలో తిక్కన నేర్పరి అని రంగారావు గారు వివరించారు.

తిక్కన భారత రచనా పద్ధతిని అవలోకనం చేస్తూ, ఆ మహాకవి నిర్వచనోత్తర రామాయణంలోని 'రంభా రావణ సంవాదం' 'శక్ర మోక్షణం' 'సీతారాముల శృంగారం' 'సీతాప్రవాసం' మొదలైన ఘట్టాల ఆధారంగా కార్యనిర్వహణ పాటవాన్ని సోదాహరణంగా రంగారావు గారు వివరించారు.

ఇట్లే ఎఱ్ఱన కృతులను పరామర్శిస్తూ రంగారావు గారు భారతారణ్యపర్వశేషంలోని 'కథాకథన శిల్పాన్ని', నృసింహ పురాణంలోని 'కావ్యశోభ'ను, హరివంశంలోని 'ప్రబంధ స్ఫూర్తి'ని తెలియజేశారు. హరివంశంలోని 'శ్రీకృష్ణచరిత్ర' కథనశిల్పం రామణీయకతను సంతరించుకున్నదని, హరివంశం భారతేతిహాసానికి అనుబంధమని, ఎఱ్ఱన శ్రీ కృష్ణ పాత్రను రెండు స్థాయిలలో తీర్చిదిద్దినాడని, శ్రీకృష్ణుని దివ్యత్వాన్ని బాలకుల చేత చెప్పించడంలో కవి ప్రమేయం లేదని, ఇది కథానిర్మాణ శిల్పానికి సంబంధించిందని రంగారావుగారు వివరించారు.

ఈవిధంగా రంగారావు గారు ప్రతిభావంతంగా సిద్ధాంత గ్రంథాన్ని రచించారు. కవిత్రయం సృజనశక్తితో పాటు, కావ్య నిర్మాణ శిల్పాన్ని సోదాహరణంగా వివరించే ప్రయత్నం చేశారు.

కేవలం వస్తుగతమైన పరిశోధనగా కాక, రంగారావు గారి పరిశోధన వారి సృజనకు అద్దం పడుతూ, కవిత్రయ కావ్య నిర్మాణ శిల్పాన్ని వ్యక్తపరచడంలో కృతకృత్యతను సాధించింది.

*రచయిత సెల్: 9885654381*

# మాదిరాజు రంగారావు కృతులు – 1953–2025

A) **స్వేచ్ఛా కవిత్వం**

I. స్వేచ్ఛా కవిత్వం – మొదటి సంపుటం రచనా కాలం 1953 2002

i. స్వేచ్ఛా నవం : 1. మానవీయం 2. పడగెత్తిన ఉదయం 3. ముక్తధాత్రి 4. ఇది వియత్నాం 5. యుగసంకేతం ii. 6. ఆవాహనం iii. 7. ముక్తకాలు. iv. సమయ దర్పణం : 8. నాలో ప్రవహిస్తోంది నది 9. నాకు జ్ఞాపకముంది v. 10. కిర్మీరం 11. మనోభూమికలు vi. వర్తమానం స్క్రీన్ పై : 12. వెలుగులో ఈ నేలపై 13. మేల్కొన్న ఈ సమయం 14. శబ్దమయి ప్రాణమై 15. అగ్నిమయం జీవితం 16. కాలాన్ని నిలిపి క్షణం 17. ఈ తరం స్వరచిత్రం 18. అశాంతి ఆర్కెస్ట్రా 19. వర్తమానం స్క్రీన్‌పై vii. 20. అగ్ని నుండి ఆనందానికి viii. ఈ శాతాబ్ది రెక్కలపై 21. జైలు కార్నర్ నుండి 22. ప్రయాణం నుండి ప్రయాణం 23. డైరి దర్పణంలో 24. ఈ శతాబ్ది రెక్కలపై 25. శాంతి స్వప్నం ix. అగ్నిపీఠం 26. క్రాస్ ఫైర్ 27. సీజ్ ఫైర్ 28. నేడు రేపు మధ్య x. 29. కిరణ పథం 30. స్వేచ్ఛకు సిగ్నెల్

**స్వేచ్ఛా కవిత్వం** మొదటి సంపుటం Addendum-1 రచనా కాలం 1953 –1975

మొదటి సంపుటంAddendum-2 రచనా కాలం 1953 – 2000

II. **స్వేచ్ఛా కవిత్వం – రెండో సంపుటం** రచనా కాలం 2003 – 2012 31. అభిషేకం 32. ఆగమనం 33. ఎప్పటికీ కొత్తే 34. సృజన దర్శనం 35. మరో వైపు 36. హృదయ మేఘం 37. సమకాలీనం 38. అభినవ యానం 39. ఆత్మ బంధం 40. సృజన మేఘం 41. ఉగ్ర చరణం 42. సవారంభం 43. గిఫ్ట్ ప్యాకెట్ 44, నవ దర్శనం 45. పునర్దర్శనం 46. నడిచే వెలుగు చుట్టూ 47. అపూర్వ 48. అజ్ఞాతం నుండి 49. రోజు వస్తుంది 50. ఉద్యమ చరణం 51. ఆల్బంలో ప్రజాస్వామ్యం 52. అద్దంలో ప్రజాస్వామ్యం 53. ప్రవాహంలో ప్రజాస్వామ్యం

III. **స్వేచ్ఛా కవిత్వం మూడో సంపుటం** రచనా కాలం 2013– 2015

54. ఖడ్గం కన్నీరు కార్చదు 55. చార్ ధామ్ 56. ఆల్ ఇన్ వన్ 57. ఉద్యమ పథం 58. అడవిలో ఆయుధం 59. చెదరిన ప్రజాస్వామ్యం 60. గాయ పడిన ప్రజాస్వామ్యం 61. ఈనాటి నిజం 62. ఇంకా బహు దూరంలో ప్రజాస్వామ్యం 63. సంస్కృతి & హృదయం నుండి 64. తెలంగాణ స్వరం, ఆత్మబంధం

IV. **స్వేచ్ఛా కవిత్వం – నాలుగో సంపుటం** రచనా కాలం 2015 నుండి 2018

65. వర్తమాన స్వనం 66. లైన్ క్లియర్, 67. వర్తమాన వాస్తవం 68. వర్తమాన లహరి 69. వర్తమాన యానం 70. వర్తమాన సంకేతం 71. ఇదే దారి 72. నవ మానవం 73. ప్రపంచీయం 74. హృది కిటికి నుండి 75. కార్నర్ కవితలు

V. **స్వేచ్ఛా కవిత్వం – ఐదో సంపుటం** రచనా కాలం 2017 నుండి 2019

ఇది జీవితం: 76. ప్రశ్నలతో ఇప్పటికీ 77. బ్రతుకులో కవితయై 78. గమ్యంపై గురితో 79. అస్మితలు, అస్తితలు 80. వాస్తవ చక్రంపై 81. ఎవరి దారి వారిది 82. అశాంతి పరిచయం 83. కవిత నా ఆత్మ 84. కాలం కప్పులో 85. నిప్పు రెక్కలపై 86. సమాప్తి కాదు 87. కాలానికి కృతజ్ఞతలు 88. సమయ పథం 89. ఇది అందరిదీ 90. సమాంతరం 91. ప్రాణం కన్న మిన్న 92. వర్తమానం ఆనవాలు 93. నీడ నుండి వెలుగులోకి 94. అక్షర ముకురం 95. జీవితం స్వతంత్రం 96. కాలంతో నేను 97. కర్తవ్యంలో కవిత

VI. **స్వేచ్ఛా కవిత్వం – ఆరో సంపుటం** రచనా కాలం 2019 నుండి 2020

98. ఏది కవిత 99. వర్తమానం ముందుకే 100. మార్పుకు సిగ్నల్ 101 కవిత ప్రభుతతో 102 హృదయ దర్పణం 103. నేను నేనే 104. స్వేచ్ఛలో స్వతంత్రం 105. భవితకు సంకేతం 106. అక్షరంలో స్వేచ్ఛ – సమాజ యానం 107. స్వేచ్ఛలో బంధనం 108. కార్టెయిల్

VII. **స్వేచ్ఛా కవిత్వం – ఏడో సంపుటం** రచనా కాలం 2020 నుండి 2022

109. రేపటికి రిజర్వులో 110. అక్షతం 111. లాక్ డౌన్ 112. వర్తమానం మెట్లమీంచి 113 అజేయం 114 ఈ వారం కవిత 115. గుడ్ బై 116. అక్షర హృదయం 117. గాయ పడిన శాంతి 118. వార్తలో కవిత 119. నిప్పులపై మేఘం 120. తెలియని వాస్తవం

VIII. **స్వేచ్ఛా కవిత్వం – ఎనిమిదో సంపుటం** రచనా కాలం 2022 నుండి 2023

121. మార్నింగ్ వాక్ 122. విప్లవ ప్లవనం, స్వేచ్ఛలో మనోజ్ఞం 123. అదృష్టం 124. మేల్కొన్న కవిత 125. ఆగని పయనం 126. కవిత్వమొక థెరపి, తెలంగాణ స్వరం

IX. **స్వేచ్ఛా కవిత్వం – తొమ్మిదో సంపుటం** రచనా కాలం 2023

127. హృది నుండి హృదికి 128. రౌండ్ టేబుల్ 129. మానస

తంత్రులపై 130. సరికొత్తగ 131. ఆశానవం 132. మౌనం మాట్లాడుతుంది 133. శిల నుండి రసాకృతి 134. అశాంతి చక్రంపై 135. మేనిఫెస్టో

**X. స్వేచ్ఛా కవిత్వం – పదో సంపుటం** రచనా కాలం 2024

136. కవిత సర్వ స్వతంత్రం 137. ఇది మలి తెలంగాణ 138. నిజయానం (బొన్సాయ్ అనంతం) 139. స్వేచ్ఛామేఘం, మెరపులు తలపులు 140 స్వేచ్ఛా పవనం

**XI. స్వేచ్ఛా కవిత్వం – పదకొండో సంపుటం** రచనా కాలం 2025

141. జీవన దర్శనం 142. అద్దంలో అనల చిత్రం 143. ముక్తకాలు 144. ఆశాబద్ధం


B) **పరిశోధన – సమాలోచనం**


**I. సాహిత్య విమర్శ – సాహిత్య సమాలోచనం రచనా కాలం 1980–2025**

1. కవిత్రయం – సృజన రూపం నిర్వహణ శిల్పం – అనుశీలనం 2&3. సృజన చేతన రామాయణ కల్పవృక్షం 4. మరో వైపు గురజాడ ఆధునిక చేతన 5. శ్రీశ్రీ మహాప్రస్థానం సమాలోచనం 6. దాశరథి కవితా సమాలోచనం పునర్నవం 7. సమాలోచనం సాహిత్య వ్యాసాలు 8. నవల స్వరూప సమాలోచనం 9. కవితా సమాలోచనం.

**II. సాహిత్య విమర్శ – సాహిత్య సమాలోచనం రచనా కాలం 1980–2025**

10. సృజన రూపం మానవీయ భావన 11. స్వేచ్ఛా కవిత్వతత్వం – 1 ప్రజాస్వామ్య భావన 12. స్వేచ్ఛా కవిత్వతత్వం – 2 మానవీయ భావన 13. స్వేచ్ఛా కవిత్వతత్వం – 3 సహృదయ స్పందన 14&15. స్వేచ్ఛా కవిత్వంలో భావనా రూపాలు– వివిధ పార్శ్వాలు– సమదర్శనం 16. Facets of Telugu Free Verse 17. పరిశోధనా స్వరూపం 18&19 అధికార భాష & అనువాద కళ 20. ఆలోకనం నవల సమాలోచనం. స్వేచ్ఛా కవిత్వం, దాశరథి కవితా సమాలోచనం, శ్రీశ్రీ మహాప్రస్థానం, నవల స్వరూపం.




















సీరియల్

# మలిసంధ్యలో మలుపులు

– తరానా

ఎనిమిదవ భాగం

(గత సంచిక తరువాయి)

“మార్చి మొదటి వారంలో ఇంటి నుంచి బయల్దేరి జైసల్మేర్ చేరుకున్నాం. నాన్నకు ఎడారి ఇసుక తిన్నెల మీద తిరుగాడాలని కోరిక. అమ్మ సరేనన్నది. 'శామ్' శాండ్–డ్యూన్సుకు దగ్గరలో పరిశుభ్రంగా ఉన్న ఒక హొటల్లో ఆగాం. నాన్న, అమ్మ దూర ప్రయాణంతో బాగా అలసిపోయారు. మొదటి రోజు ఎక్కడా వెళ్లకుండా విశ్రాంతి తీసుకోవాలని నిశ్చయించాం. అయినా నాన్న ఊరుకోరుగా! పొద్దున్నే నన్ను తీసుకుని ఇసుక తిన్నెల కడకు వెళ్లినారు. అక్కడ ఒక చోట కూర్చున్నాం. దిగంతాల వరకు వ్యాపించి ఉన్న ఆ సృష్టి విశేషాన్ని ఆస్వాదిస్తూ మా హృదయాల్లో నింపుకుంటున్నాం. నాన్నను ఏం ఇన్స్టింక్ట్ ప్రేరేపించిందో, ఏమో! అకస్మాత్తుగా 'చిట్టితల్లీ! ఇలా కొద్దిసేపు నా ఒళ్లో పడుకో!' అన్నారు. నా ఎడమచేతిని తలగడగా చేసుకుని కుడిచేతిని నాన్న తొడమీద ఆనించి తన ఒళ్లో కుదురుగా పడుకున్నాను. నాన్న కళ్లు మూసుకున్నారు. అయిదు నిమిషాలు నిశ్శబ్దం, మా ఇద్దరి మధ్య. ఆ అయిదు నిమిషాల నిశ్శబ్దంలో విశ్వాంతరాళంలో విహరిస్తున్నానా అనిపించింది నాకు.

ఆ నిశ్శబ్దాన్ని ఛేదిస్తూ అకస్మాత్తుగా 'చిట్టితల్లీ! చిట్టితల్లీ! మా బంగారు తల్లీ! మమ్మల్ని విడిచిపెట్టి వెళ్లిపోతున్నావా!' అంటూ బిగ్గరగా ఏడుస్తున్నాడు నాన్న, పసిపిల్లాడిలా. అప్పటి దాకా మబ్బులు కమ్మి ప్రశాంతంగా ఉన్న ఆకాశం ఒక్కసారిగా ఉరుములతో గర్జిస్తే ఎలా ఉంటుందో అలా ఉంది. నా పరిస్థితి. నేను భయంతో వణికిపోయిన. 'నాన్నా! నాన్నా! ఏమయింది నాన్నా!' అంటూ అనేకసార్లు తన బుగ్గలను గట్టిగా తడిమాను. మామూలు స్థితికి రావడానికి నాన్నకు చాలా టైం పట్టింది.

'సారీ తల్లీ! భయపడిపోయినావు కదూ!' అంటూ చాలా సేపు నా బుగ్గలు నిమిరాడు నాన్న. ఆ తర్వాత, 'లే తల్లీ! వెళ్దాం' అన్నాడు. ఇద్దరమూ హొటల్ చేరుకున్నాం. ఈ మధ్య దారిలో నేను నాన్ననేమీ అడగలేదు. నాన్న సరాసరి వెళ్లి పడుకున్నాడు. గంట తర్వాత లేచినాడు. నేను అమ్మకు జరిగిన విషయం వివరించిన. ఆ రోజంతా అమ్మ నాన్ననేమీ అడగలేదు. ఆ రాత్రి భోజనమయిన తర్వాత అమ్మ 'బావా! బాగా అలసిపోయారు. రేపు కూడా ఎక్కడా వెళ్లకుండా గదిలోనే విశ్రాంతి తీసుకుందాం' అని ప్రతిపాదించింది.

'లేదు, అలాంటిదేమీ లేదు. కొద్ది సేపు ముఖ్యమైన ప్రదేశాలకు వెళ్లివద్దాం' అన్నారు నాన్న. వెంటనే చిట్టితల్లి ఏది? దాన్ని పిలువు అన్నారు. నేను వెళ్లగానే తన పక్కనే కూర్చోబెట్టుకున్నారు. నా చేతులను మృదువుగా పునుకుతూ 'తల్లీ! నీతో అనుబంధం సుదీర్ఘమైనది, ఇప్పటిది కాదు' అన్నారు. 'నువ్వు నా ఒళ్లో పడుకున్న కొద్దిసేపట్లో ట్రాన్స్‌లోకెళ్లిపోయాను. ప్రస్తుతం, పరిసరాల స్పృహలేదు. నా ముందు పూర్వజన్మ వృత్తాంతం ప్రత్యక్షమయ్యింది. అప్పుడూ నిన్ను నా 'చిట్టితల్లి' నా 'బంగారుతల్లి' అని పిలుచుకునే వాణ్ణి. నువ్వు నా ముద్దుల బిడ్డవు. పదేండ్ల వయస్సులోనే మమ్మల్ని అనంతమైన దుఃఖసాగరంలో ముంచి వెళ్లిపోయినావు. ఒక విషజ్వరం నిన్ను బలితీసుకున్నది. మా ప్రయత్నాలేవీ నిన్ను కాపాడుకోలేక పోయినవి. చివరి శ్వాస నా ఒళ్లోనే విడిచినావు. అప్పుడు నేను నీ ముఖాన్ని, తలనూ సుకుమారంగా నిమురుతూ చిన్న పిల్లవాడిలా ఏడ్చినాను. జీవిత కాలమంతా నిన్ను గుర్తుచేసుకుని దుఃఖించేవాణ్ణి. రోజూ నిద్రపోయే ముందు దేవీ మాతతో వేడుకునేవాణ్ణి: 'తల్లీ! నా బిడ్డ మరుజన్మలో మా కుటుంబంలోనే పుట్టి పరిపూర్ణ జీవితం అనుభవించేలా ఆశీర్వదించు.'

అదీ తల్లీ! ఆ ట్రాన్స్‌లో నేనేమి చేసినానో నాకు తెలియదు. నా వింత ప్రవర్తనకు నువు బెదిరిపోయి ఉంటే నన్ను క్షమించు తల్లీ!' అని నాన్న అనడంతో నా దుఃఖం కట్టలు తెంచుకున్నది. 'ఎందుకు నాన్నా! అట్లా అంటారు?' అని నేను తన వక్షంమీద వాలిపోయి చాలాసేపు ఏడ్చినాను. నాన్న నా తల నిమురుతూనే ఉన్నారు. అమ్మ ఓ పాత్రలో నీళ్లు తెచ్చి తువాలు తడిపి ఇద్దరి ముఖాలను తుడిచి నన్ను కూర్చోబెట్టింది.”

“అంటే అప్పుడు నువ్వు నాన్న కన్నబిడ్డవు అయితే ఇప్పుడు అమ్మ కనిపెంచిన బిడ్డవు. ఏమి విచిత్రం! నువ్వెంతో అదృష్టవంతురాలవు శ్రితా! అందుకే నాన్న నిన్ను 'చిట్టితల్లీ!' అని పిలిచినప్పుడు అది దివ్య వాణిలా ధ్వనిస్తుంది.” అని శ్రేయ చెల్లెలి కళ్లల్లోకి చూసింది. ఆ చూపులో ప్రేమ, ఆరాధనా భావం సయ్యాటలాడుతున్నాయి.

“కాని నాన్న నన్నెంతగా ప్రేమించేవారో నిన్నూ అంతగానే ప్రేమించేవారు.”

“లేదు చెల్లీ! నేను అసూయపడటం లేదు. గర్వంగా ఫీలవుతున్నాను” అంటూ ఆమె చెల్లెలి చేతిమీద ముద్దుపెట్టింది.

“అయినా నేను జీవితమంతా నాన్న దుఃఖానికి కారణమయినాను కదా!”

“దానికి నువ్వు బాధ్యురాలివి కాదు. ఆ విషయంలో నువ్వు బాధపడకు. నిశ్చింతగా ఉండు.”

ముగ్గురమూ ముక్తేశ్వర్ చేరుకున్నాం. హనుమా మాకు హృదయ పూర్వకంగా స్వాగతం పలికినాడు. అతని ఆనందం మాటల్లో వర్ణించతరం కాదు. వయసులో చిన్నవాడైనా అమ్మను 'బెటియారాణి!' అని పిలుస్తాడు. నాన్నను మాత్రం 'స్వామీజీ' అనే సంబోధిస్తాడు. వారం రోజులు మా సమయం హాయిగా గడిచిపోయింది. నాన్న ఆరోగ్యం మళ్లా దెబ్బతిన్నది. అమ్మ లోలోనే దిగులుపడేది. ఎక్కువ సమయం నాన్న పడుకునే ఉంటున్నారు.

ఒకరోజు నాన్న నన్ను పిలిచి “చిట్టితల్లీ! మనం ఊరికి వెళ్లిపోదాం. మా చివరి మజిలీ అదే తల్లీ! ప్రయాణానికి ఏర్పాట్లు చేయి. హనుమాను కూడా వెంట తీసుకెళ్దాం' అన్నారు. అమ్మకిదంతా అయోమయంగా తోస్తున్నది. తనలోపల రగులుతున్న ఆందోళనను మాత్రం బయటకు వ్యక్తం కానివ్వటం లేదు. అలా మేము ఢిల్లీ వరకు కారులో వెళ్లి, అక్కడి నుంచి ట్రెయిన్లో కాజీపేట చేరుకున్నాం. అక్కడ ఒక రోజు విశ్రమించి మరుసటి రోజు ఉదయం బయలుదేరి ఊరికి చేరుకున్నాం. అమ్మమ్మ, తాతయ్య ఒకింత విస్మయం చెందినా ఆనందంతో వారి ముఖాలు విప్పారినయి.

రోజులు ఆనందంగా గడుస్తున్నవి. ఒక రోజు మధ్యాహ్న భోజనాలవగానే తాతయ్య, అమ్మమ్మల సమక్షంలో నాన్న అన్నారు: “దేవీ! నీ పేరిట ఆస్తిపాస్తులేవి ఉన్నా ఒక ట్రస్టుకు చెందుతాయని వీలునామా తయారుచేయించు. దానికి 'చంద్రముఖీ దేవి ట్రస్టు' అనే పేరు ఉంటుంది. ట్రస్టు సభ్యులుగా నాన్న, శ్రేయ, శ్రితలు ఉంటారు. అవసరాన్ని బట్టి

ఇంకెవరినైనా చేర్చాలనుకుంటే ఆ నిర్ణయాన్ని నాన్నకు వదిలెయ్యి."

'ఇప్పుడు దానికి తొందరేమి వచ్చింది బాబూ!' అని తాతయ్య అన్నారు.

'లేదు నాన్నా! ఈ పని వెంటనేకానివ్వండి. ఆలస్యం చేయకండి', అన్నారు నాన్న. అందరూ విస్తుపోయినారు. కాని ఎవరూ ఏమీ పలకటానికి సాహసించలేదు.

'నువ్వన్నట్లే జరుగుతుంది. కాని బంగారు తల్లి మనస్సులో ఏమున్నదో తెలుసుకున్నాక ముందుకు వెళ్దాం బాబూ!' అని తాతయ్య అన్నారు. వెంటనే అమ్మ, 'నాన్నా! నా మనస్సు నా బావ ఆలోచనకు భిన్నంగా పనిచేయదు. బావ చెప్పినట్లుగా వెంటనే ఏర్పాట్లు చేయించు నాన్నా!' అన్నది. ఆమె ధ్యాస ఆస్తిపాస్తులు, ట్రస్టు వ్యవహారం మీద లేదు. తమ జీవితాల్లో సంభవించబోయే అనూహ్యమైన సంఘటనలేమిటా అనే సందేహమే ఆమెను వేధిస్తోంది. దానికి సమాధానం దొరకక తికమక పడుతోన్నది. నాన్నకూ ఆ విషయం తెలుసు. అయినా పైకి మాత్రం 'దేవీ! నీ పరిపూర్ణ అంగీకారం ఉన్నదని నాన్న విశ్వసిస్తేనే ముందుకు వెళతారు' అన్నాడు.

'బావా! నన్నెందుకు పరీక్షిస్తున్నారు?' అని దుఃఖాన్ని దిగమింగి లోపలికి పరుగెత్తింది. ఆ తర్వాత అమ్మ కళ్ల రంగును బట్టి బాగా ఏడ్చిందని ఊహించవచ్చు. రెండురోజుల్లో ట్రస్టు తతంగం జరిగిపోయింది. నాన్న నీరసంగా ఉన్నా రోజూ రెండుగంటలు ధ్యానమందిరంలో గడిపి వస్తున్నారు. సరిగా మూడు రోజుల తర్వాత రాత్రి భోజనమవగానే నాన్న నన్ను తన దగ్గరకు పిలుచుకున్నారు. పక్కనే కూర్చోమన్నారు.

'చిట్టితల్లీ! నువ్వు నా బంగారు తల్లివి అని చెప్పాను కదా! అమ్మమ్మ, తాతయ్యలకు వాళ్ల కూతురు కూడా బంగారు తల్లే. ఆమె హృదయం సుకుమారమైనది. పొరపాటున కూడా ఆమెను నొప్పించకూడదు. ఆమెకు మీ ప్రేమను పంచండి. అంతకంటే ఆమె మీ నుంచి ఏమీ ఆశించదు. సుఖంగా సాగిపోతున్న జీవితాన్ని వదిలేసి వచ్చి ఆమె నా దగ్గర చేరింది. కఠినమైన సన్యాసిని జీవితాన్ని అనుభవిస్తున్నది. నువ్వు గొప్ప విజ్ఞురాలవు. నీకు ఇంతకంటే ఎక్కువ చెప్పాల్సిన అవసరం లేదు' అని కళ్లు మూసుకున్నాడు. ఎందుకో నా మనస్సును శంక, భయం పీడించసాగాయి. నాన్న కళ్లు తెరవగానే, 'మీ ఆదేశాలన్నీ నాకు శిరోధార్యం, కాని ఇప్పుడివన్నీ చెప్పి నన్నెందుకు భయపెడుతున్నారు నాన్నా, అని దుఃఖం పొరలుకొస్తుంటే అడిగాను.


'లేదు, నా తల్లి ధైర్యవంతురాలు, భయానికి లొంగేది కాదు. చిట్టితల్లీ! మరో విషయం శ్రద్ధగా విను'. ఏమిటన్నట్టు ప్రశ్నార్థకంగా చూసిన.

'తాతయ్య, అమ్మమ్మ నిస్వార్థ సేవాపరులు. ఇద్దరూ పుణ్యాత్ములు. వారినీ మీరు ప్రేమ, ఆదరభావంతో సేవించండి. పిల్లలకు సెలవులున్నప్పుడు వాళ్లతో పాటు వచ్చి కొన్నాళ్లు వారి దగ్గర గడపండి. వారి జీవితానికి ప్రయోజనం, తృప్తిని చేకూర్చినవారవుతారు. ట్రస్టు విషయాలూ చూసుకోగలుగుతారు అని చెప్పి నా కళ్లలోకి చూసినారు. అపారమైన ప్రేమ ఆ కళ్లల్లో తొణికిసలాడుతున్నది.

అప్పుడు అమ్మను పిలిచి నాన్న, 'దేవీ! నీకు చెప్పాల్సినదేమున్నది? ప్రేమనంతా రంగరించి ఆ దేవీమాత నిన్ను రూపొందించింది. స్ఫటికం లాంటి హృదయాన్ని అందులో ప్రతిష్ఠించింది. ఎన్నో జన్మల పుణ్యఫలం చేత నాకు దేవిగా లభించినావు. నా జన్మ ధన్యమైంది' అని కళ్లు మూసుకుని కొద్దిసేపట్లోనే నిద్రలోకి జారుకున్నారు.

మరుసటి రోజు ఉదయం లేచి చూస్తే నాన్న గదిలో లేరు. ధ్యాన మందిరానికి వెళ్లి ఉంటారనుకున్నా. నేను బ్రష్ చేసుకుని స్నానం కూడా ముగించాను. అమ్మ కూడా స్నానం చేసింది. నాన్నను పిలుచుకొస్తానని ధ్యాన మందిరానికి వెళ్లిన. నాన్న గురుదేవుల ముందు సాష్టాంగ ప్రణామం చేసి లేచి నేను కనపడగానే 'రా తల్లీ! నీ కోసమే చూస్తున్నాను.' అన్నారు. నేను వెళ్లి వేదిక మీద నాన్న పక్కనే కూర్చున్నా.

'ఈ రోజు నా తల్లి ఒడిలో సేదదీరాలని కోరికగా ఉన్నది.' 'ఏమిటి నాన్నా!' అని నేను ఆశ్చర్యంగా చూసిన.



'అవును, నిజమే తల్లీ!' అన్నారు నాన్న. తన ఎడమచేతిని తలకింద మడిచిపెట్టి కుడిచేతిని నా తొడమీద ఉంచి నా ఒళ్లో ఒత్తిగిలి పడుకున్నారు.

'నా బంగారు తల్లీ! నేను చెప్పిన విషయాలన్నీ గుర్తున్నవి కదా!' నేను కొంచెం ప్రశ్నార్థకంగా వింతగా చూసేటప్పటికి తను కొద్దిగా నా వైపు తిరిగి నా ముఖంలోకి చూస్తూ, 'అమ్మ గురించి, అమ్మమ్మ, తాతయ్యల గురించి. వాళ్లకూ, శ్రేయకూ నీ ప్రేమను పంచు. ఎవరిపట్లనైనా కరుణ ప్రేమతో వ్యవహరించు. నా చిట్టితల్లి ఓ జ్ఞాని. ఆమెకు ఇంతకంటే ఎక్కువ చెప్పేదేముంటుంది!' అని నా వైపు ఓ చిరునవ్వు విసిరి తిరిగి ఒత్తిగిలి పడుకున్నారు. నాకు అయోమయంగా ఉన్నది. ఓ అయిదు నిమిషాల సమయం నిశ్శబ్దంలో గడిచిపోయింది.

'నాన్నా!' అని పిలిచిన. జవాబు లేదు. 'నాన్నా!' అని బిగ్గరగా పిలిచి భుజం పట్టుకుని కదిలించిన. నాన్నలో చలనం లేదు. 'అమ్మా! అమ్మా!' అని బిగ్గరగా అరుస్తున్నాను. ధ్యానమందిరం పరిసరాల్లో ఉన్న పాలేరు పరుగెత్తుకొచ్చి నా వాలకం చూసి అమ్మ దగ్గరకురికాడు. రెండు నిమిషాల్లో అమ్మవచ్చి, 'బావా! బావా! నీ దేవిని!' అని బలంగా కుదిపింది. నాన్న తేరుకుని 'దేవీ! వచ్చినావా? తిరిగి కలుసుకుందాం, మరో జన్మలో' అంటూ కష్టం మీద తన చేతినెత్తి అమ్మ తలను నిమిరాడు. అంతటితో ఆయన కళ్లు శాశ్వతంగా మూతపడినయి. తన చేయి అమ్మ తలపై నంచి అచేతనంగా దానంతట అదే పడిపోయింది. నాన్న తల నా ఒళ్లోనే ఉన్నది. అమ్మ రోదనను ఎవరూ ఆపలేకపోయినారు. నాన్న వక్షంపై వాలి సొమ్మసిల్లిపోయింది. అమ్మ తన బావ ఛాతీమీద శాశ్వతంగా ఒదిగిపోయింది. ఒక చేయి ఆయన తలను, మరో చేయి ఆయన బుగ్గలను స్పృశిస్తున్నది. ఇద్దరి తలలను స్పృశించి అమ్మమ్మ కుప్పకూలిపోయింది. 'నా ఇద్దరు బిడ్డలు పోయిం తర్వాత ఇంక నేనెందుకు బతకాలయ్యా'! అంటూ రోదిస్తున్నది.

తాతయ్య ఓదార్పు ఏమీ పనిచేయలేదు. అమ్మమ్మ స్పృహతప్పింది... తాతయ్యకేమీ తోచటం లేదు. నా కళ్లు ఏకధాటిగా వర్షిస్తున్నవి. అమ్మమ్మ మళ్లీ స్పృహలోకి రాలేదు. శాశ్వతంగా కన్ను మూసింది. అంత ధైర్యవంతుడైన తాతయ్య నిశ్చేష్టుడుగా ఉండిపోయినాడు. మొదటిసారిగా తను అనాథగా ఫీలవుతున్నట్టు ఆయన ముఖం చెప్పుతూ ఉన్నది. తనతో పాటు నేనూ, ఇద్దరం అనాథలుగా మిగిలిపోయినం.

ఊర్లో జనం గుమిగూడుతున్నారు. తాతయ్య కొంచెం తేరుకుని నాన్న తలను నా ఒళ్లో నుంచి కిందకు దింపి సరిగా పడుకోబెట్టినాడు. అమ్మను నాన్న ఛాతీమీద నుంచి జరిపి తన పక్కనే పడుకోబెట్టినాడు. అమ్మ పక్కనే అమ్మమ్మ. వరుసగా మూడు పార్థివ దేహాలు. రెండు రోజులు మీరు వచ్చే దాకా ఆ గురుదేవుల కరుణా వీక్షణలో సేదదీరుతుండినవి".

"చెల్లీ!" అని శ్రితను గట్టిగా అలుముకుని చాలాసేపు విడువలేదు శ్రేయ.

"వద్దక్కా! ఏడ్వకు. అమ్మానాన్నల దీవెనలు మనకున్నాయి. అవే మనకు రక్ష. మనవంతు బాధ్యతను నిర్వహించడంలో అవే మనకు కొండంత ధైర్యాన్నిస్తవి".

*(సమాప్తం)*

***రచయిత సెల్: 94404 07607***

RNI NO: APTEL/2010/32190 ISSN-2582-7294

# ప్రజాస్వామ్య స్ఫూర్తిని ప్రబోధించే "ఏడుకోలల బాయి"



**డా. జి. వెంకటలక్ష్మి**
**అసోసియేట్ ప్రొఫెసర్, తెలుగు విభాగం**
**ప్రభుత్వ డిగ్రీ కళాశాల, హయత్ నగర్**
**ఫోన్ నెంబర్ -9949059179**

**కావ్యం యశసే2ర్థకృతే వ్యవహార విదే శివేత రక్షతయే ।**
**సద్యః పర నిర్వృతయే కాంతాసమ్మితత యోపదేశ యుజే ॥**

ప్రఖ్యాత ఆలంకారికుడు మమ్మటుడు ఉత్తమ కావ్యం యశస్సు,అ ర్థం, వ్యవహార జ్ఞానం, అమంగళ పరిహారం, ఆనందం, ఉపదేశాలను అందిస్తుందని చెప్పాడు. అక్షరాల అటువంటి కోవలోకి చెందిందే ఏనుగు నరసింహారెడ్డి గారి "ఏడు కోలల బాయి ఎన్నికల శతకం". దీనిలో 101 సీస పద్యాలు ఉన్నాయి. వ్యాకరణ నియమాను సారం తేటగీతో, ఆటవెలదో ఉండాలి. కవి తేటగీతిని ఎంచుకొని విభిన్న మైన రీతిలో అదనపు తేటగీతిని మకుటంగా అమర్చి ఈ శతకం రాశారు.

*మాయ మాటల హామీల మర్మ మెరిగి*
*గుర్తు లేకుండ ఓటెట్ల గుద్దు తావు?*
*ఓరి ఎంకన్న! దోస్తుగా! ఒర్లుబోతు!*
*ఒక్క మాటన్న వినవార! తిక్కలోడ!*

అంటూ కవి ఎంకన్న అనే దోస్తును ఒర్లుబోతు, తిక్కలోడా అని ప్రేమగా తిడుతూ దేశ బంగారు భవిష్యత్తుకు కారకమయ్యే ఎన్నికల జ్ఞానాన్ని నూరిపోశారు. ఎన్నికల సమయంలో నాయకుల, కార్యకర్తల హడావిడి, ఎన్నికల తర్వాత పరిస్థితి, ప్రజల వ్యవహారం, రాజకీయవేత్తల తీరు తెన్నులు, కులతత్వం, ప్రాంతీయతత్వం, ప్రవర్తన, హామీలు, పబ్లిసిటీ, మొదలైన పరిస్థితులను వివరిస్తూ ప్రజలను జాగృతం చేసే విలువైన పరిష్కార మార్గాలు, సూచనలు తెలంగాణ యాసలో, దేశి ఛందస్సులో సులభ శైలితో, పద్యం నిత్య నూతనం అని నిరూపిస్తూ, పాఠకులను ఆకట్టుకుంటుంది ఈ శతకం. ఈ ఎన్నికల శతకం ప్రజలకి ఒక చైతన్య క్రాంతి. విజ్ఞాన దీప్తి.

దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు, ప్రజల పాలన మొదలై 70 సంవత్సరాలు గడుస్తున్నా అట్టడుగు వర్గం ఇంకా కష్టాల్లోనే ఉంది. ప్రతి ఐదేళ్లకోసారి జరిగే ఓట్ల పండగ రోజుల్లోనే రాజకీయ నేతలు కనిపించి, పండుగ పూర్తవగానే బుర్రపిట్ట ల్లాగా తుర్రుమంటారు.

*రాజకీయాలలో నున్న రంకు తనము*
*తరచి చూడగ మూర్ఖులు తప్ప వాయే...*
*రాజకీయాలు పెంటగా రగులు కొనియె*
*తుప్పు మని ఉమ్ముటయే ఇక తప్పదేమో!-*

అంటూ రాజకీయాల రొంపిని కళ్ళకు కట్టినట్లు కవి చూపారు. ఎన్నికల సమయంలో లీడర్లు ఓట్లు అడిగే సందర్భంలో రకరకాల వేషాలు వేస్తూ, నటరత్నాలుగా మారి ఓట్లు అడుగుతారని చెప్పే సందర్భాన్ని కవి ఇలా వ్యంగ్యంగా, చమత్కారంగా ఇలా కళ్ళకు కట్టించారు -




"వాకిట్లో ముగ్గు వేసే ఆడవారిని అక్క నేనున్నా" అంటూ పలకరిస్తారు. ఇళ్లల్లోకి వెళ్లి చంటి పిల్లల్ని ఆడిస్తారు. పశువులకి గడ్డి వేసి, పెండ కళ్లను తీస్తారు. మూలకి ఉన్న ముసలి వాళ్ళని పలకరిస్తారు. ఇడ్లీ బండి వాళ్లను, నేత కార్మికులను, బుట్టలల్లే వాళ్లను, మంగలి షాపులు తిరుగుతూ ఫోటోలకు ఫోజులిస్తూ, పేపర్లో వచ్చేటట్లు చూసుకుంటారు. ఆటలాడే పిల్లలకు క్రికెట్ కిట్లు ఇచ్చి 100 ఓట్లు వేయించుకుంటారు.

ఒక పార్టీకి మించి మరొక పార్టీ అమలు చేయ లేని ఉచిత హామీలు ఎన్నో ఇస్తాయి. ఇంటింటికి బైక్‌తో పాటు పెట్రోల్, ప్రతి ఇంటికి డిష్ కనెక్షన్‌తో పాటు టీవీ వైఫైతో సెల్ ఫోన్, ఏసీలు, పీసీలు, ఇంటికో నౌకర్, ఊరికి రైలు, పుణ్య తీర్థాలకు ఉచిత రైలు, ఇంటి జాగా, ఉద్యోగ ప్రకటనలు, ఆడవారికి ఉపయోగపడే స్కీమ్‌లు ఇలా అన్నీ -

*"ఓట్లు గుద్దించుకొనుటకే ఒదుపుగాని*
*హామీ గుర్తుంచు కొనువాడు భూమి లేడు*
*గెలుపు కోసము విడిచితే విలువలన్ని*
*గద్దెనెక్కిన వాడేమి ఉద్ధరించు"*

- ఓట్ల కోసమే ఈ కొత్త స్కీమ్లు పెట్టి ఓటర్లను ఆకర్షిస్తారు. ఇచ్చిన వాగ్దానాలు తీర్చేవేనా అనే ఆత్మశోధన వారికి ఉండదు. గెలిచిన తర్వాత అధికారంలోకి వచ్చి కళ్ళు నెత్తిన పెట్టుకొని ఎవరిని లెక్క చేయరు. అందుకే "ముందు ఓటింగ్ సరళియే మార్చ వలెను" అంటూ కవి ఉద్బోధ చేశారు. తెల్ల వారక ముందే గల్లీలో తిరుగుతూ మోరీల కంపు, అపరిశుభ్ర పరిస్థితులు, మంచినీళ్ల సమస్య- మొదలైన పరిస్థితులను ఎత్తి చూపుతూ

*"తనను గెలిపించ చూపింతు పనితనంబు*
*ఇటుల జేతును కార్యముల్ చిటికలోన"*

అంటూ నాయకులు ఓట్లు అడుగుతారు.

ఎన్నికల సమయంలో ఓటర్లకు పంచే తిండి, డబ్బు విషయాలను చాలా హాస్యాత్మకంగా కవి చెప్పారు.

*తిండి లేకున్న ఎన్నిక తీపి ఏమి?*
*మందు లేకున్న తిండిలోమజయే లేదు*
*అందరన్ని పార్టీల వారంద జేస్తు*
*నాల్గు రోజులు నడిచేను నాటకాలు*

- ఎన్నికలంటేనే ఉచితంగా వచ్చే మందు, తిండి. ఎన్నికల సమయంలో ఓటర్లకి నాలుగు రోజులు నాటుసారా కాకుండా మెక్డోనాల్డ్, బ్లాక్ డాగ్,

బ్లెండర్, టీచర్, స్కాచ్– మార్కెట్లోకి ఏ కొత్త బ్రాండ్ వస్తే అది ఇస్తారు. ఇక తిండిలో బురద మట్టలు, కొర్ర మట్టలు, నాటుకోడి, లెగ్గు పీసులు, పీతలు, రొయ్యలు, మేక మాంసం, తలకాయ శోర్వ, బిర్యానీ– ఇలా పెగ్గు లేస్తూ, తింటూ ఎన్నికల పండుగను ప్రజలు హుషారుగా జరుపుకుంటారు. గెలవడమే ప్రథమ లక్ష్యంగా భావించి నాయకులు ప్రతి ఏరియాకి ఒక ఇన్చార్జిని పెట్టి కట్టుదిట్టంగా డబ్బులను, చీరలను వెండి దేవుడి బిళ్ళలను పంచుతూ సర్పంచికి, ఎంపీటీసీ, జడ్పిటిసికి, మండలాధ్యక్షునికి కి డబ్బులు ఇస్తూ

*"అసలు అమ్ముడు పోనోన్ని అణిచివేసి/ నీతి అను మాట అన్నోన్ని పాతిపెట్టి/ ఎట్టులైనను పోస్టులు కొట్టివేత్రు".* డబ్బును మంచినీళ్ల లాగా పంచి పెడతారు.

*"నల్ల డబ్బును ఎట్లెట్ల నడుపవలెనొ*
*ఎరిగినోడిదే విజయమ్ము ఎన్నికలలొ*
*సకల శాస్త్రాల సారమ్ము వికలమాయె"*

– నాయకులు కొందరిని నమ్మి డబ్బు పంచమని ఇవ్వగా వారు కొంత తిని మిగతాది పంచుతారు. "వంకరటింకర తొవ్వ లింకెన్ని ఉన్నయో/ఒడుపుగా పట్టరా ఉడుము పట్టు" అనుకుంటూ నాయకులు ఎన్నికల ఫలితాలను ఆశిస్తారే తప్ప ప్రజల అభివృద్ధిని పట్టించుకోరు. కులం, ప్రాంతం, మతం, గ్రూపులు, జాతీయ పార్టీలు జారిపోతే ప్రాంతీయ పార్టీలు ఇలా ఇచ్చ వచ్చినట్లు "ఉన్న చోటెల్ల అతి వినయాన్ని చూపి /నీతి సిగ్గులు వదిలిరి నేతలెల్ల".


పార్టీ ప్రచారానికి పోస్టర్లు, బ్యానర్లు, పాంప్లెట్లు, మొబైల్ ఫోన్‌లో కాన్వాస్, పాటలు కట్టించి మీడియాలో ప్రసారం చేసుకుంటూ, ఊరూరా మైకుల హోరుతో పాటు టీవీల్లో, యూట్యూబ్, ఫేస్బుక్, పార్టీ కో పేపరు పెట్టుకొని లేదా డబ్బు ఇచ్చి వారి పార్టీ వివరాలను క్రమంగా వేయించు కుంటారు. బహిరంగ సభలను ఎంతో డబ్బు వెచ్చించి నిర్వహిస్తారు.

*"సృజన అన్నది అసలేది సుత్తి దప్ప*
*బాగు చేయాలి అనుకునేభావమేది*
*రాజకీయాలు అంటేనె రచ్చలాయె*
*ఒక్క దన్నను తేలునా సొక్కపోడు"*–

నిర్మాణాత్మకంగా బాగు చేయాలనే ధ్యాస లేకుండా పాడిందే పాడుతూ చెప్పిందే చెప్తూ ప్రచారానికి నాయకులు పూనుకుంటారు. పెద్ద పార్టీలు, చిన్న పార్టీలు, ఇండిపెండెంట్ అభ్యర్థుల గురించి చెప్తూ –

*"పెద పార్టి జేసేటి పెడ మర్ల పనులన్ని*
*చిన్న పార్టి బెట్టేటి చిచ్చు లన్ని*
*ఇటు అటు గాని అర్థతే సరిపోని*
*ఇండిపెండెంటోని ఇగుర మంత...*
*లోక జ్ఞానమ్ము ఎంతుంటె లోతుదెలియు"*

–అంటారు కవి. ఇదే సందులో కార్యకర్తల



*సీస, తేటగీతులలో తెలంగాణ భాష సొబగును చూపిస్తూ, ప్రజాస్వామ్య రక్షణకు, ప్రజా శ్రేయస్సుకు అందించబడ్డ శతకమే ఏనుగు నరసింహారెడ్డి గారి "ఏడుకోలల బాయి". తేనె సోక నోరు తీయనగు రీతిగా చదవగానే అర్థమయ్యే సులభ శైలితో రూపొందింది.*

హంగామా, ఒక సిద్ధాంతానికి కట్టుబడక తరచూ పార్టీలు మారే గోపి లు, పక్క పార్టీలో చేరి వారిగుట్లమట్లను చేరవేసే కోవర్టులు, పోలింగ్ రోజు జరిగే ఒడిదుడుకులను సరి దిద్దే పోకిరి గుంపులు, – వీరందరితో ఈ నేలమ్మ తవుడు బుక్కి లాగే తయారయ్యింది. కొన్నిసార్లు ప్రజల పరంగా కాకుండా తమ స్వలాభం ఆశించి వారసత్వంగా రాజకీయాల్లోకి వస్తారు

*"ఎమ్మెల్యే టికెట్టు ఎట్టైనా సాధించి*
*ఇచ్చినా వెయ్యోట్లు తెచ్చుకోడు*
*మరుసటెన్నిక లోన మాయ్యోపాయము జేసి*
*ఎంపీ కిబెట్టే కంపు జేయు...*

తనదైన నేర్పు ఉంటేనే తప్ప వారసత్వంగా గెలవడం సాధ్యం కాదని కవి అభిప్రాయపడ్డారు. గెలవక ముందు గెలిచిన తర్వాత ఉండే రాజకీయ నేతల గురించి చెబుతూ– ఉండి ఉన్నది లేనట్లు ఊదు్చ వారు/లేనిదున్నట్లు ఎగిరేటి లేకి గాళ్లు – మొలక పలుకులు పలుకుతూ, వలవల మంటూ, గోల్మాల్, కంత్రి గాళ్లు, జంపు జిలానీలు, కంపు గొంతుల వారు, పోటుగాళ్లు చాల స్వభావాలతో ఉంటారు.– "దోచుకొనుటను మానిన దొరలు గలరే/ భూతదయ గల్గునే ఎట్టి ప్రేత కైనా?"– నీతిగల్లోడు ఎవరూ లేరని కవి చెప్తూ,–"పొద్దు తిర్గుడు పువ్వు పద్ధతి నడవాలె/ ఎటువైపు వెలుగుంటె అటకు దిరిగి "– ఎటు అవకాశం ఉంటే అటు మాట్లాడుతూ పబ్బం గడుపుతారు. తెల్ల బట్టలు తొడ్గి తెలివి మీరిన వాళ్ళు/ సున్న జుట్టేస్తారు అన్ని పనుల/ ఎన్నికల్ రాగానే ఎక్కడెక్కడి వగల్ కుమ్మరించేస్తారు నమ్మబలికి /....ఇంతకన్న రాచరికమె కొంత మేలు. తెల్లని బట్టలు ధరించి, అధికారంలో ఉండగా అన్ని పనులు వాయిదా వేసేవారు కూడా ఎన్నికల సమయంలో కనిపిస్తూ వగలు పోతారు. ఒడుపుగా మాట్లాడ్డం వస్తే చాలు రాజకీయాల్లో రాణించొచ్చు. నాయకుల పరస్పర ఆరోపణలు, నోటిదురుసు తనం గూర్చి కవి చెప్తూ–

*"ప్రజల స్వామ్యమ్ము అనియెడు పచ్చిపులుసు*
*పాలు, కారమ్ము దగులగా పగిలినట్టు"*

ప్రజల శ్రేయస్సుకాక, అధికారమే ముఖ్యమను కుంటారు. ఎన్నికల ముందు ఒక రకంగా ,తర్వాత మరోరకంగా ప్రవర్తిస్తారు. "గెలుపు ముందటి మాట గెలిచాక వాక్కులు /తిక్క తిక్కగ మారు నొక్కసారి" అంటారు. "ఎన్ని వేషాలు వేసింది ఎవడు జూసు /ఎట్లు గెలిచావు నీవంటు ఎవ్వడడుగు /గెలిచి వచ్చుటే బలముగా పిలువ బడును"–ఎత్తుకు పై ఎత్తులు వేస్తూ "నూరు వాగ్దానాలు నూటొక్క లాభాలు మాటలాడెడిదొటి మనసునొకటి /ఎవడేని కోపాన ఎదురొచ్చి తిట్టినా చిరునవ్వుతో వాన్ని చిత్తు జెయ్యి" గెలుపు కోసం నాయకులు ఎన్ని పాట్లయినా పడతారు. ఇచ్చిన వాగ్దానాల కంటే ఎక్కువ లాభం చూసుకుంటారు. ఎవరైనా కోపంతో తిట్టినా మనసులోని భావం బయట పడకుండా చిరునవ్వే సమాధానంగా ఇస్తారు. ఎన్నికల ముందు ఎర్రబస్సులెక్కి, సైకిలెక్కి, పాదయాత్రలు చేస్తూ, అధికారులతో మృదువుగా మాట్లాడుతూ, ప్రజలతో మీ పనులను దగ్గరుండి చేస్తానని బాస చేస్తూ, కార్ల, జీపుల హంగామా లేకుండా పర్యటిస్తారు. గెలిచాక –

*"ఇపుడొచ్చు ఎమ్మెల్యే ఇవరమే దొరకదు*
*కారు జీపుల గుంపు బారులోన*
*ఎటులొచ్చునో ఎంపి ఎవ్వరూహిస్తారు*
*తీరైన కాన్వాయి తీరులోన*
*...ప్రజల సొమ్ముకు బాధ్యతే పట్ట దెట్ల*
*ఎంత పని చేస్తె ఫల మొచ్చు ఎంతకెంత"* –

అంటూ కవి జనస్వామ్య పడవ మునగకుండా, అందుబాటులో ఉంటూ, ప్రజల కెంత సహాయం చేస్తే, అంతకు రెట్టింపు ఫలితం నాయకులకి లభిస్తుందని చెప్పారు. *"సిద్ధాంత మను మాట రాద్ధాంతమే గాని/రాణింపు కొరకది రాదు పనికి / .....నీతి వాక్యాలు పెదవుల ప్రీతి జేసి/పవరునే కోరి ప్రతివాడి పరుగులాయే"* – ఒక సిద్ధాంతానికి

కట్టుబడక, పైపై మాటలతో పెళ్లికాకుండానే బారాత్ తీసినట్లు ప్రజల కళ్ళకి ఒక మాయా యవనికను చూపిస్తూ పదవే పరమావధిగా, ఒడుపుగా నాయకులు ప్రవర్తిస్తారు.

మేథో వర్గం, ఉన్నతాధికారులు సైతం నాయకుల అడుగులకు మడుగు లొత్తాల్సిందే.

*"విధి లోన ఉండుటే అధికారి పనిగాదు,*
*మనము చెప్పిన మాట వినగవలెను*
*రూల్సు గీల్సు అంటూ ఫాల్సు మాటలు చెప్తె*
*తుప్పలు తంగెల్లు తప్ప వౌర"*

– మాట వినే వారికి తమకు అనుకూలమైన పదవిలో కూర్చోబెట్టి, వినని వారిని గుర్తింపు లేని పోస్ట్‌లో ఉంచుతారు. ఒక్కోసారి నాయకుల పనులు అధికారులను ముప్పుతిప్పలు పెడతాయి.

*"జరుగుతున్న పనులు జరగవద్దని చెప్పి*
*అధికారులను పంపి అవమనుట*
*లబ్ధిదారుడు వచ్చి లబ లబా మొత్తుకుంటె*
*అధికారులదె తప్పు అంటు అరచి*
*... ప్రజల ముందు ఒక మాట ప్రైవేటుగా ఓటి*
*అధికారులకి చెప్పి ఆగ పరుచు"*

– చేయమంటే చేయ వద్దని, చేయ వద్దంటే చేయమని కొత్త అర్థాలు సృష్టించి,అధికారులకి అయోమయ స్థితిని కల్పిస్తారని కవి అభిప్రాయ పడ్డారు. దొంగ ఓట్లను అరికట్టడానికి కవి కొన్ని విలువైన సూచనలు ఇచ్చారు –

*నిద్ర పోయెడి చోటె నిజమైన వాసమ్ము*
*అక్కడుండవలయు అసలు ఓటు*
*...ఆధారుకు ఓటు అనుబంధముగ జేయు*
*సకలమ్ము దేలును చక్కనౌను...*
*సంస్కరణలకు పూనాలి సత్యవాది*
*గెలుపు ఓటమికి నిజము విలువ గలుగు"*

– అంటూ కవి ఓటర్లను కూడ సుతిమెత్తగా మందలించారు. పల్లెల్లో, పట్నాల్లో రెంటిలోనూ ఓటు హక్కు వాడకుండా, నివసించే చోటే ఓటుహక్కు ఉండాలి. సత్యవాదులు లోటుపాట్లు లేకుండా ఓటర్ల జాబితా తయారు చేసే చర్యలకి పూనుకోవాలని కవి కాంక్షించారు.

*ఆన్లైన్ ఓటింగు ఆధారు థంబుతో*
*డూప్లికేటోటర్ను దునుమవచ్చు*
*విపరీతమౌ ఖర్చు వింతైన టెన్షన్లు*
*అధికారులకు దప్పు అల్కనౌను*

– పోలింగ్ శాతానికి, మెరుగైన ప్రతినిధ్యానికి నేతలు చర్చలు జరిపి ఆధార్‌తో కూడిన ఆన్లైన్ ఓటింగ్‌ను ప్రవేశపెడితే బాగుంటుందని కవి భావించారు. అనేక పార్టీలు లేకుండా అగ్రదేశాల్లాగా రెండు పార్టీలు ఉంటే అవినీతి కూడా తగ్గుతుందని కవి అభిప్రాయపడ్డారు.

చివరగా కవి ఎన్నికలు సజావుగా జరగడానికి మంచి సలహాలు కూడ సూచించారు. బహిరంగ సభలకు బదులుగా బహుపార్టీ చర్చలు, ప్రజలు శాంతి యుతంగా వారి సమస్యలు చర్చించడం, ఎన్నికల సమయంలో డబ్బును కట్టడి చేయడం, మాటకు, చేతకు సంబంధం ఉంటే ప్రజాస్వామ్య యుత సమసమాజ నిర్మాణం ఎన్నికల ద్వారా సాధ్యమౌతుందని కవి భావించారు.

*"ఎన్నిరాష్ట్రాలు తిరిగినా ఎచ్చటనైన*
*కలుసుడన్నది అపురూప కార్యమాయె"*

– ఒక జత బట్టలు, చెప్పులు, సంచి, పుస్తకంతో పార్టీ కార్యాలకు, ప్రజల పిలుపుకు బేధాభిప్రాయం లేకుండా మర్యాదగా మాట్లాడుతూ, శ్రద్ధతో పనిచేసే నాయకుడు ఒక్కడు కూడ లేడే అని కవి వాపోయాడు.

ఓటర్లకు ప్రశ్నించే తత్త్వం వస్తేనే రాజకీయ ప్రక్షాళన సాధ్యమౌతుందని కవి అభిప్రాయపడ్డారు.

*"బట్ట దడ్పు చినుకు బాధేమి బాపెను*
*సాలేటి వానొస్తే మేలుగాని*
*పెను ఉప్పెనలు వస్తే పెంటంత సాఫ్పొను*
*ముసురుతో రోగాల ముప్పెవచ్చు*
*జనమంత ఒక మార్పు రణమునకై గొంతెత్తు*
*దినమొస్తె నే తప్ప కనము మార్పు"*

– నాయకుల "చెలిమి చేయవు మాటల చేత తోడ", వేదిక మాట ఒక తీరు, గదిమాట వేరే తీరుగ ఉంటాయి. ఈ తీరును ప్రశ్నించే గొంతుక రావాలి. ఏ ఒక్కరో కాకుండా విప్లవాత్మక తీరులో ప్రజలంతా అడగాలి. – "హద్దుపద్దులు లేకుండ అతిగా పోతె.../పారములు జెప్పు నొకసారి ప్రకృతి గూడ". హద్దుల్లో ఉంటూ ప్రజల స్వామ్యాన్ని కాపాడుకోవాలని కవి సూచించారు.

సీస, తేటగీతులలో తెలంగాణ భాష సొబగును చూపిస్తూ, ప్రజాస్వామ్య రక్షణకు, ప్రజా శ్రేయస్సుకు అందించబడ్డ శతకమే ఏనుగు నరసింహారెడ్డి గారి "ఏడుకోలల బాయి". తేనె సోక నోరు తీయనగు రీతిగా చదవగానే అర్థమయ్యే సులభ శైలితో రూపొందింది. పానుగంటి వారు సాక్షి వ్యాసాల్లో ''జంఘాల శాస్త్రి'' పాత్ర ద్వారా సమకాలీన పరిస్థితులను అద్దం పట్టి చూపినట్లుగా, ఏనుగు నరసింహారెడ్డి గారు కూడ "దోస్తు ఎంకన్న" పాత్రను సృష్టించి, సమకాలీన ఎన్నికల పరిస్థితులను కళ్ళకి కట్టినట్లు చూపించారు. "విత్తును బట్టి చెట్టు", "మొగుడిని గొట్టి మొగసాల కెక్కినట్లు", "రోటిని బట్టి పాట", "గురువిందకు తన నలుపు తెలియదు" – వంటి సామెతలు అలవోకగా పద్యాల్లో ఇమిడి పోయాయి. "సహితస్య భావః సాహిత్యమ్", హితేన సహితమ్ సాహిత్యమ్ – కనుక ఈ శతకం యొక్క వస్తువు సమకాలీన సమాజ ప్రతిబింబమై సమాజ హితాన్ని కోరుకుంటుంది. వ్యంగ్యం ఉండటం వల్ల ఆనందాన్ని కూడ ఇస్తుంది. ఈ "ఏడుకోలల బాయి" ఎన్నికల శతకం పఠితలను ఆకట్టుకొని దృష్టిని మరల్చుకోకుండా చేస్తుందనటం ఏ మాత్రం అతిశయోక్తి కాదు. ●

## నిత్యం కవిత్వమై కదులుతా

సాహిత్యమే సమస్తమని సాగిపోతున్నా!...
కవిత్వపు పరిమళం
పొగమంచులా కమ్మేస్తోంటే...
కరిగిపోయిన కాలములో
ఎన్నోజ్ఞాపకాలను ఒలుచుకున్నా!...
ఎన్నో అనుభూతులను
గుండె నిండా నింపుకున్నా!!...

అప్పుడే కొత్తగా ఉదయించాను!.
వెచ్చని కిరణాలతో
పచ్చని ప్రకృతి వాకిళ్ళుతెరిచాను!!..
నాచూపుల స్పర్శ చుట్టేసింది...
ఎన్నెన్నో ఎందరెందరివో ఆలోచనలను
పోగుచేసుకొన్నా!...
ఎన్నెన్నో సరిహద్దులను దాటి
కన్నీటి కథలను కవిత్వంలో నిలుపుకొన్నా!...

అద్భుత క్షణాలు గుర్తు వచ్చినప్పుడల్లా...
నా హితులు..స్నేహితులు
జ్ఞాపకంచేసినప్పుడల్లా...
కఠినకాలంలోంచి...సామాజిక సంతలోంచి
సమాజంలోని వింతలను రాస్తుంటా!...

ఆశలవలయం నాచుట్టే!..
ప్రేమనిలయం నాఇల్లే!...
మోడైన బతుకు మొదళ్లో
కవిత్వపు నీళ్లుపోసి...
కొంతగా చిగురింప చేస్తున్నా!!...

అన్నిటిని నెట్టేసుకొంటూ
వచ్చిన నిందలను తుడిచేసుకొంటూ...
నాటివి నేటివి నెమరేసుకొంటూ...
కనబడే అసత్యాలను దిగబడిన సత్యాలను
తట్టి లేపుతుంటా!!...


కొందరు అంతర్ముఖంగా వుంటూ
అంతులేని అగాధాన్ని సృష్టిస్తారు!...
అందరూ గొప్పవారే!!...
వారిలోని తప్పుదార్లను చూస్తా!!..
మూసుకున్న కళ్లను తెరిపిస్తా!...
ఓ ప్రభంజనంలా వెల్లువెత్తుతా!!...

కొందరి బద్దకాలను బద్ధలుకొట్టాలి!..
సుతిమెత్తగా సమస్తాన్ని
నా హృదయంలోకి రప్పిస్తా!...
నిత్యం కవిత్వమై తట్టి లేపుతా!....

*– అంబటి నారాయణ*
**9849326801**

సమీక్షలు

# కథలు - సంకలనాలు



తమ ఆశయాలు – సిద్ధాంతాల కనుగుణంగా ఉన్న కథలను సేకరించి సంకలనాలుగా వెలువరించేవారు కొందరు. కొంతమంది మిత్రులు కలిసి తమ కథలను సంకలనాలుగా తీసుకొచ్చే వారున్నారు. ఒక అంశంపై వచ్చిన కథలు లేదా ఒక అంశంపై ప్రత్యేకంగా కథలు వ్రాయించి సంకలనాలుగా వెలువరించి వారున్నారు. పేరు కోసమో, డబ్బు కోసమో సంకలనాలు తెచ్చేవారు ఉన్నారు. ఇటీవలి కాలంలో ప్రతి కథకుడి దగ్గర రెండు లేదా మూడు వేల రూపాయలు వసూలు చేసి, వారి కథలతో సంకలనాలు వేయడం ఎక్కువైంది. డబ్బులు ఇచ్చి వేసుకున్న కథల నాణ్యత గురించి ఎంత తక్కువగా మాట్లాడుకుంటే అంత మంచిది.

ఇప్పటివరకు ఎనిమిది కథాసంకలనాలు వేసిన సంపాదకుడు ఎన్ కె బాబు ఇప్పుడు తొమ్మిదో సంకలనాన్ని "కథా పున్నమి" పేరిట 45 మంది కథలతో తీసుకువచ్చారు. ఇందులో ప్రజలకు ఉచిత విద్య, ఉచిత వైద్యం అందజేయాల్సిన ప్రభుత్వాలు తమ బాధ్యతను మరిచి, వాటిని కార్పొరేట్లకు వదిలేయడంతో వారు ప్రజల్ని పీల్చి పిప్పిచేస్తున్నారు. వారి దోపిడీ ఇంకా కొనసాగాల్సిందే నా అంటూ దాసరి రామచంద్రరావు "కోరలు" కథలో ప్రశ్నిస్తున్నారు.

అదొక ప్రభుత్వ హాస్పిటల్. చుట్టుపక్కల పల్లెల్లో నుండి ఎక్కువగా వచ్చే కేసులు పాముకాట్లు. తర్వాత వాంతులు, విరోచనాలు. ఇక తేలుకాట్లు, మలేరియాలు తాగేసి పడిపోవడాలు మూడో స్థానం. అప్పుడప్పుడు పురుగుమందులు తాగే బ్యాచ్ వచ్చేది. దగ్గర్లో ఉన్న ఆడపిల్లల హాస్టల్ నుండి నెలతప్పిన అమ్మాయి అబార్షన్ కోసం ప్రయత్నించి హాస్పిటల్లో చేరుతుంది. దానికి కారణమైన వాడిని పిలిపిస్తే వాడి నిర్లక్ష్య ధోరణి, పట్టింపులేని తనం డాక్టర్ను ఆవేదనకు గురిచేస్తుంది. ఇక పేషెంట్లుగా వచ్చిన గ్రామీణుల స్వభావాలు, అలవాట్లను "ఉద్యోగంలో ఉద్వేగం" గా జగదీష్ కొచ్చర్లకోట మలచిన విధానం బాగుంది.

మధ్యతరగతి జీతంతో, జీవితంలో కొడుకును పెంచడం కోసం నరహరి ఎన్నో విషయాల్లో కాంప్రమైజ్ కావలసి వస్తుంది. తన అవసరాలన్నీ మానుకొని పొదుపుగా బతికి కొడుకుని ఇంజనీర్ చేసి అమెరికాకు పంపిస్తాడు. వాడు అక్కడి అమ్మాయిని పెళ్లి చేసుకొని, ఇంటి గురించి చేసిన అప్పుల గురించి పట్టించుకోడు. ఉన్న ఇల్లు అమ్మేసి అప్పులు కట్టి, ఒంటరితనంతో నరహరి గుండె పగిలి చనిపోవడం ''అప్పున్నామ నరకం'' లో కూర చిదంబరం కళ్లకు కట్టినట్లు చిత్రించారు.

గుత్తాధిపత్యం నాయుళ్ల చేతిలో ఉండడం వల్ల వారిని ఎదిరించే వాళ్ళు లేరు. అతని నమ్ముకున్న పంతులుకు అన్యాయం చేసినా, పాలేరుగా ఉండే వాడపల్లి ఆదుకోవడానికి ముందుకు వస్తాడు. అంటరానితనం, ఆధిక్యతా భావంతో చులకనగా చూసిన పంతులు – వాడపల్లి మంచితనం చూసి ఉన్నవాళ్లను ఎదిరించలేకపోయినా, లేని వాళ్ళందరూ కలిసి బతకాలనె సత్యాన్ని తెలుసుకోవడం కె.వి.ఎస్.ఎన్ మూర్తి రాసిన "అంతరాలు" లో చూడవచ్చు.


సన్న కారు రైతులంటే బుగత గారికే కాదు. వ్యవసాయ కేంద్ర అధికారులకు కూడా చులకనే. ఎక్కడికక్కడ బుగత వాళ్లను దోపిడీ చేస్తూనే ఉంటాడు. వాళ్ళ బతుకులు లంకమేత గోదారి ఈతలా తయారవుతాయి. వ్యవసాయం అంటే జీవితాంతం కష్టపడటమే. అది "దినదినగండం" గా ఎలా మారుతున్నదో సంఘమిత్ర తెలియజేస్తారు.

భర్తా పిల్లలు తమ అనారోగ్యాల గురించి, భయాల గురించి, దిగుళ్ల గురించి తల్లితో చెప్పుకొని ఊరటపడతారు. మరి తల్లి తన సమస్యలను ఎవరికి చెప్పుకోవాలని ''గరిమనాభి'' కథలో సలీం ప్రశ్నిస్తారు. వస్తు వ్యామోహం మనకు అవసరాలను కల్పిస్తుంది. అవసరాలను గుర్తుచేస్తుంది. అవసరాలు తీర్చినట్టుగా తీర్చి తద్వారా లాభాలు లాక్కుంటుందని ఆ "మాయాబజార్" గురించి వి వెంకట్రావు గారు తెలియజేస్తారు.

ఇందులో మంచి కథలు ఏడు. రెండు పాత కథలు పోగా 36 కథలు సాధారణ కథలే. కథా సంకలనం అంటే చదివి దాచుకునేట్లుగా ఉండాలి. అలా ఉండాలంటే మంచి కథలకు ఎక్కువ ప్రాధాన్యత నివ్వాలి. లేకపోతే ఆయా రచయితలు, సంకలనదారులకే పరిమితమైపోయే ప్రమాదం ఉందని గుర్తించాలి.

**(కథా పున్నమి – 45 మంది కథకుల కథలు, సంపాదకులు: ఎన్.కె. బాబు, పేజీలు: 384, వెల: రూ. 350, ప్రతులకు: 89777 32619)**

# చింత చేను - చింతల చేను



ర్యాపిడో డ్రైవర్ గా పనిచేసి లాభం లేదని తేల్చుకున్న గుణశేఖరుడు, ఒక సెకండ్ హ్యాండ్ ట్రాక్టర్ కొని అద్దెకు దింపి లాభాలు గడించవచ్చని తలపోస్తాడు. ఐదు లక్షలు అప్పుచేసి ట్రాక్టర్ కొంటాడు. వచ్చిన గిరాకీలన్ని పని అయిన తర్వాత, పైకం తర్వాత ఇస్తామని చెబుతుంటే ఏం చేయాలో తోచదు. చివరికి ఒకరి కయ్యలో ట్రాక్టర్ నడపబోయి చేయి విరగగొట్టుకుంటాడు. జీతం ఇచ్చి డ్రైవర్లను పెట్టుకుంటే అసలుకే మోసం వస్తుంది. అప్పుల వాళ్ళ బాధపడలేక తిరుచానూర్ దగ్గర కొన్న స్థలాన్ని అమ్మకానికి పెడితే డాక్యుమెంట్స్ లో వేరే వారి పేరు ఉండటంతో అమ్మలేని పరిస్థితి. అలా వాళ్ళ చింతచేను, చింతల చేనుగా మారిపోతుంది. అప్పు ఇచ్చినవాడు ట్రాక్టర్ను జప్తు చేసుకుంటాడు. క్రమంగా దారిద్ర్యంలో కూరుకుపోయిన గుణశేఖరుడి పరిస్థితి దయనీయంగా తయారవుతుంది.

హఠాత్తుగా చివరి పేజీలో, పరిస్థితులన్నీ చక్కబడి గుణశేఖరుడు అతని కుటుంబం మంచి స్థితికి ఎదగడంతో నవల ముగుస్తుంది. ప్రధాన కథకు సంబంధం లేని పాత్రలన్నీ వచ్చి నవలా గమనం సజావుగా కొనసాగడానికి తమ వంతు తోడ్పాటును అందజేయడం విశేషం.

**(చింతల చేను– నవల, రచన: ఆర్ సి కృష్ణ స్వామి రాజు. ముద్రణ: మువ్వ చినబాపిరెడ్డి మెమోరియల్ ట్రస్ట్, పేజీలు: 142, వెల: రూ.100, ప్రతులకు: ప్రముఖ పుస్తక కేంద్రాలు మరియు 93936 62821)**

**– కె.పి. అశోక్ కుమార్**



అమ్జద్
సీరియల్
ఏడవ భాగం

# రామాపురంలో...

**(గత సంచిక తరువాయి)**

## 24

ఆసక్తికరంగా, విడవకుండా జోగారావు డైరీని చదివింది కృష్ణవేణి. జమీందార్ గారి కుటుంబ చరిత్రను క్లుప్తంగా రాశాడు. జరిగిన సంఘటనలను కండ్లతో చూసినట్లుగా రాశాడు జోగారావు. 'అసాధ్యుడు' అనుకుంది కృష్ణవేణి. అతని ధ్యాస రాగానే ఆమె శరీరం పులకరించింది. వెంటనే అతడు తన ఉపాంతమున లేకపోవడంతో మనసు చిన్నబుచ్చుకుంది.

ఎన్నికల పోటీ ఫలితాలు తెలిసే రోజున రామాపురం వస్తానని తెలియజేస్తూ ఓ ఉత్తరం కూడా పంపాడు రాంబాణం కబురుతో పాటు. 'ఆర్రోజులు అతడికోసం నిరీక్షించాలి' అనుకొంటూ ఓ దీర్ఘ నిశ్వాసం విడిచింది.

'జోగారావు...జోగులు...నాజోగి...' అంటూ తన హృదయ తంత్రులను అప్రయత్నంగా ఎవరో మీటినట్లనిపించింది కృష్ణవేణికి. తలదిండుతో గోడకాని మంచం మీద కూర్చుని, మోకాళ్ళు మడిచి దగ్గరగా తీసుకొని, వాటిమీద జోగారావు రాసిన డైరీ ఉంచి, చదవడంలో నిమగ్నమైపోయిన కృష్ణవేణికి సమయం తెలిసి రాలేదు. నీహారిక స్టీలు కప్పులతో టీలు తీసుకొస్తూ అరుస్తుండగా గాని తెలుసుకో లేకపోయింది సాయంత్రం కావస్తున్నదని.

స్వాతి గురించి నీహారికతో చెప్పడమా మానడమా అనే మీమాంసలో పడిపోయింది కృష్ణవేణి. స్వాతి కూడా ఈ హావేలీ కుటుంబం లోని ఒక సభ్యురాలే. ప్రత్యక్షంగా కాకపోయినా పరోక్షంగానైనా రక్తసంబంధికురాలే! జుట్టుపోలిగాడు, రాంబాణం తనకు బాబాయ్!... ఆనంద బాష్పాలు రాలాయి కృష్ణవేణికి.

నీహారిక ఆమె కన్నీళ్ళను జూసి తత్తరపాటుతో అడిగింది "కృష్ణా! ఆర్ యూ ఓ.కె..నీ జోగి... త్వరలోనే వసున్నాడుగా" అంది తెచ్చిన ఓ టీ కప్పును ఆమె కందిస్తూ.

చిరునవ్వుతో 'లేద'న్నట్లు తల తిప్పి, నీహారిక చేతిలోంచి టీ కప్పు అందుకొని, చప్పరిస్తూ తాగసాగింది, కృష్ణవేణి.


"స్వాతి ఏమిజేస్తూందీ?" అడిగింది కృష్ణవేణి.

"తాతతో కలసి పూలచెట్లకు నీళ్లు పోస్తోంది. ఏం?'' నీహారిక ప్రశ్నించింది స్వాతి గురించి అడగడంతో ఆశ్చర్యబోతూ.

"ఏమి లేదు...ఊరికనే అడిగాను. తోటలో కెళ్ళి కూర్చుందాం పద" అంది కృష్ణవేణి.

"అలాగే...కాని నేను స్నానం చేసి వస్తాను. ఈ లోగా నువ్వుకూడా రెడీగా ఉండు" అంటూ తాగిన టీ కప్పులను తీసుకొని కిందికి వెళ్ళిపోయింది నీహారిక.

కృష్ణవేణి మూసిన గాజు కిటికీ తలుపులను తెరచి, తల బైటకు పెట్టి తోట వైపు చూసింది. నెమ్మదిగా వీస్తూన్న చల్లగాలి ఆమెకు హాయినిచ్చింది. తోటమాలి తాత వీపు తన వైపు ఉంది. అతను పూలచెట్లకు గొప్పులు తవ్వుతున్నాడు. స్వాతి మాత్రం రబ్బరు గొట్టంతో గడ్డిపై నీళ్ళు చిమ్ముతూంది. స్వాతి మోహం తన వైపే ఉంది. కాని ఆమె చూపులు నేల పైనే ఉన్నాయి. సాయంత్రపు నీరెండ లో బంగారు కొండలా మెరిసిపోతోంది స్వాతి.



"స్వాతీ...గడ్డిపై నీళ్లు చల్లకు. మనం కూర్చుందాం అక్కడ!" అంది కృష్ణవేణి అప్రయత్నంగా, స్వాతికి వినబడేటట్టు గట్టిగా.

స్వాతి నివ్వెరబోయింది. 'మనం కూర్చుందాం!' అన్నందుకు. తలపై కెత్తి స్వాతి కృష్ణవేణి వైపు చూసింది. కృష్ణవేణి మొహంలో ఏదో ఆత్మీయత, ఆప్యాయత ఆమెకు కొట్టొచ్చేలా కనిపించింది. తాత కూడా తిరిగి కృష్ణవేణి వైపు చోద్యంగా చూడసాగాడు.

"ఏమిటీ తాతా,...పూలను కోసిస్తావా?" అంది కృష్ణవేణి ఏదో ఒకటి మాట్లడించాలనే ఉద్దేశంతో.

"ఈ హవేలీ లో పూలనే కదానమ్మ కోసేది...!?" తాత గొంతులో అవ్యక్తమైన జీర!

కృష్ణవేణి నెవరో చెంపదెబ్బ కొట్టినట్లనిపించింది. తాత సమాధానం లోని నిగూఢార్థం తను అర్థం జేసుకోక పోలేదు.

"కొద్ది సేపట్లో కిందికి వస్తున్నాను" అంటూ తిరిగి కిటికీ తలుపులు మూసింది కృష్ణవేణి.

బాత్రూంలో అడుగు పెట్టింది, తయారై కిందికి వెళ్లడానికి. మధ్యాహ్నం కునుకు తీయని కళ్ళు భారంగా ఉన్నాయి.

## 25

టాప్ లేని జీపులో మొహం నిండా రంగులు పులుముకొన్న జి.పోలయ్యగారు నిలువెత్తు లావైన పుష్ప మాలలతో మునిగి తేలుతూ, కేవలం కండ్లద్దాల సహాయంతో స్వాగతానికి రెండు వైపుల బారులు తీరి జయ జయ ధ్వానాలతో తన వైపు చూస్తున్న జనాలకి రెండు చేతులతో నమస్కారం పెడుతూ, హుందాగా పెదవులపై చిరునవ్వుల్ని చిందిస్తున్నారు. అడుగడుగునా అభిమానులు పూలదండలతో పోలయ్యగారిని సత్కరించి ఆనందిస్తున్నారు.

రామాపురం వాసులే కాకుండా ఇతర చుట్టుపక్కల గ్రామాల చిన్నా-పెద్దలందరూ కూడా ఊహించనంత సంఖ్యలో బారులు తీరి, చేతుల్లో కనీసం ముద్దబంతి పూలదండలు, సజ్జదండలు వారి వారి తాహతును బట్టి తీసుకొచ్చారు.

"అదృష్టం అంటే వాడిది" అని కొందరు వయసు మళ్ళిన స్త్రీ-పురుషులు అన్నారు, జి. పోలయ్యగారి వైపు చూపుతూ.

"ఇదంతా రాంబాణం నడిపించిన భారతం" అని వయసులో ఉన్న ఆడవాళ్ళు అన్నారు తమ పెదవుల పై చిరునవ్వుల మధ్య.

జుట్టుపోలిగాడు జి.పోలయ్యగారుగా మారిన తర్వాత, అంతవరకూ అతగాణ్ణి చీదరించుకొన్న యువతులిప్పుడు సిగ్గుతో కుచించుకుపోయారు. తమలో తాము నొచ్చుకోసాగారు. నిర్మల ఆ యువతుల గుండెలో మెదలగానే ఈర్ష్య, అసూయ జనించింది.

ఎన్నికల పోటీలో కనీవినీ ఎరుగని ఊహించని, జి.పోలయ్యగారి విజయం చూస్తూన్న రామాపురం

వాసుల ఆశ్చర్యం అవధులు దాటింది. జి.పోలయ్య గారి జీపు ముందు కర్రసాము చూపురులను ఆకట్టుకొంది. టపాసులు, చిచ్చుబుడ్లు, కాకర పువ్వొత్తులు, రాకెట్లు ఇత్యాదులు కాల్చసాగారు ఊరేగింపులో.

రాంబాణం ముందు జాగ్రత కోసం డిస్ట్రిక్ట్ అధికారులతో మాట్లాడి కట్టుదిట్టంగా పోలీసు బందోబస్తు చేయించాడు జి.పోలయ్యగారి ఊరేగింపు కోసం. రాంబాణం ఊరేగింపులో కాసేపు పాల్గొని ఆ తర్వాతి కార్యక్రమాల కోసమని హవేలీ కెళ్లాడు.

ఊరేగింపు గుర్నాథం ఇంటిముందు నుంచి వెళ్ళసాగింది. గుర్నాథం తన ఇంటిముందు చేతిలో ఓ పెద్ద పూలదండతో, మొహం మీద చిరునవ్వు పులుముకొని నిలబడ్డాడు. తలుపు చాటుగా నిర్మల నిలబడింది. గుమ్మం ముందు పొరుగింటి ఛాయ నిలబడి ఉంది తన కూతురును ఎత్తుకొని. ఆమెకు పక్కనే గుర్నాథం భార్య నవ్వుతూ నిలబడింది.

ఊరేగింపు తప్పెట-తాళాల వాయిద్యాలతో వచ్చి గుర్నాథం ఇంటిముందు ఆగింది. గుర్నాథం గబుక్కున జీపు ఎక్కి జి.పోలయ్యగారిని అభినందించి, అతడి మెడలో పూలదండ వేసి చేయి కలిపాడు ఆప్యాయతగా.

జి.పోలయ్య గారు గుర్నాథం ఇంటి గుమ్మానికి ఓరగా తెరచి ఉన్న తలుపు వెనుక నిలబడి, బయటికి తొంగి చూస్తున్న నిర్మల వైపు చూసి చేయి ఊపాడు. నిర్మల తలుపు ముందుకొచ్చి నిలబడింది సిగ్గుగా...చిన్నగా నవ్వుతూ.

గుర్నాథం, జీపులో జి.పోలయ్య గారికి కుడి పక్కన నిలబడి ఉన్న నరేష్‌ను, అతడి పక్కనే ఉన్న రమేష్‌ను పరామర్శించి జీపు దిగిపోయాడు.

'హవేలికి రావల్సింద'ని నరేష్ ఆహ్వానించగా, గుర్నాథం 'అలాగే' నన్నాడు.

ఇది గమనించిన ఓ వయసు మళ్లీన వ్యక్తి అన్నాడు, "కాల జ్ఞానం తెలిసినోడు...వెధవ!" అని. అతనికి పక్కనే ఉన్న మరో వయసు మళ్లిన వ్యక్తి నవ్వుతూ, ''జాగ్రత్తపడి గాలివాలును బట్టి మసలుకోకపోతే మునిగిపోతాడు మరి!" అన్నాడు.

"కూర్చున్న కొమ్మను చేతులారా నరుక్కున్న వాడవుతాడు మరి!" కొద్దిగా చదువుకున్న ఓ యువకుడు, వాళ్లిద్దరూ గుర్నాథం గురించి మాట్లాడుకొంటుండగా మధ్యలో చెప్పాడు.

ఊరేగింపు గుర్నాథం ఇంటిని దాటి వెళ్ళింది. నిర్మల, ఆమె తల్లి ఇంట్లోకి దారి తీశారు. నిర్మల సంతోషం వర్ణనాతీతం. ఆమె తల్లికి పెద్దగా సంతోషం కలగలేదు.

'రాంబాణం మట్టి పట్టుకున్నా బంగారమే అవుతూంది' అని అనుకొంటూ తనెత్తుకున్న కూతురిని ముద్దేట్టుకొంటు లోనికి వెళ్ళిపోయింది ఛాయ.

ఓ నలుగురైదుగురు తన చుట్టూ నిలబడి పిచ్చాపాటి మాట్లాడుతుంటే, ''పోలయ్యంటే ఎవరనుకొన్నావు...మనోడే!" అన్నాడు గుర్నాథం. అది విన్నవాళ్ళు కళ్ళు తేలేశారు. జి.పోలయ్యతో బద్ద వైరం ఉన్న గుర్నాథం ప్లేటు ఫిరాయించాడను కొన్నారు అక్కడున్న వాళ్ళు.

పెద్దగా హారన్ మోగించుకొంటూ హరీష్ వచ్చి ఆగాడు గుర్నాథం దగ్గర, అతని ఇంటి ముందు.

నవ్వుతు పలకరించాడు గుర్నాథం "ఏమిట్రోయ్! ఈ రోజంతా పెద్దగా హడావుడిగా ఉన్నట్టుంది! మనోడు గెలిచేశాడుగా" పోలయ్య గెలిస్తే గుర్నాథం సంతోష పడటమేమిటని విస్తుపోయాడు హరీష్.

''ఆ...ఏదోలే...కాకతాళీయంగా జరిగి పోయింది!" అన్నాడు రాగం దీస్తూ హరీష్. అతని వాలకం చూసి జి.పోలయ్యగారి విజయం అంతగా సంతోషం కలిగించ లేదనీ, అతనేదో పని తొందర్లో ఉన్నాడనీ అర్థం చేసుకొన్నాడు గుర్నాథం.

హరీష్ హారన్ విని ఛాయ ఓరగా తలుపు తెరిచి నిలబడింది. గుర్నాథం వీపు ఆమె వైపు ఉంది. హరీష్ ఛాయను గమనించి కూడా గమనించ నట్లున్నాడు.

''హవేలీలంతా దీపావళిలా ఉందటగా? అందరూ తలో పని పురమాయించుకొని కాలుగాలిన



పిల్లిల్లా తిరుగుతున్నారటగా! జుట్టు పోలిగాడి అదృష్టమే అదృష్టం!" అని కొనియాడసాగాడు గుర్నాథం.

హరీష్ ఆశ్చర్యంగా కండ్లు పెద్దవి జేసుకొంటూ అన్నాడు, "అయితే ప్లేటు మార్చేశావన్నమాట. నువ్వు కూడా ఏదో పూలదండ వేశావటగా?"

"ఏంజెయ్యను మరి, కూతురున్న తండ్రినిగా" అన్నాడు నవ్వుతూ గుర్నాథం.

"దండ వేసి ఏదైనా దండనం చదివిస్తావేంటీ?" వ్యంగ్యంగా నవ్వుతు అన్నాడు.

హరీష్ మోటర్ సైకిల్ కు కిక్కు కొడుతూంటే, "ఏమిటా తొందరా? కాసేపు ఇంట్లో కూర్చొని వెళ్ళరాదు!" అని గారాబంగా అన్నాడు గుర్నాథం.

"కొంచెం అర్జెంటుగా పని మీద వెళ్ళుతున్నాన్లే!" అని తొందరపడుతు అన్నాడు.

అప్పటికే అక్కడున్నవాళ్లందు చల్లగా జారుకున్నారు. వీళ్ళు వెళ్ళాక "రత్తిగాడి కూతుర్ని ఇకనైనా వదిలేయరాదోయ్!" అని ఇకిలిస్తూ అన్నాడు గుర్నాథం.

"నీకా వాసన తగిలిందన్నమాట!" అని అన్నాడు నవ్వుతూ.

"ఎంతైనా మనిద్దరం ఒకే రుచి గలవాళ్ళం" తను కూడ నవ్వుతూ అన్నాడు గుర్నాథం.

"ఊ..." అని అన్నాడు గంభీరంగా హరీష్.

"ఇన్నాళ్ళూ ఎక్కడ ఉంచావ్? ఇప్పుడెక్కడ వదిలేశావ్?" మోటర్ సైకిల్ హేండిల్ మీద చేయి పెడుతూ చిరు నవ్వుతో అడిగాడు గుర్నాథం.

"అదంతా నీ కనవసరం గాని...ఇప్పటికి అది తనింటికి చేరుకొని ఉంటుంది" అంటూ మోటర్ సైకిల్ స్టార్ట్ చేసి అక్కణుంచి స్పీడులో వెళ్ళిపోయాడు హరీష్. హరీష్, తనకు ఇంతకన్న మంచి సమయం చిక్కదనుకొన్నాడు స్వాతిని లోబరుచుకోవడానికి. అందరు తమ తమ హడావుడిలో ఎవరికేమి పట్టించుకోకుండా ఉంటారు. ఈ రోజు నూరు ఆరైన, అరు నూరైన స్వాతిని వదిలేది లేదని తన మనసులో శపథం చేసుకొని హవేలీ లోకి ప్రవేశించాడు హరీష్.

మొదటిసారిగా పెద్దగా హారన్ మోగించకుండా హవేలీ లోకి ప్రవేశిస్తూ ఇంజన్ ను ఆఫ్ చేసి, బండిని ఓ పక్కకు పెట్టి, లోనికెళ్ళాడు హరీష్ స్వాతిని వెతుక్కొంటూ.

## 26

కీర్తిశేషులు రావుబహదూర్ సీతా వెంకట చలపతి జమీందార్ గారి జన్మదినోత్సవం హుందాగా జరుపుకునే సన్నాహాలు మొదలయ్యాయి హవేలీలో. నరేష్ తన భార్య ఇద్దరు కొడుకులతో హవేలీకి చేరుకున్నాడు ఓ రోజు ముందు.

హవేలీలో మళ్ళీ యువకుల కలకలారావం మొదలైంది. నీహారిక అణువణువూ సంతోష సాగరంలో మునిగి తేలసాగింది. ఈ శుభ సందర్భంలో సురేష్-నీహారికల పెళ్ళి విషయం ఖాయం కానున్నది. కృష్ణవేణి పెళ్ళి గురించి రాంబాణం జోగారావు సంబంధాన్ని ప్రస్తావించ నున్నాడు. కృష్ణవేణి శరీరంలో అవ్యక్తమైన పులకరింతలు కెరటాలై ఉవ్వెత్తున లేవసాగాయి. రమేష్ పెళ్ళి కూడా నిశ్చయమైంది కమల కుమారితో.

కృష్ణవేణి, నీహారిక, జోగారావు కృషివల్ల రాంబాణం కూడా పెళ్ళి చేసుకోవడానికి ఒప్పుకున్నాడు. మిగిలింది స్వాతి. ఆమె అనారోగ్యం విషయం కూడా అందరిముందు ప్రస్తావించదలచుకున్నాడు రాంబాణం ఎలక్షన్ల గొడవలు ముగియగానే. అలాగే



జుట్టుపోలిగాడి పెళ్ళి విషయం గురించి కూడా మాట్లాడవలసుంది.

ఎన్నికల ఫలితాలు జమీందార్ గారి జన్మదినోత్సవం రోజునే రావడం శుభసూచకమే మోనని అనుకున్నారు జమీందార్ గారి కుటుంబ సభ్యులు.

జోగారావు కూడ మదనపల్లె నుంచి తిరిగొచ్చాడు. అక్కడ కూడా రాంబాణం పార్టీ అభ్యర్థి గెలుపొందాడు. కృష్ణవేణి ఉత్సాహం ద్విగుణీకృత మైంది జోగారావు రాకతో. పనిచేస్తున్న వాళ్ళ దగ్గరకి ఛంగు ఛంగున పరుగెత్తుకొంటూ వెళ్ళి, నడుం బిగించి రంగంలో దూకింది.

బయట కోలాహలం అలా ఉండగా ఇక్కడ హవేలీలో స్వాతి రాంబాణం తనకు పురమాయించిన పనులన్నీ ఒకటి తర్వాత మరొకటి చేసుకొంటూ పోయింది. జోగారావు ఉండే గదిని శుభ్రపరచిన తర్వాత, రెండవ అంతస్తులోని హాల్లో ప్రవేశించి శుభ్రం చేసింది.

జమీందార్ గారి జన్మదినోత్సవం, జి.పోలయ్య గారి విజయోత్సవం అదే హాలులో జరప నిశ్చయించారు. ఓ వేదిక నేర్పాటు చేసి హాలంతా విద్యుద్దీపాలతో అలంకరించారు. కృష్ణవేణి, నీహారికా, సురేష్ లు వచ్చి హాల్లో ఉన్న కుర్చీల వరసలని సరిచేసి, అక్కడక్కడా చెదురుమదురుగా పడిఉన్న రంగుకాయితాల ముక్కల్ని ఏరమని స్వాతిని ఆదేశించి బయటకు వెళ్ళిపోయారు.

స్వాతి మరో సారి కుర్చీల మధ్యగా హాలుని శుభ్రపరచి, బడలికతో ఓ కుర్చీలో కూర్చుంది. ఆమె తప్ప ఆ హాలంతా నిర్మానుష్యంగా ఉంది. ఆమెలో అనేకమైన ఆలోచనలు చోటు చేసుకొంటున్నాయి.

తను జుట్టుపోలిగాడి గెలుపుకు చాలా సంతోషించింది. తన సంతోషాన్ని తాతతో పంచుకుంది. తాత ఆమె తల నిమురుతూ ఆప్యాయంగా, 'అంతా పై వాడి చలవ! మనం అసాధారణం అనుకున్నవన్నీ ఆ పై వాడు తలచుకొంటే అవన్నీ సాధారణ విషయాలేనమ్మా' అన్నాడు.

ఈ రోజు తన కెంతో విలువైన రోజు. రాంబాణం చేసిన ప్రయత్నాలు ఫలించిన రోజు. జుట్టుపోలిగాడిని విజయం వరించిన రోజు. హవేలీలోని సభ్యులు కూడా ఈ మధ్య తనతో చనువుగా ఉంటున్నారు. కృష్ణవేణి, నీహారిక లు తన్నెంతో ఆప్యాయంగా చూస్తూ, ఏదో వంకతో హవేలిలోకి తీసుకు వెడుతున్నారు. ఈ మార్పు తనకీ, తాతకీ కూడా ఎంతో వింతగా అనిపించింది. తన పట్ల వీరి ప్రవర్తనలో మార్పు విషయమై తాత కూడా ఎంతగానో సంతోషించాడు.

అవునూ, రాంబాణం ఇంకా రాలేదేమిటి? త్వరగా వస్తానని చెప్పి ఊరేగింపు కోసం పోయిన మనిషి అతాపతా లేదు. రాంబాణం వచ్చి ఈ హాల్లో తను చేసిన పని చూసి మెచ్చుకొంటే ఎంత సంతృప్తిగా ఉంటుందని?

అయితే ఆ హాల్లో అడుగు పెట్టింది రాంబాణం కాదు. అందరి హడావుడినీ, స్వాతి ఏకాంతాన్నీ అదనుగా తీసుకొని, దుప్పిమీద దూకబోయే పులిలా నిశ్శబ్దంగా ప్రవేశించిన హరీష్.

## 27

ఆమె హాలంతా హరీష్‌ను తప్పించుకొంటూ పరిగెత్తి చివరికి సొమ్మసిల్లి గోడనానుకొని కూలబడింది, ఏడుస్తూ.

స్వాతి చేతులు జోడి ఏడుస్తూంది తనను వదిలేయమని. ప్రాధేయ పడుతూంది.

హరీష్ విషపు నవ్వు నవ్వుతూ ఆమెను తన వశం లో చేసుకొంటుండగా రాంబాణం హాల్లో ప్రవేశించాడు.

"హరీష్ స్వాతిని వదిలేయ్! అది నీకు చెల్లెలు!" అని గర్జించాడు, కనిపించిన దృశ్యాన్ని కళ్లారా చూసి ఆవేశపడుతూ.

"నీ డైలాగులు నాకు కొత్తేమి కాదులే! నీ పార్టీ విజయం పొందిన సందర్భాన, నాకీ స్వాతి ఈ రోజు విందు భోజనం" అంటూ ఆమెను తన భుజాల పై కెక్కించుకున్నాడు అమాంతంగా. స్వాతి గిలగిలా కాళ్లాడించసాగింది. హరీష్ భుజాలపై నుంచి రెండు చేతులతోను, వీపుమీదా మోకాళ్ళతోను చాతీమీదా కొట్టసాగింది. హరీష్ ఆమె మోకాళ్ళను గట్టిగా తన ఎడం చేతులతో అదిమిపట్టుకొన్నాడు. హాలుకు ఆనుకొని ఉన్న మరో గదిలోకి తీసుకెళ్ళడానికి ఉద్యుక్తుడైయ్యాడు.

రాంబాణం రివాల్వర్ తీసి గాలిలో పేల్చాడు.

"హరీష్! ఒక్క అడుగు ముందుకు వేశావో రివాల్వర్ లోని గోలీలన్నీ నీ గుండెలో దిగిపోతాయి జాగ్రత్త...దుర్మార్గుడా, స్వాతిని వదిలేయ్" రెండవ అంతస్తు దద్దరిల్లింది రాంబాణం గర్జనకు.

రాంబాణం పేల్చిన రివాల్వర్ గుండు హాల్లో అందంగా వేలాడుతూన్న విలువైన ఛాండలీయర్ కి తగలడంతో పెద్దగా శబ్దం చేస్తూ నేలమీద పడి తునాతునకలైంది. గాజు తునకలు కొన్ని స్వాతికి, హరీష్ కు తగిలి గాయపరిచాయి. వారిద్దరికి రక్తం చిమ్మసాగింది.

కింద హాల్లో ఉన్న వాళ్లంతా భయంతో పరుగెత్తుకొంటూ పైకొచ్చారు. సురేష్‌తో పాటు వాళ్ల అమ్మ, నీహారిక, కృష్ణవేణి, రమాదేవి కూడా చేరారు ఏదో అనర్థం జరిగి ఉంటుందని కంగారుపడుతూ. అక్కడ ఏమి జరిగిందో కృష్ణవేణి వెంటనే గ్రహించి, "హరీష్ బాబాయ్ స్వాతి నీకు చెల్లెలు! అమ్మ తోడు" అంది గట్టిగా అరుస్తూ. అప్పటికే ఆమె కండ్లలో నీళ్లు నిండిపోయాయి. నిలువెత్తు కంపించసాగింది.

తాత కూడా ఆదరాబాదరాగా రొప్పుతూ రెండంతస్థుల మెట్లు ఎక్కలేక ఎక్కుతూ చేరుకున్నాడు. అక్కడున్న దృశ్యాన్ని చూసి నోరు తెరిచాడు.

ఎవరి నోట్లోంచి ఒక్క మాట పెగిలి రాలేదు కృష్ణవేణికి తప్ప. వచ్చిన వాళ్లంతా శిల్పాలై చూడ సాగారు. రాంబాణం చింతనిప్పులు కక్కుతున్నాడు కండ్లలో నుంచి. రాంబాణం ఒళ్లంతా కోపంతో ఊగిపోతోంది.

హరీష్ కోపంతో స్వాతిని భుజాలపై నుంచి కిందికి నేల మీదికి విసిరేశాడు. "అమ్మా" అంటూ మూలిగింది స్వాతి నేల పై బడి.

కృష్ణవేణి పరుగెత్తుకొంటూ స్వాతి దగ్గరికెళ్లి ఆమెకు సహాయపడుతూ లేపింది.

స్వాతి గజగజ వణకసాగింది.

ఆమెలో సత్తువ సన్నగిల్లింది.

నగేష్ కూడా అప్పటికి పరుగెత్తుకొంటూ వచ్చాడు అక్కడికి. అతడు పార్వతితో జి.పోలయ్య స్వాగతానికి సన్నాహాలు చేస్తున్నాడు, హవేలీ లో కొందరు వ్యక్తులతో కలసి. పార్వతి కూడా ఆదరబాదరగా భర్తననుసరించింది.

నోటిపండ్లు పటపటా కొరుకుతూ "అసలు నీ చూపంతా స్వాతి మీదుంది. నాకు దక్కనీయకుండా నువ్వు పన్నుతున్నా పన్నాగం ఇది. అందుకే నాకు దీనితో చెల్లాయి వరుస కట్టబెడుతున్నావ్" అన్నాడు ఉక్రోషంగా హరీష్, స్వాతి వైపు చేత్తో చూపిస్తూ.

"స్వాతి నీకే కాదు నాక్కూడా చెల్లెలే!" అని అన్నాడు రాంబాణం తన కోపాన్ని అణగదొక్కు కొంటూ.

రాంబాణం చేతిలో రివాల్వర్ ఇంకా వణుకు తూనే ఉంది.

హరీష్ గట్టిగా నవ్వుతూ "తన ప్రియురాలను నా నుంచి దక్కించుకోవాలనే మరో కొత్త ఎత్తుగడ! నిజంగా నీకు స్వాతి చెల్లెలైతే ఆమెను నీ రివాల్వర్ తో కాల్చి నిరూపించుకో!" అని అన్నాడు.

రమాదేవి మందలిస్తూ "హరీష్ ఏమిటీ నీ పిచ్చితనం. రాంబాణం నీకు పెద్దన్నయ్య. నువ్వు ఈ సంబంధాన్ని స్వీకరించినా స్వీకరించక పోయినా అది యదార్థం" గట్టిగా అంది.

"ఓహో...అయితే అక్కయ్యగారిని కూడా తన రాజకీయ చాతుర్యంతో తన వైపు తిప్పుకున్నాడన్న మాట. ఎంతకైన ఘటికుడు రాంబాణం" అంటూ రాంబాణం వైపు చూస్తూ "వెర్రిబాగులోడైన జుట్టుపోలిగాడిని జి.పోలయ్యగా మార్చి ఘనంగా విజయం సంపాదించావు ఎన్నికలలో. కాని స్వాతి ఎన్నికల రంగం కాదే" అని అన్నాడు వెటకారంగా హరీష్.

హరీష్, రాంబాణం ఎదురెదురుగా ఉన్నారు పదిగజాల దూరంలో. ఇద్దరికి మధ్య గోడనానుకొని స్వాతి బిక్కుబిక్కుమంటూ కృష్ణవేణిని అంటిపెట్టుకొని అయోమయంగా చూస్తాంది పిచ్చిదానిలా. రాంబాణంకు కొద్దిదూరంలో రమేష్, సురేష్, నీహారిక నిలబడి ఉన్నారు. వారికి కొద్దిదూరంలో పార్వతి, రమాదేవి, నగేష్ ఆయన వదిన నిలబడి చోద్యంగా రాంబాణం, హరీష్ వైపు చూడసాగారు. జొగారావు రాంబాణం కు ఓ రెండడుగుల దూరంలో నిలబడి ఉన్నాడు. తాత రెండు చేతులు జోడించి సురేష్ వైపు చూస్తున్నాడు.

"హరీష్ నాలో సహనం చచ్చిపోతుంది. నువ్వు మరేమైనా పన్నెత్తి మాట్లాడిన...నేను ఎలాంటి అఘాయిత్యమైనా చేయగలను. ఆ తర్వాత పూచీ

*కింద హాల్లో ఉన్న వాళ్లంతా భయంతో పరుగెత్తుకొంటూ పైకొచ్చారు. సురేష్‌తో పాటు వాళ్ల అమ్మ, నీహారిక, కృష్ణవేణి, రమాదేవి కూడా చేరారు ఏదో అనర్థం జరిగి ఉంటుందని కంగారుపడుతూ. అక్కడ ఏమి జరిగిందో కృష్ణవేణి వెంటనే గ్రహించి, "హరీష్ బాబాయ్ స్వాతి నీకు చెల్లెలు! అమ్మ తోడు" అంది గట్టిగా అరుస్తూ. అప్పటికే ఆమె కండ్లలో నీళ్లు నిండిపోయాయి. నిలువెత్తు కంపించసాగింది.*

నీదే. జరగకూడనిదేమైనా జరిగితే నీ కారణంగానే జరిగిందనుకో..." అని హెచ్చరించాడు రాంబాణం.

"నువ్వు నిరూపించగలవా?" అని ప్రశ్నించాడు హరీష్.

"ఏమిటది?" అడిగాడు రాంబాణం.

"స్వాతి నీకు నాకు చెల్లాయి అని" తలడిస్తూ చెప్పాడు హరీష్.

"ఎలా నిరూపించమంటావ్?" రాంబాణం గొంతు గంభీరంగా మారింది.

"నిజంగ స్వాతి నాకు చెల్లాలైతే! నీకు ప్రియురాలు కాకపోతే నీ ఈ రివాల్వర్‌తో ఆమెను కాల్చి నీకు చెల్లాయి అని నిరూపించుకో"

"నువ్వు ఆమెను కాల్చలేక పోతే హండ్రెడ్ పర్సెంట్ స్వాతి నీ ప్రియురాలు. చెల్లాయి అన్నది కేవలం నీ నాటకం...బూటకం" అని నాటక ఫక్కీలో చెప్పుతూ "ఏమంటావ్ పెద్దొదిన!" అంటూ ఆమె వైపు చూస్తూ అన్నాడు హరీష్.

"నువ్వింతా కిరాతకుడివని ఈ రోజే నా కళ్ళు తెరిచాయి. నువ్వు నా ఒళ్ళో ఆడుకున్న వాడివి ఇలాంటి పైశాచక చర్యలకు పాల్పడుతున్నావంటే నాకు సిగ్గుగా ఉంది. నిన్ను మరదిగా కాక నా కొడుకుగా లాలించాను. ఆ మమకారంతోనే, నీ దుష్ట కృత్యాల గురించి అప్పుడప్పుడు రాంబాణం ద్వారా విన్నాను కాని నమ్మలేక పోయాను. ఈ రోజు నా కళ్ళారా చూసింతర్వాతె రాంబాణం చెప్పిందంతా నిజం అని బుజువైపోయింది.

"రాంబాణం ఆ రివాల్వర్ నా చేతికివ్వు. స్వాతి గురించి మరో ముక్క మాట్లాడినా నేనే హరీష్ ని కాల్చేస్తాను!" అని ఆడ సింహంలా గర్జించింది పెద్దవదిన.

అప్పుడే, తప్పెట-తాళాల శబ్దాలాకాశాన్ని అంటుతుండగా ఊరేగింపు హవేలీలో ప్రవేశించింది.

హరీష్ తన పెద్ద వదిన మాటల్ని కూడా ఖాతరు చేయకుండా, "ఊఁ...చూస్తావేంటీ...నిరూపించు!" అని ఉసిగొలిపాడు రాంబాణంను.

"ఢాం" అన్న శబ్దంతో అందరి నోళ్ళలోంచి కెవ్వున కేకలు ఎగిసాయి. క్షణం వరకు ఎవరికేమైందో అర్థం కాలేదు. అందరూ తేరుకునే లోగా స్వాతి రక్తం చిందుతున్న కడుపును రెండు చేతులతో పట్టుకొని నేలమీదికి పడిపోయింది.

రెప్పపాటులో హరీష్ చేతిలో కూడా ఓ రివాల్వర్ ప్రత్యక్షమైంది. జోగారావు వారించబోతూండగానే అది కూడా 'ఢాం' అని పేలింది.

జోగారావు రాంబాణం పై రాబోయే విపత్తును తృటిలో గ్రహించి రాంబాణం ను కౌగిలించు కొన్నాడు.

హరీష్ కాల్చిన గుండు జోగారావు వీపులోకి చొచ్చుకుపోయింది.

కృష్ణవేణి కెవ్వున గావుకేక పెట్టి నేలపై పడిపోయింది. ఏడుపులు పెడబొబ్బలు మొదల య్యాయి.

హవేలీ ప్రాంగణంలో పనిజేస్తున్న వాళ్ళంతా బరబరా పరుగెత్తుకొంటు హవేలీ రెండవ అంతస్థులోకి చేరుకొన్నారు. చూసిన వాళ్ళు చూసినట్లుగానే నోళ్ళు తెరిచారు. కాని ధైర్యం జేసి ఎవరూ ముందుకు రాలేదు.

శ్మశాన వాతావరణం అక్కడ రాజ్యం మేలింది.

నరేష్ మూగబోయాడు. రమేష్ కేమి అర్థం కాలేదు ఇదంతా ఎలా జరిగిపోయింది? అతనికో కలలా ఉంది.

జి.పోలయ్యగారికి నోట మాట రాలేదు. కుమిలి కుమిలి ఏడ్వసాగాడు. అతడి గొంతు తడారిపోయింది.

నీహారిక కన్నీళ్లు ఏకధాటిగా ప్రవహిస్తున్నాయి.

పార్వతి తన భర్త నగేష్ గుండెలపై వాలి పోయింది.

సురేష్ కేమి పాలుపోవట్లేదు.

రమాదేవి అయోమయంగా ఏడ్వసాగింది.

ఊరేగింపు వెంట వచ్చిన అంబులెన్స్ లో స్వాతి, జోగారావు లను హాస్పిటల్ వైపు తీసుకెళ్ళారు. రాంబాణం, హరీష్‌లతో పోలీస్ జీపు బయలు దేరింది.

రామాపురం లోని హవేలీ కొన్ని నిమిషాల క్రితం ఆనంద మేళాలు జరుపుకోడానికి ఆయత్తమవు తుండగా అది ఊహించని శోకముద్రలోకి మారిపోయింది.

**(సమాప్తం)**

**రచయిత సెల్: 966 50 766 2638**

కథ

# మళ్ళీ పెళ్ళి !



**– గజ్జారాం చట్ల**

గుబురు మీసాల కింద దాగివున్న పొగచూరిన పెదాలపై ఓ చిన్న వైరాగ్యపు నవ్వు, ‘ఈ పంతులుకి ఏమైనా పిచ్చి పట్టిందా? ఎవరూ లేని టైంల బూడిదల దేనికోసమో కెలుకుతున్నడు’ అనుకుంటూ, కొంచెం బిగ్గరగానే నవ్వాడు ఆ బుర్ర మీసాల బాపతు కాటికాపరి పోశాలు (50).

“ఏం ఎతుకుతున్నావు సారు” దగ్గరగా వెళ్లి రిటైర్డ్ పీజీ హెడ్మాస్టర్ ధర్మారావును అడిగాడు.

“ఏం లేదు లేరా, అటు దూరం వెళ్లి కూర్చో” అంటూ ఓ చిన్న కర్ర తీసుకొని తన భార్య చితాభస్మంలో మళ్లీ ఏదో వెతకసాగాడు ధర్మారావు.

“హమ్మయ్య దొరికినయి” అనుకుంటూ దొరికిన రెండు ముక్కుపుడకలను తదేకంగా చూస్తూ తన జేబులో వేసుకుని, స్మశాన వాటిక నుండి ఇంటి ముఖం పట్టాడు ధర్మారావు.

చోద్యం చూస్తున్న పోశాలకు మైండ్ బ్లాక్ అయింది ‘కోట్ల కొద్ది ఆస్తుంది కదరా, ఏం చేసుకుంటావో అదంతా, రెండు ముక్కుపుడకల కోసం ఒంటరిగా స్మశానానికొచ్చి ఎతికి ఎతికి ఎత్తుకెళ్లాలా ఏం బతుకులురా మీయి’ అనుకున్నాడు తలగోక్కుంటూ !

ధర్మారావు (59) భార్య ధనలక్ష్మి (55) అనారోగ్యంతో మరణించింది. నిన్ననే అంత్యక్రియలు జరిపారు. శవం పైనున్న నగలన్నీ నిన్ననే తీసేసుకున్నారు, నిన్న దొరకని ముక్కుపుడకలను ఈరోజు ధర్మారావు ఎవరికీ తెలియకుండా స్మశానానికి వెళ్లి చితిలోంచి తీసేసుకున్నాడు.

***

ధర్మారావుకు ముగ్గురు సంతానం పెద్దవాడు శరత్ డాక్టర్, చిన్నవాడు అరవింద్ ఇంజనీర్, కూతురు దివ్య హౌస్ వైఫ్. అదృష్టం కొద్ది అందరూ ఒకే టౌన్‌లో ఉంటున్నారు. హాయిగా సాగిపోతున్న వారి జీవితంలో హఠాత్తుగా ధనలక్ష్మి మరణించడం కోలుకోలేని శోకంగా మారింది!

ఇంటికి వెళ్తున్న ధర్మారావుకు ఆ ముక్కుపుడకల గత జ్ఞాపకాలు మనసులో తిరుగుతున్నాయి. తన మొదటి నెల జీతం తీసుకెళ్లి అమ్మ అన్నపూర్ణకి ఇచ్చాడు.

“మొదటి నెల జీతం భార్యకివ్వాలి, ఆమె సంతోషిస్తుంది, ఆమె సంతోషంగా ఉంటే ఇల్లంతా సంతోషంగా ఉంటుంది” అంటూ తిరిగి ఇచ్చేసింది.

తీసుకెళ్లి భార్యకివ్వబోతే “మొదటి నెల జీతం అమ్మకివ్వాలి గాని పెళ్ళానికి ఇస్తారా ఎవరైనా” అంటూ వారించినంత పనిచేసింది.

“అమ్మా! ఇక నన్ను ఫుట్బాల్ ఆడుకోకండి ఇంద తీసుకో” అంటూ అమ్మ చేతిలో బలవంతంగా పెట్టి వెను దిరిగాడు ధర్మారావు.

ఒక వారం రోజుల తర్వాత అన్నపూర్ణమ్మ రెండు చక్కటి ముక్కు పుడకలు తీసుకొచ్చి ధర్మారావు చేతిలో



పెట్టి, “ఇది నీ మొదటి సంపాదన, నీ కష్టార్జితం! మన ఇంటి కోడలు ధనలక్ష్మికి కానుకలుగా ఇస్తే ఇల్లు కళకళలాడుతుంది అట్లాగే ఆమె మహాలక్ష్మిలా కనిపిస్తుంది!”

ధర్మారావుకు ధనలక్ష్మికి కళ్ళు చమర్చాయి. అభిమానంతో, అనురాగంతో, అన్యోన్యంగా అన్నపూర్ణమ్మలో వాళ్ళ అమ్మను చూసుకుంటూ జీవితమంతా గడిపింది ధనలక్ష్మి!

అంత మహత్తరమైన ముక్కుపుడకలని శోధించి సాధించినందుకు లోలోన సంతోషపడుతూ, తమ అనుబంధానికి గుర్తుగా ఉన్న ఈ ముక్కు పుడకలు నిన్న దొరకకుండా ఈరోజు తనకే దొరికాయి, కాబట్టి సెంటిమెంట్‌గా తన జీవితాంతం తనతోనే వాటిని ఉంచుకోవడానికి నిర్ణయించుకున్నాడు ధర్మారావు.

దశదిన కర్మతో సహా కార్యక్రమాలన్నీ ముగించేశారు. చుట్టాలందరూ ఒకరు ఒకరుగా వెళ్ళిపోతున్నారు, ధర్మారావుకు గుండెలో ఏదో తెలియని గుబులు మొదలైంది, “ధనలక్ష్మి ఇక లేదు, ఇక తాను జీవితమంతా ఒంటరేనా!” దిగులు పట్టుకుంది.

“బాబాయ్ మీరు కూడా ఇప్పుడే వెళ్ళిపోతే ఎలా? ఒక వారం రోజులు ఉండండి, నాకు కాస్త మనశ్శాంతిగా ఉంటుంది” హైదరాబాదులో సెటిల్ అయిన తన బాబాయ్ రామారావును బ్రతిమిలాడాడు ధర్మారావు. “సరేలేరా నాకూ అట్లాగే అనిపిస్తోంది” ఒప్పుకున్నాడు రామారావు.

‘బాబాయి-అబ్బాయి’ అన్న మాటేగాని స్నేహితుల కంటే ఎక్కువ క్లోజ్‌గా ఉంటారు. మనశ్శాంతి కోసం ప్రతి రోజు ఇద్దరూ మందు పార్టీలు చేసుకుంటూనే ఉన్నారు. గత జీవితం, గడుస్తున్న జీవితం, రాబోయే జీవితం గురించి మాట్లాడుకుంటూనే ఉన్నారు!

“ధర్మా, నువ్వేమి అనుకోకపోతే ఓ మాట చెబుతాను, చరిత్రలో చాలామంది గొప్పవాళ్ళు తమ జీవిత భాగస్వామిని కోల్పోయిన తర్వాత ఒంటరిగా బ్రతకలేక, మళ్ళీ పెళ్ళి చేసుకుని తమ శేషజీవితాన్ని ఆనందంగా గడపడమే కాకుండా తమ జీవిత భాగస్వామికి కూడా మంచి జీవితాన్ని ఇచ్చి ఆదుకున్నారు! ఎవరైనా భార్య బతికుండగానే మళ్ళీ పెళ్ళి చేసుకోవాలని ఆలోచిస్తే వాళ్ళు కచ్చితంగా దుర్మార్గులే! కానీ విధి వక్రీకరించి ఒంటరిగా మిగిలిపోయేవారు తోడు కోసం జంటను వెతుక్కోవడం తప్పు కాదు! నిన్ను తొందరపడమని చెప్పడం లేదు, కూల్‌గా ఆలోచించు! మంచంలో పడి ఉన్న మీ అమ్మకు సేవలు చేయాలి, నీ బాగోగులు చూడాలి! నీ ఒక్కడి వల్ల అయ్యే పనేనా? నీ కొడుకు కోడలు చేస్తారా? ... నా అభిప్రాయంతో గనుక నువు ఏకీభవిస్తే నాకు ఫోన్ చేయి, నేను నీకు తగిన సంబంధం, తగిన జోడిని చూస్తాను, లేదా నీ దృష్టిలో ఎవరైనా ఉంటే చెప్పు, నేనే వెళ్ళి మాట్లాడి సెటిల్ చేస్తాను!”

ధర్మారావు మౌనం!

మరుసటి రోజు కూడా ఇదే విషయాన్ని ఇంకా సవివరంగా చెప్పి రామారావు సెలవు తీసుకొని హైదరాబాద్ వెళ్ళిపోయాడు.

***

ఓ రెండు రోజుల తర్వాత రామారావు దివ్యకి ఫోన్ చేసి, "మీ నాన్న గురించి ఏమాలోచించారు? వాడి యోగక్షేమాలు, అవసరాలు ఎవరు చూస్తారు? వాడి జీవితం ఎట్లా ఉండాలని కోరుకుంటున్నారు?" నాటకీయ ఫక్కీలోఅడిగాడు.

సడన్‌గా అడిగేసరికి దివ్య కొంచెం కన్ఫ్యూజ్ అయినా, "బాగోగులేముంటాయి తాతయ్యా ! మేమందరం లేమా? అయినా నాన్నగారే మా యోగక్షేమాలు చూస్తారు, వారికోసం ప్రత్యేకంగా ఎవరు అవసరం లేదు కదా!" అంది.

"అదేనమ్మా! బాగా ఆలోచించండి ! ఇదివరకైతే మీ అమ్మ వాడి ప్రతి విషయాన్ని పట్టించుకొని దగ్గరుండి అన్ని చేసి పెట్టేది. నానమ్మను కూడా చూసుకునేది. నువ్వైతే అత్తారింట్లో ఉంటావు మరి ఇక్కడ మీ అన్నయ్య వదిన ఇవన్నీ చేసి పెడతారా? మీ నాన్నకైతే బాత్రూంలో టావెల్ వేసుకోవడం కూడా తెలియదు! పైగా సడన్‌గా భార్య పోయింది, డిప్రెషన్ కి వెళ్లే ప్రమాదం కూడా ఉంది!" రామారావు చెబుతూనే ఉన్నాడు!

'నిజమే కదా తాను ఇంత లోతుగా ఆలోచించనే లేదు' నాన్న పరిస్థితి గుర్తుకొచ్చి కళ్ళల్లో నీళ్లు తిరిగాయి దివ్యకు.

"ఏమ్మా మౌనంగా ఉన్నావు? మీ నాన్నకు మళ్లీ పెళ్లి చేసి సంతోషకరమైన జీవితాన్ని ఇద్దామా లేక డిప్రెషన్ లోకి పంపుదామా?" గట్టిగానే అన్నాడు రామారావు. ఒక్కసారి ఉలిక్కిపడింది దివ్య! ఏంటి నాన్నకు మళ్ళీ పెళ్ళా? మాకు సవతి తల్లా? ఊహించలేక పోయింది. తల పట్టుకుని అలాగే కూర్చుండి పోయింది!

"సరే ఆలోచించు, ఓ మూడు రోజుల్లో నీ అభిప్రాయం చెప్పు" ఫోన్ పెట్టేసాడు రామారావు.

వారం రోజుల తర్వాత రామారావు ధర్మారావుకు ఫోన్ చేసి "ధర్మా, ఏమాలోచించావ్ రా! ఇక్కడ హైదరాబాదులో మా వీధిలోనే ఒక మంచి సంబంధం ఉంది. మనవాళ్ళే, పేరు రామలక్ష్మి, 50 ఏళ్ళు ఉండొచ్చు, డైవర్సీ, ఓ శాడిస్ట్ సైకోగాడు విడాకులు ఇచ్చాడు, పిల్లలు కూడా లేరు, ఏ బాదరా బందీ లేదు, మన ఇంట్లో బాగా అడ్జస్ట్ అవుతుంది! ఏమంటావ్?"

మౌనంగానే ఉండిపోయాడు ధర్మారావు.

"మౌనం అంగీకారం అనుకోనా? సరే బాగా ఆలోచించుకొని చెప్పు!" ఫోన్ పెట్టేసాడు రామారావు.


మూడు రోజుల తర్వాత శరత్‌కు ఫోన్ కలిపాడు రామారావు, "శరత్ ఎప్పటినుంచో నీతో ఈ విషయం డిస్కస్ చేద్దామనుకుంటున్నాను, టైం కుదరలేదు. ఏంటంటే మరి మీ నాన్న భవిష్యత్తు ఏమిటి?" అడిగాడు రామారావు.

"చెప్పు తాతయ్య నాకేం అర్థం కాలేదు" జవాబు ఇచ్చాడు శరత్.

"అదేరా ఇప్పుడు మీ అమ్మ లేరు కదా, మరి నాన్న బాగోగులు చూసుకోవడానికి ఓ మనిషి కావాలి కదా! వాడి పనులువాడే చేసుకోలేని పరిస్థితిలో ఉన్నాడు, అలా తయారు చేసింది మీ అమ్మ! అందుకే అన్ని విధాల తగిన ఆవిడని చూసి పెళ్ళి చేద్దామని నా ఉద్దేశం!" సూటిగా చెప్పేశాడు రామారావు.

"అదేంటి తాతయ్య నాన్నకు ఈ వయసులో పెళ్ళి ఏంటి? అయినా ఆయన పనులు చూసుకోవడానికి మేమున్నాం కదా!" జవాబు ఇచ్చాడు శరత్.

"మీరున్నారు సరే కానీ వాడి దైనందిన జీవితంలో కావాల్సిన ఏర్పాట్లు అన్ని మనం



చేయలేమురా, ఒక ఆడ తోడు కంపల్సరిగా ఉండాలి!" అన్నాడు రామారావు.

"అది తప్పు తాతయ్య, ఇప్పుడు మా తమ్ముడు అరవింద్‌కు సంబంధాలు వస్తున్నాయి, మరి పెళ్ళి తండ్రికా కొడుక్కా అని జనం నవ్వరా? ఏం మాట్లాడతారు తాతయ్య ! అర్థం పర్థంలేకుండా" కసురుకున్నాడు శరత్.

"ఒరేయ్ భార్య లేని వాళ్ళ బాధలు నీకు అర్థం కావు, అది అర్థం చేసుకునే అనుభవం కూడా నీకు లేదు! ఇట్లాగే వదిలేస్తే మీ నాన్న డిప్రెషన్లోకి వెళ్లిపోయి మనకు కాకుండా పోతార్రా!" గట్టిగానే అన్నాడు రామారావు.

"నీకు చాదస్తం ఎక్కువైంది తాతయ్య" కోపంగా అన్నాడు శరత్.

"పెద్ద చిన్న లేకుండా మాట్లాడకు, మీ నాన్నకు మీ నాన్నమ్మకు కావలసిన విధంగా సేవలు చేయడానికి నీ భార్య ఒప్పుకుంటుందా? ముందు అడిగి తెలుసుకొని నాతో మాట్లాడు! ఏదో అభిమానంతోనో ఆవేశంతోనో సేవలు చేస్తామని నువ్వు అంటావు కానీ ఆడవాళ్ళు ఒప్పుకోర్రా! నీకు తెలియదు, ఒకరోజు రెండు రోజులు కాదు జీవితాంతం చేయాలి ! చేస్తారా?" గదమాయించాడు రామారావు.

శరత్ ఆలోచనలో పడ్డాడు.

"సరే మీ ఆవిడతోను మీ తమ్ముడుతోనూ చర్చించి ఒక రెండు రోజుల్లో నాకు ఏ విషయం చెప్పు" అని ఫోన్ పెట్టేసాడు రామారావు.

ఇంతలో రామారావు ఫోన్ మోగింది అవతల దివ్య, "హలో తాతయ్య, నేను దివ్యను, మొన్న మీరు చెప్పిన విషయం బాగా ఆలోచించాను, మరి ఆ వచ్చే ఆవిడ మా నాన్నను మా అమ్మ లాగా చూసుకుంటుందా? మా అందరిని బాగా చూసుకుంటుందా?" అడుగుతోంది.

"తప్పకుండా చూసుకుంటుంది, అందుకే అలాంటి సంబంధమే చూశాను" జవాబు ఇచ్చారు రామారావు.

"నాన్నగారి అవసరాల్ని దృష్టిలో పెట్టుకొని ఒప్పుకుంటున్నాను, మళ్ళీ ఏదైనా తేడా జరిగితే మటుకు తాతయ్య నేను ఊరుకోను!" వార్నింగ్ ఇచ్చింది దివ్య.

"సరేలేవే" నిట్టూరుస్తూ హమ్మయ్య ఇంకెన్ని కష్టాలు పడాలో వీడి కోసం అనుకున్నాడు రామారావు.

ఓ మూడు రోజుల తర్వాత శరత్ రామారావుకు ఫోన్ చేశాడు "తాతయ్య, నా భార్య కూడా మీరన్నట్టుగానే అంటోంది, జీవితాంతం సేవ చేసే బాధ్యత ఎట్లా తీసుకుంటాము, మధ్యలో వదిలేస్తే అవమానం కాదా అంటోంది. కానీ అరవింద్ మాత్రం ససేమీరా ఒప్పుకోవట్లేదు. ముసలోడికి పిచ్చి పట్టినట్టుంది, మా నాన్నకు పెళ్ళి చేస్తాడా, ఇప్పుడు గనక ఎదురుగా ఉంటే వాయించేసేవాణ్ణి అని ఏదో పిచ్చిపిచ్చిగా మాట్లాడుతున్నాడు! వాడిని ఒప్పించడం నావల్ల కాదు తాతయ్య!"

"సరేలేరా కుర్ర కుంక, ఉడుకు రక్తం కదా, ఏదో వాగుతాడు, నేను చూసుకుంటాలే! ఇక ఇప్పుడు మీ నాన్నను ఒప్పించాలి!" అన్నాడు రామారావు.

"ఏంటి, ఇంత తతంగం జరుగుతున్నా మా నాన్నకి ఇంకా తెలియదా! ఏంటి తాతయ్య మీ ప్లాను? నాన్నంటే మాకు ఎంత భయమో నీకు తెలుసు కదా!" నివ్వెరపోయి అడిగాడు శరత్.

"చెప్పాను కానీ, ఇంకా 100 శాతం రిజల్ట్ రాలేదు! చేసేదంతా వాడి కోసమేగా ఒప్పుకోక చస్తాడా! అయినా మీ నాన్న మీద ఒక కన్నేసుంచరా మనవడా!" నవ్వుతూ చెప్పాడు రామారావు.

"ఏంటో తాతయ్య, ఈమధ్య ఓ రెండు మూడు సార్లు కాటికాపరి పోశాలు వచ్చి నాన్నను కలిసి వెళ్ళాడు!" చెప్పాడు శరత్.

"మీ నాన్న అలాంటి వాడు కాదులేరా, ఏ దురలవాటుకు లొంగడు!" నవ్వి, "వాడికి ఏదో డబ్బులు అవసరం ఉండి వచ్చుంటాడు" అన్నాడు రామారావు.

మరుసటి రోజే ధర్మారావుకి ఫోన్ చేశాడు రామారావు "ఎట్లా ఉన్నావ్రా ధర్మా, మీ అమ్మగారు బాగున్నారా, ఏంటి విశేషాలు? ఫోన్ అసలే చేయట్లేదు! ఇప్పటికైనా మనసు మార్చుకున్నావా? పెళ్ళికి సిద్ధమేనా?" టకటక సూటిగా అడిగేశాడు. ధర్మారావు మౌనం.

''ఏంర్రా నీ మూగనోము, మౌనవ్రతం వదలవా? మనసులో ఏముందో చెప్పవా? నేను చేసేదంతా నువ్వు బాగుండాలనే కదా! ఈమధ్య పోశాలు గాడు ఇంటికి వచ్చి కలుస్తున్నాడంట ఏంటి సంగతి?" అడిగాడు రామారావు.

"ఏం లేదు బాబాయ్, ఏమన్నా ఉంటే మీకు చెప్పనా? వాడికేదో అవసరం ఉండి వచ్చాడు, అంతే!" వివరించాడు ధర్మారావు.

"ఇంతకీ పెళ్ళి సంగతేమంటావు" సూటిగా అడిగాడు రామారావు.

"ఇంకా ఏమీ ఆలోచించు కోలేదు, ఆలోచించుకొని ఒక నెల తర్వాత చెప్తాను బాబాయ్" అన్నాడు ధర్మారావు.

"సరే చించు చించు, నేను ఇటువైపు నుంచి ఒక్కొక్కరిని నరుక్కుంటూ వస్తున్నాను, నీ నెల గడువయేలోగా అంతా చక్కదిద్దేస్తాలే!" ధీమాగా చెప్పాడు రామారావు.


చూస్తుండగానే ఒక నెల గడిచేపోయింది, ఈలోగా ఎన్నో మార్పులు! శరత్‌కు పక్క జిల్లాలో మెడికల్ ఆఫీసర్‌గా పోస్టింగ్ వచ్చింది, భార్యతో సహా వెళ్ళి అక్కడే కిరాయి ఇంట్లో ఉంటున్నాడు. అరవింద్ హైదరాబాదులోని ఇఎన్ సి ఆఫీసులో డెప్యుటేషన్ పై వెళ్ళాడు. ఇక ఇంట్లో ధర్మారావు, అన్నపూర్ణమ్మ, ఓ పనిమనిషి మాత్రమే మిగిలారు. దివ్య అప్పుడప్పుడు వచ్చి ఒకరోజు రెండు రోజులుండి వాళ్ళ బాగోగులు చూసి వెళ్తుంది.

ఆదివారం సెలవు రోజున అరవింద్ ఇంటికి వచ్చి వాళ్ళ నాన్న పడుతున్న కష్టాలు చూసి చలించిపోయాడు. 'ఇంట్లో అమ్మ అవసరమే, నాన్నకు ఓ తోడు కావాలి అప్పుడే ఆయన ఆనందంగా ఉండగలరు' మనసులోనే ఒక నిర్ణయానికి వచ్చి వెంటనే రామారావు తాతయ్యకు ఫోన్ చేసి తన మనసులోని మాట చెప్పేశాడు.

''నాకు తెలుసులేరా, కొన్ని విషయాలు స్వయంగా చూసి అనుభవిస్తే గాని అర్థం కావు, మీ నాన్న పెళ్ళి సంగతి నేను చూసుకుంటాలే, ఇంక నువ్వు నిశ్చింతగా ఉండు" చెప్పి ఫోన్ పెట్టేసాడు రామారావు.

'అమ్మయ్య! అందరిని ఒప్పించేసరికి తల ప్రాణం తోకకొచ్చింది' ఇక ధర్మారావుకు ఫోన్ చేసి ఈ శుభ పరిణామాలన్నీ చెప్పి ఒప్పించాలి, ఆ తర్వాత అమ్మాయి వాళ్ళకు ఫోన్ చేసి వాళ్లను కూడా రెడీ చేయాలి! ఇది ప్రస్తుతం తన కర్తవ్యం! అప్పుడే ఈ బాబాయ్‌కి మనస్ఫూర్తిగా సంతృప్తి ఉంటుంది. తననే నమ్ముకున్న ధర్మరావుకి, ఓ ఒంటరి మహిళకు ఓ జీవితం ఇచ్చినట్టవుతుంది. రామారావుకి మనసెంతో తేలికైనట్లనిపిస్తోంది, ఓ మంచి కార్యం సాధిస్తున్నందుకు ముఖంలో సంతోషం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది!

ఇంతలో ఫోన్ రింగ్ అవుతోంది, ఎవరా అని చూస్తే ధర్మరాజు ఫోన్ ! వెతకబోయిన తీగ కాలుకు తగిలినట్టయింది రామారావుకు. "హలో ధర్మా, బాగున్నావా? నేనే నీకు ఫోన్ చేద్దామనుకుంటున్నాను, ఇంతలో నువ్వే చేసావు, శుభవార్తరా ! నీ పెళ్ళికి మీ వాళ్ళందరూ ఒప్పేసుకున్నారు! ఇంక నువ్వు ఊ అంటే ముహూర్తం చూడడమే తరువాయి" తన సహజ ధోరణిలో టకటకా చెప్పేసాడు రామారావు.



"బాబాయ్ నేనే మీకో శుభవార్త చెప్పడానికి ఫోన్ చేశాను, వచ్చే ఆదివారం ఉదయం 11 గంటలకు నా పెళ్ళి! ఆశ్చర్యపోకండి మీకెందుకు శ్రమని నేనే అమ్మాయిని వెతుక్కున్నాను. నిరాడంబరంగా పెళ్ళి మా ఇంట్లోనే ! ఎవరిని పిలవట్లేదు బాబాయ్, మనమే ఇంటి వాళ్ళమే ఉంటాము. మీరు తప్పకుండా పిన్ని, పిల్లల్ని తీసుకుని కనీసం అరగంట ముందైనా రావాలి! అమ్మాయి ఎవరు ఏంటి అని ఏమీ అడగవద్దు! మన వాళ్ళందరికీ ఇలాగే చెప్తున్నాను, ఎందుకంటే ఒకటి రెండు రోజులు ముందు వచ్చి అనవసర గలాటా చేస్తే మన పరువే పోతుంది కదా అని నా ఉద్దేశం!" చక చక పాఠం ఒప్ప చెప్పినట్లు చెప్పేసి ఫోన్ పెట్టేసాడు జవాబు కైనా ఎదురు చూడకుండా ధర్మారావు. ఖంగు తినడం రామారావు వంతయ్యింది!

అందరికీ ఇలాగే చెప్పి, ఊపిరి పీల్చుకున్నాడు ధర్మారావు!!

***

అనుకున్న ఆదివారం రానే వచ్చింది! ఉదయం 9:30 కల్లా పిలిచిన వారందరూ వచ్చేసారు, ఇంట్లోనే టిఫిన్లు కాఫీలు అరేంజ్ చేయించాడు ధర్మారావు. గంభీరంగా ఉన్న ధర్మారావును పెళ్ళి వివరాలు అడిగే ధైర్యం ఎవరికీ చాలట్లేదు. మౌనంగా ఉండడం లేదా వాళ్ళలో వాళ్ళే ఏదో మాట్లాడుకోవడం మాత్రమే చేస్తున్నారు.

ఉదయం 10:30 అవుతోంది. ధర్మారావుకు ఏదో ఫోన్ వచ్చింది, ఫోన్ మాట్లాడి పెట్టేసి, "పెళ్ళి వాళ్ళు, అమ్మాయి వచ్చేస్తున్నారు, మనం బయట నిలబడి వాళ్ళని ఆహ్వానిద్దాం పదండి!" అన్నాడు ధర్మారావు. మౌనంగానే ఒకళ్ళ ముఖం ఒకళ్ళు చూసుకుంటూ అందరూ బయటకెళ్ళి నిలబడ్డారు.

ఒక పెద్ద వ్యాన్ వచ్చి ఇంటి ముందు ఆగింది, క్యాబిన్ నుంచి డ్రైవర్, పోశాలు, శంకర్ (ధర్మారావు మిత్రుడు) దిగారు.

పోశాలు ఒక్కొక్కరిగా అందరికీ నమస్కారాలు చెప్పాడు.

"వీడేనా పెళ్ళి పెద్ద?" వెటకారంగా అన్నాడు రామారావు.

"అవును బాబాయ్ పోశాలే పెళ్ళి పెద్ద! ఇతను శంకరని నా మిత్రుడు! వీళ్ళిద్దరే నా పెళ్ళికి సూత్రధారులు" వినమ్రంగా చెప్పాడు ధర్మారావు. 'అఘోరించారు వెధవలు' అనుకున్నారు అందరూ మనసులో!

వ్యాన్ వెనుక నుండి మొదట సన్నాయి బృందం దిగారు, తర్వాత ఐదారుగురు ఆడవాళ్ళు, నలుగురు బోయలు దిగారు. సన్నాయి వాయించమని చెప్పాడు శంకర్. బోయలచేత పల్లకి దింపించాడు పోశాలు.

ముందు సన్నాయి వాయిద్యాలు, ఆ వెనకే మంగళారతులు పట్టుకున్న ఆడవాళ్ళు, వెనకే పెళ్ళి కూతురును మోస్తున్న పల్లకి, పక్కనే నడుస్తూ పెళ్ళికొడుకు దుస్తుల్లో ధర్మారావు! ఇంటి వైపు కదులుతున్నారు! చుట్టుపక్కల ఇళ్ళలోంచి జనం బయటకు వచ్చి చోద్యం చూసినట్టు చూస్తున్నారు!

రామారావు, ధర్మారావు అందర్నీ సాదరంగా ఇంట్లోకి ఆహ్వానించారు. పల్లకి కింద దింపి, బోయలు వ్యాన్ లోకి వెళ్ళి రెండు సీట్లున్న ఒక సోఫాసెట్ తీసుకొచ్చి, ధర్మరావు పర్సనల్ రూమ్‌లో అమర్చారు.

ఆడవాళ్ళు మెల్లగా పల్లకి తెర తొలగించారు. లోపల ఉన్న పెళ్ళి కూతుర్ని చూసి అందరూ అవాక్కయ్యారు! ఎవరు తేరుకోక ముందే అన్నపూర్ణమ్మ దగ్గరగా వచ్చి, కళ్ళజోడు పెట్టుకోనందున మసగ్గా కనిపిస్తున్న పెళ్ళికూతురుని చూసి ఆశ్చర్యపోయింది!

"ఏమిటిది మా ధనలక్ష్మి తిరిగొచ్చిందా! మళ్ళీ బతికొచ్చిందా? ఇది నిజమా! కలనా!" అయోమయంలో మాట్లాడుతూనే ఉంది అన్నపూర్ణమ్మ.

ధర్మారావు మెల్లిగా అన్నపూర్ణమ్మ భుజం పైన చేయి వేసి ఆప్యాయంగా "అవునమ్మా! భగవంతుడు మన ధనలక్ష్మిని మనకే తిరిగి ఇచ్చేశాడు, ఇక మనం హాయిగా ఉండొచ్చు!" చెబుతూ మెల్లిగా తీసుకెళ్ళి కుర్చీలో కూర్చోబెట్టాడు.

పెళ్ళి చేయడానికి వచ్చిన పంతులు హడావిడి

చేస్తున్నాడు ముహూర్తం దాటి పోతుందని, ఆడవాళ్ళొచ్చి పెళ్ళికూతురుని తీసుకెళ్లి సోఫాలో కూర్చోబెట్టారు. పెళ్ళి తతంగం మొదలైంది. పెళ్ళి మంత్రాలు, సన్నాయి వాయిద్యాల మధ్య తాళి కట్టేశాడు ధర్మారావు, అందరూ అక్షింతలు వేశారు.

ధర్మారావు మెల్లిగా అన్నపూర్ణమ్మను తీసుకొచ్చి అక్షింతలు వేయించి, తన జేబులో నుంచి ధగధగా మెరుస్తున్న రెండు ముక్కుపుడకలను తీసి ఆడవాళ్ళ సహాయంతో అన్నపూర్ణమ్మతో ధనలక్ష్మికి అలంకరింప జేశాడు! "అమ్మా, గుర్తుందా ఇవి నా మొదటి సంపాదనతో నువ్వు చేయించిన ముక్కు పుడకలు! ఇవే మన ధనలక్ష్మిని తిరిగి మన దగ్గరికి తీసుకొచ్చా యి!" చెమర్చిన కళ్ళతో చెబుతున్నాడు ధర్మారావు.

"ఈ ముక్కుపుడకల్లో ఏ అతీత శక్తులు ఉన్నా యో గాని, అవి నా దగ్గర ఉన్నప్పటి నుండి నేను ఒక్క క్షణమైన ధనలక్ష్మిని మర్చిపోలేకుండా ఉన్నాను, అందుకే నాకోసం మీరు ఎంత కష్టపడి పెళ్ళి సంబంధాలు చూసినా మీరందరూ ఒప్పుకుని నన్ను ఒప్పించాలని ప్రయత్నించినా నేను ఒప్పుకోలేదు! క్షమించండి!

అసలేం జరిగిందంటే "ఒకరోజు ధనలక్ష్మి చితి వద్ద ఏడుస్తూ కూర్చున్న నన్ను పోశాలు ఓదారుస్తూ, ఇట్లా ఎంతకాలం ఏడుస్తూ ఉంటారు సారు, వారం రోజుల నుంచి చూస్తున్నాను, మీకు నచ్చితే నేను ఒక ఉపాయం చెబుతాను వింటారా అన్నాడు, సరే చెప్పమన్నాను. పట్నంలో మా బామ్మర్ది మైనపు బొమ్మలు తయారు చేసే ఫ్యాక్టరీలో పనిచేస్తుంటాడు, అవి అచ్చం మనిషిలాగే ఉంటాయి, అమ్మగారి బొమ్మ చేయించి ఆ ముక్కుపుడకలు పెట్టండి, తప్పకుండా అమ్మ మీతోనే ఉండిపోతారు!" అని చెప్పి ఒక రోజు నన్ను పట్టణం తీసుకెళ్ళి అక్కడ బొమ్మలు చూపించాడు, నిజంగా అవి సజీవంగా ఉన్నట్లే అనిపించింది. వెంటనే ధనలక్ష్మి బొమ్మను తయారు చేయవలసిందిగా, ఎంత డబ్బైనా ఇస్తాను, ప్రాణం ఉన్న మనిషిలాగే ఉండాలని చెప్పాను. ఈ కార్యక్రమమంతా నా ఫ్రెండ్ శంకర్ దగ్గరుండి చూసుకున్నాడు, పర్యవసానమే ఈ నా ధనలక్ష్మి!" సోఫాలో ధనలక్ష్మి పక్కనే కూర్చుంటూ చెప్పాడు.

"పెళ్ళి ప్లాన్ అంతా శంకర్‌ది.,

ఇప్పుడు ఎక్కడ లేని శక్తి నాకు వచ్చింది, నా పనులు నేను చేసుకోవడమే కాకుండా ఆయా సహాయంతో అమ్మ పనులు కూడా చేసి పెడతాను, అట్లాగే మా ఊర్లో ఉన్న సమస్యల్ని కూడా తీర్చడానికి ప్రయత్నం చేస్తాను!" ఎంతో ఉత్సాహంగా చెబుతున్నాడు ధర్మారావు.

'నీ ఉన్నతమైన సంస్కారాన్ని గుర్తించలేక పెళ్ళి పెటాకులంటూ నిన్ను సతాయించాన్రా ధర్మా, నన్ను క్షమించు' మనసులోనే అభినందిస్తున్నాడు రామారావు.

'మైనపు బొమ్మ అయినా అమ్మను చూసినట్టే ఉంది, 'వాషింగ్టన్ డిసి లోని వ్యాక్స్ మ్యూజియం' బొమ్మకన్నా గొప్పగా ఉంది' మనసులోనే మెచ్చుకుంటున్నారు ధర్మారావు పిల్లలు.

"పోశాలూ, నీ స్మశాన వాటిక పేరు స్వర్గసీమ అని పెట్టాలన్నావు కదరా, అది కాదురా స్వర్గసీమ, ఇకనుండి మా ఈ గదే "స్వర్గసీమ"! చెప్పాడు ధర్మారావు.

"అమ్మ, బాబాయ్, పిల్లలు, ఇక్కడ ఉన్న వాళ్ళందరూ వినండి! ధనలక్ష్మి సాక్షిగా ప్రకటిస్తున్నా ను: ఈరోజు నుండి నేను "వానప్రస్థం" స్వీకరిస్తున్నా ను! సాత్విక ఆహారం, పుస్తక పఠనం, సమాజ సేవ, నేను నేర్చుకున్న విద్యా బుద్ధుల్ని యువతకు బోధిస్తూ అందరూ సక్రమ మార్గంలో నడిచేటట్లు ప్రయత్నం, ఇంటా బయటా ప్రశాంతత నెలకొలిపే ప్రయత్నం! ఇకనుండి ఇవే నా దిన చర్యలు" ధర్మారావు గంభీరంగా ప్రకటించి, చేతులు జోడించడంతో అందరి కళ్ళు చెమర్చాయి.

*రచయిత సెల్: 99592 99039*


**కన్నడ నవలలకు వేలూరి కృష్ణమూర్తి అనుసృజన**

1. పుంస్త్రీ – డా. ప్రభాకర శిశిల ..........................రూ. 120/-
2. మహాయోగి పతంజలి – కె. శ్రీనివాసశాస్త్రి............రూ. 120/-
3. సీత – డా. హెచ్.జి.రాధాదేవి............................రూ. 120/-
4. వాసవి – జె.సు.నా.........................................రూ. 100/-
5. మత్స్యగంధి – డా. ప్రభాకర శిశిల......................రూ. 90/-
6. పృథ తెరచినపుటలు–శ్రీమతి విజయచంద్రమౌళేశ్వర్.రూ. 150/-
7. అంధపర్వం –రామచంద్ర భావె.........................రూ. 200/-
8. యుగపురుషుడు – హెచ్.ఎస్. పార్వతి................రూ. 150/-
9. రామరాజ్యంలో...సీత – డా. ప్రభాకర శిశిల.........రూ. 150/-
10. విశ్వరథ – గోపినాథ్ ఎం. బెంగళూరు..............రూ. 200/-
11. కాలచక్రం – నా.సు. భరతన హళ్ళి.................రూ. 150/-
12. బర్బరిక – గురుపాదం బేలూరు.....................రూ. 120/-
13. యాజ్ఞవల్క్య – హెచ్. లక్ష్మీనరసింహ శాస్త్రి.........రూ. 120/-
14. మీరా – టి.సుబ్బారావు..............................రూ. 150/-
15. ధరణికి దిగివచ్చిన దివ్యతేజం – హెచ్. లక్ష్మీనరసింహ శాస్త్రి......................................................రూ. 150/-
16. గంగావతరణం – రామచంద్ర భావె.................రూ. 200/-
17. బాబూజి – కె. శ్రీనివాస శాస్త్రి..........................రూ. 150/-
18. నచికేత – టి.సుబ్బారావు..............................రూ. 150/-

**ఇతర అనువాదాలు**

1. సరళ సుందర సునిశత మమత – మమతా బెనర్జీ కవిత్వం, అనువాదం: డా. సామాన్య ..............................రూ. 100/-
2. శిలా విలాపం–టాగోర్ కథలకు చింతపట్ల అనువాదంరూ. 30/-
3. Some Silent Melodies- Dr. Dhenuvakonda ................రూ. 60/-
4. గోరింట పూలు –చాగంటి తులసి.......................రూ. 60/-
5. Pride of Place (An anthology of Telugu Poetry 1981-2000) Translated by K. Damodar Rao రూ.......300/-
6. నెలబాల (ఠాగూర్ కవిత్వం) –రత్నమాల................రూ. 50/-
7. పడమటి గాలి పాట – ఆంగ్ల కవితల అనువాదం:రూ. 150/-
8. సాల్వేషన్ – డాక్టర్ కావడి ఎల్లయ్య ఆంగ్ల కవిత్వం.. రూ. 100/-
9. నౌకా భంగం (రవీంద్రనాథ్ టాగూర్ నవల 'ది రెక్'కు అనువాదం) – ఒద్దిరాజు సోదరులు........................రూ. 200/-
10. ఒద్దిరాజు సోదరుల ఇంగ్లీష్ గ్రామర్..................రూ. 200/-
11. జాతీయ, అంతర్జాతీయ ఉత్సవాలు–బుర్ర మధుసూదన్..రూ. 100/-
12. లోపలి పరిమళం –మునిమడుగుల రాజారావు......రూ. 100/-
13. కళాసౌందర్యం (చిత్రకళా వ్యాసాలు)......................రూ. 60/-
14. సౌందర్యసృజన (చిత్రకళావ్యాసాలు).................. రూ. 100/-
15. వర్ణపద చిత్రణ (చిత్రకళావ్యాసాలు)..................... రూ. 150
(పై మూడు పుస్తకాల రచయిత – ఎల్.ఆర్. వెంకటరమణ)
16. జీవించు... మరణంలో కూడా – పి. విజయలక్ష్మి...రూ. 90/-
17. న్యాయం గెలుస్తుంది– తడకమళ్ళ మురళీధర్......రూ. 100/-

# నాస్తిక విప్లవకారుడు గోరా

- చెరుకూరి సత్యనారాయణ




ప్రఖ్యాత నాస్తికోద్యమకారుడు 'గోరా'గా పేరు మార్చుకున్న గోపరాజు రామచంద్రరావు భార్య సరస్వతి, "గోరాతో నా జీవితం" అనే పేరిట 1992లో రాసిన తన స్వీయచరిత్ర ఇటీవల చదవటం జరిగింది. గోరా అంటే ఒక సాధారణ నాస్తికుడిగానే నాకున్న అభిప్రాయం ఈ రచన తొలగించింది. గోరా ఒక అనితరమైన, అసాధారణమైన వ్యక్తిగా, గోరాలో గొప్ప త్యాగం, నిబద్ధత కన్పించాయి. విప్లవకారులుగా చెప్పుకునేవారు సైతం చేయలేని పనులు నిర్భయంగా చేసిన వైనం, పూజలు, పురస్కారాలు, సాంప్రదాయక పద్ధతుల మధ్య పెరిగి కేవలం 3వ తరగతి చదివిన సరస్వతిని తన భావాలకనుగుణంగా మార్చుకోవటం - ఇద్దరూ కలిసి తమ 9 మంది సంతానాన్ని వారి వారి జీవిత భాగస్వాముల్ని వారి పిల్లల్ని అందరినీ నాస్తికోద్యమంలో భాగస్వాములుగా మార్చటం - ఇవన్నీ గోరా గారిపై నా అభిప్రాయం మరింత గౌరవస్థానంకి చేర్చింది. ఈ పుస్తకంలో నేను తెల్సుకున్న కొన్ని విషయాలు పాఠకుల కోసం...

విజయనగరంలో సరస్వతి గారి ఇంటిపక్కనే గురజాడ అప్పారావు గారి ఇల్లు ఉండేది.

* గురజాడ, ఆదిభట్ల నారాయణదాసు, ద్వారం వెంకటస్వామి నాయుడు, గిడుగు రాంమూర్తి గార్లు రోజూ సరస్వతి వాళ్ల ఇంటికి వచ్చేవారు.

* సరస్వతి గారి తాతగారు, గిడుగు రాంమూర్తి గారు తోడల్లుళ్లు.

* విజయనగరం మహారాణి గారు తమ దగ్గర పనిచేసే కుటుంబాల్ని పిలిపించుకొని వారి కష్టసుఖాలు విచారించేవారు.

* ఆ రోజుల్లో నెలల పిల్లలకి పెళ్లి చేసేవారు. వారి తల్లులు ఎత్తుకొని పెళ్లి తంతు నిర్వహించేవారు.

* వెయ్యిన్నూట పదహార్లు అనేది గొప్ప కట్నం.

* గోపరాజు రామచంద్రరావు గారు తనపేరుని గోరా గా 1960లో ప్రభుత్వ గెజిట్‌లో ప్రచురించటం ద్వారా మార్చుకున్నారు.

* 1926 నాటికి తిరుమల కొండపైకి బస్సులు లేవు.

* 1927 నాటికి రైళ్లలో 4 తరగతులుండేవి. మొదటి తరగతి, రెండో తరగతి, ఇంటర్ తరగతి, మూడో తరగతి.

* మద్రాసు నుండి కొలంబో (ప్రస్తుత శ్రీలంక) వెళ్లటానికి సముద్రం మీద రెండు రోజులు పట్టేది.

* బౌద్ధులు, బౌద్ధ భిక్షువులు అన్ని రకాల మాంసాలు తినే వారు.

* ఉప్పు సత్యాగ్రహం సందర్భంగా 3 లక్షల మంది జైళ్లకెళ్లారు.

* గాంధీ గారు ఆంధ్ర పర్యటనకు (1933) వచ్చినప్పుడు ఆయన ఉప న్యాసాన్ని గోరా గారు తర్జుమా చేశారు.

* గోరా గారు కాకినాడ కాలేజిలో పనిచేస్తున్నప్పుడు, జస్టిస్ పార్టీకి చెందిన పిఠాపురం రాజా గారు కాలేజి నిర్వాహకులుగా వుండేవారు. కాంగ్రెసుకు వ్యతిరేకంగా, బ్రిటీష్ వారికి అనుకూలంగా వున్న వారు గోరా గారిని ఉద్యోగం నుండి తొలగించారు. దానిపై గోరా గారు ఆంధ్ర విశ్వవిద్యాలయం వైస్-ఛాన్సలర్ సర్వేపల్లి రాధాకృష్ణన్‌కి అప్పీలు చేయగా వారు "నాస్తిక భావాలు కల్గి వున్నారన్న కారణంగా ఏ వ్యక్తినీ విద్యాసంస్థలు శిక్షించరాదని" తీర్పు చెప్పారు. దాంతో మళ్లీ గోరా గారికి ఉద్యోగం ఇవ్వాలని కాలేజి వారు అనుకున్నా గోరా గారు చేరకుండా బందరు హిందూ కళాశాలలో చేరారు. అప్పటి వరకు ఆ కాలేజిలో బోటనీ సబ్జెక్టు లేకపోయినా గోరా గారి కోసం ఆ సబ్జెక్టు ప్రవేశపెట్టారు.

* 1926 నాటికి కలకత్తా - మద్రాసు మధ్య విశాఖపట్నంలోనే పెద్ద ఆసుపత్రి (కింగ్ జార్జ్ హాస్పిటల్) వుండేది.

* 1937 ఎన్నికల్లో పంజాబ్, సింధు, బెంగాల్ మినహా అన్నిచోట్లా కాంగ్రెసు గెల్చింది.

* 1937 ఎన్నికల నాటికి ఓటు హక్కు కేవలం ఆస్తి పన్ను, ఆదాయపు పన్ను కట్టేవారికి, చదువుకున్న వారికి మాత్రమే ఓటు వుండేది.

* గోరా - సరస్వతి గార్ల ద్వితీయ కుమార్తె పెళ్లికాకుండా గర్భవతి అయింది. అందరూ అబార్షన్ చేయించమని సలహా ఇచ్చినా గోరా గారు వినలేదు. ఈ విషయంలో కిశోరిలాల్ మష్రువాలా లాంటి కాంగ్రెస్ నాయకులు మందలించినా పొట్టి శ్రీరాములు లాంటి మిత్రులు అండగా నిలబడ్డారు. ఈ అమ్మాయిని పిల్లతో సహా స్వీకరించిన ప్రసిద్ధ కమ్యూనిస్టు నాయకులు జొన్నలగడ్డ రామలింగయ్య గారి ఆచరణలు, మాతృత్వం, అవివాహ మాతృత్వం వివాహిత మాతృత్వం అంటూ విభజించటం పురుషాధిక్య సమాజంలో పురుషుణ్ణి రక్షించి స్త్రీని శిక్షించడం అవుతుందన్న గోరా గారి అభిప్రాయం రెండూ అభినంద నీయాలు.

* కేవలం కూతురు విషయంలోనే గాక అంతకుముందు ఏడెనిమిదేళ్ల క్రితం గ్రామంలో ఒక వితంతువు గర్భవతి అయినప్పుడు కూడా గోరా గారు ఆమెకు ఆశ్రయమిచ్చి మాతృత్వానికి - వివాహానికి ముడిపెట్టటం మాతృత్వాన్ని కించపరచటమేనని అభిప్రాయపడిన గోరా దంపతులు ఆమెకు పురుడుపోశారు.

* పొట్టి శ్రీరాములు కంటే ముందు స్వామి సీతారాం ఆంధ్రరాష్ట్రం కొరకు భీమవరంలో నిరాహార దీక్ష చేశారు.





* శ్రీరాములు గారు 1952 అక్టోబర్ నుండి 53 రోజులు నిరాహార దీక్ష చేసి డిసెంబర్ 15వ తేది చనిపోయారు.

* 1954లో కర్నూలు జిల్లా కరివెన గ్రామం ఈనాం రైతుల సమస్యపై సరస్వతి గారి నాయకత్వంలో శాసన సభ్యురాలు కాంతం, మంత్రి యం.వి. సుబ్బారెడ్డి భార్య మల్లమ్మలు సత్యాగ్రహం చేసి జైలుకెళ్లారు. సరస్వతి గారికి 'ఎ' క్లాసు ఇచ్చినా తిరస్కరించి 'సి' క్లాస్ తీసుకున్నారు

అ వాస్తవికత, సంఘదృష్టి, వ్యక్తిత్వం కలిపి వాస్తవ్య పేరుతో విద్యాలయం స్థాపించారు.

అ గోరా దంపతులు వారి పిల్లలకు చిత్రమైన పేర్లు పెట్టారు. ఉప్పు సత్యాగ్రహం సమయంలో పుట్టిన పిల్లాడికి 'లవణం' అని; రెండో ప్రపంచయుద్ధ సమయంలో పుట్టిన పిల్లాడికి 'సమరం' అని; 1937 ఎన్నికల్లో కాంగ్రెసు పార్టీ ఘన విజయం సాధించిన సమయంలో పుట్టిన పిల్లాడికి 'విజయం' అని; గాంధీ ఇర్విన్ ఒడబడిన సందర్భంలో పుట్టిన పిల్లకు 'మైత్రి' అని; మరొకరికి మారు (మార్పు) అని మరో కుమారుడి పేరు నియంత అని; రెండో ప్రపంచయుద్ధ కాలంలో ముస్సోలినీ, హిట్లర్ తదితర నియంతలు ప్రాచుర్యంలోకి వచ్చినందున ఈ పిల్లవాడికి 'నియంత' అని పేరు పెట్టారు. మైత్రి – జొన్నలగడ్డ రామలింగయ్యల కూతురు సకలతో నియంత వివాహం జరిగింది. తొమ్మిదో పిల్లాడికి 'నౌ' అని నామకరణాలు చేయటమేగాక వారందరినీ తమ నాస్తికోద్యమంలో భాగం చేశారు. ఎక్కువమంది పిల్లలకు వర్ణాంతర వివాహాలే చేశారు.

* దేశానికి స్వాతంత్ర్యం రాగానే కాంగ్రెసు పార్టీని రద్దు చేసి "లోక్ సేవక్ సంఘం" స్థాపించమని గాంధీజీ అన్నారు.

* ప్రజా ప్రతినిధుల ఆడంబరానికి వ్యతిరేకంగా 1961 అక్టోబర్ 8 నుడి సేవాగ్రాం నుండి బయలుదేరిన గోరాగారు 99 రోజులు 1100 మైళ్ళు పాదయాత్ర చేసి ఢిల్లీలోని నెహ్రూ గారి ఇంటి ముందు సత్యాగ్రహం చేశారు. ఇదే విషయమై 1960 రాయపూర్ కాంగ్రెసు సమావేశాలు జరిగిన 3 రోజులూ, గోరా గారు ఉపవాస దీక్ష చేశారు.

* 1963 మార్చిలో చైనా–భారత్ మైత్రికోసం ఢిల్లీలోని మహాత్మా గాంధీ సమాధి నుండి ఉత్తర ప్రదేశ్, బీహార్, బెంగాల్, అస్సాం రాష్ట్రాల గుండా చైనా సరిహద్దుల వరకు చేరిన గోరా బృందానికి చైనాలోకి ప్రవేశం నిరాకరించబడింది. ప్రభుత్వాల మధ్య ఘర్షణ వచ్చినా ప్రజల మధ్య స్నేహ వాతావరణం చెడిపోగూడదని "ఢిల్లీ – పెకింగ్ అంతర్జాతీయ మైత్రీయాత్ర" పేరుతో జరిగిన ఈ యాత్ర 1964 జనవరి 30న అర్ధాంతరంగా ముగించబడింది.

అ 1975 జులై 26న విజయవాడలో ఒక సభలో ప్రసంగిస్తూ గోరా గారు అకస్మాత్తుగా చనిపోయారు.

***రచయిత సెల్: 98486 64587***

# సామూహిక స్వప్నం



ఎవడో ఒక సొంత కలగంటాడు
అది భూగోళమంతటికీ
పీడకలవుతుంది
అతడు చమురు నదిలో దీపం వెలిగించి
జీవితాలకు కాంతినిస్తానంటాడు
ఆ నది మానవుల రక్తకాసారమై మండుతుంది
దారుల్ని మూసి
జీవన మార్గాలన్నిటినీ అనుసంధిస్తానంటూ
సంధి ప్రేలాపనలు పేలుతుంటాడు
విశ్వసంరక్షకుడ్ని నేనేనంటూ
బలప్రదర్శనతో బాలిస్టిక్ క్షిపణులతో
విపణిలో వీరంగమేస్తుంటాడు.
రక్తదాహమో రణ మోహమో
అతన్ని రాచపుండై తొలుస్తుంటుంది
పువ్వుల నవ్వులు వికసించే చోట
వాటిని చిదిమి అత్తరు జల్లుతానంటాడు
పుడమి తల్లికి రక్తాభిషేకం చేసి
శాంతిదూతనంటాడు
చేపలకు సముద్రాన్ని
పక్షులకు ఆకాశాన్ని కాకుండా చేసి
కొత్త ప్రపంచాన్ని సృష్టిస్తానంటాడు
కొన్ని లక్షల ప్రాణాలు
కొందరు యుద్ధోన్మాదుల చేతిలో ఉన్న
నవీన నాగరిక ప్రపంచంలో
ఇప్పుడు నరుడొక ఆటబొమ్మ
ప్రపంచమంతా ఆటవిక రాజ్యం
భూమిలో పంటలు కాక
క్షిపణులు పండుతున్న వేళ
నేలకు ఇక వంధ్యత్వమే
సిరలు ధమనుల్లో కాకుండా
నేల మీద రక్తనదులు ప్రవహిస్తుంటే
శాంతి ఇప్పుడొక పగటికల
పచ్చని మొక్కను నాటుదామని ఓ బాలిక
రక్తపు చుక్కతో తడవని
అంగుళం జాగా కోసం వెతుకుతుండడం
శ్వేత కపోతాన్ని చేతిలో పట్టుకున్న బాలుడు
చిల్లులు పడని ఆకాశాన్ని కనుగొని
దాన్ని ఎగరవేయాలని చూడడం
ఇప్పుడొక సామూహిక స్వప్నం

***– నెల్లుట్ల రమాదేవి***
***94406 22781***

# నేను, పద్యం

పద్యానికి బలవంతంగా
రంగులద్దాను.

పెదవి విరుపుల జల్లుల్లో
రంగులు వెలిసిపోయాయి..
పద్యానివి, నావి–

డొల్ల మొఖంతో
నేను, పద్యం
లిలిలి
కదిలిపోతున్న కాలం బండిలో
స్థలం చాలా తక్కువ.

పద్యానికి చోటుంటుంది.
పద్యం రాసిన చేతులకు స్థలముంటుంది.

భుజ కీర్తులు, కీర్తి కండూతులు
మూటాముల్లెలు కట్టి
అటకల్లోకి –
...
ఎప్పుడో రాసిన పద్యం
పుటల్లోంచి జారిపోయింది.

దాని కొస మాత్రం
గుండె కొమ్మకు తగులుకునే వుంది.

తపోధ్యాసలో కొసను వెదికితే
పద్యం దొరికింది.

నేను పద్యాన్నీ
పద్యం నన్నూ
గుర్తుపట్టలేదు.

చిధ్రమైన మా మొఖాల స్థానంలో
కాలం తవ్విన కందకాలు
...
పద్యానికి పాలుపోసి
ప్రాణం పోసాను.

ఉగ్గుపాలలో
పౌరుషం రంగరించాను.
పద్యపాదాల చేతికి
అన్యాయాన్ని నిగ్గదీసే
ఆయుధాలిచ్చాను.

జైలుభాష మాట్లాడుతూ
తాఖీదులు తలుపు తట్టాయి.

పద్యం మౌనం దాల్చింది.
కానీ, దానికి
గెరిల్లా విద్య తెలుసు.

*– పి.శ్రీనివాస్ గౌడ్,*
***9949429449***

# త్యాగాల ప్రతిరూపం

నవమాసాలు గర్భంలో మోసి
ఆపసోపాలు పడి జన్మనిస్తుంది అమ్మ
అమ్మ కాదు ఆమె మరో బ్రహ్మ
చనుబాలతోనే ఆకలితీరుస్తుంది
గండం గడిచి పిండాన్ని
బయటకు వదులుతుంది
అంచెలంచెలుగా తన వాడినే
ఆసనం చేసి ఆదరిస్తుంది
మాతృత్వపు మాధుర్యాన్ని అనుభవిస్తుంది
కనులముందు కన్నబిడ్డ
కదలాడుతుంటే మురిసిపోతుంది
బుడిబుడి అడుగుల సవ్వడితో పులకరిస్తుంది
అమృతతుల్యపు ప్రేమతో అభిమానిస్తుంది
అల్లరి చేష్టలను అదిలిస్తుంది
జిలిబిలి పలుకులకు జేజేలు పలుకుతుంది
ఎన్నెన్నో నిదుర లేని రాత్రులు గడుపుతుంది
పసిగుడ్డును పసిడి బొమ్మగా మార్చుతుంది
బోసినవ్వుల బుజ్జాయిని లాలిస్తుంది
జోలపాటలతో జోగొడుతుంది
అమృతమైన పలుకులతో ఆడిస్తుంది

తాను తినక
తన బిడ్డ కడుపు నింపుతుంది
అమ్మంటే అనురాగం
అమ్మంటే ఆత్మీయత
కుసుమ కోమలమైన హస్తాలతో
ఎత్తుకొంటుంది
అమ్మ మాతృత్వం, ప్రేమ,
త్యాగాలకు ప్రతిరూపం
జన్మజన్మలకు తీర్చుకోలేనిది అమ్మ రుణం.
అంతులేని అగాధమే ఆమె హృదయం.

*– దోసపాటి వేంకట రామచంద్ర రావు*
***7780594995***

# స్నేహ గంధం!

తెమ్మెర చక్కిలిగింతలకు
అది సడి లేకుండా నవ్వుతోంది
మూడడుగుల పూలమొక్క
ఆనందంతో అంబర మంటుతోంది
పిల్లగాలి మహా చిలిపిది
కవ్విస్తూనే ఉంది నవ్విస్తూనే ఉంది
మొక్క విలాస నృత్యం సాగుతూనే ఉంది
అటు ఇటూ వయ్యారంగా ఊగుతూ
పూలతో పాటు, లలిత సుకుమారంగా
తోటకే పరిమళం తెచ్చే స్నేహం
చిరుగాలిదీ, విరిబాలదీ!

తల్లితో పాటే గాలి కూన
ఇక్కడే విహరిస్తుంటుంది
మొక్కదే అల్పాయుర్దాయం
పూలది,మరీ స్వల్పాతిస్వల్పం
మూన్నాళ్ళ ముచ్చటే!

అయినా, ఇవేవీ పట్టవు ఆ చిన్ని ప్రాణికి
వర్తమానంలో బ్రతికే వివేకి
మధురానుభూతిని దాచుకుంటుంది
పదిలంగా హరిత హృదయంలో!

తీపి అనుభవాల హారం కదూ –


మాట్లాడే మనిషికైనా
మౌన ముద్రాంకితమైన మొక్కకైనా
బ్రతుకుపై రవ్వంత రుచి నిల్పేది!
గుండె తడి మిగిల్చేది
జీవనోత్సాహాన్ని మళ్ళీ మళ్ళీ
పూరిస్తూ ఉండేది–

రసమింకని, వసివాడని
జ్ఞాపకపారిజాత సుమహారం!

*– సముద్రాల హరికృష్ణ*
***99865 59905***



# మీరు చదివారా!




### విలక్షణ కథల సమాహారం


## పాలపిట్ట కథ-2025

తెలుగునాట సాహిత్య ప్రక్రియల్లో కవిత్వం తరువాత కథా ప్రక్రియనే ఎక్కువగా ప్రాచుర్యం పొందింది. కనుకనే కథా ప్రియుల కోసం ఈ సంకలనం తీసుకొచ్చింది పాలపిట్ట. దీనిలో 31 కథలు ఉన్నాయి. మన సమాజ గమనాన్ని, మానవ నైజాన్ని, మనుషుల పోకడలను తెలియజేసే కథలు ఈ సంకలనంలో ఉన్నాయి. వ్యవస్థలకీ, మనుషులకీ నడుమ సంఘర్షణను, మానవ మనస్తత్వంలోని వైచిత్రిని ప్రతిఫలించే కథలు ఇందులో చూడొచ్చు. చట్టాలు, నీతిసూత్రాలు, నిజాయితీ, నిబద్ధత అనే పదాలు చూడటానికి అందంగా ఉంటాయి. వీటికి అనుగుణంగా మనుషులు జీవించాలని, సామాజిక, పాలనా వ్యవస్థలు పని చేయాలని కోరుకుంటారు. కానీ ఇందుకు భిన్నంగా ప్రవర్తించే నాయకులు, ప్రభుత్వాధికారులు, వైద్యులు ఎల్లెడలా తారసపడతారు. నిబంధనలకు అనుగుణంగా పనిచేయడమే ఒక అనర్హతగా పరిణమించే సందర్భాలుంటాయి. ఇలాంటప్పుడు సానుకూలంగా ఆలోచించే వారు తమ చేతుల్లో లేని పరిణామాల పట్ల ఎలా స్పందిస్తారో ఈ కథలు చెబుతాయి.


**పాలపిట్ట కథ – 2025 (విలక్షణ కథల సంకలనం)**
**పేజీలు: 272, వెల: రూ. 200**
ప్రతులకు: గూగుల్ పే నెంబర్: 9848787284
నవోదయ, నవతెలంగాణ, నవచేతన పుస్తక కేంద్రాలు

# గుడిపాటి పుస్తకాలు


మానవోత్తముడు
షిరిడి సాయిబాబా
జీవిత కథ
పేజీలు: 104
వెల: రూ. 100





కథాదీప్తి
విమర్శా వ్యాసాలు
పేజీలు: 144
వెల: రూ. 100




సంవిధానం
కథా సాహిత్య వ్యాసాలు
పేజీలు: 160
వెల: రూ. 50




పుట్ట బంగారం
తెలంగాణ సాహిత్య వ్యాసాలు
పేజీలు: 192
వెల: రూ. 120





ఒబామా
స్ఫూర్తిదాయక విజయగాథ
పేజీలు: 168
వెల: రూ. 50




**ప్రతులకు: పాలపిట్ట బుక్స్, హైదరాబాద్**


RNI NO: APTEL/2010/32190 July-2026


# పాలపిట్ట సంచికలు





















పాలపిట్ట ఫిబ్రవరి 2010లో ప్రారంభమైంది. పదహారేళ్ళ ప్రయాణంలో ప్రత్యేక సంచికలను ఎన్నో వెలువరించింది. సాహిత్య విద్యార్థులకు, పరిశోధకులకు ఉపకరించే సిసలైన సాహిత్య వేదిక పాలపిట్ట. పాత సంచికల కోసం సంప్రదించండి – పాలపిట్ట బుక్స్, 9848787284

If Undelivered Please return to:
PALAPITTA, 16-11-20/6/1/1
Vijayasai Residency
Saleem Nagar, Malakpet
Hyderabad-500 036
PH: 9848787284

Book Post

To
Mr/Mrs.......................................
..................................................
..................................................
..................................................

Printed, Published and Owned by Gudipati Venkateswarlu and Printed at Karshak Art Printers, Vidyanagar Hyderabad - 500 044 and Published at H.No.16-11-20/6/1/1, 403, Vijaya Sai Residency, Saleem Nagar, Malakpet, Hyderabad - 500 036, Telangana **Editor: Gudipati Venkateswarlu**